

# ప్రసిద్ధ హిందీ కథానికలు











అనుసృజన

దాసరి శివకుమారి

# ప్రసిద్ధ హిందీ కథానికలు

అనుసృజన

దాసరి శివకుమారి

# ప్రసిద్ధ హిందీ కథాకారుల రచనా వైశిష్ట్య తరంగాలు

సాహిత్య ప్రక్రియలో అనువాద రచనకున్న స్థానము విశిష్టమైనది. దీనివలన కలిగే ఉపయోగమూ చాలా గొప్పది. హిందీ భాషలో రచనలు చేసిన శ్రీ ప్రేమ్‌చంద్, శ్రీ జయశంకర ప్రసాద్, శ్రీ విశ్వంభరనాథ్ శర్మకౌశిక్, శ్రీమతి మహాదేవి వర్మల లాంటి వారు జగమెరిగిన సాహితీవేత్తలు. అలాంటి ఉన్నత స్థాయికి చెందిన వారి రచనలు ఎన్నో ఆలోచనలను, మనోవైజ్ఞానికతను ప్రతిబింబిస్తూ వుంటాయి. అవి పాఠకుల మనస్సుకు హత్తుకుని పదికాలాల పాటు పరిమళాలను వెదజల్లుతూ వుంటాయి. ఆయా రచనా సౌరభాలను మన తెలుగు పాఠకులకు కూడా అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ ఇరవై హిందీ కథలను తెలుగులోకి అనువదించటం జరిగింది. కథలతోపాటు ఆయా రచయితల పరిచయాలను కూడా పొందుపరచటమైనది. "పేదోళ్ళను పీల్చి పిప్పి చేసి, గంగాతానాలు చేసి, గుళ్లూ గోపురాలు తిరిగే బడా బాబులు ఎందుకెల్తారు సొర్గానికి? ఆళ్లు నరకానికే పోతారు. నా కోడలు లాంటి వాళ్లే సోర్గానికి పోతారు" అంటూ 'కఫన్' అనే కథలో శ్రీ ప్రేమ్‌చంద్ తన పాత్ర 'ఘీసూ' చేత పలికిస్తారు. తాగుబోతుల, మనస్థితిని కళ్లకు కట్టినట్లు చిత్రించిన ఈ రచన ప్రేమ్‌చంద్ కథా సాహిత్యంలో పేరెన్నికగన్నది.

"నాయనా మనోహర్! నేను నిన్ను చంపుకున్నానురా, కాపాడలేకపొయ్యాను. వాడు పడిపోతున్నాడు. పట్టుకోండి" అంటూ రామేశ్వరి చేసిన ఆక్రందన మాతృత్వ ప్రేమను అద్భుతంగా చిత్రించి కథా సాహిత్యంలో తన స్థానాన్ని సుసంపన్నం చేసుకున్న శ్రీ విశ్వంభర్ నాథ్ శర్మ కౌశిక్ రచన 'తాయీ' అనే కథ మనోవైజ్ఞానిక రచనగా పేరుగాంచింది.

"సువర్ణ మల్లెతీగ కిందే గిల్లూ సమాధయ్యింది. ఆ చిన్న ప్రాణి ఏదో ఒక వసంత ప్రాభవాన, సువర్ణ మల్లెతీగకు, బంగారు రంగులో పచ్చని మొగ్గగా వచ్చి నాకు సంతోషాన్ని ఇవ్వటానికి ప్రయత్నిస్తుందని నా నమ్మకం" అంటూ 'గిల్లూ' అనే కథలో శ్రీమతి మహాదేవివర్మ చూపించిన భూతదయ పశుపక్షుల పట్ల ఆమెకున్న ప్రేమను చాటి చెప్తుంది. "ఈ దీప స్థంభం నుండి వెన్నెల కాంతిని వెలిగించి నా తండ్రి సమాధిని వెతుకుతాను. నాక్కూడా ఆకాశ దీపంలాగా వెలిగి ఇక్కడే కలిసి పోవాలనివున్నది" అన్న చంప మాటలు ఆమె, ఆత్మాభిమానానికి తార్కాణంగా వుంటాయి.

'ఆకాశదీప్' లాంటి కథ చిత్రణతో శ్రీ జయశంకర్ ప్రసాద్ ఉన్నత సాహిత్య శిఖరాలు అధిరోహించగలిగారు.

"వీరబాల ఎంత సౌభాగ్య శీలో? ఆమె మృత్యువు తర్వాత కూడా ఆమె ప్రేమికుడు, ఆమె సమాధిమీద ఈ రోజు వరకూ ఆమె ఆశయాల పుష్పాలనే అర్పిస్తున్నాడు" అంటూ 'చిన గార్' అనే కథలో డా. సరోజినీ కులశ్రేష్ గారు దేశభక్తినీ, త్యాగాన్నీ, అమర ప్రేమనూ కడు రమణీయంగా చిత్రించారు. ఇలాంటి మరెన్నో ఉత్తమ కధాకారుల ఆలోచనలతో నిండిన శ్రేష్ఠమయిన కథలు ఈ సంకలనంలో వున్నాయి. పాఠకులకే ఆ విషయం తేట తెల్లమవుతుంది. ఈ కథల అనువాదం చెయ్యమని శ్రీ వెంకటనారాయణగారు నన్నెంతో ప్రోత్సహించారు. ప్రోత్సహించి ప్రచురించిన శ్రీ పల్లవీ పబ్లికేషన్స్ వారికి నా కృతజ్ఞతాంజలులు.

**శ్రీమతి దాసరి శివకుమారి**

## శ్రీ జయశంకర ప్రసాద్ కవి పరిచయము

జీవన రేఖలు : **1889** జనవరి **30**వ తేదిన ఉత్తరప్రదేశ్ నందలి వారణాసిలో జన్మించారు. ప్రాథమిక అభ్యాసంతోనే స్కూలును వదిలిపెట్టారు. ఆ తర్వాత ఇంట్లో వుండే ఇంగ్లీషు, సంస్కృతం, పాలీ, ప్రాకృత లాంటి భాషల్ని నేర్చుకున్నారు. అంతేకాక భారతీయ దర్శనాలు, చరిత్ర, సాహిత్య సంస్కృతులను బాగా ఔపోసన పట్టారు. ఆ జ్ఞాన సముపార్జనంతా వారి రచనల ద్వారా పాఠకుల కందించారు.

వృత్తి వ్యాపారాలు : నస్యము, పొగాకు వ్యాపారాల్లో వీరి కుటుంబం ప్రసిద్ధి చెందింది. తండ్రితో పాటు బాల్యంలోనే చాలా ప్రదేశాలను తిరిగివచ్చారు. కుటుంబ సభ్యులందరి మరణంతో జయశంకర ప్రసాద్ తన వారసత్వపు వ్యాపారాన్ని చూచుకోవాల్సివచ్చింది. వీరు **1937** నవంబరు **15**న స్వర్గస్థులయ్యారు.

సాహిత్య సృష్టి : హిందీ సాహిత్య శ్రేష్ఠ సృష్టికర్తల్లో అగ్రగణ్యులుగా జయశంకరప్రసాద్ పేరుగాంచారు. తక్కువ వయసులోనే మరణించినా ఆ చిన్న జీవితంలోనే సాహిత్యపు విభిన్న పార్శ్వాలను స్పృశించి భారత దేశ చరిత్రను, మానవుని అనేక మనోవృత్తులను అత్యంత సామర్థ్యంగా చిత్రించారు.

కథలు : వీరి కలం నుండి జాలువారిన కథలు వీరికి కథా సాహిత్యంలో ఒక వున్నత స్థానాన్ని కల్పిస్తున్నవి. వీరి నాటకాలు, నవలలు, కావ్యాల వలె వీరి కథలు కూడా ఒక ప్రత్యేక శ్రేణికి చెందినవిగా సాహిత్య సమాలోచకులు భావిస్తున్నారు. అందువలన వీరి కథలు చదివిన పాఠకులు ఎంతో ఉత్తేజితులవుతూ, మానసికోల్లాసాన్ని పొందుతారు. పురస్కార్ గుండా, మధువా మొదలగు కథలు చాలా ప్రాచుర్యం పొందినవి.

ప్రముఖ రచనలు : ఝర్‌నా, ఆంసూ, లహర్, కామాయనీ, స్కంద్ గుప్త్, చంద్రగుప్త్, ధ్రువస్వామినీ, జనమేజయ్‌కా నాగయజ్ఞ్, రాజశ్రీ, విశాఖ్ కామనా, కంకాల్, తితలీ ఔర్ ఇరావతి చాలా ప్రసిద్ధిపొందినవి.

"ఘీసూ" అన్న కథలో (చెదిరిన స్వప్నం అన్నపేరు పెట్టాను) ఆనాటి సామాజిక పరిస్థితులు, ఒక అమాయక ప్రేమికుని బలిదానం, అత్యాంత సహజంగా వర్ణించబడి వున్నది. "చూడీవాలీ' (విలాసిని) కథలో వేశ్యావృత్తి నుండి తప్పుకుని కులవధువుగా జీవితం గడపటానికి ఒక యవతి చేసిన ప్రయత్నమే కన్పిస్తుంది. విలాసిని పాత్ర పాఠకుల ఆదరణను పొందుతుంది. ఆభిజాత్యపుపొరలు కరిగిన విధానమూ ఆకట్టుకుంటుంది. "ఆకాశదీపం" అనే కథ హిందీ కథా సాహిత్యంలో ఆణిముత్యమంటిదని పరిశీలకుల భావన, ఈ కథలో భారతీయ మహిళ తన ఆత్మ గౌరవాన్ని, ఆత్మ ప్రభోధాన్ని కాపాడుకున్న విధానాన్ని పాఠకుల కళ్లముందు సాక్షాత్కరింప జేస్తారు. 'చంప' పరిస్థితికి వగచే పాఠకులను రచయిత తన వర్ణనలతో ఊరడించే సఫలీకృత ప్రయత్నమూ చేస్తారు. 'ఆంధీ" కథ నిజంగా తుఫాను లాగే వివరంగా, తీవ్రంగా విస్తరించిన కథ. ఇందలి భారత ఔన్నత్యం, భారతీయ శిల్ప, చిత్రకళా వర్ణన పాఠకులకు ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. అలాగే మానవుని మానసిక దౌర్బల్యాలు, బౌద్ధుని విశాల, ఉదార స్వభావమూ, చాలా విపులంగా చర్చించబడ్డాయి. లైలా తుఫానులాగే విజృంభించి ప్రకృతిలో కలసిపోయి పాఠకుల మనసులో తుఫాను వాతావరణాన్ని మిగిల్చి వెళ్ళే ఉదంతం పాఠకుల మనస్సులపై చెరగని ముద్ర వేస్తుంది. తుఫాను అన్న పేరు ఈ కథకు ఎంతో సార్థక నామంగా ఉన్నది.

హిందీమూలం : జయశంకర్‌ప్రసాద్ **ఆకాశదీపం** అనుసృజన : దాసరి శివకుమారి

"బందీ! నువ్వు తప్పించుకోవాలనుకోవటం లేదా?

"ఇప్పుడు కాదు. ముందు నిద్రపోదాం. బాగా చలిగావుంది. ఎవరైనా ఒక కంబళి కప్పి చలి బారి నుండి కాపాడితే బాగుండును."

"నిద్రపోతానంటే కుదరదు. తుఫాను వచ్చేటట్లుగా కూడా వున్నది. ఇవాళ మన బంధనాలు కూడా పెద్ద పట్టుగా ఏమీ లేవు. ఇదే మనకు మంచిఅవకాశం. జారవిడుచుకోకూడదు."

"ఈ నావ మీద పదిమంది నావికులూ, కాపలావాడూ వున్నారు. తాళ్ళు తెగ్గోయటానికి, నీ దగ్గరేమైనా ఆయుధమున్నదా? దాంతో తాళ్ళు కోయగలవా? నీవు కూడా బందీవేగా?"

సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. ఆ సమయంలో బందీలిరువురు పరస్పరం సహకరించుకున్నారు. అలల కుదుపులకు బందీలిరువురు ఒకరినొకరు స్పర్శించుకోవలసివస్తున్నది. స్నేహభావంతో, ఆశలతో, ఆ అంధకారంలోనే ఇరువురూ తాళ్ళను తెగ్గోసుకుని బంధవిముక్తులయ్యారు. ఆనందం పట్టలేక తన తోటి బందీని గట్టిగా హృదయానికి హత్తుకుని "ఏమిటీ? నీవు స్త్రీవా?" అంటూ గుసగుసగా అడిగాడు.

"స్త్రీనైతే ఏమైనా పాపమా"? అంటూ అతని కౌగిలి నుండి దూరంగా జరిగింది ఆమె.

"ఆయుధాన్నెక్కడ దాచివుంచావు? ఇంతకీ నీ పేరేమిటి?"

"నా పేరు చంప". అంటూ చాలా జాగ్రత్తగా, అటూఇటూ దొర్లుతూ తనకిబ్బందేమీ లేకుండా చూసుకుంటున్నది. ఎందుకంటే నీలాకాశంలోనూ, అగాధసముద్రంలో కూడా గాలి తన ప్రతాపాన్ని చూపిస్తుంటే నావ అలల్లో అటూ, ఇటూ ఊయలలూగుతున్నది. అల్లకల్లోల సముద్రంలో నావ పెద్దరాతి బండను ఢీ కొట్టబోతుంటే తోటి బందీని అవతలికి నెట్టివేసి, చంప చాలా జాగరూకతతో వున్నది. తన కత్తిని అలానే చేతిలో పట్టుకుని అటూ, ఇటూ దొర్లుతూనే విడుదలయిన బందీ వద్దకు చేరుకున్నది.

"తుఫానొచ్చింది. అందరూ జాగ్రత్తగా వుండండి" అంటూ నావ నడిపేవాడు బిగ్గరగా అరిచాడు. ప్రమాద సూచికలు మోగాయి. తాడునొకరు గట్టిగా పట్టుకుంటే, తెరచాపను మరొకరు తెరిచివుంచారు. పిశాచం లాంటి తుఫాను నావను బంతిలా అటూ, ఇటూ విసురుతూ వికటాట్టహాసం చేయసాగింది. ఆ తుఫాను చప్పుడులో ఒకరి మాటలు మరొకరికి వినపట్టంలేదు. బందీలు వారి బంధనాల నుండి విముక్తులవటం కూడా ఎవరూ గమనించలేదు. కొంత సమయం గడిచింది. ఆ నిశీధరాత్రిపూట అనంత జలరాశిలో వెన్నెలకిరణాల బంగారు కాంతిలో అలలు కోమలంగా చిరునవ్వు నవ్వసాగినివి. ఇప్పుడు నావ తన గమనంలో తానున్నది. ఎందుకంటే సముద్రం శాంతించింది.

"బుద్ధగుప్తా! కట్లు ఎలా విప్పుకున్నావు? నేను నిన్ను మరలా బంధిస్తాను. నావకు యజమానిని నేనేకదా!" అంటూ ఒక వ్యక్తి ముందుకొచ్చాడు.

"నౌకాధ్యక్షుడు మణిభద్రుడు. అతనిపుడు ఏ అనంత జలరాశిలోనో సమాధి అయివుంటాడు. కాబట్టి నౌకను నేను స్వాధీనపరచుకుంటున్నాను. ఇకదీనిపై అధికారం నాదే. అడ్డుతప్పుకో" అంటూ బుద్ధగుప్తుడు సమాధానమిచ్చాడు.

"సముద్రపు దొంగవైన నీవా నాయకుడివి?" అంటూ కత్తిదూశాడు. "రా, మనిద్దరం ద్వంద యుద్ధం చేద్దాం, ఎవరు గెలిస్తే వారే యజమానులవుతారు."

చంపక్రోధావేశురాలవుతూ కత్తి అందించింది. ఇరువురూ లాఘవంగానే కత్తినితిప్పారు. చివరకు బుద్ధగుప్తుడే నైపుణ్యాన్ని ప్రదర్శించి ఎదుటివాని చేతిలో కత్తినెగురగొట్టి అతణ్ణి క్రిందకు పడదోశాడు. ప్రభాత కిరణాలలో బుద్ధగుప్తుని చేతిలో విజయ ఖడ్గం ప్రకాశించింది. నావకు యజమాని కావాలనుకున్న వ్యక్తి, కళ్ళలో ప్రాణభీతిని నింపుకుని ప్రాణభిక్ష కోరటం తప్ప ఏం చేయలేకపొయ్యాడు. "ఇకనుంచి నువ్వే నాయకుడవు బుద్ధగుప్తా. ఈ వరుణదేవుని సాక్షిగా నేను విశ్వాసంగలిగిన అనుచరుడిగా మాత్రమే నీ దగ్గర పనిచేస్తాను." అంటూ సాగిలపడ్డాడు.

బుద్ధగుప్తుడు క్షమించి వదిలేశాడు. బుద్ధగుప్తుని శరీరంపై వున్న రక్తపు బిందువులు విజయతిలకాన్ని అద్దినట్లుగా భావించి అతని గాయాలపై తన ప్రేమ దృష్టులను ప్రసరింపచేసి అతణ్ణి వేదనావిహీనుణ్ణి చేసింది చంప.

"మన నావ ఎటుపోతున్నది?" అంటూ బుద్ధగుప్తుడు ప్రశ్నించాడు.

"బాలిద్వీపానికి దూరంగా బహుశా ఏదో ఒక ద్వీపానికి చేరుకోగలుగుతాం. జనసంచారం చాలా తక్కువ. సింహళ వ్యాపారుల అజమాయిషీ ఎక్కువ. వాతావరణం అనుకూలంగా వుంటే రెండు రోజుల్లో మనం అక్కడికి చేరుకుంటాం. అప్పటివరకూ ఆహారపదార్థాలూ సరిపోతాయి" అని చెప్తూ ఆ వ్యక్తి స్వయంగా చుక్కాని చేతబట్టాడు. "రేయ్ గడవెయ్యండి. ఇక్కడి నీటిలో రాతిఖండాలుంటాయి. జాగ్రత్తపడకపోతే నావనే కుదిపేస్తాయ్" అంటూ హెచ్చరించాడు.

"చంపా? నువ్వు వీళ్ళకెలా చిక్కావు? నీకెవరూ లేరా?" బుద్ధగుప్తుడు ప్రశ్నించాడు.

"గంగానది ఒడ్డునవున్న చంపానగరం మాది. నేనొక క్షత్రియబాలికను. మణిభద్రుని నావకే మా నాన్న కాపలాదారుగా వుండేవాడు. అమ్మ చనిపోవటంతో, నా ఎనిమిదేళ్ళ వయసు నుండీ నాన్నతోపాటే నేనూ ఈ సముద్రంపైనే వుంటున్నాను. నువ్వు నావపై దురాక్రమణ చేసినప్పుడు నా తండ్రి మీలో ఏడుగురు దొంగలను చంపి ఆ తర్వాత తాను జలసమాధయ్యాడు. ఒక నెలరోజుల పాటు నేను నీలాకాశం క్రింద, నీలి సముద్రంపైన, ఒక భయానక అనంతతత్వంలో నిస్సహాయురాలినై పడివున్నాను. అనాథనన్న

ఆసరా తీసుకుని మణిభద్రుడు నాతో నీచంగా ప్రవర్తించాలని చూశాడు. నేను తిరస్కరించి, నిందించినందులకు ప్రతిఫలంగా నన్ను బంధించాడు." అని చెప్తూ చంప రోషావేశురాలయ్యింది.

"నేను కూడా తామ్రలిప్తికి చెందిన క్షత్రియుణ్ణి. కాని చంపా! దురదృష్టవశాత్తూ సముద్రపు దొంగనయ్యాను. ఇప్పుడు నువ్వు విముక్తురాలవయ్యావు నీ ఇష్టం వచ్చినట్లుగా వుండవచ్చు."

"నా అదృష్టం ఎక్కడకు తీసుకెళ్తుందో తెలియదు." అంటున్న చంప కళ్ళలో సుదూర ప్రదేశాల అదృశ్యదృశ్యాలు,కోరికలు లేని ఆమె తెల్లని కంటి రక్తనాళాలలో ఏదో ప్రగాఢ విశ్వాసాన్ని చూసిన సముద్రపు దొంగయిన బుద్ధగుప్తునికి ఆ సమయంలో వణుకు పుట్టింది. అతడి, మనసులో ఆమెపట్ల శ్రద్ధాసక్తి, అనురక్తి కలిగినాయి.

సముద్రపు చెట్లమీద దట్టంగా రాగరంజితంగా సంధ్యాదేవి నాట్యమాడే వేళ చంప వీపుమీద సుదీర్ఘమైన ఆమె కేశరాశి పరచుకునివున్నది. తన అస్థిత్వంలో, ఒక అలౌకిక అందంతో ఈ తరుణ బాలిక తన కోమలత్వంతో నా హృదయాన్ని తట్టిలేపుతున్నదని బుద్ధగుప్తుడు భావించాడు. ఇంతలో మనం ద్వీపం చేరుకున్నామన్న మాట వినిపించింది. నావ ఒడ్డుకు చేరగానే చంప క్రిందకు దుమికింది. "ఈ ద్వీపాన్ని మనం చంపాద్వీపమని పిలుద్దాం." అన్నాడు బుద్ధగుప్తుడు చంప చల్లగా నవ్వింది.

ఐదు సంవత్సరాలు కాలగర్భంలో కలసిపొయ్యాయి. ఆనాటి రాత్రి శరత్‌లక్ష్మి పూలను, పేలాలను చల్లి ఆశీర్వదిస్తునట్లుగా తారకలు ఆకాశంలో మిలమిలా మెరుస్తున్నాయి. ఒక ఉన్నత సౌధంలో కూర్చుని చంప దీపాలను వెలిగిస్తున్నది. అభ్రకపు పెట్టెలో దీపాన్నుంచి తాడు సహాయంతో దాన్ని దీప స్థంభంపైకి తీసుకువెళుతున్నది.  తన ఆకాశదీపం నక్షత్రాల వరకు చేరుకోవాలని ఆమె ఆశ. ఎదురుగా అలలతో, ఎగిసిపడే అగాధజలరాశి. వెనగ్గా పర్వత పంక్తులు. దూరాన్నుంచి వేణునాదం వినపడుతున్నది. తన ఆకాశ దీపపు ప్రతిబింబం ఎదుటనున్న జలరాశిలో చక్కర్లు కొడుతూ పూర్ణత్వాన్ని పొందాలని తహతహలాడుతున్నది. ఈ దృశ్యాలన్నింటిని చూస్తున్నది చంప. "జయా!" అంటూ పరిచారికను పిలిచి "మహానావికులు" ఎప్పుడొస్తారో తెలిసికొనిరా" అని పంపించింది. గాలికి ఎగిరిపడే పైటకొంగులాగే ఈ రోజు ఆమె హృదయం కూడా తుళ్ళితుళ్ళి పడుతోంది.

ఇంతలో దృఢకాయుడైన బుద్ధగుప్తుడొచ్చి ఆమె వీపుపై చేయివేసిలాలనగా నిమిరాడు.

"పిచ్చిదానిలా ఇక్కడ కూర్చుని ఇలా దీపాలు వెలిగించవలసిన అవసరమేమున్నది?"

"క్షీరాబ్ధినాధుణ్ణి ప్రసన్నం చేసుకోవటానికి పనివాళ్ళ చేత దీపాలు పెట్టించటం నాకిష్టం లేదు."

"ఎవరికి దారి చూపించాలని నువ్వు దీపాలు వెలిగించి భగవంతుణ్ణి అర్థిస్తున్నావు? ఇదంతా చూస్తుంటే నాకు నవ్వువస్తున్నది."

"దారి చూపించే భగవంతుడే భ్రమపడి దారితప్పి ఈనాడు బుద్ధగుప్తునికి ఇంత ఐశ్వర్యం ఇచ్చాడు."

"ఇందులో తప్పేంలేదే? ఈ ద్వీపానికి చంపే రాణి కదా?"

"ముందు నన్ను ఈ బందీ గృహాన్నుంచి విముక్తురాలనుచెయ్యి. ఇప్పటికే బాలి, జావా, సముద్ర ద్వీపాల్లోని వాణిజ్యమంతా నీ చేతుల్లోనే వున్నది. కాని తొలినాళ్ళలో నీ దగ్గర ఒక పడవే వున్న సమయంలోనే మనం ఎంతో ప్రశాంతంగా సేదతీరేవాళ్ళం. ప్రాతఃకాలాల, వెన్నెల రాత్రుల సోయగాన్ని ఆస్వాదించేవాళ్ళం."

"కానీ చంపా మెరుగైన పద్ధతుల్లో మనం ముందుకెడుతున్నాం. నువ్వు నా సర్వస్వానివి. ప్రాణదాతవు."

"కాదు. కాదు. నువ్వు దొంగతనాలు మానివేశావు కాని నీ హృదయంలో నిర్దయా, కోరికలూ జ్వలిస్తూనే వున్నాయి. భగవంతుణ్ణీ నేను పెట్టిన ఆకాశదీపాన్నీ, వెటకారం చేస్తున్నావు. నేను బాగా చిన్నగా వున్నప్పుడు పనికోసం నాన్న సముద్రం మీద కెళ్ళిపోయేవాడు. వెదురుగడను పాతి, మట్టిప్రమిదలో దీపం వెలిగించి ఆగడకు కట్టి వుంచేది నా తల్లి. భగవాన్! నా భర్తకుత్రోవ చూపించు అని ప్రార్థించేది. తర్వాత నా తండ్రి తిరిగివచ్చేవాడు. "సతీ! నీ ప్రార్థనలవలనే భగవంతుడు నన్ను కష్టాలనుండి గట్టెక్కించాడని చెప్పేవాడు. నా తల్లి స్మృతి నాకు ఎంతో పవిత్రమైనది. నువ్వు మహావీరుడైన మా నాన్నను చంపిన దొంగవు, హంతకుడవు. ముందిక్కణ్ణుంచి వెళ్ళు" అని చంప చాలా కోపంగా అన్నది.

"నువ్వీ రోజు చాలా ఉద్రేకంగా, అస్వస్థతగా వున్నావు. విశ్రాంతి తీసుకో" అంటూ బుద్ధగుప్తుడు అక్కడ్నుంచి వెళ్ళిపొయ్యాడు. చంప మాత్రం ఉన్మాదస్థితిలోనే వున్నది.

అలల్ని వెదజల్లే సముద్రం. అలసటతో పశ్చిమానికేగుతున్న సూర్యుడు. జయతో కలసి చంప సముద్రపు ఒడ్డుకు వచ్చి ఒక చిన్న పడవలో కూర్చున్నది. జయే పడవనడుపుతున్నది. సముద్రం కన్నా అల్లకల్లోలంగా వున్నది చంపమనస్సు. "చల్లని, అనంత జలరాశి వున్నా దప్పికతీరదు. రొదపెట్టే సముద్రం. అంతకన్నా రోదించే తన హృదయపు మంటను ఏ జలరాశిలో ముంచి చల్లార్చగలను? అంటూ ఆక్రోశించింది."

చంప ఆలోచనల్లోవుండగానే బుద్ధగుప్తుని పెద్ద నావ సమీపంలోకొచ్చింది. బుద్ధగుప్తుడు చూసి చంపకు చేయందించాడు. "రాతి గుట్టలుండే ఈ ప్రాంతంలో ఇలా చిన్న పడవల్లో విహారం మంచిది కాదు చంపా. మన పెద్దనావలో కూర్చో."

పెద్దనావ ఎక్కి కూర్చుని "ఈ కఠోర గోడలమధ్య జీవించేకన్నా జలసమాధి కావటమే మంచిదనిపిస్తుంది." అన్నది

"ఎందుకంత నిర్దయగా మాట్లాడతావు? ఈ బుద్ధగుప్తుణ్ణి ఆజ్ఞాపించిచూడు. నీ కోసం కొత్త ద్వీపాలనే సృష్టించి ప్రజలతో సహా రాజ్యాన్నీ నిర్మించి ఇవ్వగలడు. అతణ్ణి పరీక్షించి చూడు. నువ్వు కోరితే ప్రాణాన్నే త్యజించి ఈ అగాధ జలరాశిలో కలసిపోతాడంటూ" ఆనాటి ద్వీపాలలో తన పేరు మారుమ్రోగే

బుద్ధగుప్తుడు గాలిని కూడా శాసించగలిగే మహానావికుడు మోకాళ్ళ మీద కూర్చుని చెమ్మగిలిన నేత్రాలతో చంప సమాధానం కోసం ఎదురుచూస్తూవున్నాడు.

మోహినీ రూపపు రహస్య జీవజాలానికి, పర్వత శిఖరాల, సముద్రజలాల, ప్రకృతి చేసే కుహూనాదాల మధ్య ఈ దిగ్మండలంలో ఆకాశమూ, సముద్రమూ ఒకదాన్నొకటి హత్తుకున్నట్లుగా చంప బుద్ధగుప్తుణ్ణి హత్తుకుపోయింది. వెంటనే తెప్పరిల్లిన చంప తన దుస్తుల్లో దాచుకున్న కత్తిని బయటికి తీసి "నా ప్రతీకార కరవాలాన్ని ఈ నీళ్ళల్లో పడవేస్తున్నానంటూ సముద్రంలో పారవేసింది. నా హృదయమే నన్ను మాటిమాటికీ మాయచేస్తున్నది బుద్ధగుప్తా" అన్నది.

"ఈనాటికైనా నన్ను క్షమించినట్లేనా" అని కంపించే గొంతుతో అడిగాడు.

"మహానావికా! ఈ విషయంలో నా హృదయమే నన్ను మోసం చేస్తున్నది. నీకేమని జవాబివ్వగలను? నిన్ను నేను అసహ్యించుకుంటూనే వున్నాను. కాని నీ కోసం చావటానికి కూడా వెనుదీయను. నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను నీ కర్థం కావటల్లేదా బుద్ధగుప్తా అంటూ రోదించసాగింది. రంగురంగుల స్వప్నాలు అతడి కన్నుల ముందు తారట్లాడసాగినయి. "నా జీవితంలోని ఈ అదృష్ట గడియల జ్ఞాపకార్థం ఒక వెలుగుల గృహమే ఈ కొండ మీద నిర్మిస్తాను. నా జీవితంలో ఇక చీకటనేదే లేకుండా అంతా అదృష్టపు వెలుగే" అంటూ ఉప్పొంగిపొయ్యాడు.

చంపాద్వీపానికి రెండవ వైపున అందమైన పర్వత పంక్తివున్నది. కొండల క్రింది భాగమంతా సముద్రపు నీటితో కప్పబడివున్నది. ఈ రోజు ఆ పర్వతాలపైనే ఆదివాసీల ఉత్సవం జరుగుతుంది. వారంతా చంపను వనదేవతలాగా అలకరించారు. తామ్రలిప్తికి చెందిన సైనికులు, నావికులు అడవిపూలతో బాగా అలంకరించిన పూల పల్లకిలో చంపను కూర్చోబెట్టి మోసుకువెళ్తున్నారు.

చంపాద్వీపపు నావికులను అప్రమత్తం చేయటానికి దృఢమైన దీపస్థంభం నిర్మించబడింది. ఈ దీపస్థంభపు దీపోత్సవమే ఈరోజు జరుపుకుంటున్నారు. బుద్ధగుప్తుడు ముందుగా వచ్చి దీపస్థంభపు ద్వారం దగ్గర నిలబడి పల్లకి దిగే చంపకు తన చేయందించాడు. వారిరువురూ లోపలికిరాగానే రకరకాల వాయిద్యాలు మ్రోగసాగాయి. ఆదివాసీ బాలికలు పూలు చల్లుతూ నాట్యం చేస్తున్నారు. "ఈ రోజు చంపారాణి వివాహ సందర్భంగా ఇదంతా ఏర్పాటు చేయబడిందని" జయ చెప్పగానే చంప ఉద్విగ్నురాలయింది.

"నన్నీరోజు నిస్సహాయురాలిగా, పేదరాలిగా తలచి ఈ విధంగా నాపై బదులు తీర్చుకోవాలని చూస్తున్నావా బుద్ధగుప్తా? నాకు సమాధానం చెప్పు."

"నీ తండ్రిని చంపిన హంతకుణ్ణి నేను కాను. అతను వేరే దొంగ చేతిలో మరణించాడు. నీకు ఇష్టముంటే మనపెళ్ళి జరుగుతుంది. ఎన్నాళ్ళనుండి ఈ బడబాగ్నిని నా హృదయంలో, అణచిపెట్టుకున్నానో తెలుసా చంపా?"

"ఇది నేను నమ్మితే ఆ క్షణం ఎంతో మధురంగా వుంటుంది. నిష్ఠూరపు మాటల్లో కూడా నువ్వు ఉన్నతుడివే బుద్ధగుప్తా!"

బుద్ధగుప్తుడు క్రిందికి వంగి చంపకాళ్ళు పట్టుకుని "చంపా! మనం ఇంత దూరంలో వుండి ఈ చంపాద్వీప ప్రజలచేత ఇంద్రుడు, శచీదేవిల్లా కొలువబడుతున్నాం. అయినా మన మాతృభూమి భరత ఖండం ఎంతో మహిమాన్వితమైనది. అది ఎందరో దార్శనికులకు పుట్టినిల్లు. నాకు మాటిమాటికీ మన భరతభూమే గుర్తుకొస్తున్నది. మనం అక్కడికే వెళ్దాం. నీ స్పర్శ పొందిన రోజే రాతిలాంటి నా హృదయం చంద్రకాంతమణివలె ద్రవీభవిస్తుంది. అదే నాకు గొప్ప సంపద. భగవంతుడ్నీ, పాపపుణ్యాలనూ, దయనూ నమ్మనివాడను. దారి తప్పిన నాకు వెన్నెలరేకవలె, కోమలత్వం నిండిన వెలుగుల చిరునవ్వులుచిందిస్తూ, నా శూన్యహృదయానికి దారి చూపావు. పశుబలంతో, ధనపిపాసతో వున్న నాకు శాంత, స్నిగ్ధ మార్గముపదేశించావు. ఈ రోజు మనపెళ్ళి జరిగితే రేపే రాజారాణీ లాగున భరతభూమికి ప్రయాణమవుదాం. మహానావికుడైన బుద్ధగుప్తుని ఆజ్ఞలను సముద్రపు అలలు కూడా పాటిస్తాయి. సంపద నిండిన మన నావల్ని హాయిగొలిపే దక్షిణానిలంలాగా భారతదేశానికి చేరుస్తాయి." అంటూ నివేదించాడు. తమకంతో అతని చేతిని పట్టుకుని బుద్ధగుప్తుణ్ణి మనసారా ముద్దాడింది చంప. వెంటనే స్పృహలోకి వచ్చి "బుద్ధగుప్తా! గాలీ, నీరూ, నేలా అంతా ఒక్కటే. నాకు ప్రత్యేకమైన కోరికలేవీ లేవు. నేనెక్కడున్నా నాకు మిగిలేది శూన్యమే, కాబట్టి నేనెక్కడికీ రాను. నీవు మాత్రం స్వదేశానికి వెళ్ళి సుఖభోగాలనుభవించు. ఇక్కడి అమాయక ఆదివాసీలకు సేవ చేస్తూ నేను ఇక్కడే వుండిపోతాను. ఈ దీపస్థంభం నుండి వెన్నెలకాంతిని వెలిగించి నా తండ్రి సమాధిని వెదుకుతాను. నాక్కూడా ఆకాశదీపంలా వెలిగి ఇక్కడే కలిసిపోవాలనివున్నది." అంటూ తన స్థిరమైన నిర్ణయాన్ని తెలియజెప్పింది చంప.

మరునాటి బంగారు ప్రభాత సమయంలో అనంత సంపదను తరలించుకుని పోయే నావలు అగాధ జలరాశిని చీల్చుకుంటూ పశ్చిమ ఉత్తరం వైపు సాగిపోవటాన్ని చంప దీపస్థంభం పై నుండి చూసి కన్నీళ్ళు ఆపుకోలేకపోయింది.

ఇది ఎన్నో శతాబ్దాల క్రిందటి కథ. చంప తన జీవన పర్యంతమూ ఆ దీపస్థంభంలో ఆకాశదీపాలు వెలిగిస్తూనే వున్నది. ఆది వాసులకు తన ప్రేమను పంచి ఎన్నో సేవలను అందించింది. ఆ ద్వీపవాసులు కూడా ఆమె తదనంతరం దీపస్థంభానికి పూజలు జరిపి దీపాలు వెలిగించారు. కాలపు కఠోర హస్తాలు ఆ తర్వాత దీప స్థంభాన్ని నేలకూల్చాయి.

## సాహిత్య, చిత్రలేఖన కళాకారుడు శ్రీ నరేంద్రనాగదేవ్

జీవన రేఖలు : శ్రీ నరేంద్ర నాగదేవ్ ఇటు సాహిత్యములోనూ అటు చిత్రలేఖనములోనూ మంచి ప్రవేశముకలిగివున్న వారు. వీరు మధ్యప్రదేశ్ నందలి ఉజ్జయినీలో **1961** నుండి **1966** వరకు ఆర్కిటెక్చర్ నందు విద్యాభ్యాసం చేశారు.

కథా సాహిత్యం : విభిన్న పత్రికలలో వ్యాసాలూ, కథలూ వెలువరించారు. కాదంబినీ కథల పోటీలో విజేతలయ్యారు. 'తమాశ్‌బీన్' అనే కథల సంపుటి వెలువరించారు. ఇందులో విస్మృత్ నావ్-భర్ అంధేరే, సమాపన్, ఉతార్, రిస్తే, ప్రతిశోధ్ మొదలగు కథలున్నవి.

చిత్రలేఖనం : అఖిల భారత కాళిదాస సంస్థ నుండి ఉజ్జయినీలో రెండు సార్లు పురస్కారాలను పొందారు. చిత్రకళ వీరి అభిమాన విషయం. ఆలిండియా ఫైన్ ఆర్ట్స్ & క్రాఫ్ట్ సొసైటీ, న్యూఢిల్లీ వారి నుండీ పురస్కారాన్ని పొందారు. ఎన్నో చిత్రకళా ప్రదర్శనలనేర్పాటు చేశారు.

ప్రస్తుత కథ "ఆక్రమాక్". అనగా ఆక్రమణదారుడని అర్థం. ఈ కథలో ఒక వ్యసన పరుడైన తండ్రి అటు కొడుకు జీవితం పై, ఇటు కూతురి జీవితంపై దురాక్రమణ చేస్తూ, వారినెన్ని ఇక్కట్ల పాలు చేశాడో రచయిత బాగా చక్కగా వివరించారు. ఆ తండ్రి చేసిన పనికి విసిగిపోయిన కొడుకు తీసుకున్న పరిష్కారం కూడా పాఠకులను మెప్పించేటట్లుగా వున్నది.

ప్రస్తుత రెండవ కథ 'ఫాంస్' అంటే ఉరి అని అర్థం. ఈ కథలో గుడిపూజారిగా వున్న రమాశంకర్ పూర్వాశ్రమంలో ఒక గుండా. తన తల్లిని మనస్తాపానికి గురిచేసి ఆమె ఇల్లు వదిలివెళ్ళేటట్లు చేసిన వ్యక్తి. గతం తాలూకు నీడలు వెంటాడుతుంటే రమాశంకర్ గొంతుకు ఉరి బిగుసుకుంటున్నట్లుగా పడే వేదననే శ్రీ నరేంద్రనాగదేవ్ చక్కని భావనా పటిమతో వ్రాశారు.

# ఆక్రమణదారుడు

మా ఇల్లంటే ఒక గుడిసెలాంటిది. వర్షాకాల మొస్తే దాని పరిస్థితి చెప్పనే అఖ్ఖర్లేదు. ఇప్పుడిప్పుడే అక్కకు పెళ్లయి అత్తవారింటికి వెళ్ళింది. ఆమెను చూడటానికంటూ మొదటిసారిగా నేను అక్కా వాళ్ళ ఇంటికొచ్చాను. చాలా శుభ్రంగా, అందంగా, పెద్దదిగా వున్న ఆ యింటిని చూచి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

వాళ్ళింటి దర్వాజా ముందు నా సైకిలునాపి ఎన్నో ఊహించుకుంటూ మూడుసార్లు నా సైకిల్ బెల్ కొట్టాను. మా అక్కే వచ్చి తలుపుతీసింది. ఎంతో ఉత్సాహంగా, సంతోషంతో అరుస్తూ లోపలికొచ్చాను. నా అరుపులకు, అల్లరికి అక్కకు భయమేసి అటూ, ఇటూ బెదురుగా చూడసాగింది. నాకు సంతోషంగా వుందిగాని అక్కకు దిగులుగా, భయముగా వున్నట్లుంది.

"నాకు టీ అయినా ఇవ్వవా" అంటూ నా తల వూపుకుంటూ ప్రశ్నించాను. ఒక గంటసేపున్నాను. ఆమెలోపలికీ, బయటికీ ఎన్నోసార్లు తిరిగింది గాని టీ మాత్రం చేసి తీసుకురాలేదు. మరలా అడిగాను.

"ఇప్పుడే చేసి తెస్తానులే" అని మాత్రం అన్నది. ఆ తర్వాత దాని ఊసే లేకుండా నిశ్శబ్దంగా వుండిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా ఏడ్వసాగింది.

ఏ సంతలోనో, జాతరలోనో తప్పిపోయిన పిల్లవాడు అటూ ఇటూ తిరిగిన తర్వాత తన వారిని కలుసుకున్నప్పుడు వెంటనే ఏం మాట్లాడలేదు. కాని అతని కళ్ళల్లో ఎన్నో ఫిర్యాదులు వుంటాయి. మీరు నన్ను ఒంటరిగా వదిలేసి ఎందుకెళ్ళారని మౌనంగానే అతని కళ్ళు ప్రశ్నిస్తాయి. అలాంటి భావాలే, అలాంటి భయాలే ఇపుడు అక్క కళ్ళలో కూడా కనపడుతున్నది. నేను తనకు ఓదార్పు, ధైర్యం ఇస్తున్నట్లుగా సముదాయించి నేను త్వరగా వెళ్తానన్నాను.

కానీ నేనొచ్చిన పనివేరు. "ఒక వంద రూపాయలు మీ అక్కనడిగి తీసుకునిరా" అని నాన్న నన్నిక్కడికి పంపాడు. అలా అడగటం బాగుండదని నాన్నకెంతో నచ్చచెప్పాను. కానీ ఆయన వింటేనా? గంటసేపున్నా ఒక కప్పు టీ కూడా ఇవ్వలేనిది, నేను కొంచెం బిగ్గరగా మాట్లాడితేనే గొంతు తగ్గించు, ఇక్కడ బిగ్గరగా మాట్లాడకూడదని భయపడే మనిషి వందరూపాయలు ఎలా ఇవ్వగలదు? అలా అని నాన్ననొప్పించే శక్తీ నాలో లేదు. నేను ఏదైనా పనిని వ్యతిరేకించినపుడు నాన్న వెకిలిగా, క్రూరంగా నవ్వుతాడు. ఆ నవ్వు భరించలేక నేనే అక్కణ్ణుంచి వెళ్లిపోతానని ఆయనకు తెలుసు. కానీ నన్ను మాత్రం తాను వదిలిపెట్టడు. పూర్వపు కథల్లోని మాయావి వలె రెక్కలు అల్లల్లాడిస్తూ నాచుట్టుపక్కలే తారట్లాడుతూ వుంటాడు. కనీసం వెయ్యిసార్లు తర్జన భర్జన పడి నాన్నతో వాదులాడి, చివరకు అక్క ఇంటికి వచ్చాను. నాన్న ఎలాంటి వాడంటే చెప్పులనాడా అయినా ముడివేసే రకం. ఏదో విధంగా నన్నుపయోగించి డబ్బులు సంపాదించటానికి నాన్న అవలంబించిన రెండో ఉపాయం అక్క దగ్గరకు పంపటం. మొదటి

ఉపాయం ఆయన ప్రారంభించినపుడు నాకు ఏడెనిమిది ఏళ్ళ వయస్సుంటుంది. ఆ రోజుల్లో చాలా ప్రొద్దున్నే నిద్రలేపేవాడు. "ఈరోజు గుళ్ళోకెళ్ళవా ఏంటి? అని గట్టిగా అడిగేవాడు. గుళ్ళోకెళ్ళి నేనేం చేసుకురావాలో తనే నిర్ణయించి నన్ను గుడి లోపలికి పంపేవాడు. హారతి కార్యక్రమం పూర్తికాగానే అందరూ ఎవరి ధ్యాసలో వారుంటారు. పూజారి ఒక విగ్రహం దగ్గరనుంచి మరొక విగ్రహం వున్న చోటుకు వెళ్ళి హారతి ఇస్తూవుంటాడు. ఈలోగా వీలు చూచుకుని కానుకలపళ్ళెంలో నుండి గుప్పెడనిండా డబ్బులు తీసుకుని నా జేబులో వేసుకునేవాడిని. అలా చేస్తున్నప్పుడు నా గుండె గబగబా కొట్టుకునేది. కాళ్ళు వణుకుతూ, వళ్ళంతా చెమట్లు పట్టేవి. అయినా కూడా మళ్ళీ మళ్ళీ అదే పనిచేయటానికి వెళ్ళాల్సివచ్చేది. గుళ్ళో నావెనగ్గా నిలబడి ఏదైనా ఇబ్బంది వచ్చేటట్లైతే నాన్న చప్పట్లు కొడతాడని, నేను బయటికొచ్చేదాకా నావైపే దృష్టిపెట్టి వుంటాడనీ తెలుసు. ఇలాంటి పనులు చేస్తూ నేను మిగతా పిల్లల్లాగా బాల్యాన్ని ఆనందంగా గడపలేకపొయ్యాను. గుళ్ళో నేను దొంగతనం చేసిన రోజంతా నాకు గుబులు, గుబులుగా వుండేది. పొరపాటున ఏపిల్లవాడి చేయితగిలినా సరే పొగిలి, పొగిలి ఏడ్చేవాణ్ణి. నా తోటిపిల్లలంతా నవ్వుతూ, తుళ్ళుతూ కేరింతలు కొడుతూ ఆడుకుంటుంటే నేనొక్కడ్నే ఒక మూల కలవరపడుతూ కూర్చుని వుండే వాణ్ణి. నేను తప్పు చేస్తున్నాననే భావమే నాలో జీర్ణించుకుపోయింది.

నాన్న ప్రేమ నాకేందక్కలేదు. ఆ ప్రేమను మా వీధిలోవున్న ఇతరులు దగ్గర నుంచైనా పొందాలని ప్రయత్నిస్తూ ఎవరేపని చెప్పినా కాదనకుండా చేసే వాణ్ణి. నాకుపని చెప్పినవాళ్ళు నా వాళ్ళే, నేనూ ఆయింటి వాణ్ణే అనుకునేవాడిని. కాని ఎవరూ నన్ను తమవాడిగా భావించలేదు. ప్రేమ పొందాలని ఇంటి లోపలికెళ్ళిన వాణ్ణి అనుమానంగా చూస్తూ, బెదిరించి పంపేసేవాళ్ళు. ఆ బాధతో ఏడ్చుకుంటూ అక్క దగ్గరకే వచ్చేవాణ్ణి.

అక్క తనదైన పద్ధతిలో ఆ బాధలన్నింటినీ పోగొట్టేది. నిరంతరం కష్టాలుపడుతూ, పడుతూ అక్కా, నేనూ మా మనసుల్ని బాగా దగ్గర చేసుకున్నాం. అది ఎంత దగ్గరితనమంటే మా ఇద్దరి అస్తిత్వాలు వేరు, వేరు కాదు. మా ఇద్దరిదీ కలిపి ఒకే జీవితమనుకున్నాం. అక్క దగ్గర దొరికే ఓదార్పు, ఆమె మనసులో చోటు ఇవి చాలు నాకు.

నాన్నతో ఏ విధమైన అనుబంధమూ లేదు మాకు. ఆయన అన్ని భావాలకూ అతీతుడు. ఆ రోజుల్లో ఒక బట్టల మిల్లులో పనిచేసేవాడు. జీతం తీసుకున్న రోజు ఉదయమూ, సాయంత్రమూ, కడుపు పట్టేంతగా తాగి వచ్చేవాడు. ఇంటికి వచ్చేటప్పుడో, బయటికెళ్ళేటప్పుడో తరచూ ఎవరితోనైనా గొడవపడుతూ వుండేవాడు. తప్పతాగి రోడ్డుమీద ఎక్కడో అక్కడ పడిపోయేవాడు. ఆదారంట వెళ్ళే వాళ్ళు గుమిగూడి చూసేవాళ్ళు. తెలిసిన వాళ్ళెవరైనా వుంటే తీసుకొచ్చి ఇంటి దగ్గర వదిలేసి వెళ్ళే వాళ్ళు. అప్పటికే ఆయన వంటి మీద బట్టలు దుమ్మూ, ధూళీ, బురద మరకల్తో నిండివుండేయి. అయినా కూడా ఆయన ఏనాడూ సిగ్గుపడలేదు. తన పద్ధతులు మార్చుకోనూలేదు. అవసరపడితే ఎదుటివాళ్ళను పొగుడుతూ, మెరమెచ్చు కబుర్లు చెప్తూ తన పబ్బం గడుపుకోవాలనీ చూస్తాడు. అవసరం తీర్చని వాళ్ళను తూర్పారబడుతూ వుండేవాడు. ఎవరైనా ఓపిక చచ్చి ఈయన్నెత్తి అవతల పారేస్తారేమోనని కాపలా

కాస్తూ వుండేవాళ్ళం. అటువంటి సమయంలో నాన్నకెంత అసహనమో, ఎంత రౌద్రమో మాటల్లో చెప్పలేం. ఆ కోపంలో గట్టిగా నన్ను కేకేసినా నన్ను వెళ్ళ నివ్వకుండా నా బదులు తనే వెళ్ళి అక్క ఆయన చిరాకునూ, తిట్లనూ తనే భరించి నన్ను రక్షించేది.

అలాంటి ప్రేమమూర్తి అయిన మా అక్కనుచూడాలన్న తపనతో వచ్చాను. ఏదో కాస్త మిఠాయిని కాగితంలో పొట్లంకట్టి తెచ్చి నా జేబులో కుక్కింది. "ఇక్కణ్ణుంచి త్వరగా వెళ్ళు" అన్నది. కాబట్టి సమయం కోసం కాచుకుని వున్నాను. సమయం దొరగ్గానే "అక్కా! నాన్న ఒక వంద రూపాయలు అడిగి తెమ్మన్నాడు. రేపే ఆ డబ్బులు కావాలని చెప్పమన్నాడు." అన్నాను.

గుళ్ళో దొంగతనం చేయటానికి వెళ్ళేముందు నా మనసెలా వుండేదో ఈ రోజూ అలాగే వుంది. ఆమె వంక చూస్తుంటే అక్క కన్నుల్లో బెదురు, ఆందోళన కనపడ్డాయి. ఇంక అక్కడ ఆగకుండా తిరిగి మా యింటికి వచ్చేశాను. రాగానే నిండాదుప్పటి ముసుగుపెట్టుకుని నిద్రపోయాను. మొదట్నుంచీ నావరసింతే. గుళ్ళో దొంగతనం చేసి వచ్చినపుడు కూడా ఇలాగే పక్కలో దూరిపడుకునే వాణ్ణి. ఒక అరగంట వరకూ నాగుండెల్లో తుఫాను హెూరు విన్పిస్తుంది. వళ్ళంతా తీవ్ర ప్రభంజనమేదో పరుగులు పెడుతున్నట్లు వుంటుంది. నేనీ విధంగా ఎందుకు పడివుంటున్నాను? రెక్కలు విప్పి ఆడిస్తూ ఎగిరే ఆ మాయావి నుండి ఎందుకు కాపాడబడలేకపోతున్నాను? కాని ఈ సారి పరిస్థితి నాకు చాలా గడ్డుగా వున్నది. ఎవరి దగ్గరైతే నేను స్వాంతన పొందేవాణ్ణో, ఎవరి ప్రేమను ఎదనిండా నింపుకుని బతుకుతున్నానో వారికే ఆఘాతం కల్గించివచ్చాను. తప్పించుకోలేని పరిస్థితి నాది. రెండవరోజు డబ్బులు తెచ్చుకోవటానికి మరలా వెళ్ళాను. కాని కళ్ళెత్తి అక్కవంక సూటిగా చూచి మాట్లాడలేకపోయాను. ఇన్నాళ్ళూ ఆమె కళ్ళలో నాతమ్ముడు వాడి పట్ల ప్రేమ అన్న భావాలే చూట్టం నాకలవాటు. ఇపుడామె కళ్ళల్లో అవే భావాలుంటాయా? లేక ఏ కొంచెమైనా లోటు కన్పిస్తే నేను తట్టుకోగలనా? అక్క, నా అక్క. ఎలా జమచేసిందో తెలియదు. ఇంట్లో ఏమేం చెప్పివినిపించి ఆ డబ్బు నాకివ్వగలిగిందో నాకు తెలియదు. తిరిగి వచ్చేటప్పుడు నా మనసులో రకరకాల ఆలోచనలు, మొలుచుకొచ్చాయి.

అదృష్టం అనేది ఎంత విచిత్రంగా వస్తుంది? అక్క ఆ మోటరు సైకిలు వాడితో ప్రేమాయణం జరిపివుండకపోతే ఈ ఇంటికి వచ్చివుండేది కాదు.

అక్క నాకంటే వేరు, నా కంటే పెద్దదన్న విషయం ఆ మోటరు సైకిలు శబ్దం విన్న అక్క ముఖం వంక చూస్తేనే నాకు తెలిసింది. అతడు మా పేటలోపలి కంటా మోటరు సైకిలు మీద వచ్చేవాడుకాదు. దూరంగా నిలబడి హారను వేసేవాడు.

హారను వినపట్టంతోనే మా పేటలోని వాళ్ళు కిటికీలు కొద్దిగా తెరుచుకుని ఆసక్తిగా చూసే వాళ్ళు. ఏదో జరగబోతుందని భావించేవాళ్ళు. బావి దగ్గర బట్టలుతికే వాళ్ళు తమ చేతుల్ని సడన్‌గా పనిచేయకుండా ఆపేసేవారు. ఆ రోజుల్లో అక్క కుట్టుక్లాసులకు వెళ్తూవుండేది. మోటరు సైకిలతను అక్కను క్లాసులకు తీసుకెళ్ళి మరలా ఇంటిదగ్గర దింపేసి వెళ్ళేవాడు.

అక్క ప్రొద్దున్నే లేచి పనులన్నీ గబగబా పూర్తి చేసి తను తయారయ్యి అతని కోసం ఎదురు చూస్తూ కూర్చునేది. ఆ చిన్న గుడిసెలో, మా కుటుంబంలో ఎవరైనా సంతోషంగా వుండటాన్ని నేను చూడటం అదే మొదటిసారి. ఆ రోజుల్లో మైకంగా, ఎంతో ఉత్సాహంగా వుండేది అక్క. అతను జీన్‌పాంటు వేసుకుని చేతికి కడియాన్ని పెట్టుకుని వుండేవాడు. వెంట్రుకల్ని చాలా స్టయిల్‌గా దువ్వేవాడు. అతడు తరచూ కిళ్ళీ నములుతూ వుండేవాడు.

కాని ఒకనాటి రాత్రి అదీ హోలీ పండగ నాటి రాత్రి ఒక విచిత్రం జరిగింది. మామూలుగా అయితే హోలీ నాటి రాత్రి నాన్న ఇంట్లో వుండడు. బయటెక్కడో ఆవారాలాగా తిరుగుతూ వుంటాడు. కాని ఆనాటి రాత్రి ఇంట్లోనే వున్నాడు. అక్క ఎక్కడికీ వెళ్ళటానికి కుదరలేదు. మాదంతా ఒకటే గది. ఎవరు ఏ మూలా దాక్కోవటానికి లేదు. ఆగదిలోనే ఒ పక్కగా కూర్చునుంది అక్క. కళ్ళు రెండూ ఎఱ్ఱగా జ్యోతుల్లాగా వున్నాయి. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ వున్నది. ఈ రోజంతా ఏమీ తిన్నట్లుగా కూడా లేదు. నాకు ఏమీ చెప్పటం లేదు. మాట్లాడకుండా కూర్చున్నది. అక్కతో ఏం మాట్లాడాలో నాకేం అర్థం కావటం లేదు. కాని అక్కను చూస్తుంటే నాకు ఏడుపువస్తుంది. పదకొండు గంటలప్పుడు కాసిని మంచి నీళ్ళు తీసుకుని అక్క దగరకెళ్ళి నిలబడ్డాను.

"ఇదుగో, నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఇవాళ రాత్రి నాన్న నన్ను బాగా కొడతాడు. నువ్వు భయపడతావు. ఇంట్లో వుండకుండా బయటికెళ్ళి తిరిగిరా" అన్నది.

"ఎందుక్కొడతాడని" అడిగాను.

"ఎందుకంటే నాన్నతో నేనంతా చెప్పేశాను. మనకింకెవరున్నారు? అందుకే నాన్నతోనే చెప్పాను. ఆ మోటరు సైకిలు వాడు నేను చెప్పిన మాట విని పారిపోయాడు. నీకు చెబ్దామంటే నువ్వు చిన్న పిల్లవాడివి" అన్నది.

నేను హోలీ సంబరాలు చూడటానికి వెళ్ళి బయటతిరిగి రాత్రి మూడు గంటలకు తిరిగి వచ్చాను. అప్పటికి కూడా నాన్నింకా నిద్రపోలేదు. ఆ గదిలోనే అటూ, ఇటూ తిరుగుతున్నాడు. బాగా దెబ్బలుతిన్న అక్క అక్కడే నేలమీద పడివున్నది.

"ఈ పిల్ల నా కుటుంబ గౌరవాన్ని మట్టిలో కలిపేసింది" అనే మాటనే నాన్న మాటిమాటికీ అనసాగాడు.

మరుసటి ఉదయానికి సీను మారిపోయింది. సాయంకాలపు బండికి నాన్న అక్కను తీసుకుని దగ్గరలో వున్న పట్నపు ఆసుపత్రికి వెళ్ళాడు. ఆ ఆసుపత్రిలో మోటరు సైకిలువాడి గుర్తుల్ని కరిగించివేశారు.

ఆ సంఘటన తరువాత అక్కపెళ్ళి చేయాలని నాన్న ఒకటే తొందరపడిపోయాడు. ఎక్కువ దూరపు వాళ్ళ సంబంధం కూడా కాదు. మా పట్నపు వాసితోనే అక్క పెళ్ళి కుదిర్చాడు. పెళ్ళికొడుకు ఏభై

ఏళ్ళవాడు.

"వాళ్ళు చాలా పెద్ద మనుష్యులు. గొప్ప ఇంటి వాళ్ళు. మనతో సంబంధం కలుపుకుంటున్నారంటేనే వాళ్ళ గొప్పతనం అర్థమవుతుంది అన్నాడు. అతడి దగ్గరున్న డబ్బుతో ఏమేంకొనుక్కోవచ్చో మనం ఊహించనుకూడా ఊహించలేం" అంటూ సంబరంగా చెప్పుకొచ్చాడు నాన్న.

ఆ వృద్ధునికిది మూడవపెళ్ళి. అందువలన పెద్ద ఉత్సాహమేదీ లేదు. ఆడంబరంగా పెళ్ళి చేసే సామర్థ్యమూ మాకులేదు. పెండ్లికి మాకున్న ఒకరిద్దరు బంధువులు మాత్రమే వచ్చారు. మా గదిలో కొన్ని రంగుకాగితాలంటించాను. ఒకరిద్దరాడవారు డోలక్ వాయిస్తూ కొద్దిగా పాటలు పాడుతున్నారు. అక్క మాత్రం ఏడుస్తూనేవున్నది.

ఎలాంటి పెళ్ళి ఇది. నాన్న మా చేత చేదు మాత్రలు మింగిస్తూనే వుంటాడు. తను ఎంత ఆలోచించి ఈ సంబంధం కుదిర్చాడో? దీని వలన మాకు ఏమేం ఉపయోగాలుంటాయో వివరించి వివరించి చెప్పాడు.

ఒకసారి ప్లానువేసి నన్ను డబ్బుకోసం పంపి నాన్న విజయాన్ని పొందాడు. ఇప్పుడదొక అలవాటుగా మారింది ఆయనకు. ఏ రోజైతే నాకు బజారునుండి గులాబ్‌జామున్ తెస్తాడో ఆ రోజు నేను అక్కదగ్గరకు డబ్బు తేవటానికి వెళ్ళాల్సివుంటుందని నాకర్థమవుతుంది. గులాబ్‌జామున్ నాముందరపెట్టి తాను సీసా తెరిచి తాగుతూ ఈసారి ఎంత డబ్బు తీసుకురావలసిందీ అంకె చెప్తాడు.

ఎన్నోసార్లు నాన్నకు చెప్పాలనుకుంటాను. "ఇంత చిన్న వయస్సులో నేనెంత కుంగుబాటుకు గురవుతున్నానో నీకెందుకు తెలియటం లేదు? మాటిమాటికీ అటూ ఇటూ వెళ్ళటం వలన నా చదువూ నష్టపోతున్నాను. ఇన్ని రోజులవరకూ నాచేత దొంగతనాలు చేయించావు. అక్క ఎలాగో తన కాపురం తను చేసుకుంటున్నది. ఆ కాపురంలో నిప్పులు పోయటానికి నన్ను సైతాన్‌లాగా అక్కడికి పంపిస్తున్నావు. ఆ నిప్పుల్లో నేనూ నెమ్మది నెమ్మదిగా కాలిపోతున్నాను. నీ దృష్టికివేం కనపడవు. నేను భయంకరమైన కలలుగంటున్నాను. అక్కా, ఆమె స్నేహితుని కొరకు నేను ప్రాణాలు వదిలినట్లుగా కలలువస్తున్నాయి. వూళ్ళోవాళ్ళంతా నా ప్రాణ త్యాగాన్ని మెచ్చుకుంటున్నట్లుగా కలగంటున్నాను. అక్క దగ్గరకు వెళ్తుంటే రోడ్డు మీద చూచేవాళ్లంతా ఈ కుర్రాడు వెళ్ళి తన అక్కకూ, ఆమె కాపురానికీ ఎంతో నష్టం కలిగిస్తున్నాడని అనుకుంటున్నట్లుగా కలగంటున్నాను. ఇంకా ఏమనుకుంటున్నారంటే ఆ అక్క ఇతన్ని ఎంత ప్రేమించింది! ఎంతలాలించింది! అలాంటి అక్కకు ఈ తమ్ముడు ఎంత ద్రోహం చేస్తున్నాడో చూడండి అంటున్నారు.

యధాప్రకారం నేను డబ్బు కోసం వెళ్ళాను. అక్క నా వంక చూస్తూ "నిన్న నువ్వు వచ్చి వెళ్ళిన తర్వాత ఆయన్ని డబ్బడిగాను. అతడు నన్ను జుట్టుపట్టుకుని కొట్టాడు. ఎటువంటి ఇంటినుంచి వచ్చావు?" అంటూ తిట్టాడని చెప్పింది.

గిరుక్కున్న వెనుదిరిగి రోడ్డు పట్టుకుని తిరిగాను. ఇంటికి వెళ్ళటానికి బాగా ఆలస్యం చేయసాగాను. కల్లు అమ్మేవాడి దగ్గరకెళ్ళి తప్పతాగి రోడ్డుమీద పడిపోతే సరి. అచ్చం నాన్న చేసినట్లే. మాటిమాటికీ చిన్నబుచ్చుకున్న అక్క ముఖం, ఏడ్చి ఏడ్చి ఉబ్బిన ముఖం, ఎఱ్ఱబడ్డ అక్క కళ్ళు ఇవే గుర్తుకొస్తున్నాయి. దీనికంతటికీ నేనే కారణమనిపిస్తుంది.

అవును బాధ్యుణ్ణి నేనే. అపరాధిని నేనే అంటూ కుంగిపోయాను. స్కూల్లో క్లాసులయింపోయిం తర్వాత పిల్లలంతా బయటికొచ్చే సమయంలో వాళ్ళ ఎదురుగా నిలబడి అరవాలనిపిస్తుంది. "సోదరులారా? నన్ను సరిగా అర్థం చేసుకోండి. పరదా వెనకుండి నన్ను నడిపించే అపరాధిని గుర్తించండి". కానీ నాకు తెలుసు. ఉపయోగమేమీ వుండదు. ఏమార్పూ జరుగదు.

నాన్న మరలా ఆజ్ఞాపించాడు. అక్కకు మృత్యుకళను ఆపాదించటానికి, నేను వెళ్ళాను. నేను కూడా అలాంటి స్థితిలోనే బయటికొచ్చాను.

దీపావళి పండుగ రోజున అక్క మా యింటికొచ్చింది. అక్క వెళ్ళిన తర్వాత ఇక్కడంతా శూన్యమే. ఆదరణ చూపించే కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరు. అక్క కోసం ఎంతో ఎదురుచూశాను."అక్క వస్తుంది.కుప్పలు తెప్పలుగా కబుర్లు చెప్పుకోవచ్చు. ఆమె అక్కడి అనుభవాలు చెప్తే నేను వింటాను. ఇక్కడి సంగతులు నేను చెప్తుంటే అక్కకు బావుంటాయి. అక్క చేతి వంట తిని చాలా రోజులైంది. అక్క చేసే కూరల రుచేవేరు. ఇంకా చాలా చాలా ఆలోచించాను. అక్కరాగానే ఇద్దరం చిన్న పిల్లలమై వెనకటి రోజుల్లోకి వెళ్ళిపోయి గతాన్నంతా నెమరువేసుకుంటూ ఒకరోజంతా గడపాలని."

అక్క వచ్చింది కాని నేనకున్నవి ఏమీ జరగలేదు. ఆత్మీయంగా మేము ఏక్షణాన్నీ పంచుకోలేదు. ఒకరికొకరం మా మధ్య అడ్డుగోడల్ని కట్టేసుకున్నాం.

రెండో రోజు "అక్కా! పద నిన్ను మీ ఇంటి దగ్గర దింపేసివస్తానన్నాను."

"నేను వెళ్ళగలను." అంది ఆమె నిష్ఠూరంగా.

ఎంతో శ్రమించి నేను పేర్చుకున్న కలలసౌధం, నా భావాల పందిరి అన్నీ చిన్నాభిన్నంగా కుప్పకూలిపోయాయి. మరలా నేను నాన్న చెప్తే వేరే ముఖాన్ని తగిలించుకుని ఆమె దగ్గరకెళతాను. ఎప్పుడైనా తనను రక్షించటానికి కూడా నేను వేరే ముఖాన్ని తగిలించుకోవాలి. జరిగే దానిలో తప్పంతా నాదేనా? నా తప్పేంలేదే? నా తప్పు లేకుండానే అపరాధి నన్న బోర్డు నామెడలో వేలాడుతుంది. అలా వేలాడతీసేది ఎవరు అని ఆలోచిస్తూవుండగానే నాన్న అక్కడ కనపడ్డాడు. మరలా నాన్న ముఖంలో మాయావి తాండవిస్తున్నది. అది వేగంగా రెక్కల్ని అల్లల్లాడిస్తూ అక్క చుట్టుపట్లే పచార్లు చేస్తున్నది. అక్క ఏం గాభరాపడలేదు. బహుశా గత సంవత్సరపు అనుభవాలతో ఆమెకు పెద్దరికం వచ్చేసినట్లున్నది.

మోసపూరితమైన నవ్వునే పెదాల మీద పులుముకుంటూ "రెండు వందల పైకం కావాలి"

అన్నాడు నాన్న.

చాలా ధైర్యంగా నాన్న వంకచూస్తూ వున్నది అక్క. ఆమె ధైర్యాన్ని చూసి నేను విస్తుబోయాను.

"ఇప్పుడు డబ్బు దొరకదు" అని చాలా గట్టిగా చెప్పి అద్దంలో చూచుకుంటూ బొట్టును సరిచేసుకుంటున్నది.

మాయావి పక్షి దెబ్బతిన్నట్లుగా గదిలో ఒక మూల పడివున్నది. అప్పుడు మా ముగ్గురిలో ఎవరమూ ఏం మాట్లాడలేదు. చాలా సేపటివరకూ నాన్నా నిశ్శబ్దంగా వున్నాడు. కాని నాకు మా గదిలోకి వచ్చే గాలిలో తుపాకి మందువాసనే వస్తున్నది. ఏ క్షణంలోనైనా గదిలో వున్న ప్రతి వస్తువూ పేలికలై ఎగురుతాయని నాకనిపించింది.

నెమ్మదినెమ్మదిగా గది దాటి బయటకి వస్తూ నాన్న అన్న మాటలు నేనెప్పటికీ ఊహించలేదు. సమాప్తమైపోయిన దాన్ని తననీచత్వంతో బయటకు తెస్తాడనీ కన్నబిడ్డల జీవితాలతో ఆడుకుంటాడనీ.

"విను పూనమ్. నువ్వు చాలా ఎక్కువ చేస్తున్నావు. బాగా గుర్తుపెట్టుకో. రేపటికల్లా డబ్బివ్వకపోతే "నేను నీ మనిషికి అంతా చెప్పేస్తాను. ఆ మోటర్ సైకిల్ వాడితో నువ్వేం చేశావో? పట్టణంలోని ఆస్పత్రికి తీసుకెళ్లితే ఏం జరిగిందో అంతా అంటూ ఆ మాయావి పక్షి తన రెక్కల్ని అల్లల్లాడిస్తూ బయటికెళ్ళింది.

కొంచెంసేపున్నాక అక్క మరణ దండన పొందిన ఖైదీలాగా కుంగిపోయి నెమ్మది నెమ్మదిగా కూడదీసుకుని తన ఇంటి వైపుకు వెళ్ళింది. నేనూ వెంటే వెళ్ళాను. ఆమె రావద్దని వారించలేదు. దార్లో ఆమె ఏం మాట్లాడలేదు. రోడ్డు వంక కూడా సరిగా చూచినడవటం లేదు. నేనామెను ఏమని ఓదార్చను? నాలోపలున్న బలహీనత, పిరికితనం, సంకోచం పక్కనపెట్టి ఏమైనా అడగాలనుకున్నాను. ఇంతలోకి ఆమే అన్నది.

"నువ్వు డబ్బు కోసం ఎప్పుడొస్తావు" అని

రేపన్నాను. అలాగే డబ్బు తీసికెళ్ళటానికి మర్నాడు అక్కావాళ్ళింటికెళ్ళాను. అక్క మొగుడు వాకిట్లోనే వున్నాడు. ఆయన నన్ను అక్క దగ్గరకు వెళ్ళకుండా ఆపాలని చూస్తున్నట్లు నాకర్థమయింది. నా వంక చూస్తూ కూర్చున్నాడు. ఆ చూపులో ఎంత అసహ్యమో? నేను వెళ్ళి కూర్చున్నాను. పట్టణంలోని పేటంతా వణికేటట్టుగా ఆయన నాపై గర్జించాడు. చాలాసేపటి వరకూ తిడుతూ నిప్పులు కక్కాడు. అవన్నీ వింటూ నిశ్శబ్దంగా వుండిపోయాను. అంతకు మించి నేనేం జవాబివ్వగలను? మా అక్క చేయి పట్టుకున్న పాపానికి మా కుటుంబానికి ఎంత ఉపకారం చేస్తున్నాడో వివరిస్తున్నాడు.

వెంట్రుకలు తెల్లబడి, ముఖమంతా ముడతలు కనబడే ఈ వృద్ధుడే గర్జించి నన్నడుగుతున్నాడు.

"ఏంటీ అర్ధమవుతుందా? మీరంతా కలిసి మీ పిల్లను ఇక్కడ చేర్చి ఈ యింటి సొమ్మునంతా దోచేస్తున్నారు. ఇంకెప్పుడైనా నువ్విక్కడకు వస్తే దాన్నీ, నిన్నూ ఇద్దర్నీ కలిపి బయటకు నెడతాను. తెలిసిందా? అంటూ, అరవటంతోపాటు డబ్బు కూడా విసిరివేశాడు. బొత్తిగా బిచ్చగాడికి బిచ్చమేసినట్లుగా.

పరిస్థితి ఇలా అయింది. నా అక్క ఏమేమి అనుభవించవలసివస్తుందో? ఈ పరిస్థితికంతా నేను బాధ్యత వహించవలసివస్తుంది. తన ఇంట్లోనే తన గౌరవం మంటగలుస్తుంటే ఆమె ఎలా తట్టుకుంటుంది?

ఇంటికి రాగానే మా నాన్న ఎంతో శ్రద్ధగా నోట్లను లెక్కబెట్టుకుంటున్నాడు. ఏదో తాను కష్టపడి సంపాదించిన డబ్బులాగా.

విషపు నవ్వు నవ్వుతూ "చూడు మీ అక్కను ఒక్క ఊపు ఊపగానే డబ్బురాలింది. ఇక ముందు కూడా డబ్బివ్వనంటే నువ్వూ ఇదే మాట చెప్పు. అర్థమయిందా? ఆ మోటరు సైకిల్ వాడి సంగతీ, ఆస్పత్రిలో అంతా పూర్తి చేసిన సంగతీ దాని మొగుడితోనే చెప్పు" అన్నాడు.

ఓహ్! ఎలాంటి తండ్రివి నువ్వు. భగవంతుడా! నీమీద ఒట్టేసి చెప్తున్నాను. నన్నింక క్షమించి వదిలెయ్, నాన్నా! నీ కొడుకునన్న ముద్ర నాపై పడుతుంది. ఆ ముద్ర నాకు వద్దే వద్దు. నా ఆలోచనలన్నీ, నా మాటల్నీ పట్టించుకునే స్థితిలో లేడు. తన ప్రయత్నం ఫలించి డబ్బు చేజిక్కిందన్న సంబరంలో వున్నాడు.

ఈ నిరంతర ఆత్మ గ్లాని నుండి బయటపడేదారి లేదు. ఎన్నో భ్రమలు కలుగుతున్నాయి. పట్టణంలో వున్న దారులన్నీ చీకటితోనే మూసుకుపోయినట్లుగా, నాకంతా అంధకారమే కనిపిస్తున్నదంటే "నీ చూపు పూర్తిగా పోయుంటుంది. ఎవర్కైనా చూపించుకో" అంటున్నారు.

నాన్న చేసే పని కాస్తా ఊడిపోయింది. అతనక్కడ సరిగా పనిచేసేవాడు కాదు. చేసేవాళ్ళని కూడా ఇబ్బంది పెట్టేవాడు.

ఇపుడు నాన్న ఒక సినిమా హాలు దగ్గర నిలబడి గూండాగిరి చేస్తున్నాడు. చిన్నా, పెద్దా తగాదాల్లో వేలుపెడుతున్నాడు. ఈయన పేరు అక్కడక్కడా వినపడుతుంది. ఒకటి రెండుసార్లు చాకు కూడా తీసి ఎదుటివాళ్ళపై తన ప్రతాపాన్ని చూపించాడట. ఇపుడు మాపేటలో ఇతని ముఖమెవరూ చూడటం లేదు. మధ్యమధ్యలో కొన్ని రోజులు మాయమవుతూ వుంటాడు. వినబోతే జైల్లో వేశారంటారు. అప్పుడప్పుడూ పరారీలో వున్నాడంటారు.

ఒక రోజు బయటి నుండే బిగ్గరగా పాడుకుంటూ లోపలికొచ్చాడు. బాగా తాగివున్నాడు. చేతిలో గులాబ్‌జామున్ దొన్నె వున్నది. పరిస్థితి అర్థమయింది.

ఆ రోజు నాన్నకెంతో నచ్చచెప్పాను. "నేనిపుడు చిన్న పిల్లవాడిని కాదు. నీ అంత ఎత్తు పెరిగాను.

నీ కంటే బిగ్గరగా కూడా అరవగలను. క్రిందటిసారి వెళ్ళినపుడు అక్క మొగుడు ఏమేం అన్నాడో గుర్తుచేశాను. ఇప్పుడు డబ్బుకోసం వెడితే అక్కనూ, నన్నూ ఇద్దర్నీ కలిపి బయటకు గెంటేస్తాడని చెప్పాను. కాని నాన్న ఒప్పుకోలేదు. నా రెక్కపట్టుకుని గుంజుతూ, సంవత్సరాలపాటు నేను సంపాదించిందే తేరగా తింటూ కూర్చున్నావు. ఇప్పుడేమైనా పనిచేసి చూపించు. పో వెళ్ళు అన్నాడు.

సైకిలు తొక్కుకుంటూపోతూ ఆలోచిస్తున్నాను. ఒక కాలిని పెడల్‌పై వేసి "నాన్న చెప్పినట్లే అక్క మొగుడ్ని దబాయించి ఎదిరిస్తాననుకున్నాను. రెండవ కాలిని మరొక పెడల్ మీద వేసి నా కాళల్లో, ఒంట్లో బొత్తుగా ప్రాణం లేదు. ఎక్కడికి వెళ్తాను? అక్క ఇంటికి నేను వెళ్ళలేను అన్న ఆలోచనల్లో వుండగానే నన్నాపి నాన్న అడిగాడు? అక్కడికి వెళ్ళి ఏం చేస్తావని?" ఆయన చెప్పేది నాకు తెలుసు. ఆ మోటరు సైకిలు వాని సంగతీ, ఆస్పత్రి సంగతీ గుర్తుచేస్తున్నాడు.

ఈ ఆలోచనలతో అక్క ఇంటికి చేరుకున్నాను. అక్క ముఖంలో బాధపడే లక్షణాలేంలేవు. నన్ను చూసి ఆమె ఏ కలవరమూ పడలేదు.సహజంగానే చూస్తూ కూర్చున్నది. ఆ సహజతతోనే నన్ను పైకి తీసుకెళ్లింది. నేను మొట్టమొదటిసారి ఈ యింటికొచ్చినప్పుడు ఆమెతో కలిసి ఎలా లోపలికెళ్ళానో, ఈ వేళా అలాగే వెళ్ళాను. అక్క కొంచెం తటపటాయిస్తూ, సంకోచంగా నా వంక చూడసాగింది. ఏదైనా రహస్యం చెప్పేముందు ఇదే తరహాలో సిగ్గుపడే చూపుల్తో చూడటం ఆమెకలవాటు. అది చూచి నేను కొంచెం అశాంతిగా అయ్యాను.

"నన్ను చూసి వెళ్దామనివచ్చావా? లేక డబ్బుకోసమే వచ్చావా?" అంటూ నా దగ్గర్లో వున్న సోఫాలో కూర్చుని నెమ్మదిగి చెప్పసాగింది. నీకెంత కావాలంటే అంత ఇస్తాను. ఇంకా ఎక్కువైనా ఇస్తాను. కాని నాకు నువ్వొక పనిచేసిపెట్టాలన్నది".

"తప్పకుండా చేస్తాను. నీకేమైనా కావాలా"

"కావాలి. నాకొంచెం విషం కావాలి. ఏ విధమైన విషమైనా సరే. మీరూ, నేనూ చావాలి. చచ్చిపోయేంత మోతాదు చాలు." అంటుంటే ఆమె పెదాలమీద చిరునవ్వే వున్నది. "ఇదే నాకు చివరకు మిగిలింది. చిన్న చిన్న విషయాలకే కుంగిపోతున్నాను. విపరీతంగా బాధపడుతున్నాను. ఇంకేదైనా పెద్ద విషయమైతే నాలో జీవమేం వుండటంలేదన్నది."

బయటి రోడ్డుమీదకొచ్చి నేను వేగంగా సైకిల్ తొక్కసాగాను. పెడల్ మీద ఒక కాలు వేసినపుడు అక్క స్పృహలోనే వున్నది కదా అనుకుంటాను. మరొక కాలు మరొక పెడలు మీద వేసినపుడు అక్క స్పృహలో లేదా అనుకుంటాను. మరొక సారి పెడల్ తిరిగేటప్పుడు నేను స్పృహలోనే వున్నాను కదా అనుకుంటాను. మరొకసారి పెడల్ తొక్కినపుడు "నేను స్పృహలో లేను" అన్పిస్తుంది. మా పేటకు నేను

సాయంత్రానికి చేరుకున్నాను. రోజూ కంటే నిశ్శబ్దంగా వుంది. బావి దగ్గర కూడా రోజూలాగే సందడిలేదు. స్త్రీలెవ్వరూ అక్కడ బట్టలుతకటం లేదు. నీళ్ళు నింపుకోవటం లేదు. నీళ్ళకోసం వచ్చిన వాళ్ళు కూడా త్వరగా ఇళ్ళకెళ్ళే ప్రయత్నంలో వున్నారు.

మా గుడిసెలో చిన్న లైటు వెలుగుతున్నది రేడియో రోజూకంటే చాలా తక్కువ ధ్వనిలో మోగుతున్నది.

సెంటర్‌లో ఏదో తగువుపడి మా నాన్న ఇంటికి వచ్చాడని అర్థమయింది. అంతేకాక ఈ సారి ఒక పెద్దాయనను అగౌరవపరచివచ్చాడు. ఆదాదా ఈ రాత్రికొచ్చి నాన్న అంతు చూస్తానని బెదిరించివెళ్ళాడు. ఎలా దాక్కుంటావో దాక్కో అని కూడా అని వెళ్ళాడు. ఈ సంగతులన్నీ దార్లోనే తెలిశాయి.

ఇంటికొచ్చి నాన్నను చూశాను. రోజుకన్నా ఎక్కువ తాగేసివచ్చాడు. నన్ను డబ్బులు కోసం పంపిన సంగతి కూడా మర్చిపోయాడు. ఇంటిలోపల వెలుతురు బయటికేం కనపడకుండా దర్వాజా, కిటికీలు అన్ని మూసేయాలని తెగతాపత్రయపడిపోతున్నాడు. నన్నుచూడగానే "వచ్చావా? నీవొచ్చి మంచి పనిచేశావు. కిటికీలు తలుపూ అన్నీ గట్టిగా మూసేయ్. ఏదైనా తెరిచివుంటే వాళ్ళు లోపలికొచ్చి నన్ను చంపేస్తారు." అన్నాడు.

నాన్న చెప్పినట్టే అన్నీ మూసేసి ఆయన్ను మంచం మీద పడుకోబెట్టాను. నేను మిద్దె మీదికెళ్ళిపడుకున్నాను. మా పేటంతా నెమ్మదినెమ్మదిగా చీకటిలో ఒదిగిపోయింది.

నేను అటూ, ఇటూ ఒత్తిగిలి పడుకుంటూ వణకసాగాను. రాత్రి నెమ్మది నెమ్మదిగా ముందుకు జరుగుతున్నది. నేను మెలకువతోనే ఉండి ఇప్పుడు టైం పదయ్యుంటుంది, ఇప్పుడు పదకొండైవుంటుందని అనుకోసాగాను.

అర్థరాత్రి సమయంలో కొన్నికుక్కలు మొరిగే శబ్దం వినపడింది. నేను లేచి కూర్చున్నాను. వాళ్లు వచ్చి నాన్నను చంపేస్తారని నాకు బాగా నమ్మకంగా వుంది. ఆ చీకట్లో అడుగుల చప్పుడు వినిపిస్తే వాళ్ళెంతమంది వస్తారు? వచ్చినవాళ్ళ ముఖాలు ఎట్లా వుంటాయో చూద్దామనుకున్నాను.

అకస్మాత్తుగా ఆ వచ్చేవాళ్ళంతా నా మిత్రులే అనిపించింది. అలా అనుకుంటే నా భయమంతా పోయింది వణుకంతా తగ్గిపోయింది. నేనొక నిర్ణయానికి వచ్చి కిందికి దిగివచ్చాను. ఇపుడు కిందకి వస్తుంటే నా కాళ్ళేం తొట్రుపడటం లేదు. సరిగ్గానే అడుగులు పడుతున్నాయి. నేను నాన్న పడుకున్న చోటికి వెళ్ళాను. శుభ్రంగా నిద్రపోతున్నాడు. చాలా ఎక్కువ తాగటం వలన బొత్తిగా స్పృహలో లేడు. కిటికీలు, దర్వాజా పూర్తిగా తెరిచివుంచాను. లోపల పడుకున్నదెవరనేది స్పష్టంగా కనపడేటట్లు చేశాను. మరలా నేను పైకొచ్చి పడుకున్నాను. ఆ పాదాల చప్పుడు ఎంత దూరంలో వుందో అంచనా వేయసాగాను.

## వర్ధమాన రచయిత్రి శ్రీమతి రేణు నారాయణ్

జీవన రేఖలు : వీరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శామలీ జిల్లాయందు గల ముజఫ్ఫర్ నగర్ నందు జన్మించారు. జన్మతిధి మే 25, 1962. శ్రీమతి శ్రీలత, శ్రీ సత్యప్రకాశ్‌లు ఆమె తల్లిదండ్రులు.

విద్యాభ్యాసం : ఎమ్.ఎ.బి.ఎడ్.లలో పట్టభద్రురాలు. కొద్ది రోజులపాటు అధ్యాపక వృత్తి చేపట్టారు.

సాహిత్య రచన : నందన్ మొదలగు పత్రికలలో అనేక కథలు, కవితలు వెలువరించారు. బాల సాహిత్యాన్ని కూడా రచించారు.

వీరి మొదటి సంపుటి "టూటతీజడేం".దానిలోని కథే ఈ 'అపరిపక్వరిస్తే". ఇంకా ఈమె కథల్లో టూటతీజడేం, బదలా, గురూజీ, బేటీకీ మా, శహర్, మొదలగు కథల్లో మధ్య తరగతి కుటుంబాలు, అప్పుడప్పుడే ధనవంతులయిన వారి మనస్థితిని గురించి వర్ణనలూ ఎక్కువగా కనపడతాయి.

ప్రస్తుత కథ 'అపరిపక్వరిస్తే' అంటే పరిపక్వం కాని బంధుత్వాలని అర్థం. బంధుత్వాలే కాదు మనసులు కూడా పరిపక్వం కాని దశలో ఒకరు గడుసుగా, మరొకరు అమాయకంగా, అజ్ఞానంలో పడిపోవటాన్ని పాఠకుల మనస్సుకు హత్తుకునేటట్లుగా చిత్రీకరించబడింది. దీనిని నేను 'స్వార్థము–నిస్వార్థము' అనే పేరుతో అనువాదం చేశాను.

వీరి మరొక కథ "టూటతీజడేం" అంటే తెగిపోయే వ్రేళ్ళని అర్థం. తల్లిదండ్రుల ప్రేమ అనే వ్రేళ్ళను పిల్లలు మొదలంటా పెరుకుతుంటే ఆ వృద్ధులుపడే వేదనే ఇందులో వర్ణించబడింది. నేను దీన్ని 'భూమి గుండ్రమే' అన్న కథగా వ్రాశాను.

# భూమి గుండ్రమే

అరవై సంవత్సరాల వయస్సులో రామప్రసాదబాబు మరలా ఈనాడు తన గ్రామానికి తిరిగి వచ్చాడు. సుమారు ముప్పై సంవత్సరాల క్రిందట తన స్వంత ఊరిని వదిలిపెట్టాడు. ఇప్పుడు ఖాళీ చేతుల్తో తిరిగి వచ్చాడు. ఈరోజు ఆయన దగ్గర ఏమీ లేదు. ఆయనకూ ఎవరూ మిగల్లేదు.

ఆనాడు నీరు కమ్మిన కళ్ళతో తనను వెనుక నుండి బేలగా చూస్తూ వుంటే ఏం పట్టనట్టుగా తన దారిన తను వెళ్లిపోయాడు. ఇంట్లో వాళ్ళు మాట్లాడుతూనే వున్నారు. తనను కాదన్నట్టుగా దులపరించుకుని టౌను బాటపట్టాడు. కాని ఈ రోజు మూడు దశాబ్దాలు గడిచిన తర్వాత ఒక్కొక్కటిగా తన లోపలి విషయాలు పెల్లుబికివస్తున్నాయి. ఆనాడు తను ప్రతి ఉపకారాన్నీ, ప్రతి సంబంధాన్నీ, ప్రతి చుట్టరికాన్నీ తేలిగ్గా తెంచేసుకున్నాడు. కొన్ని బంధాలను అతడే వదిలిపెట్టివెళ్ళాడు. కొన్ని బంధాలు అతడ్ని వదిలేసిపోయాయి. అలా వదిలేసిపోవటం ఆనాడు బాగుందేమో కాని ఈనాడు అదే అతన్ని వెక్కిరిస్తుంది. ఏనాడూ వెనక్కు తిరిగి ఆలోచించుకోలేదు. చేసిన పని తప్పా, రైటా అని బేరీజు వేసుకోలేదు. స్వార్ధం అనే మోహం కమ్మేసి కాళ్ళకు బేడీలు పడిపోయాయి. తల్లినీ, తండ్రినీ గుర్తుచేసుకుని ఏనాడూ కంఠంరుద్ధం కాలేదు. ఏదో స్వప్నావస్థలోనే బతికాడు.

తనూ తన భర్త, తన పిల్లలు ఇదే కాపురం అనుకుంటూ రామ్‌ప్రసాద్ భార్య ఆ కాపురాన్ని చక్కదిద్దుకోవటంలో మునిగిపోయింది. అత్తమామల దగ్గర, గ్రామంలో వుండటం ఆమెకెపుడూ ఇష్టం లేదు. పిల్లల, చదువు సంధ్యలు, నాగరికతా అంతా పట్టణాల్లోనే సాధ్యపడతాయి. అని హద్దులు పెట్టుకుని ఆమె సంతోషపడేది. తన ఇంటిని చక్కదిద్దుకోవటానికి ఆమె చాలా కష్టపడింది. రామ్‌ప్రసాద్ తెచ్చే జీతాన్నిమించి ఎప్పుడూ ఆమె ఏ కోరికలూ కోరేది కాదు. దాంట్లోనే ముగ్గురి పిల్లల్నీ చదివించింది. ఇంటినీ సమర్ధించుకున్నది. రామ్‌ప్రసాద్‌కు తన ఫైల్సు తప్ప మిగతా ఏ విషయంలోనూ ఆసక్తి వుండేది కాదు. కనీసం ఇంట్లో ఎక్కువగా మాట్లాడే అలవాటు కూడా లేదు. భార్యపై కోపగించుకోవటం, ఇంట్లో తనమాటే బలవతంగా నెగ్గించుకోవటం అతనికలవాటులేదు. ఎప్పుడూ అతిగా బాధపట్టంగాని, గట్టిగా నవ్వటంగాని అతనెరుగడు. ఇంట్లోవున్నప్పుడంతా పేపరే అతని ప్రపంచం. ఏయే విషయాలపట్ల అతనికి అనుబంధం వున్నదో చెప్పటం కష్టం. అంతే కాని తనుకన్న సంతానం మీదా శ్రద్ధలేదు. తనని కన్న తల్లిదండ్రులపట్ల గట్టి బాధ్యతా లేదు.

పట్టణానికొస్తూనే గ్రామంతో వున్న సంబంధ బాంధవ్యాలన్నీ వదిలిపెట్టేసుకున్నాడు. ఎవరితోనైనా ఉత్తరప్రత్యుత్తరాలు జరిపినా తన మూలాలేమిటో తెలిసికొనేవాడు. ఇంట్లో అతనొంటరి సంతానం. కాని పెదనాన్న, బాబాయిలందరి కుటుంబాలలో నలభై మంది సభ్యులుంటారు. అందరూ అదే వూళ్ళో వుంటారు. కొంతమంది వ్యవసాయం చేస్తారు. మరికొంత మంది ఆ చుట్టు పక్కలే కిరాణా, బట్టలషాపులూ నడిపేవారు.

రామ్‌ప్రసాద్ చదువు అయిపోయి బ్యాంక్‌లో క్లర్కు పోస్టు లభించినందుకు అతని తండ్రి ఆనందానికి హద్దులు లేవు. బంధువుల్లో తండ్రికి గౌరవం పెరిగింది. అక్కడి వారందరూ అతడిదగ్గర సలహాలు తీసుకుంటూ పెద్దరికాన్ని ఇచ్చేవారు. ఆయనా దాన్ని నిలబెట్టుకుంటూ, మంచితనాన్ని పంచుతూ ఇతరుల దుఃఖాన్ని తన దుఃఖంగా భావించేవాడు. ఆ సుఖదుఃఖాల అనుభూతుల్లో ఆయనకు తెలియకుండానే కాలం గడిచిపొయ్యేది. కాని రామ్‌ప్రసాద్ తల్లికి చాలా కొరతగా, బెంగగా వుండేది.

"రామ్! నువ్వు పట్టణం వెళ్ళి అక్కడే వుండిపోతే మీ నాన్నగారి తర్వాత ఇక్కడి పొలం, పుట్రా ఎవరు చూస్తారు? నీకీ వ్యవసాయపు పన్లు ఎప్పటికి తెలుస్తాయి? నాకిప్పటికే మన ఇల్లు చాలా శూన్యంగా అనిపిస్తుంది. మీ పెద్దమ్మా వాళ్ళ ఇళ్ళు చూడు ఎంత సందడిగా వుంటాయో?" అన్నది.

"నాకిపుడొచ్చిన ఉద్యోగం చాలా మంచిది. ముందు, ముందు దీంట్లో చాలా లాభాలుంటాయి. నేనింకా బాగా ఎదగవచ్చు. ఇక్కడ మనూళ్ళో ఏంవుంది? కరెంటుకానీ, చివరకు తాగటానికీ మంచి నీళ్లైనా వుండవు. ఎలా వుండమంటావు ఇక్కడ? ఆ ఆలోచనే పెట్టుకోదల్చుకోలేదు" అన్నాడు గట్టిగా తల్లితో.

"అమ్మా! నేనొకటి చెపుతాను వినండి. మీరు కూడా ఇదంతా తెగ నమ్ముకుని నాతోపాటు పట్టణానికి వచ్చెయ్యండి. సుఖంగా వుండొచ్చు" అన్నాడు.

ఆ మాటలు వింటూనే ఆమె నిలువెల్లా వణికింది. ఆ వణుకుతో ఆమె చేతిలోని పాలగిన్నె పడిపోయింది. ఎప్పుడైతే పెళ్ళి చేసుకుని ఆమె ఈ గ్రామమొచ్చిందో అప్పట్నుంచి ఏ సంతా, ఏ ఉత్సవాలు చూడటానికి కూడా ఆమె పట్టణానికి రాలేదు. ఒక రోజుకంటే ఎక్కువ ఆమె తనిల్లు వదిలిపెట్టి ఎక్కడా ఇంతవరకు వుండలేదు. అంతటి మమకారాన్నొదిలి, తన అత్తమామలిచ్చిన ఇంటిని విడిచి ఆమెకొడుకు దగ్గరకైనా సరే ఎలా వెళ్ళగలదు? తన కొడుక్కు తెలియదా ఇదంతా? ఎంత తేలిగ్గా అనేశాడూ, ఇల్లూ, పొలమూ అమ్మేసి రమ్మని.

నా కొడుకు నా చేయిదాటి, నా మనసు విడిచి దూరంగా వెళ్ళిపోయాడని గ్రహించుకుంది. ముసలితనంతో కోడలిచేత సేవ చేయించుకోవాలని, మనుమడూ, మనుమరాళ్ళ ఆటపాటలతో పరవశించిపోవాలని ఎన్ని కలలు కన్నది. ఎంతకష్టమైనా కొడుక్కి చదువుచెప్పించి, ఉద్యోగస్థుణ్ణి చేశాం. అందుకు ఆనందానికి బదులుగా ఈ జరిమానా భరించాల్సివస్తుంది. ఆలోచల్ని పక్కనపెట్టి మనస్సును చిక్కబట్టుకుని "రామూ! నువ్వు హొూశియార్ పూర్ బ్యాంకులో నౌకరీ ఎందుకు చెయ్యగూడదు? దూరానవున్న పట్టణానికే ఎందుకు పోవాలి?" అనడిగింది.

"హొూశియార్‌పూర్‌లో ఏముంది అమ్మా" అన్నాడు కోపంగా. అమ్మ ఉద్దేశ్యమేమిటో తనకు అర్ధమైంది. తన చదువంతా ఆ హొూశియార్‌పూర్‌లోనే పూర్తయింది. రోజుకు మూడు నాలుగు గంటలు

సైకిలు తొక్కుకుంటూ వెళ్ళేవాడు. ఇప్పుడూ అంతలేసి ప్రయాణాలు తాను చెయ్యలేడు. ఈ టైంలోనే ఏదో ఒక గట్టి నిర్ణయం తీసుకోవాలి. లేకపోతే జీవితాంతం బాధపడవలసివస్తుంది. తండ్రి తన హయామంతా ఆవాలు, గోధుమలు సాగుచేస్తూ కాలం గడిపాడు. ఇపుడీ వ్యవసాయమంతా కౌలు కిచ్చేసి తనతో పాటు లక్నో వచ్చెయ్యమని చెప్తున్నాడు.

తాను గట్టిగా ప్రయత్నిస్తే హొూశియార్ పూర్ బ్యాంకులో తనకు ఉద్యోగమొస్తుంది. కాని అమ్మా, నాన్నా గట్టి పట్టుబట్టి తనను తను ఊళ్ళోనే బంధించివేస్తారు. అలా ఉండటం తనకస్సలిష్టం లేదు. తాను చెప్పే విషయం అమ్మానాన్నలకిష్టం లేదు. నాన్నగారికి పెద్ద పట్టింపువున్నట్లు వుండదు. తన మనసులో ఏమున్నా పైకి ఆయనేమీ వెలిబుచ్చరు. కాని అమ్మే చిన్న బుచ్చుకుంటుంది. ఆ చిన్నబుచ్చుకున్న అమ్మ ఉద్వేగభరితమైన ముఖాన్ని చూడటం కొంచెం ఇబ్బందిగానే వున్నది. అందుకని అమ్మ చూపుల్ని తప్పించుకుని తిరగాల్సివస్తుంది.

కాని లోపల్లోపల రామ్‌ప్రసాద్‌కొక ఆశ చిగుర్లు వేస్తూవున్నది. కొన్నాళ్ళు పోయిన తర్వాతైనా ఒంటరితనం భరించలేక అమ్మా, నాన్న తన దగ్గరకే వచ్చేస్తారని. కాని అలా ఎప్పుడూ జరగలేదు. నెమ్మది నెమ్మదిగా కొడుక్కు దూరంగా వుండటం వాళ్ళకే అలవాటయిపోయింది. కొడుక్కూ వాళ్ళ జ్ఞాపకాలు తగ్గటం ప్రారంభమైంది. ఐదేళ్ళు గడిచిపోయినయి. ఏదైనా పండగా, పబ్బం వస్తే అమ్మావాళ్ళ దగ్గరకు ఊరికెళ్ళి, ఆ రెండు రోజులూ వుండిరావటం అంతే. అలాగే అలవాటయిపోయింది.

ఒకరోజు అకస్మాత్తుగా నాన్నగారికి ఆరోగ్యం బాగాలేదని టెలిగ్రామొచ్చింది. అతడి మనసుకేదో అనుమానం తోచింది. రెండు జతల బట్టలు బ్రీఫ్‌కేసులో సర్దుకుని బయలుదేరాడు. సుధ కంగారుపడుతూ భర్తవంకే చూస్తూ నిలబడింది. ఆమె కళ్ళు భయంభయంగా బెదిరిన లేడి కళ్ళవలె వున్నాయి. సుధకు కొంత డబ్బిచ్చి అతను ఊరికి బయలుదేరాడు. రైలు రాత్రి పన్నెండు గంటలకు స్టేషన్ చేరింది. అక్కడ దిగి నాలుగుమైళ్ళు కాలినడకన గతుకుల రోడ్డులో నడిచి ఇల్లు చేరుకున్నాడు. ఇంట్లో వున్న గంభీర వాతావరణం అతడికి దాని కారణాన్ని తెలియజేసింది. ఏ భయాన్నైతే దారిపొడుగునాపడ్డాడో ఆ భయమే అతడి మనసునీ, మస్కిష్కాన్నీ చైతన్యశూన్యణ్ణి చేసింది. పూర్తిగా పదమూడు రోజులూ అక్కడే వుండి అర్ధచైతన్యావస్థలోనే అక్కడి కార్యక్రమాలు పూర్తిచేశాడు.

మధ్యలో సుధా, పిల్లలు ముగ్గురూ ఇక్కడకొచ్చారు. వారిని చూసి తన్ను తాను సంబాళించుకోలేకపోయాడు. ఏదో అమూల్య పెన్నిధిని పోగొట్టుకున్నట్లుగా బాధపడ్డాడు.

కార్యక్రమాలన్నీ పూర్తయి తిరిగి పట్టణానికి బయల్దేరుతుంటే అతనికి కాళ్ళు వణికినాయి. మనసంతా భారమయింది. కాళ్ళుముందుకు నడుస్తున్నా, ఆలోచనలు వెనక్కు పరుగెడుతున్నాయి. అమ్మే ఎంతగానో సముదాయించింది. తానెంతో ధైర్యంగా వుండి ఎంతో సంయమనాన్ని చూపించింది. అమ్మకింత ధైర్యమా? నన్ను ఇంత బాగా అమ్మ అర్థం చేసుకోగలిగిందా అని ఆశ్చర్యపోయాడు. ఇదంతా తనూహించనిది.

చాలా పట్టుపట్టి అమ్మను తనతో ఒకసారి తీసుకొచ్చాడు. ఇక్కడి గాలీ, నీరూ ఆమెకంత నాణ్యంగా అనిపించలేదు. మొండిపట్టుపట్టి మళ్ళీ ఆమె ఊరికి తిరిగి వెళ్ళిపోయింది. భర్త మరణం ఆమెనెంతో గంభీరంగా తయారుచేసింది. సుధ ఆ విషయం భర్తకు చెప్పింది. తరచూ తల్లిదగ్గరకెళ్ళి చూసి రమ్మనీ అనేది. దాంతో ఏ రెండు రోజులు శెలవొచ్చినా అమ్మదగ్గర వాలేవాడు.

ఊళ్ళో చాలా మంది బంధువులున్నారు. అందరూ అన్ని విషయాల్లో పాలుపంచుకునేవారు. కాని వాళ్ళతో తనే అంతగా కలవలేకపోతున్నాడు. వారికీ, తనకీ మధ్య ఏదో తెలియని అడ్డంకి వున్నట్లుగా అనిపించేది. ఇతని సంగతి గ్రహించి వాళ్ళూ అంతగా కలసిపోవాలని ముందుకు రాలేదు. ఇతడూ వాళ్ళతో కలిసిపోవాలని ఆరాటపడలేదు. ఇలా ఈరాకపోకలు ఎన్నాళ్ళో సాగలేదు. పైకి ఎంతో దైర్యంగా, నిబ్బరంగా కనుపించే అమ్మలోపల్లోపల బాగా కృంగిపోయింది. తనక్కలిగిన భావావేశాలను, బాధనూ తనలోనే అణిచివేసుకున్నది. కనీసం తనకొక కూతురైనావుంటే తన బాధను ఆమె దగ్గర చెప్పుకునేది. కాని ఆ అవకాశం కూడా లేక ఆమె పడ్డ బాధంతా ఆమె గుండెల్లోనే గూడుకట్టుకుని వుండిపోయింది. భర్తపోయిన సంవత్సరానికే ఆమె ఈలోకాన్ని వదిలిపెట్టింది. ఆమెక్కలిగిన బాధ కేవలం ఒంటరితనం. తన కొడుకునుండి విడివడిన బాధ. తన ఆలోచనలూ, తన కలలూ వ్యర్థమైన  బాధ. తన ఆత్మీయుల నుండి, రక్త సంబంధీకుల నుండి దూరంగా వున్నానన్న బాధ.

సూర్యాస్తమయింది. తన పాత ఇంటి వరండాలో, ఆ పురాతన కుర్చీలో కూర్చుని గతాన్నంతా నెమరువేసుకుంటూ రామ్‌ప్రసాద్ దీక్షగా సూర్యుని వంక చూస్తూ కూర్చున్నాడు. సూర్యుడు ఎరుపు రంగులోకి మారుతూ నెమ్మది నెమ్మదిగా అదృశ్యమవుతున్నాడు. వెంటనే చీకటి చిక్కబడుతుంది. ఒకసారి తన కళ్ళజోడు తీసి పంచె అంచుతో తుడిచి శుభ్రం చేసి మరలా పెట్టుకున్నాడు. గడిచిన గతం అంధకారంలో కరిగిపోతున్నది. కాలం చాలా నిర్దయమైనది. ఎవర్నీ క్షమింపదు. కాలంలో కలిసిపోతూ ఆనాడు తన తలిదండ్రులు భరించిన బాధ నేడు తనకు బాగా అనుభవంలోనికి వచ్చింది. ఆ బాధను మోసుకుంటూ, భారాన్ని దింపుకోవాలని మళ్ళీ నా స్వస్థలానికొచ్చాననుకున్నాడు. ముప్ఫై ఏళ్ళ వాడు ఏ బాధను అమ్మా, నాన్నలకిచ్చానో అదే బాధ ఇప్పుడు నన్ను ఊపిరి ఆడకుండా చేస్తున్నదనుకున్నాడు.

## శ్రీ జయశంకర ప్రసాద్ కవి పరిచయము

జీవన రేఖలు : 1889 జనవరి 30వ తేదిన ఉత్తరప్రదేశ్ నందలి వారణాసిలో జన్మించారు. ప్రాథమిక అభ్యాసంతోనే స్కూలును వదిలిపెట్టారు. ఆ తర్వాత ఇంట్లో వుండే ఇంగ్లీషు, సంస్కృతం, పాలీ, ప్రాకృత లాంటి భాషల్ని నేర్చుకున్నారు. అంతేకాక భారతీయ దర్శనాలు, చరిత్ర, సాహిత్య సంస్కృతులను బాగా ఔపోసన పట్టారు. ఆ జ్ఞాన సముపార్జనంతా వారి రచనల ద్వారా పాఠకుల కందించారు.

వృత్తి వ్యాపారాలు : నస్యము, పొగాకు వ్యాపారాల్లో వీరి కుటుంబం ప్రసిద్ధి చెందింది. తండ్రితో పాటు బాల్యంలోనే చాలా ప్రదేశాలను తిరిగివచ్చారు. కుటుంబ సభ్యులందరి మరణంతో జయశంకర ప్రసాద్ తన వారసత్వపు వ్యాపారాన్ని చూచుకోవాల్సివచ్చింది. వీరు 1937 నవంబరు 15న స్వర్గస్థులయ్యారు.

సాహిత్య సృష్టి : హిందీ సాహిత్య శ్రేష్ఠ సృష్టికర్తల్లో అగ్రగణ్యులుగా జయశంకరప్రసాద్ పేరుగాంచారు. తక్కువ వయసులోనే మరణించినా ఆ చిన్న జీవితంలోనే సాహిత్యపు విభిన్న పార్శ్వాలను స్పృశించి భారత దేశ చరిత్రను, మానవుని అనేక మనోవృత్తులను అత్యంత సామర్థ్యంగా చిత్రించారు.

కథలు : వీరి కలం నుండి జాలువారిన కథలు వీరికి కథా సాహిత్యంలో ఒక వున్నత స్థానాన్ని కల్పిస్తున్నవి. వీరి నాటకాలు, నవలలు, కావ్యాల వలె వీరి కథలు కూడా ఒక ప్రత్యేక శ్రేణికి చెందినవిగా సాహిత్య సమాలోచకులు భావిస్తున్నారు. అందువలన వీరి కథలు చదివిన పాఠకులు ఎంతో ఉత్తేజితులవుతూ, మానసికోల్లాసాన్ని పొందుతారు. పురస్కార్ గుండా, మధువా మొదలగు కథలు చాలా ప్రాచుర్యం పొందినవి.

ప్రముఖ రచనలు : ఝర్‌నా, ఆంసూ, లహర్, కామాయనీ, స్కంద్ గుప్త్, చంద్రగుప్త్, ధ్రువస్వామినీ, జనమేజయ్‌కా నాగయజ్ఞ్, రాజశ్రీ, విశాఖ్ కామనా, కంకాల్, తితలీ ఔర్ ఇరావతి చాలా ప్రసిద్ధిపొందినవి.

"ఫీసూ" అన్న కథలో (చెదిరిన స్వప్నం అన్నపేరు పెట్టాను) ఆనాటి సామాజిక పరిస్థితులు, ఒక అమాయక ప్రేమికుని బలిదానం, అత్యాంత సహజంగా వర్ణించబడి వున్నది. "చూడీవాలీ' (విలాసిని) కథలో వేశ్యావృత్తి నుండి తప్పుకుని కులవధువుగా జీవితం గడపటానికి ఒక యవతి చేసిన ప్రయత్నమే కన్పిస్తుంది. విలాసిని పాత్ర పాఠకుల ఆదరణను పొందుతుంది. ఆభిజాత్యపుపొరలు కరిగిన విధానమూ ఆకట్టుకుంటుంది. "ఆకాశదీపం" అనే కథ హిందీ కథా సాహిత్యంలో ఆణిముత్యమంటిదని పరిశీలకుల భావన, ఈ కథలో భారతీయ మహిళ తన ఆత్మ గౌరవాన్ని, ఆత్మ ప్రభోధాన్ని కాపాడుకున్న విధానాన్ని పాఠకుల కళ్లముందు సాక్షాత్కరింప జేస్తారు. 'చంప' పరిస్థితికి వగచే పాఠకులను రచయిత తన వర్ణనలతో ఊరడించే సఫలీకృత ప్రయత్నమూ చేస్తారు. 'ఆంధీ" కథ నిజంగా తుఫాను లాగే వివరంగా, తీవ్రంగా విస్తరించిన కథ. ఇందలి భారత ఔన్నత్యం, భారతీయ శిల్ప, చిత్రకళా వర్ణన పాఠకులకు ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. అలాగే మానవుని మానసిక దౌర్బల్యాలు, బౌద్ధుని విశాల, ఉదార స్వభావమూ, చాలా విపులంగా చర్చించబడ్డాయి. లైలా తుఫానులాగే విజృంభించి ప్రకృతిలో కలసిపోయి పాఠకుల మనసులో తుఫాను వాతావరణాన్ని మిగిల్చి వెళ్ళే ఉదంతం పాఠకుల మనస్సులపై చెరగని ముద్ర వేస్తుంది. తుఫాను అన్న పేరు ఈ కథకు ఎంతో సార్థక నామంగా ఉన్నది.

# చెదిరిన స్వప్నం

సంధ్యా సమయం. ఊరి వెలుపల అంతగా జనసంచారం లేని చోటు నుండి మధురమైన గానం ప్రతిధ్వనిస్తూ వున్నది. ఘీసూకు పాటలంటే చాలా ఇష్టం. ఎవరూ విని ఆనందించకపోయినా పాడుకుని తనకు తానే ఆనంద పడటం అలవాటు చేసుకున్నాడు. శ్రావ్యమైన సంగీతాన్ని విని ఇద్దరు ముగ్గురు పాటను ఆలకిద్దామని దగ్గరకొచ్చినా ఘీసు గొంతు పెగిలేది కాదు. తన సామాగ్రినంతా సర్దుకుని అక్కడి నుండి వెళ్ళిపోయేవాడు. ఎవరూలేని చోటునొకదాన్ని వెతుక్కుని అక్కడే కొన్ని రోజులపాటు మకాం వేశేవాడు. తొమ్మిదిగంటలకల్లా నందూబాబు ఇంట్లో హాజరయ్యేవాడు. ఆ సమయానికతడు తన వీణ పట్టుకుని రాగాలాపన మొదలుపెడతాడు. ఇతను వెళ్ళగానే "వచ్చేశావా ఘీసూ" అనటం అతనికలవాటు.

"వచ్చాను బాబూ. వేగంగా పరుగెత్తిరావటంతో దుమ్ముకొట్టుకుందని" అంటూ తన జయపురీ అంగవస్త్రాన్ని దులుపుకునేవాడు.

భుజాలవరకు వున్న వెంట్రుకలు, చిన్న గడ్డం, పెద్ద పెద్ద, గులాబీ కళ్ళతో వున్న ఘీసూ అంటే నందూకు చాలా వాత్సల్యం. నిత్యం నందూ బాబును చూసి అతని వీణా నాదాన్ని గ్రోలే భక్తుడు ఘీసూ. తాంబూలపు డబ్బాలోనుంచి రెండు కిళ్ళీలు బయటకుతీసి "కిళ్ళీవేసుకో ఘీసూ ఇచ్చిన దాన్ని తినకుండాదాస్తావెందుకు?" అన్నాడు నందూ.

ముత్యాల్లాంటి పలువరస మెరిసేటట్లుగా నవ్వుతూ ఎంతో వినయంగా ఆ కిళ్ళీ అందుకున్నాడు ఘీసూ.

ఘీసు వయస్సు పాతికేళ్ళు. అతనితల్లి చనిపోయి కూడా మూడేళ్ళయింది. నందూ బాబు వీణ విన్న తర్వాత బజార్నుండి కచోరీలు, పాలు తెచ్చుకున్నాడు. అవితినటం పూర్తయినతర్వాత పాటనొకదాన్ని తనలో తనే పాడుకుంటూనే నిద్రలోకి జారుకున్నాడు.

ఘీసూ పెట్టుబడంతా ఒక వందరూపాయలు. తన రోజువారీ వ్యాపారం కోసం చిల్లరనాణేల సంచీ తీసుకుని దశాశ్వమేధం దగ్గరికి వెళ్ళి కూర్చునేవాడు. ఒక పైసా ప్రతిరూపాయికి కమీషను తీసుకుని వచ్చినవాళ్ళకు చిల్లర ఇచ్చేవాడు. అలా రోజు మొత్తం మీద పన్నెండు, పధ్నాలుగు అణాల కమీషను మిగిలేది.

గోవిందరామ్ భంగు తయారుచేసి తాగటానికి పిల్చేవాడు. ఘీసూ ఒప్పుకునేవాడు కాదు.

"నువ్వవట్టి పిసినారివి. భంగుక్కూడా కొంచెమైనా ఖర్చుపెట్టవా? నాకెక్కడ తాగించవలసి వస్తుందోనని నువ్వు దీని జోలికే రావటం లేదని" అనేవాడు.

"అదేం కాదన్నా. నేను సాయంకాలం పూట ఒక్కసారే తాగుతాను. నీకు తెలుసుగదా" అనేవాడు ఘీసూ.

గోవిందరామ్ ఘాట్ దగ్గరకు బిందూ రోజూ పదిగంటలకు గంగాస్నానం చెయ్యటానికి వస్తుంది. ఆమె కట్టుకున్న కాంతివంతమైన ధోవతి ధవళకాంతులీనుతూ వుంటుంది. అప్పుడప్పుడు చిల్లరనాణేలూ, పైసలూ తీసుకోవటం కొరకు ఆమె ఘీసూ దగ్గరకు వచ్చి నిలబడేది. ఆరోజు ఘీసూకు పట్టరాని సంతోషం కలిగేది. "రూపాయికి చిల్లర పూర్తిగా ఇస్తాను. నీ దగ్గర కమీషనేం తీసుకోను" అనేవాడు.

పైసలు ఎక్కువగా వున్నాయా ఏంటి? నీ పేరే ఘీసూ. అంటే అరగదీసి, రుద్ది మరీ తీసుకునేవాడివని అర్థం."అలాంటివాడివి కమీషను వద్దంటావేమిటి?" అ నవ్వుతూ.

"బిందూ! నువ్వన్నట్లే ఈ ప్రపంచంలో నాకంటే ఇంకెవరు గీసి గీసి బేరం చేస్తారు? అది ఊహించే మా అమ్మా నాన్నా నాకు ఘీసూ అనే పేరు పెట్టుంటారు.

ఘీసూ మాటలకు పెదవులమీద నవ్వు బిందూ కళ్ళదాకా పాకింది. వచ్చే నిట్టూర్పునణుచుకుంటూ దశాశ్వమేథ్‌లో వున్న కూరగాయల బజారువైపుకు వెళ్ళింది.

బిందూ ఎప్పుడో తప్ప రూపాయి మార్చి చిల్లర తీసుకోదు. అందుకని ఆమె మాటలూ, నవ్వూ వినగలిగే అదృష్టం ఘీసూకు తరచూ కలిగేది కాదు. బిందూతో మాట్లాడినప్పుడల్లా కైపెక్కి మగత వచ్చేది. అప్పుడప్పుడూ ఎక్కిన కైపైనా చాలా రోజులవరకూ ఆ మత్తులోనే వుండేవాడు. ఎంతో తృప్తితో మానసికంగా ఆనంద పడిపొయ్యేవాడు.

గోధూళివేళ నగరం వెలుపలకొచ్చి క్షితిజరేఖా సౌందర్యాన్ని వీక్షిస్తూ, గొణుక్కుంటూ పాడుకుంటూ ఎంతో సౌఖ్యాన్ని అనుభవిస్తూ తన్మయావస్థలో వుంటున్నాడు. ఆ సౌఖ్యమే, ఆ ఆనందమే తోడుగా వుండి ఘీసూ జీవితాన్ని నడిపిస్తున్నది.

చిక్కబడుతున్న సంధ్యాసమయపు రాగరంజితం. భంగు ఇచ్చే మత్తు, ముచ్చటైన రాగాలాపన, రసపూరితమైన పాట, నందూబాబు వీణ వీటన్నింటిని బిందూనారాధించటానికి సామాగ్రిలా వాడుకుంటున్నాడు ఘీసూ. తన ఊహా జగత్తులో విహరిస్తూ, బిందూ గురించి కలలు గంటూ సుఖంగా నిద్రలోకి జారుకుంటున్నాడు.

బిందూ ఎవరు? ఎక్కడుంటుంది? అన్న ఆలోచన కూడా రాలేదు ఘీసూకు. ఆమె ఒక విధవరాలని నమ్మకంగా తెలిసింది. అంతకన్నా వివరాలు తెలుసుకోవలసిన అవసరం అతనిక్కనపడలేదు.

రాత్రి ఎనిమిది గంటలైంది. ఘీసూ ఇంటి వైపుకు బయలుదేరాడు. శ్రావణ మేఘాలు కమ్ముకుని జల్లులు కురుస్తున్నాయి. "నిశి రాత్రిలో కురిసే వర్షం కనుల ముందే" అని పాడుకుంటూ నడుస్తున్నాడు.

రోడ్డంతా బురదమయం నెమ్మది నెమ్మదిగా నడుస్తూనే రోడ్డుమీద బురదనీళ్ళున్న గుంట కనపడే సరికి, ఆ బురద నీరు చిందకుండా ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తూ నడక వేగాన్ని ఇంకా తగ్గించాడు. దగ్గర్లోవున్న తోటలోని ఇంట్లో నుండి ఏవో మాటలు వినపడేసరికి తన పాటా ఆపేశాడు. వినపడే మాటల్ని ఆలకించాడు.

"ఎంతో వెదికితే నీ దర్శనం ఇక్కడయింది. నీ చేష్టలన్నీ సహిస్తున్నాను. నీ నోరుపడిపోను. నన్నెంతగా హింసిస్తున్నావు. నీకిదేం బుద్ధి" అని ఒక స్త్రీ ఆవేదన పడుతుంది.

"నేనిలా చేయటంలో వింతేముంది? నువ్వేమన్నా నాతాళిగట్టిన పెళ్ళానివా? నీ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సిన అవసరం నాకేం లేదు" అని పరుషంగా, కరుకుగా మాట్లాడే తాగుబోతు మాటలూ విన్పించాయి.

"నేను నీ కేంకానా? నీ వెంట తిరిగి నేను ధర్మభ్రష్టురాలినయ్యాను. నిన్నే నమ్మినందుకు ఈనాడు నన్ను పనికిరానిదాన్ని చేస్తున్నావా? నా గొంతు నులిమేసుకుంటాను. నిన్ను గూడా బతుకనివ్వను."అంటున్న బిందూ మాటలు ఘీసూకు వినిపించాయి.

"ఓహ్హో! నేను బద్మాష్‌నే. నాతోనేవున్నావు. నాతోనే తిన్నావు. ఈ రోజు ఎవరితో నువ్విక్కడకు రాగలిగావు? ఎవడి అండ చూసుకుని ఎగిరెగిరి పడుతున్నావు? వెళ్ళిక్కణ్ణుంచి. వెళ్లకపోతే పొడిచి పారేస్తాను."

పొడిచేస్తావా? చంపురా చంపు. నేను చచ్చేముందు నిన్నూ ప్రాణాలతో వుండనివ్వను. నీ ఊపిరి ఆగితేనే నిన్ను వదిలిపెడతాను." అన్నది బిందూ ఉద్రేకంగా.

ఒకరినొకరు తోసుకుంటున్న శబ్దం, కొట్టుకుంటున్న వైనం బయటకు వినిపించింది. ఘీసూ ఇంక ఆగలేక పక్కనున్న దర్వాజా దగ్గరకెళ్ళి తలుపునెట్టాడు. గదిలోపలంతా పరిశీలనగా చూస్తూ లోపలున్న మరొకగదిలోకెళ్ళాడు. బిందూనేలమీద పడివున్నది. ఒకనడివయస్కుడు ఆమె జుట్టు పట్టుకుని లాగుతున్నాడు.

ఆ దృశ్యం చూసిన ఘీసూ గులాబి కళ్ళలోకి రక్తం చిమ్ముకువచ్చింది. "ఏయ్ వదులు ఆమెనొదిలిపెట్టు" అనరిచాడు.

జుట్టుపట్టి లాగేవాడు ఇటు తిరిగి "దీంతోపాటు వచ్చింది నువ్వేనన్నమాట. చూడవే బాగా చూడు. నిన్ను కాపాట్టానికి నీ ప్రియుడొచ్చాడు" అన్నాడు కర్కశంగా.

ఆ మాటలకు బిందూ తిరిగి చూచి "ఘీసూ"! అంటూ ఏడవసాగింది.

"దాన్ని తీసుకెళ్ళు. ఖుషీ చేసుకో. ఇదంటే నాకు మొహం మొత్తింది అంటూ బిందూ వంకకు తిరిగి ఇవాల్టి నుండీ నీ దరిద్రపు ముఖం మరెప్పుడూ నాకు కనపడకూడదు. నీకూ, నాకూ మధ్య మరే సంబంధం మిగిలిలేదు" అన్నాడు అదే తన నిర్ణయమైనట్లుగా.

"అన్నా! నువ్వు విచిత్రంగా మాట్లాడుతున్నావు. నేను ఈ ప్రక్కగా వెళ్తుంటే గొడవపడుతూ మీరు అరిచే అరుపులు, కొట్టుకుంటూ ఏడ్చే ఏడ్పులు వినబడి ఇటు వచ్చాను. మీ తగువులతో నాకేం సంబంధం లేదు. ఈమెను నేనెక్కడికి తీసుకెతాను? నీ పనేదో నువ్వు చూసుకో. నాదారిన నేను పోతున్నానని" చెప్పి ఘీసూ బయటికి నడిచాడు.

"ఆగు ఘీసూ!" అన్న బిందూ పిలుపుతో ఆగిపోయాడు.

"ఘీసూతోపాటు నేను వెళ్ళిపోతున్నాను. ఇక నుంచీ అతడితోనే వుంటాను" అన్నది బిందూ.

"అలాగే లేవే. ఇప్పుడది నువ్వు వివరంగా మరోసారి చెప్పాల్సిన పనిలేదు. నేనేపొమ్మన్నాగా? నువ్వు పోతానని వేరే చెప్పక్కర్లేదు." అన్నాడతను.

బిందూ, ఆమె వెంట ఘీసూ తోటదాటి వెలుపలికి వచ్చారు. రోడ్డంతా నిశ్శబ్దంగా వున్నది. వీళ్ళిద్దరూ మౌనంగా నడుస్తున్నారు. "చౌరాస్తాకు వచ్చాం. బిందూ! నువ్వు మీ ఇంటికి వెళ్ళు" అన్నాడు ఘీసూ.

"నేనెక్కడికి వెళ్తాను? ఇప్పుడు నీతోపాటే నీ ఇంటికే వస్తాను" అన్నది బిందూ.

ఘీసూ గొప్ప సందిగ్ధంలో పడిపొయ్యాడు. "నాకిల్లంటూ ఎక్కడుంది? నందూబాబు దయతో ఇచ్చిన చిన్న గదిలో నేను పడుంటున్నాను. అందులో నీక్కూడా చోటెక్కడుంటుంది" అన్నాడు.

బిందూ వలవలా ఏడ్వసాగింది. తన చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ "నన్ను తీసుకొచ్చే ఉద్దేశ్యమే నీకు లేకపోతే ఆ సమయంలో అక్కడికెందుకువచ్చావు? నా తిప్పలేవో నేను పడేదాన్ని. నువ్వక్కడకు వచ్చి నాకు లేనిపోని అనర్థం తెచ్చిపెట్టావు. అతని దగ్గరవుండే అవకాశం లేకుండా చేశావు." అన్నది ఏడ్పు ఆపకుండానే.

రోడ్డు మీది వీధి లైట్ల కాంతిలో నడుస్తూ, ఏడుస్తూ బిందూ మాట్లాడే మాటలకు ఘీసూకు ఊపిరి ఆడనట్లయింది. కొద్దిగా తెప్పరిల్లి "సరేనడువు, నాతోరా" అన్నాడు.

మరుసటి రోజు మిట్ట మధ్యాహ్నం చిల్లరసంచిని గోవిందరామ్ ఘాట్‌లో వుంచి ఘీసూ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. గోవిందరామ్ భంగు తయారుచేసే పనిలో వున్నాడు.

"ఘీసూ భంగు కావాలా?" అనడిగాడు.

ఘీసూ దగ్గరనుంచి జవాబేమీ రాలేదు. గోవిందరామ్ తలెత్తి ఘీసూ వంకచూస్తూ "ఏమైంది? ఎందుకలావున్నావు? చెప్పొచ్చు కదా ఘీసూ" అన్నాడు.

"ఏం చెప్పేదన్నా? ఒక సమస్యలో చిక్కుకున్నాను. వుండటానికి గదొకటి వెతుకుతున్నాను. ఎంతచిన్న గదైనా సరే, గది దొరికితే దాంట్లో నా సామాను పెట్టుకుని తాళమేసుకోవటానికి వీలుగావుండాలి".అన్నాడు.

"నందూబాబు ఇచ్చిన గదిలో వుంటున్నావు గదా?"

"ఇప్పుడది సరిపోవటం లేదు. అందుకే వేరేది వెతుకుతున్నాను."

"ఈ గుడిసెలాంటి గదిలో ఎందుకుండగూడదు. దీనికి తాళం కూడా వేసుకోవచ్చు. ఇరవై నాల్గు గంటలూ నేను బయటే తిరుగుతుంటాను" అన్నాడు గోవిందరామ్ తన గది చూపుతూ.

"అంతకంటేనే అన్నా" అంటుంటే ఫీసూ కళ్ళు కృతజ్ఞతతో చెమర్చినాయి.

"లే. ఫీసూ. లేచి ఈ భంగును వడపోయి. సమస్యతీరింది కాబట్టి ఇద్దరం ఖుషీగా తాగుదాం."

ఫీసూ చిల్లర వ్యాపారం చేస్తూ ఇప్పుడూ తన దుకాణంలో కూర్చుంటున్నాడు. బిందూ నిత్యం గంగాస్నానం చేస్తూనేవున్నది. ఆమె ఫీసూ దుకాణం దగ్గర నిలబడుతుంది. అతను నాలుగణాల చిల్లర ఇస్తాడు. అంతే కాని ఇద్దరి మధ్య పలకరింపులూ, పరిహాసాలూ లేవు.

ఫీసూ బయటికెళ్ళటం మానేశాడు. గోవిందరామ్‌కున్న చిన్న పడవలో అవతల ఒడ్డుకెళ్తాడు. తిరిగివస్తూ గంగానది మధ్యలో గంగాతరంగాల సవ్వడి వింటాడు. తాను మాత్రం వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడూ మౌనాన్నే ఆశ్రయిస్తున్నాడు. పాటల ఊసేలేదు.

బిందూ నిత్యం డబ్బులు తీసుకెడుతుంది. ఆమె ఫలానా అని చెప్పదు ఫీసూ ఏమీ అడగడు. ఫీసూ పెద్ద పెద్ద గులాబీ కళ్ళ చుట్టూ గుంటలుపడ్డాయి. బిందూ అది గమనించి పరీక్షగా ఒకసారతణ్ణి చూచి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

రోజురోజుకూ చిల్లర నాణాల సంఖ్య ఫీసూ దగ్గర తరిగిపోతున్నది. దాంతోపాటు ఫీసూ శరీరం కూడా శిధిలమైపోతున్నది.

"ఫీసూ! అస్సలు పాడటం మానివేశావేంటి? నీ పాట వినపడక ఈసోటంతా బోసిపోతుంది." అన్నాడు గోవిందరామ్.

"ఆరోగ్యం బాగా లేదన్నా" అని జవాబిచ్చాడు.

గోవిందరామ్ అతని చెయ్యి పట్టుకుని చూస్తూ "జ్వరం వచ్చింది ఏమిటి?" అన్నాడు.

"అదేంకాదు. అన్నం వండుకుని తినకుండా బద్ధకించి అడ్డమైన నానా గడ్డీ తింటున్నాను. దాంతో తేడా చేసింది." అన్నాడు.

"తిండీలేదు, భంగూ మానేశావు. అందుకే నీ ఆరోగ్యం అలా అయింది." అన్నాడు గోవిందరామ్.

"నందూబాబు వీణ వింటానికి వెళ్ళి చాలా రోజులైంది. ఆయన నా గురించి ఏమనుకుంటున్నారో" అని ఆలోచించాడు ఫీసూ.

గోవిందరామ్ వెళ్ళిన తర్వాత ఫీసూ గుడిసెలో కొచ్చి పడుకున్నాడు. అతనికిప్పుడు బాగా జ్వరం వచ్చింది. జ్వర తీవ్రతలో రాత్రంతా విలవిలా తన్నుకున్నాడు.

ఆరోజు గుడిసె ముందు అరుగుమీద ఫీసూ దుకాణం లేదు. ఆమె నిలబడి చూచి తలుపు నెట్టుకుని లోపలి కొచ్చింది. ఫీసూ అతలాకుతలం అయిపోతున్నాడు. ఆమె కొద్దిగా మంచినీళ్ళు తాగించింది.

బిందూ వంక చూస్తూ "బిందూ! నన్ను క్షమించు. నేను నీకు చాలా దుఃఖాన్ని కలిగించివుంటాను. ఇప్పుడు నా దారిన నేను వెళ్ళిపోతున్నాను. నా దగ్గర మిగిలిన చిల్లరంతా నువ్వే తీసుకో. భగవంతుడా! నేనేంటో నీకు తెలుసు అంటూండగానే అతనికళ్ళు నిస్తేజమైపోయాయి.

బిందూ కళ్ళ వెంబడి నీళ్ళు కారసాగినయి. ఆమె వెళ్ళి గోవిందరామ్‌ను పిలుచుకొచ్చింది.

ఫీసూ మిగిల్చివెళ్ళిన డబ్బుతో బిందూ అదే దుకాణం నడుపుతున్నది. ఆమెకిప్పుడు యవ్వనం, రూపం రంగూ ఏమీలేవు. మిగిలి వుందల్లా కొద్దిగా పైసలు, పెద్దగాపొట్ట, కొండంత భావి జీవితం.

## మహిళా ప్రతినిధి, సాహిత్య నిధి శ్రీమతి మహాదేవివర్మ

జీవన రేఖలు : మార్చి 26, 1907వ సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఫరూఖాబాద్ నందు మహాదేవి జన్మించారు. వీరు సంస్కృత ఎమ్.ఏ.పట్ట భద్రురాలు. "స్వాతంత్ర్య సమరయోధురాలిగా, స్త్రీ ఉద్యమ కారిణిగా, విద్యా సంపన్నురాలిగా, పేరుగాంచారు. డాక్టర్ స్వరూపనారాయణ వర్మను పెండ్లాడి శ్రీమతి మహాదేవివర్మ అయ్యారు. నిత్య జీవితంలో ఎంతో నిరాడంబరతను కన్పరుస్తూ, పశుపక్షుల, పర్యావరణ ప్రేమికురాలిగా వుండేవారు. ఎంతో సాహిత్య నిధిని, హిందీ భాషామ తల్లికి, అందించి సెప్టెంబరు తొమ్మిదీ, పందొమ్మిది వందల ఎనభై ఏడున ఇహలోకాన్ని విడిచి పెట్టారు. చిరస్థాయిగా పాఠకుల మనస్సులలో నీరాజనాలు అందుకుంటూనే వుంటారు.

కథా విశేషం : నీలకాంత్, గౌరా, సోనా, దుర్ముఖ్, గిల్లూ, బిందా, చీనీభాయ్ మొదలగు వాటిలో పెంపుడు జంతువుల పట్ల తన ప్రేమను రంగరించి ఆదరించిన విధం వర్ణించారు.

రచనలు : అతీత్ కెచలచిత్ర్, యామా, నీరజ, దీపశిఖా, పథ్‌కే సాథీ, మేరాపరివార్, సంధ్యాగీత్, అగ్నిశిఖా, సంస్మరణ్ నీహార్, మీరా ఔర్ మీరా, స్మృతికీరేఖాయేం, రశ్మిసంకల్పిత, స్మృతి చిత్రా, మేరే ప్రియనిబంధ్, మేరీ ప్రియ కవితాయేం, మేరే ప్రియ సంభాషణ్ లాంటి సాహిత్య కుసుమాలను పూయించారు.

భారతదేశంలో వున్న అత్యున్నత పురస్కారాలన్నీ ఈమె గళ సీమలో హారంలాగా అమిరాయి. 1956వ సంవత్సరంలో పద్మభూషణ్ వచ్చింది. 1979వ సంవత్సరములో సాహిత్య అకాడెమీ ఫెలోషిప్ విచ్చేసింది. 1982వ సంవత్సరంలో హారంలోని పతకంలా జ్ఞాన పీఠ అవార్డు అమిరింది. 1988వ సంవత్సరంలో పద్మ విభూషణ్ కూడా వచ్చి చేరి మరింత నిండుదనాన్ని చేకూర్చింది.

"మహాదేవి ప్రతినిధి రచనాయేం" అను దానిని భారతీయ జ్ఞాన పీఠం వారు వెలువరించారు. ప్రస్తుత కథ "గిల్లూ". ఈ గిల్లూ శ్రీమతి మహాదేవివర్మకు ప్రియమైన ఉడుత. దానిని జాతిని బట్టి కాక తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చేర్చుకునే ప్రయత్నంగా ఆ ఉడుతకు గిల్లూ అనే పేరు పెట్టారు. గిల్లూ పట్ల చూపిన ఆదరణ, దానికి కృతజ్ఞతగా గిల్లూ చేసిన సపర్యలూ, విన్యాసాలూ చదువుతూవుంటే రోగికి పథ్యం తిన్నంత వుల్లాసంగా వుంటుంది.

# గిల్లూ

హిందీమూలం : శ్రీమతి మహాదేవివర్మ
తెలుగు సేత : దాసరి శివకుమారి

సువర్ణమల్లె పూలతీగెకు ఇవాళ ఒక పసుపు పచ్చని మొగ్గ కనపడింది దాన్ని చూస్తుంటే అప్రయత్నంగా నాకు ఆచిన్న ప్రాణి జ్ఞాపకం వచ్చింది. అదెప్పుడూ, చిక్కగా, ఆకుపచ్చగా అల్లుకున్న ఈ తీగల్లోనో, ఆకుల్లోనో దాక్కుని వుండేది. నేను దగ్గరకు రాగానే నాభజం మీదకుదూకి నన్ను దడిపించేది. ఎన్ని మొగ్గలు వేసాయో అని తీగలు కదుపుతూ వెతుక్కుంటూ అలవాటుగా, ఆ చిన్న ప్రాణికోసమూ చూశాను.

కాని ఆచిన్నారి ప్రాణి ఈ సువర్ణమల్లె తీగ మొదట్లో మట్టిలో కలిసిపోయివుంటుంది. ఈ బంగారు మొగ్గ రూపంలో ఇవాళ నాకంటబడి నన్ను మళ్ళీ ఉలిక్కిపడేటట్లు చేయటానికే వచ్చి వుంటుంది.

ఒకరోజు ఉదయాన్నే గదిలో నుంచి వరండాలోకొచ్చాను. రెండుకాకులు ఒక పూలకుండీ చుట్టూ తిరుగుతూ తమముక్కుల్ని ఒకదానికొకటి తాకించుకుంటూ ఆటలాడుతున్నాయి. ఈ వాయసాలు విచిత్రమైన పక్షులు. వీటికి ఒకొకచోట ఎంతో ఆదరంగా స్వాగతం చెప్తారు. మరొక చోట పాడుకాకులు ఛీ. ఛీ. ఇష్, ఇష్ అంటూ తోలేస్తారు. అతిగా గౌరవించేదీ వీటినే, ఛీదరించుకునేదీ వీటినే.

"పాపం. మన పూర్వీకులు గరుడపక్షి రూపంలోకాని, నెమలి రూపంలోకాని, హంసల రూపంలో కాని రారు. పితృకర్మలు జరిపించుకోవటానికి కేవలం కాకి రూపంలోనే ప్రత్యక్షమవుతారు. అంతేనా? మన బంధువులు ఎవరైనా మనింటికి వస్తున్న తీపికబురును కూడా కాకే తన కఠోరమైన గొంతుతోనే అరచి మనకు చెప్తుంది. కాకులన్నీ ఒక చోట చేరి కా.. కా.. అని అరుస్తుంటే అదేపనిగా కాకులు కవర్లాడుతున్నాయి. అశుభమని తోలేస్తాం" అని ఇలా కాకుల్ని గురించి ఆలోచిస్తూ వుండగానే పూలకుండీకి, గోడకు మధ్య దాక్కుని వున్న చిన్న ప్రాణిపై నా దృష్టి పడింది. దగ్గరగా వెళ్ళి చూశాను. చిన్న ఉడుతపిల్ల. బహుశా తన గూటి నుండి జారిపడివుంటుంది. ఇప్పుడీ కాకులు తేలిగ్గా తమ ఆహారంగా చేసుకోవచ్చని చెప్పుకుంటున్నాయన్నమాట.

అప్పటికే రెండు కాకులూ పొడిచి ఈ చిన్ని ప్రాణికి రెండు గాయాలు చేశాయి. రక్తం కారుకుంటూ ఆ దెబ్బల్తో భీతిల్లి పూలకుండీని కరుచుకుని వున్నది.

"కాకులు చేసిన గాయాలతో ఇది ఇక బతకదు. దీన్నిలాగే వదిలేస్తే మంచిదని" అందరూ అన్నారు. కాని నా మనసు ఒప్పుకోలా.

దాని బెదురును పోగొట్టి నా చేతిలోకి తీసుకుని నా గదిలోకి తీసుకొచ్చాను. దూదితో గాయపురక్తాన్ని తుడిచి పెన్సిలిన్ పూతమందు పూశాను. పలుచని దూదిని పాలలో ముంచి దాని చిన్నారి నోటిని తెరిచి ఆ దూదిని పిండాను. కాని నోరుసరిగా తెరవనందున పాల చుక్కలు క్రిందికే కారిపోయాయి.

కొన్ని గంటల తరువాత అది కొద్దిగా తేరుకుని ఒక్కొక్క నీటి చుక్కను మింగగలిగింది. మూడు రోజులకు బాగా తేరుకుని కులాసాగా, హాయిగా కనపడింది. తన రెండు లేత కాలివేళ్ళ పంజాఎత్తి

నావేలిని పట్టుకున్నది. నీలిగాజు ముత్యాలవంటి కళ్ళతో అటూ, ఇటూ చూడసాగింది.

మూడు నాలుగు నెలల్లో దాని ఒంటికి సుకుమారమైన రోమాలు, కుచ్చులాంటి తోకా వచ్చాయి. మెరిసే కళ్ళతో అందర్నీ ఆశ్చర్యంగా చూడసాగింది.

మేం దాన్ని దాని జాతిని బట్టిగాక మాలో ఒకరిగా చేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో "గిల్లూ" అనే పేరుతో పిలవసాగాం. పూలు వేసుకునే తేలికపాటి బుట్టలో దూదిని పరిచి ఆ బుట్టను ఒక తీగెతో కిటికీకి వేలాడదీశాం.

రెండేళ్ళపాటు "గిల్లూ" ఇల్లు అదే. దానికదే స్వయంగా బుట్టను అటూ ఇటూ కదిలిస్తూ వుంటే బుట్ట ఉయ్యాలలాగా, గాలికి ఊగేది. గాజు పూసల్లాంటి కళ్ళతో గదిలోపలకు, కిటికీ వెలుపలకు చూస్తూ లోపలకు, బయటకు తిరుగుతూ ఉండేది. అది ఏం చూసేదో మాకు తెలియదుకాని దాని తెలివితేటలు, అది చేసే పనులు అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించేవి.

నేను వ్రాసుకుంటూ కూర్చుంటే నా దృష్టిని తన వైపుకు తిప్పుకోవడానికి విశ్వప్రయత్నం చేసేది. దానికదే ఎన్నో ఉపాయాలను వెతుక్కునేది. నాకాళ్ళకు దగ్గరగా వచ్చేది. జరజరా వాకిలి పరదాపైకెక్కేది. తిరిగి అంతే వేగంగా కిందికి దిగేది. నేను లేచి తనను చేతుల్లోకి తీసుకునేవరకూ ఆ పరుగు, ఆ జారటం ఆపేదికాదు.

అప్పుడప్పుడూ గిల్లూను పట్టుకుని ఒక పొడవాటి కవరులో వేసి వుంచేదాన్ని, దాని ముందటి కాళ్ళు, ముఖం తప్పిస్తే మిగతా శరీరమంతా కవరులోపలే వుండేది. ఆ స్థితిలో కూడా గంటల తరబడి టేబుల్ మీద గోడ ఆసరాతో అలాగే వుండి మెరిసే కళ్ళతో నేనుచేసే పనులు చూస్తూ వుండేది. దానికి ఆకలేస్తే మాత్రం కిచ కిచ మంటూ తనకు ఆకలి వేసిందన్న సూచన చేసేది. జీడిపప్పుకాని, బిస్కెట్లుకాని ఇస్తే అదే స్థితిలో వుండి కవరులో నుంచి వెలుపలికున్న కాలి వేళ్ళతో పట్టుకుని వాటిని కొరుకుతూ వుండేది.

వేపపూత, మల్లెతీగల పూల సుగంధాలు తెమ్మెరలు, తెమ్మెరలుగా నాగదిలోకి వస్తున్నాయి. గిల్లూ, జీవితంలోకి కూడా వసంతమొచ్చింది. వెలుపలి నుంచి వచ్చిన ఉడుతలు కిటికీకి వున్న జాలీ దగ్గరకొచ్చి కిచకిచమనేవి. అవేం చెప్తున్నాయో మాకు తెలియదు. గిల్లూను తొంగిచూస్తూ జాలీ దగ్గరకు రావటం గమనించి గిల్లూకు కూడా విముక్తి కల్గించటం అవసరమని గ్రహించాను. జాలీకున్న మేకు తొలగించి గిల్లూ స్వేచ్ఛగా బయట తిరటానికి వీలు కల్పించాను. నిజంగా బయటికెళ్ళి స్వేచ్ఛగా ఉండగలదనే భావించాను. ఈ చిన్న ప్రాణిని ఇంట్లో తిరిగే కుక్కల్నుంచి, పిల్లుల్నించి కాపాడటం ఒక సమస్యగానే వున్నది.

ముఖ్యమైన కాగితాలు, పత్రాల భద్రతకోసం నేను బయటికెళ్ళినపుడు గది తలుపులు వేసివెళ్ళేదాన్ని. నేను కాలేజ్ నుంచి తిరిగివచ్చి గది తలుపులు తెరవగానే గిల్లూ తన దారి గుండా లోపలికొచ్చి నా కాళ్ళ

నుంచి తలవరకూ, తల నుండి కాళ్ళవరకూ నా ఒంటి మీద పరుగులు పెట్టేది. అప్పటి నుండి దానికది నిత్య కార్యక్రమం అయిపోయింది.

నేను గదిలో నుండి బయటికెళ్ళినపుడు గిల్లూ కూడా కిటికీలోనుంచి బయటికెడుతుంది. పగలంతా చెట్లమీదున్న ఉడుతల గుంపుకు నాయకుడుగా వుండి కొమ్మ నుండి కొమ్మకు దూకుతూ పరుగులు పెడుతూవుండేది.

నన్ను ఆశ్చర్యపరచి నాతో దాగుడుమూతలాడాలన్న కోర్కె దానిలో ఎప్పుడు కలిగిందో తెలియదు. ఒకసారి ఫ్లవర్ వాజ్‌లో ఉంచిన వత్తైన పూల మధ్య దాక్కుంటుంది. మరోసారి పరదా మడతల్లో నక్కి వుంటుంది. అప్పుడప్పుడూ సువర్ణమల్లె తీగె ఆకుల్లో దాక్కుని వుంటుంది.

నా దగ్గర పశుపక్షులు చాలానేవున్నాయి. వాటన్నిటి పట్లా నాకు చాలా ప్రేమవున్నది. కాని వాటిలో ఏవీ కూడా నాతోపాటు కూర్చుని నా పళ్ళెంలోనే తినే ధైర్యం చేసినట్లు నేనెప్పుడూ గమనించలేదు. గిల్లూకు మాత్రం ఈ విషయంలో ప్రత్యేకత వున్నది. నేను ఏదైనా తినటానికి కూర్చునప్పుడు అది ఆవరణకున్న గోడ, వరండా దాటుకుని కిటికీలో నుంచి వచ్చి భోజనాల బల్ల దగ్గర నా పళ్ళెంలోనే కూర్చోవటానికి ప్రయత్నం చేసేది. చాలా కష్టపడి గిల్లూను నా పళ్ళెం పక్కనే కూర్చోవటానికి అలవాటు చేశాను. అక్కడ కూర్చొని ఒక్కొక్క మెతుకూ ఏరుకుని చాలా శుభ్రంగా తింటూ వుండేది. జీడిపప్పు తనకెంతో ఇష్టమైన ఆహారం. చాలా రోజులు జీడిపప్పు దొరక్కపోయినా మిగతా తిండి పదార్ధాలు అంటే ఇష్టపడేది కాదు. వాటిని తన ఉయ్యాలలో నుంచి కిందకు పారబోసేది.

ఆ మధ్య నాకు కారు యాక్సిడెంటు అయితే కొద్ది రోజులు హాస్పిటల్లో వుండాల్సివచ్చింది. ఆ రోజుల్లో నా గది తలుపులు ఎవరు తెరిచినా గిల్లూ గభాల్న పరుగెత్తుకుంటూ వచ్చి నేను కాక వేరేవాళ్ళు కనుపించగానే తిరిగి వేగంగా తన బుట్టలోకి వెళ్ళిపోయేదట. అందరూ దానికి తినటానికి జీడిపప్పు పెట్టారు. కాని నేను హాస్పిటల్ నుంచి వచ్చిన తర్వాత కిటికీ జాలీని, గిల్లూ బుట్టను శుభ్రం చేయాలని చూస్తే దాన్నిండా కాజూ పలుకులే. పాపం చిన్నారి గిల్లూ. తనకిష్టమైన జీడిపప్పును కూడా తినకుండా నాకోసం ఎదురుచూస్తూ వున్నదని అర్ధమయింది.

నాకు ఒంట్లో నలతగా వున్నప్పుడు పడుకుని వుండేదాన్ని. అది నా దిండు మీద, తల దగ్గరగా కూర్చుని తన చిన్ని చిన్ని కాలివేళ్ళతో నాతల నొక్కుతూ, వెంట్రుకలను నెమ్మదిగా గీరుతూ వుండేది. ఆ పనులు ఎంతో శ్రద్ధగా ఒక పరిచారిక ఉపచర్యలు చేస్తున్నట్లుగా వుండేది. వేసంకాలంలో మిట్టమధ్యాహ్నం వరకూ నేను పనులు చూసుకుంటూ వుండేదాన్ని. గిల్లు బయటికి వెళ్ళకుండా, తన బుట్టలోనూ ఉండకుండా నా దగ్గరే వుండి ఎండ బారి నుండి తప్పించుకోవటానికి రకరకాల ఉపాయాలు వెతుకుతూ వుండేది. నాకు దగ్గరగా వున్న మంచి నీళ్ళకూజాను అంటిపెట్టుకుని వుండేది. నేనెక్కడ చల్లదనంలో వుంటే తనూ అక్కడే ఫాను కిందో, ఎ.సీ, దగ్గరో వుండేది.

ఉడుతల జీవితకాలం రెండు సంవత్సరాల కంటే వుండదు. అలాగే గిల్లూకు కూడా అంతిమసమయం వచ్చేసింది. ఆ రోజంతా తనేం తినలేదు, తాగలేదు. బయటక్కూడ వెళ్ళలేకపోయింది. అంతటి ఇబ్బందిలో కూడా తన ఉయ్యాల నుండి నా పడకమీదకు వచ్చింది. తన చల్లని కాలిప్రేళ్ళతో నా వేలు పట్టుకున్నది. అచ్చం తన బాల్యంలో ప్రాణాపాయస్థితిలో వుండి నా వేలు ఎలా పట్టుకున్నదో అలాగా ఆ వేలినే పట్టుకున్నది. తన కాలివేళ్ళ పంజాతో నా చేతిని నెమ్మదిగా సవరిస్తూ తన భావాలన్నింటినీ తెలియజెప్తున్నట్లుగా నన్ను స్పృశిస్తున్నది. గిల్లూ కాలి వ్రేళ్ళతో సహా దాని శరీరమంతా చల్లగా వుండేటప్పటికి లేచి హీటర్ వెలిగించి దానికి వేడి కల్గించే ప్రయత్నం చేశాను. కాని వేకువ సమయంలో ప్రభాత కిరణస్పర్శతో పాటే అదీ మరెవరి జీవితాన్నో మేల్కొల్పటానికి తాను శాశ్వత నిద్రలోకి జారుకున్నది. గిల్లూ ఉయ్యాల ఇప్పుడు ఊగటం లేదు. కిటికీ జాలీ కదలటం లేదు. కాని మరికొన్ని ఉడుతలు వచ్చి కిటికీకటువైపు కిచకిచ మంటూనే వున్నాయి. సువర్ణమల్లె తీగకు వసంతం వస్తూనే వున్నది.

సువర్ణమల్లె తీగకిందే గిల్లూ సమాధయ్యింది. అందుకని కూడా ఆ లతంటే నాకు చాలా ఇష్టం. ఆచిన్ని ప్రాణి ఏదో ఒక వసంత ప్రాభవాన సువర్ణమల్లె తీగకు బంగారు రంగులో పచ్చని మొగ్గగా వచ్చి నాకు సంతోషాన్ని ఇవ్వటానికి ప్రయత్నిస్తుందని నా నమ్మకం.

## నోబెల్ గ్రహీత, విశ్వకవి శ్రీరవీంద్రనాథ్ ఠాగూర్

జీవన రేఖలు : జగమంతా తన సాహిత్యపు వెలుగులుపంచిన మహాకవి శ్రీరవీంద్రనాథ్ ఠాగూర్, వీరు మే, **1861**వ సంవత్సరంలో కలకత్తా నందు జన్మించారు. తండ్రి మహర్షి దేవేంద్ర్ నాథ్ ఠాగూర్ నుండి ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకున్నారు. రవీంద్రుని భార్య మృణాళినీ దేవి. గాంధీజీ, రవీంద్రులు పరస్పర ప్రేమ, గౌరవాలను కలిగి వుండేవారు. గాన కోకిల సరోజినీనాయుడు, ఠాగూరు ఇంటిని తన పుట్టిల్లుగా భావించేది. రవీంద్రులు సాహిత్య, సంగీత, నాటక, సారస్వత సేవలను ఎన్నింటినో భరతమాతకు అందించి ఆగష్టు **1941**వ సంవత్సరంలో అమరులయ్యి కళాప్రపంచంలో చిరంజీవులయ్యారు.

కథా సాహిత్యం : వీరి కథాసాహిత్యంలో కాబూలీ వాలా, పోస్టాఫీసు, బ్రోకెన్ నెస్ట్, అపరిచిత, మోనిహరా డిటెక్టివ్, అనమోల్ భేంట్, కంచన్‌ఖేయా, హవామోతీ, నయీరోషనీ మొదలగునవి పేర్కొనదగినవి.

నవలా సాహిత్యం : గోరా, ఘరే బాహర్, జోగీజోగ్, నౌకాభంగ్ మొదలగునవి చాలా ప్రసిద్ధమైనవి.

కావ్య రచన : గీతాంజలి, కవీ ఔర్ కవితా, గూంగీ ధన్‌కీ భేంట్, పత్నీ కా పాత్ర్ మొదలగునవి చాలా ప్రముఖమైనవి. గీతాంజలి కావ్యానికి **1913**వ సం॥లో నోబెల్ పురస్కారమొచ్చింది.

అవ గుంఠన్, పింజర్, అనాథ్, యహ్‌స్వతంత్రతా, భాఖారిన్ విద్రోహీ కూడా వీరి రచనలలో పేర్కొనదగినవి. వీరు తన రచనలను బెంగాలీ, ఇంగ్లీషు భాషలలో, చేశారు.

వంద పాటలపైగా రచించి, స్వర పరచిన ఘనత వహించి రవీంద్ర సంగీత్‌కొక ప్రత్యేకతను కల్పించారు. వీరి జనగణమణ మన జాతీయ గీతమైంది. "బర్డ్ ఆఫ్ బెంగాల్" అని వీరు కీర్తింపబడ్డారు. రవీంద్రునిచే రచింపబడ్డ నాటకాలు ఎన్నో వేదికలపై ప్రదర్శింపబడ్డవి. "శ్రీనికేతన్, శాంతినికేతన్" విద్యార్థులు ఆనాడు రవీంద్రుని ఆధ్వర్యంలో సర్వకళా సంపన్నులుగా తీర్చిదిద్దబడేవారు. వారి "విశ్వభారతి" సంస్థ ఎన్నో వెలుగులను చిమ్మింది.

తాను స్వయంగా కుంచె చేతబట్టి ఉన్నత శ్రేణి చిత్రకారుడిగా రూపొంది ఎంతో మంది చిత్రకారులకాదర్శంగా నిలిచిన సర్వతోముఖ మహోన్నత వ్యక్తి శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్.

ప్రస్తుత కథ "కాబూలీ" బెంగాలీలో రవీంద్రునిచే వ్రాయబడింది. ఆ కథ దాదాపు అన్ని భారతీయ భాషలలోనికీ అనువదింపబడింది. హిందీ అనువాదం నుండి నేను తెలుగులోనికి అనుసృజన చేశాను. తండ్రిప్రేమ అనేది ధనికునికైనా, బీదవానికైనా, హంతకునికైనా తమ బిడ్డలమీద ప్రసరిస్తూనే వుంటుంది. బాల్యపు నిష్కపటత్వమూ, బిడ్డల పట్ల వ్యామోహమూ అన్ని వేళలా, అందరిలో ఎలా వెల్లివిరుస్తాయో తెలియజెప్పే కథే ఇది. అందుకే ఇది జగమంతా మెచ్చుకున్న కథ అయింది.

# కాబూలీ

బెంగాలీ మూలం: శ్రీరవీంద్రనాథ్ ఠాగూర్
అనుసృజన : దాసరి శివకుమారి

"ఖర్జూర, ద్రాక్ష, దానిమ్మ పండ్లు, తాజా పండ్లు" అన్న కేక వీధిలో వినపడింది. ఆ కేక విన్న మున్నీ ఇంటి లోపలి నుండి వరండాలోకి వచ్చింది. వరండా నుంచి వీధి గుమ్మం దాకా వచ్చి "ఓ ద్రాక్ష పండ్లూ, ఓకాబూలీ" అంటూ కేకపెట్టి పిలిచింది. పండ్లు అమ్మే వ్యక్తి వెనుదిరిగి చూశాడు. మున్నీ వెంటనే వరండాలోకి పరుగెత్తి స్థంభం చాటున దాక్కున్నది. వీధి గుమ్మంలో నుంచి కాబూలీ వరండా వరకూ వచ్చాడు. ఆరేళ్ళ మున్నీ స్థంభం చాటు నుండి తొంగి తొంగి చూడసాగింది.

"పండ్లమ్మా, తాజా పండ్లు, జల్దీరండి" అంటూ కాబూలీ పండ్ల గంప దింపుకుని క్రింద, చతికిలబడ్డాడు. ఈ మాటలు విన్న మున్నీ తల్లీదండ్రీ వరండాలోకి వచ్చారు. మున్నీ మాత్రం, స్థంభం చాటు నుండి ఇవతలకు రాలేదు. పిలవటమయితే 'ఓ కాబూలీ!' అని సరదాగా ఆటకాయతనంగా పిలిచింది. కాని ఇప్పుడు ఎదుట పడటానికి సిగ్గుపడుతున్నది. వాళ్ళ నాన్న మున్నీ చెయ్యిపట్టుకుని ఇవతలకి తీసుకొచ్చాడు. "మున్నీ! ఇలారా! మనకవసరం లేనపుడు ఇలా ఊరికే కేకలు వేయవచ్చా? తప్పుకదూ!" అంటూ మందలించాడు. మున్నీని చూసిన కాబూలీ కళ్ళు మెరిసాయి. ద్రాక్షపళ్ళు ఒక పొట్లం, ఖర్జూర పళ్ళు మరి ఒక పొట్లం కట్టిమున్నీ చేతిలోపెట్టాడు. అవి తీసుకోవటానికి కూడా మున్నీ సిద్ధపడలేదు. "తీసుకోతల్లీ! తీసుకో ఈ పండ్లు నీకే అంటూ కాబూలీ బలవంతాన పండ్లు అందించాడు. తండ్రి కూడా తీసుకో ఫర్వాలేదు అన్న తర్వాత మున్నీ తీసుకోవటానికి ముందుకువచ్చింది.

"బేటీకి ఇచ్చిన పండ్లకు డబ్బేమీ వద్దు బాబూజీ."

"ఊరికే ఇవ్వొద్దు. ఈ డబ్బులు తీసుకోవాల్సిందే" అంటూ బలవంతంగా పండ్ల ఖరీదు చేతిలో పెట్టేశాడు. కొన్ని రోజులు గడిచాయి. ఒక రోజు ఉదయాన ఆఫీసు గదిలో కాగితాలు చూసుకుంటూ కూర్చున్న మున్నీ తండ్రికి బయటి నుంచి ఏవో మాటలు వినిపించాయి. కాగితాలు చూడటం ఆపి వెలుపలికి వచ్చాడు. పండ్ల గంపలో నుంచి కాబూలీ పండ్లు తీసి ఇస్తున్నాడు. మున్నీ ఏ మాత్రం సంకోచించకుండా వాటిని తింటున్నది. ఈనాటి దృశ్యం మొదటి రోజు తాను చూసిన దృశ్యానికి పూర్తిగా భిన్నంగా వున్నది. తొలినాటి భయాలూ, సంకోచాలూ ఇపుడు మున్నీలో ఏం లేవు. చాలా కులాసాగా కాబూలీతో కబుర్లు చెప్తున్నది. అతనూ చాలా ముద్దు చేస్తూ, ఆర్తిగా, మున్నీతో కబుర్లాడుతున్నాడు. ఈ మధ్యలో కొన్నిసార్లైనా అతను మున్నీని కలవటానికి వచ్చినట్లున్నాడు. అందుకే మున్నీకి అతని దగ్గర చనువు పెరిగిందని అర్థమయింది. మున్నీ కోమలమైన పసి హృదయాన్ని అతను వశపరచుకున్నట్లుగా తండ్రి భావించాడు.

"ఇలా మాటిమాటికీ వచ్చి మా అమ్మాయికి పండ్లు ఇవ్వొద్దు. ఇది నాకేం బాగా అనిపించటం లేదు."

"అలా అనవద్దు బాబూజీ! నా పేరు రహమత్. ప్రతి సంవత్సరమూ మా ఊరి నుండి ఈ ప్రాంతానికి వచ్చి పండ్లూ మొదలగునవి అమ్ముకుంటూ వుంటాను. అమ్మకాలు పూర్తయి సొమ్ము వసూలు అయింతర్వాత మా ఊరికి వెళ్తూ వుంటాను. మున్నీ తల్లి అంతదే, నా కూతురు గూడా. నా కూతురంటే

నాకు చాలా ఇష్టం. ఆ ఇష్టంతోనే తరచూ మున్నీ బేటీ దగ్గరకొచ్చి కూర్చుని నా కూతుర్ని గుర్తుచేసుకుంటూ వుంటాను. మున్నీ కిలకిల నవ్వుతూ నాతో కబుర్లు చెప్తున్నది. ఆనవ్వుల్లో, నా కూతురి ముద్దుమాటలే నాకు వినపడుతున్నాయి. దయచేసి నా ఆనందాన్ని దూరం చేయకండి బాబూజీ, అంటూ చేతులు జోడించాడు. ఇటు తిరిగి చూస్తే నిండుజాబిలిలాగా వికసించిన మోముతో రహమత్ ఎదురుగా కూర్చుని వున్నది మున్నీ. పండ్ల ఖరీదు లెక్కకట్టి ఇస్తే మాట్లాడకుండా, తీసుకుని జేబులో వేసుకున్నాడు కాబూలీ.

ఒకరోజు వీధిలో కలకలం వినిపించింది. "మిశ్రా! వీధిలో ఏదో గొడవ వినపడుతున్నది చూడు."అన్నాను.

"అలాగే బాబూజీ అంటూ నౌకరు మిశ్రా వీధిలో కెళ్ళి వివరం తెలుసుకొని బాబూజీ! బాబూజీ! అంటూ గాభరాగా వచ్చాడు. అదే గాభరాతో "బాబూజీ! మన రహమత్ కత్తితో ఒకర్ని పొడిచేశాడు. తన పొరుగున వున్నవానికి కంబళి ఒకటి అమ్మాడట. అను రహమత్‌కు సరిగా డబ్బు ఇవ్వలేదు. దాని దగ్గర గొడవ పెట్టుకుని రహమత్ వాడిని పొడిచాడు. స్టేషన్ నుంచి పోలీసులు వచ్చి రహమత్‌ను బంధించి తీసుకుని వెళ్తున్నారు." అంటూ వివరించాడు.

రహమత్ చేతులకు బేడీలు వేశారు. ఒంటిమీదున్న బట్టల నిండా రక్తపు మరకలు. వీధిలో నడిపించుకుంటూ తీసుకెళ్ళే రహమత్‌ను మున్నీ చూసింది. "కాబూలీ! ఓ కాబూలీ! ఎక్కడకు పోతున్నావు? ఎప్పుడొస్తావు" అని బిగ్గరగా అడిగింది.

మున్నీ గొంతు వినగానే కాబూలీ కళ్ళల్లో చిరువెలుగు, పెదవుల మీద చిన్న మందహాసంతో తలెత్తి "అత్తవారింటికి పోతున్నాను. రావటానికి చాలా రోజులు పడుతుంది" అని తను గూడా బిగ్గరగా చెప్పి కదిలి ముందుకెళ్ళాడు.

అత్తగారింటికొస్తున్నాడురా పెళ్ళికొడుకు మనుగుడుపులకు అంటూ రక్షక భటులు నవ్వుకున్నారు.

ముతక బట్టలతోను, మొరటుదేలిన శరీరంతోను, నడివయసులో వున్న రహమత్, వికసించే పువ్వులాంటి సుకుమారమైన మున్నీ వీళ్ళిద్దరి వయస్సులలోనూ, ఆకారాల్లోనూ ఎంతో వ్యత్యాసం. కాని ఇద్దరి మనసులూ ఎంతో దగ్గరయ్యాయి. ఎప్పుడైనా రహమత్ రావటం ఆలస్యమైతే, "నిన్నా, మొన్నా, రాలేదు. నువ్వెక్కడికి వెళ్లావు కాబూలీ" అంటూ అడిగేది మున్నీ.

"అత్తగారింటికి వెళ్ళాను మున్నీ బేటీ, అంటూ నవ్వుతూ జవాబిచ్చేవాడు. అత్తవారిల్లు అంటే ఏమిటో అర్థం చేసుకునే వయసు లేదు మున్నీకి. ఈ రోజు రహమత్ అలాగే జవాబిచ్చినా పరిస్థితి ఏమాత్రం అర్థం కాలేదు మున్నీకి.

------

కాలం ముందుకు సాగిపోతూ వున్నది. పెరిగే వయసుతో మున్నీ క్రమంగా రహమత్‌ను మర్చిపోయింది. అందరి జ్ఞాపకాల్లో రహమత్ మరగున పడిపొయ్యాడు. ఏడేళ్ళు గడిచాయి. ఈ రోజు రాత్రికే మున్నీ పెళ్లి జరగబోతుంది. ఇల్లంతా చుట్టాలతో నిండివున్నది. ఆఫీసు గదిలో కూర్చుని వస్తువుల

జాబితాలు సరిచూచుకుంటూ ఇంకా ఏమైనా తెప్పించాలా? నా కూతురు మున్నీ పెండ్లిలో ఏలోటూ జరక్కుండా చూసుకోవాలి అని భావిస్తున్న సమయంలో "బాబూజీ"! అన్న మాట స్పష్టంగా వినపడింది. తలెత్తి చూస్తే తైల సంస్కారం లేక, దుమ్ముకొట్టుకుపోయిన బట్టలతో చూడటానికే తేడాగా అనిపించే వ్యక్తి వరండాలో కూర్చుని వున్నాడు.

"ఎవర్నువ్వు? లోపలికి ఎలా వచ్చావు? లే. లేచి ముందిక్కణ్ణుంచి బయటికి వెళ్ళు" అని గద్దించినా ఆ గద్దింపు అతణ్ణేమీ కదిలించలేకపోయింది. ఈలోగా నౌకరు మిశ్రా పరుగెత్తుకుంటూ వచ్చి "నేను ఎంత చెప్పినా వినకుండా ఈ బికారి నన్ను నెట్టుకుంటూ లోపలికి వచ్చాడు. ఇతన్నిప్పుడే బయటికి పంపించివేస్తాను" అంటూ అతణ్ణి లేపటానికి ప్రయత్నించాడు.

"బాబూజీ! నేను రహమత్‌ను. మున్నీ బేటీని చూడటానికి వచ్చాను. ఒక్కసారి నేను మున్నీ తల్లిని చూడాలి" అన్నాడు గబగబా.

ఆ కంఠ ధ్వని గుర్తుకు వచ్చింది. అవును. అది రహమత్ కంఠధ్వనే. జైలునుండి సరాసరి ఇక్కడికే వచ్చినట్లున్నాడు. కాని ఎలా? అతని కోరిక ఈ రోజు తీరదు. "చూడు రహమత్! ఈ రోజు ఇంట్లో చాలా అవసరమైన పన్లున్నాయి. మున్నీని, కలవటం కుదరదు. నువ్వు వెళ్ళిరా."

"కుదరదా? బాబూజీ? ఒక్కసారి మున్నీ బేటీని చూడాలని ఎంతో ఆశగా వచ్చాను."

బాబూజీ దగ్గర్నుంచి ఏ సమాధానమూ రాకపోయేసరికి నిస్సత్తువగా లేచి నిలబడి బయటికెళ్ళటానికై నాలుగ్గజాల దూరం ముందుకు వెళ్ళి మరలా వెనక్కు వచ్చేశాడు. అలాగే చతికిలబడి కూర్చున్నాడు. తన చొక్కా జేబులో నుండి పాతదై చినిగిపోవటానికి సిద్ధముగా వున్న ఒక కాగితాన్ని బయటకు తీశాడు. ఆ కాగితపు మడతలు విప్పి నేలపై పరిచాడు. బూడిద మసిలో అద్ది మరలా ఆగుర్తుల్ని, కాగితంపై అద్దిన రెండు చిన్నారి చేతిగుర్తులు ఆ పాత కాగితంపై వున్నాయి. ఎన్నిసార్లు నీళ్ళు నిండిన కళ్ళతో ఆ గుర్తుల్ని తనివి తీరా చూసుకుని కూతురి జ్ఞాపకాలన్నీ ఆ కాగితంలో పదిలపరచుకున్నాడో? ఆకన్న తండ్రి మనస్సాక్షికే తెలుసు. "బాబూజీ! ఇవి నా కూతురి రెండు చేతుల గుర్తులు. మా ఊరి నుండి ఇక్కడకు బేరం చేసుకోవటానికి వస్తూ తెచ్చుకున్నాను. మున్నీ బేటీ అంతే వుంటుంది నా కూతురు. నా కూతుర్ని మున్నీ బేటీలోనే చూసుకుని సంతోషించేవాడిని. ఇప్పుడు కూడా మున్నీ బేటీని, బేటీలో నా కూతుర్ని చూసుకుందామని ఎంతో ఆశతో జైలు నుండి సీదా ఇటే వచ్చేస్తిని. బేటీని చూసేదానికే లేకుండా పోయింది. అల్లా ఆకిస్మత్ నాకివ్వలా." అంటూ ఆ కాగితం మరలా మడతలు పెట్టుకుని చొక్కా జేబులో భద్రపరచుకున్నాడు. నిరాశగా కాళ్ళీడ్చుకుంటూ వెనుదిరిగాడు. రెండు బారలు నడవగానే "రహమత్! రాకూర్చో" అన్న మాట వినబడి మరలా వెనుదిరిగి వచ్చి ముందు కూర్చున్న చోటే కూలబడ్డాడు. అప్పటికే ఇంట్లోని బంధువులు రహమత్ వంక ఏహ్యంగానూ, భయం, భయంగానూ చూస్తున్నారు. వీణ్ణి మెడపట్టి గెంటకుండా ఇక్కడే వుంచి కబుర్లేమిటి? అని గుసగుసలాడుతున్నారు.

"అయ్యో? అదేమిటి? మున్నీ మీ కూతురే. అయితే మాత్రం మేం చెప్పేది కూడా కాస్త వినండి. మున్నీని బయటకు తీసుకెళ్ళి వాడికి? అందునా ఆ ఖైదీకి చూపిస్తానంటారేమిటి? వాడికీ మీకు ఏం సంబంధం? వియ్యాలవారికి తెలిస్తే ఎంత అప్రదిష్ట? బంధువులందర్లో ఎంత తలవంపులవుతాయో

ఆలోచించుకోండి. రాత్రికి పెళ్ళి కాబోయేపిల్లని ఇలా ఆ ఖైదీ ఎదుటికి తీసుకెళ్ళటానికి కుదరనే కుదరదు.” అంటూ ముఖ్యంగా ఇంట్లోని ఆడవారు గగ్గోలుపెడుతున్నారు.

మున్నీ చెయ్యిపట్టుకుని వాళ్ళ నాన్న మాత్రం ఇంటి గుమ్మం దాటించి వరండాలోకి తీసుకొచ్చి రహమత్ ఎదుట నిలబెట్టాడు. “ఇదుగో మున్నీ. ఇవాళ రాత్రికే తన పెండ్లి జరగబోతున్నది మున్నీని దీవించు రహమత్.”

బాబూజీ మాటలకు రహమత్ నిశ్చేష్టుడయ్యాడు. మున్నీ వంక విస్ఫారితనేత్రాలతో చూడసాగాడు. ఈమె ఈ అందాల యువతి తన చిన్నారి మున్నీనా? మున్నీ బేటీ అంటే ఇంకా తన దృష్టిలో చిన్న గౌను వేసుకుని కాబూలీ! ఓ కాబూలీ అంటూ చిన్ని చిన్ని చేతుల్తో ఒక్కొక్క ద్రాక్ష పండూ తినే చిట్టితల్లే. ఈ ఖరీదైన వస్త్రాలలో, ఒంటి నిండా నగలతో, మెరిసిపోయే ఈమెను తనెప్పుడైనా చూశాడా? ఈమెతో మాట్లాడాడా? ఆమె చేతులకు పండ్లు అందించాడా? లేదే? కాదు. కాదు. జమానాతో పాటు తన ఆలోచనలు పెరగలేదు. ఎంత పాగల్ అయ్యాడుతను? సంభ్రమాన్ని అణుచుకుంటూ మున్నీ వంక చూస్తూ “బేటీ! ఈ కాబూలీ గుర్తున్నాడా?” మున్నీ ముఖంలో ఏ భావమూ లేదు. తన తండ్రి వంకే చూస్తూ నిలబడ్డది.

“మున్నీ బేటీ! అత్తవారింటికి వెళ్ళబోతున్నావా తల్లీ?”

ఈనాడు మున్నీకి అత్తవారిల్లు అంటే తెలుసు. అందుకే సిగ్గుతో ఏం మాట్లాడలేదు.

“హమేశా సుఖ్ సే జీతో రహెూ బేటీ”! అంటుంటే రహమత్ కంఠం బరువెక్కింది. కళ్ళలో నీళ్లు చిప్పిల్లినయి. మున్నీ లోపలికెళ్ళిపోయింది. రహమత్ మాత్రం అక్కడే నేలమీదనే కూర్చుండిపోయాడు. “బాబూజీ! నా కూతురు కూడా ఇప్పుడు మున్నీ బేటీ అంతది అయివుంటుంది. వాళ్ళకెవరు దిక్కయ్యారో తెలియదు. ఇప్పుడు నన్ను గుర్తే పట్టకపోవచ్చు బాబూజీ” అంటూ బలవంతాన దుఃఖాన్ని ఆపుకోసాగాడు.

“రహమత్! ధైర్యంగా వుండు. ఈ ఏభై రూపాయలు తీసుకో, వెళ్ళు, నీ వాళ్ళను కలుసుకో. ఇకనైనా సుఖంగా, సంతోషంగా వుండు. వెళ్ళిరా.”

రహమత్ కళ్ళు తుడుచుకుంటూ లేచి నిలబడ్డాడు. “మీరు చెప్పినట్లే చేస్తాను. బాబూజీ! మీకు అనేక వందనాలు, ధన్యవాదాలు అంటూ అక్కణ్ణుంచి సాగిపొయ్యాడు.

ఈ రోజుల్లో ఏభైరూపాయలంటే అంత చిన్న మొత్తమేం కాదు. రాత్రికి జరగబోయే నా కూతురి పెండ్లి మంటప అలంకరణకు ఆ దబ్బుతో మరింత విద్యుత్,దీపాలంకరణ చేయొచ్చు. కాని ఆ అలంకరణ వెలుగులకన్నా ఈ తండ్రి మనస్సుకు కలిగే సంతోషమే ముఖ్యం. నేనూ తండ్రినే. నాకు నా బిడ్డ పట్ల అంతులేని మమకారమున్నది. అతనూ నాలాంటి తండ్రే. అతనిలోనూ అమితమైన తండ్రి ప్రేమ వున్నది. ఆ ప్రేమను గుర్తించి ఓదార్పు ఇవ్వటమే ముఖ్యమని భావించాను.

## ప్రసిద్ధ కధాకారుడు శ్రీసుదర్శన్

జీవన రేఖలు : శ్రీ ప్రేమ్‌చంద్, శ్రీ విశ్వంభరనాధ్ కౌశిక్‌జీల పరంపరకే చెందిన ప్రసిద్ధ కధాకారులు శ్రీ సుదర్శన్. వీరు **1895**వ సంవత్సరంలో సియాల్ కోటనందు జన్మించారు. వీరి భాషా, శైలి చాలా సరళంగా, స్వాభావికంగా వుంటుంది. రచనల్లో సందర్భానుసారంగా సామెతల్ని ఎక్కువగా ప్రయోగించారని తెలుస్తుంది. ప్రేమ్‌చంద్ లాగే హిందీ, ఉర్దూ భాషల్లో రచనలు చేశారు.

కధానిక రచన : ఉర్దూ పత్రికయైన 'హజార్ దాస్తాం'లో వీరి కథలనేకం ప్రచురింపబడ్డాయి. వీరికి పెద్దలు పెట్టిన పేరు 'బదరీనాధ్', 'సుదర్శన్'పేరుతో ఎంతో సాహిత్యాన్ని లిఖించి **1967**వ సం॥లో వీరు స్వర్గస్థులయ్యారు.

సాహిత్య సేవ : గద్యపద్య రచనలు సమానంగా వీరి కలం నుండి ధారాళంగా జాలువారాయి. అంతేకాక చలన చిత్ర పరిశ్రమకూ, వీరు విశేషంగా రచనలందించారు. 'కువారీ లేదా విధవా" అనే చిత్ర దర్శకత్వ బాధ్యతల్నీ చేపట్టారు.

తీర్థయాత్ర, పత్థర్ కా సౌదాగర్, పృధ్వీ వల్లభ్, హార్‌కీజీత్, పహలీ కహానీ అనే సినీ గీతాలు చాలా పేరుపొందినవి. ఇంకా తేరీ గఠరీ మే లగాచోర్, బాబా మన్‌కీఆంఖే ఖోల్ మొదలగు గీతాలు కూడా శ్రోతల మన్ననలు పొందినవి.

మహాత్మా గాంధీజీచే ప్రారంభింపబడ్డ వార్ధా సాహిత్య పరిషత్ ద్వారా సత్కారాన్ని అందుకున్నారు. లడాయీ, పహలీ కిరణ్, ఏక్ అమెరికన్ రమణి, ఏథెంస్ కా సత్యార్ధీ లాంటివి పాఠకుల మనసుల్లో హత్తుకుపోయిన రచనలు.

కాయాపలట్, సబ్ కా సౌదా, కమల్‌కీ బేటీ, కవీ కీ స్త్రీ మొదలగు కథలు వీరికి మంచి పేరు తెచ్చిపెట్టినవి.

ప్రస్తుత కథ "అపనీ కమాయీ." అపనీ కమాయీ అంటే తన సంపాదన అని అర్థం. అయాచితంగా వచ్చే సంపాదనపోయినా పెద్ద బాధుండదు. కాని కష్టపడి సంపాదించింది పోగొట్టుకోవాలంటే మనిషి విలవిలలాడతాడు. ఎందుకంటే దాని విలువ తెలుసు కాబట్టి. ఆ విలువను తెలియజేయటంలో శ్రీ సుదర్శన్ కృతకృత్యులయ్యారు. బిందువులో సింధువును చూపిస్తూ చిన్న కథలో పెద్ద నీతిని దర్శింపజేశారు. ఇది "కష్టార్జితం" అనే పేరుతో అనువదింపబడినది.

# కష్టార్జితం

అదొక ధనిక కుటుంబం. ఉదయాన్నే తల్లీదండ్రీ లేచి తమ తమ పనులు చూసుకుంటున్నారు. కాని ధనవంతులై సోమరిగా వుండే పుత్రులకపుడే తెల్లవారదు. తండ్రి కొడుకు లేచే వరకూ వేచిచూశాడు. బద్ధకంగా వుంటూ, కులాసాగా తిని తిరిగే కొడుకును దగ్గరగా పిలిచాడు. "ఊరికే తేరగా తిని కూర్చోవటం కాదు. సంపాదించే వయసొచ్చినా ఏపనీ చేయటం లేదు. వెళ్ళు బయటికి వెళ్ళి ఏదైనా పనిచేసి సంపాదించి తీసుకొనిరా. అప్పుడే నీకు రాత్రికి ఇంట్లో భోజనం పెట్టటానికి కుదురుతుంది." అని గట్టిగా చెప్పాడు.

ఆ పుత్రుడు అజాగ్రత్తపరుడు. దుర్బలుడు, ఆత్మాభిమానం కూడా లేనివాడు. కష్టపడి పనిచేయటం అసలే అలవాటు లేనివాడు. దాంతో తండ్రి మాటలకు అతనికేడుపొచ్చింది ఏ సమయంలోనైనా గుర్తొచ్చేది అమ్మే కదా? అందుకే వెంటనే పరుగెత్తికెళ్ళి తన బాధ మొరపెట్టుకున్నాడు. కొడుకు కళ్ళల్లో కన్నీళ్లు, అతని ముఖంలో విచారం, ఆ విచారం వలన కలిగిన కళాహీనతను చూసి ఆమెకెంతో బాధ కలిగింది. అంతేనా? ఆమె ఎంతో అశాంతికి లోనైంది. "నువ్వేం బాధపడకు. నీకు నేనున్నాను అంటూ" అతని చెంపలు నిమిరి బుజ్జగించింది. దాంతోపాటు ఒక బంగారు నాణేన్ని తీసి కొడుకు చేతిలో పెట్టింది.

రాత్రి భోజనాలకు కూర్చున్నారు. "ప్రొద్దున్న నేను చెప్పిన విషయమేం చేశావు? ఏమైనా సంపాదించావా?" అని తండ్రి కొడుకును ప్రశ్నించాడు.

కొడుకు ఎంతో బుద్ధిమంతుడులాగా తన జేబు నుండి బంగారు నాణేన్ని తీసి తండ్రి ఎదురుగా వుంచాడు.

"నువ్వే సంపాదించావా? మంచిది. దీన్నిలాగే తీసుకెళ్ళి బావిలో పారవేసిరా" అన్నాడు.

కొడుకు అలాగే దాన్ని భద్రంగా తీసుకెళ్ళి తండ్రి చెప్పిన దాన్ని తు.చ. తప్పకుండా ఆచరించాడు.

బంగారునాణెం బావిలో పడిపోయింది. మరుసటిరోజే తన భార్యను కొన్నాళ్ళపాటు పుట్టింటికి పంపించేశాడు తండ్రి.

మూడవరోజు తండ్రి మరలా కొడుకును పిలిచి "చూడు. నువ్వీరోజు తప్పకుండా ఎంతో కొంత సంపాదించుకునిరా. లేకపోతే తెలుసుగా ఏం జరుగుతుందో? రాత్రికి ఇంట్లో భోజనం చేసే అవకాశమే వుండదు" అంటూ హెచ్చరించాడు.

తల్లి ఇంట్లో లేదు కనుక ఆ కొడుకు అక్క దగ్గరకెళ్ళి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. జాలిపడిన అక్క తన అలంకార సామాగ్రి వుంచుకునే బాక్సులో నుంచి ఒక రూపాయి తీసి తమ్ముడికిచ్చింది.

రాత్రి భోజనాల సమయమైంది. తండ్రి మరలా అడిగాడు. "ఈ రోజు ఏమైనా సంపాదించావా?" అని సుపుత్రుడు వెంటనే జేబులో చేయిపెట్టి అక్క ఇచ్చిన రూపాయి తీసి తండ్రి ముందుంచాడు.

"నువ్వే సంపాదించావా? బాగుంది కాని ఈ రూపాయీ తీసుకెళ్ళి మరలా బావిలో పడవేసిరా" అన్నాడు.

మారు మాట్లాడకుండా లేచి వెళ్ళి ఆ రూపాయిని బావిలో పారవేసివచ్చాడు.

అనుభవజ్ఞుడైన తండ్రికి విషయమంతా అర్ధమవుతూనే వున్నది. మర్నాడుదయమే తన కూతుర్ని అత్తవారింటికి పంపేశాడు.

కొద్దిరోజులు గడిచాయి. మరలా తన కొడుకును చేరబిలిచి "ఈ రోజు కూడా ఎంతో కొంత సంపాదించుకుని రా. అలా సంపాదించలేకపోతే నీకు ఇంట్లో తిండి తినే అధికారం వుండదని" హెచ్చరించాడు.

ఆ మాటలు విన్న కొడుకు నిస్తేజమైపోయాడు. ఎక్కడికెళ్ళాలో, ఏం చేయాలో అసలు అర్థం కాలేదు. అవసరానికి సొమ్మిచ్చి ఆదుకునే తల్లికాని, అక్క కాని ఇపుడు అందుబాటులో లేరు. తన అసమర్ధతను తల్చుకుని కళ్ళ వెంట నీరు పెట్టుకున్నాడు. రోజంతా గడిచిపోతున్నది. ఏ ఉపాయమూ తట్టలేదు. చివరకు సాయంకాలంపూట బయటికొచ్చాడు. ఏపని చేయాలా? డబ్బులెలావస్తాయా అని ఆలోచిస్తూ అటూ, ఇటూ తిరగసాగాడు.

ఇంతలో ఒక సేఠ్‌జీ కనపడ్డాడు. "ఏయ్ అబ్బాయ్! నా ఈ పెట్టె వున్నది చూచావ్! దాన్ని నీవు మోసుకుని నాయింటి దాకారా. ఆ పెట్టె మోసినందుకు నీకు రెండణాల కూలి ఇస్తాను." అన్నాడు. ధనవంతుల బిడ్డ ఆ పెట్టెనెత్తుకుని బలవంతాన మోస్తూ ఆ సేఠ్‌జీ ఇంటికి చేర్చటానికి బయల్దేరాడు. పనులు చేసే అలవాటు లేదు. బరువులు మోసే అలవాటు అంతకంటే లేని కారణంగా అతని ఒళ్ళంతా చెమటలు కారుతున్నాయి. కాళ్ళు వణుకుతూ అడుగులు ఎడా, పెడా పడుతున్నాయి. మెడా, వీపూ ఒకటే నొప్పిపుడుతున్నది. ఎలాగో పెట్టె చేర్చి బయటికొచ్చాడు.

రాత్రయింది. ఇట్లో తండ్రీ కొడుకులేవున్నారు. ఎప్పటిలాగే కొడుకునడిగాడు. "ఈరోజేం సంపాదించుకొచ్చావని?"

కొడుకు రెండణాలు తీసి తండ్రి ఎదుట వుంచాడు.

"ఈ రెండణాలు తీసుకెళ్ళి బావిలో వేసిరా" అన్నాడు.

కొడుకు కళ్ళలో కోపం ఎగిసిపడింది. గొంతు పెంచి "నా మెడ నొప్పితో వాలిపోతున్నది. నా నడుం విరిగిపోయేటట్లున్నది. అంత బరువు పెట్టె అతి కష్టం మీద మోసి నేను తెచ్చిన రెండణాలను మీరు తేలిగ్గా బావిలో వేసి రమ్మని చెప్తున్నారు" అన్నాడు రోషంగా.

కొడుకు పడ్డ కష్టం తండ్రికి అర్ధమయింది. తన ప్రయత్నం వృధాపోలేదనుకున్నాడు. శ్రమ మరియు డబ్బు విలువా కొడుక్కు అర్ధమయివుంటుందని సంతోషించాడు. ఇక తన వ్యాపారాన్ని కొడుకు చేతుల్లో పెట్టవచ్చుని భావించాడు.

## ఆధునిక కథాకారుడు శ్రీ లక్ష్మీ కాంత్ త్రిపాఠి

జీవన రేఖలు : వీరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని, ప్రతాప్ గఢ్ జనపదం దగ్గర కూరాడీహ్ గ్రామమునందు **1965**వ సంవత్సరంలో జన్మించారు. అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎ. పట్టాను పొందారు. విభిన్న పత్రికల్లో వీరి గీతాలు, గజల్సు, కవితలు, కథలు ప్రచురింపబడినవి.

కథారచన : ఆత్మ నివేదన్, సుబహ్‌హెూనే తక్, మనోహర్‌లాల్, ఝూర్, బడేబాబ్, ఏక్‌రాత్, వహ్‌బూఢా ఆద్మీ మొదలగు కథలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి.

ఇతర రచనలు : "శహర్‌మే అజన బీహు" అనే గజల్ సంకలనాన్ని వెలువరించారు.

రచనా విశేషం : టాల్‌స్టాయ్ వ్రాసిన "కితనీ జమీన్" అనే కథ తనను చాలా ప్రభావితం చేసిందని, అలాగే టాల్‌స్టాయ్ వ్రాసిన 'పునరుద్ధాన్"నవలా ప్రభావం కూడా తనమీద చాలా వుందని శ్రీలక్ష్మీ కాంత్ త్రిపాఠి గారే వ్రాసుకున్నారు. వీరు రాసిన కథల్లో పూర్తి ప్రపంచ విషయాలు పాఠకులకు గోచరమవుతాయి.

వీరి ప్రస్తుత కథలు "నయారిక్షా", "నోనీలు". సమాజంలో మన చుట్టూ జరిగే సంఘటనలపట్ల స్పందిస్తూ పేదవాడైన రిక్షావాలా కష్టాన్ని తెలియజేస్తూ అతని ఆత్మాభిమానాన్ని ప్రశంసిస్తూ రచయిత పొందిన అనుభూతిని నయారిక్షా కథలో చక్కగా వర్ణించారు.

ఛత్తీస్ గఢ్‌లోవున్నప్పుడు ఇంట్లో పనిపాటలు చేసే "నోనీ" అనే ఆదీవాసీ బాలికపట్ల తనలో కలిగిన భావాలను, తన కర్తవ్యాన్ని గుర్తెరిగి మసలుకున్న తీరు, కథలోని ప్రధాన పాత్ర ద్వారా చక్కగా విశ్లేషించారు. **2004** నుండి **2006**వ సంవత్సరము వరకు శ్రీ నరేంద్ర పుండరీక్ అనే మిత్రుని సాహచర్యంలో చక్కగా గడిపానని అప్పుడే ఈ "నయా రిక్షా, నోనీ" కథలు "అక్షర పర్వ్", "పాఠ్" అనే పత్రికల్లో ప్రచురింపబడి తనకు చాలా మంచి పేరు తెచ్చిపెట్టాయని రచయిత తెలియజేస్తున్నారు.

# కొత్త రిక్షా

గౌరవప్రదమైన నా విధినిర్వహణలో బాందా ఆఫీసులో చేరాల్సిన మొదటి రోజు. ఆఫీసుకు వెళ్ళటానికి తయారయి తొమ్మిదిన్నర గంటలకల్లా బయలుదేరి బయటకొచ్చాను.

జూన్ 16న అకస్మాత్తుగా అలహాబాద్ నుండి బాందాకు నాకు బదిలీ అయ్యింది. వెంటనే డ్యూటీలో చేరి బాధ్యతలు చేపట్టవలసిందిగా నాకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. అలా అందిన మరుసటి రోజే నేను బాందా వెళ్ళి, పన్నుల విభాగాధికారిగా నా బాధ్యతలు స్వీకరించాను. ఆనాటి రాత్రికి మరలా అలహాబాద్ తిరిగి వెళ్ళిపోయాను.

బాందాలో అధికార నివాసం ఏమీ లేదు. బాందాలో పనిచేసేవారందరూ శాఖాధికారితో సహా అద్దె ఇళ్ళలోనే వుండేవారు. కొద్దిమంది ఉద్యోగులకు మాత్రం స్వంత ఇళ్ళున్నాయి. రెండు రోజుల తర్వాత మరలా బాందా వెళ్ళి ఇద్దరు ఉద్యోగుల సహకారంతో ఇళ్ళవేటలో పడ్డాను. వికాస్ కాలనీలో మూడు గదుల ఇల్లు మూడు వేల రూపాయలు అద్దెలో లభించింది. ఇల్లు దొరికింది కాబట్టి అలహాబాద్ నుండి సామాను వేసుకుని భార్యాపిల్లలతో బాందా వచ్చేశాను.

ఈరోజే మొదటిసారిగా బాందా ఇంటిలో నుండి ఆఫీసుకు బయలుదేరుతున్నాను. ఇంటి దగ్గర నుండి నడుచుకుంటూ తిందవారీ కూడలి దగ్గరకొచ్చాను. ఆ కూడలికి ఎదురుగా కొంతమంది రిక్షా వాలాలు తమతమ రిక్షాలతో నిలబడి బాడుగలకోసం చూస్తూ వున్నారు. వాళ్ళంతా రిక్షాకావాలా బాబూ అన్న దృష్టితో నావంక చూస్తున్నారు. నేనొక రిక్షా అతన్ని చేతితో సైగ చేసి పిలిచాను. అతను ఇంచుమించు ఏభై ఏళ్ళవాడు. తలంతా తెల్లబడిపోయింది. గడ్డం కూడా తెలుపు నలుపులతో వున్నది. అంతే కాకుండా అస్తవ్యస్తంగా బాగా పెరిగివున్నది. నా సైగ అందుకుని అతను తన రిక్షాతో పాటు నా ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. బాగా అలసిపోయినట్లుగా వున్నాడు. పైగా చాలా బలహీనంగా కూడా వున్నాడు. అతడు తన పరిస్థితులవలన వయసుకు మించి వృద్ధుడిగా కనపడుతున్నాడు. వెంటనే, నేను టైముకు ఆఫీస్‌కు వెళ్ళాలన్న స్పృహ కల్గింది. ఈ రిక్షా అతను చాలా నెమ్మదిగా తొక్కుతాడు. అలా అయితే నేను టైమ్‌లోపల ఆఫీసుకు చేరలేకపోవచ్చు అనుకుని "నువ్వాగు" అన్నాను అతనితో. అతడు నిరాశగా నావంక చూడసాగాడు.

కొంచెం దూరంలో నిలబడ్డ ఒక బలిష్ఠుడైన రిక్షావాలా నావంక తదేక దృష్టితో చూడగం గమనించి అతణ్ణి రమ్మని చెయ్యివూపాను.

నా దగ్గరగా నిలబడ్డ వృద్ధ రిక్షా వాలా తన మిణుకుమిణుకుమనే చూపులతో నన్ను చూస్తూ "కూర్చోండి సార్! నేను కూడా త్వరగానే మిమ్మల్ని ఆఫీసుకు చేరుస్తానన్నాడు."

సరే అని అతని రిక్షాలోనే కూర్చున్నాను. అతను ఎగిరెగిరి రిక్షా తొక్కుతున్నాడు. రిక్షా సీటంతా చిరిగిపోయివున్నది. లోపలవున్న మెత్త అంతా ధ్వంసమైపోయివున్నది. సీటు లోపల వుంచిన కొబ్బరిపీచు బయటకొచ్చి కనపడుతున్నది. రిక్షా పెడలుకూడా విరిగిపోయివున్నది. ఇలాంటి రిక్షా నడపటానికి అతను చాలా శ్రమ పడవలసివస్తున్నది. ఆ రిక్షాలో కూర్చున్ననాకు కూడా చాలా అసౌకర్యంగా వున్నది. రిక్షా

అతను తన మానాన తాను తొక్కుతూనే వున్నాడు. సరిగ్గా పది గంటలకు నన్ను ఆఫీసు ముందు దించాడు.

"బాడుగ ఎంతివ్వాలని" నెమ్మదిగా అడిగాను.

"పది రూపాయలివ్వండి" అని రొప్పుతూ చెప్పాడు.

ఇంత దూరం రిక్షా తొక్కి శ్రమపడ్డాడు కాబట్టి పదిరూపాయల బాడుగ సరి అయిందే అనిపించింది. నేను పది రూపాయలనోటు రిక్షా అతనికి ఇచ్చేశాను.

సాయంకాలం ఐదున్నర గంటలకు ఆఫీసు పనికాగానే బయటికొచ్చాను. ప్రొద్దుటి రిక్షా అతనే ఆఫీసుగేటు దగ్గర నిలబడివున్నాడు.

రండిసార్. మిమ్మల్ని ఇంటి దగ్గర దింపుతానన్నాడు. నేను నిశ్శబ్దంగా రిక్షాలో కూర్చున్నాను. రిక్షా బాబూలాల్ కూడలి నుంచి ముందుకు వెళ్ళగానే "నువ్వు ఎక్కడుంటావు" అని అతణ్ణి అడిగాను.

"బబేరూ దగ్గర ఒక చిన్న గ్రామముంటుంది. ఇది వరకు అక్కడే వుండేవాళ్ళం. కాని గత ఎనిమిది, పది సంవత్సరాల నుండి బాందాలోనే వుంటున్నానని" చెప్పాడు.

"నీ రిక్షా చాలా పాతగా వున్నది. దీన్నెందుకు మార్చుకోగూడదూ" అని అడిగాను.

"నేను గారేజ్ యజమాని దగ్గర నుండి దీన్ని కిరాయికి తెచ్చుకుంటాను. మా యజమాని నాకు మరో మంచి రిక్షా ఇవ్వడు. నీకిది చాలు అంటాడు. ఎందుకంటే నా దగ్గర రోజుకు ముప్పై రూపాయల అద్దె తీసుకుంటాడు. మిగతా మంచి రిక్షాలకు నలభైరూపాయలు వసూలు చేస్తాడు" అని చెప్పాడు.

"నీపేరేంటని" మరొక ప్రశ్న వేశాను.

"రామ్‌లాల్" అంటూ రిక్షా అతను తలతిప్పి నా వంక చూస్తూ చెప్పాడు.

రోజూ నేను రామ్‌లాల్‌రిక్షాలోనే ఆఫీసుకెళ్ళటం తిరిగి ఆఫీసు నుండి ఇంటికి రావటం చేస్తున్నాను. నెమ్మది నెమ్మదిగా రామ్‌లాల్ నాతో బాగా కలసిపోయాడు. నేను కూడా మనస్ఫూర్తిగా అతనితో మాట్లాడుతున్నాను.

ఒక రోజు నేను కూడలి దగ్గరకు వచ్చేసరికి రామ్‌లాల్ అక్కడ లేడు. నేను అతని కోసం చూట్టూరా చూశాను. మిగతా చాలా రిక్షాలు అక్కడే నిలబడివున్నాయి. బహుశా ఏదైనా బాడుగ దొరికితే దింపిరావటానికి వెళ్ళుంటాడని, వాళ్ళను దింపి నాకోసం త్వరగానే వచ్చేస్తాడులే అని అనుకుంటూ అక్కడే రామ్‌లాల్ కోసం ఎదురుచూస్తునుంచున్నాను. పావు తక్కువ పదిగంటలైంది. రామ్‌లాల్ జాడలేదు. నాకు కాస్త టెన్షన్ పెరిగింది. ఆ రోజుకు వేరే రిక్షా మాట్లాడుకుని ఆఫీసుకు బయలుదేరాను. రిక్షాలో కూర్చున్నానే గాని రామ్‌లాల్‌ను గురించే ఆలోచిస్తున్నాను. ఎప్పుడూ అతను నాకోసం ఎదురు చూస్తూ వుంటాడు. అలాంటిది ఇవాళ మొదటిసారి రామ్‌లాల్ కోసం నేను ఎదురు చూడాల్సివచ్చింది. ఆ రోజు పావుగంట

ఆలస్యంగా ఆఫీసులో అడుగుపెట్టాను.

మరుసటి రోజు నేను ఆఫీసుకు వెళ్ళాలని కూడలి దగ్గరకు రాగానే ఎదురుగా రామ్‌లాల్ కనపడ్డాడు. నాకు చెప్పలేనంత సంతోషం వేసింది. వెంటనే అతని దగ్గరకెళ్ళి ఫిర్యాదు చేస్తున్నట్లుగా "నిన్న నువ్వెక్కడ మాయమయిపోయావు? నేను చాలా సేపటివరకు నీకోసం ఎదురుచూశానన్నాను."

"ఆరోగ్యం బాగాలేదుసార్!" అంటూ రామ్‌లాల్ చెప్పలేనంత నీరసంగా మాట్లాడాడు.

"ఇవ్వాళ కూడా నీ ఆరోగ్యం బాగున్నట్లు లేదు. ఎవరైనా డాక్టరుకు చూపిస్తే మంచిదిగదా" అన్నాను.

"మందుల దుకాణానికి వెళ్ళి మందు బిళ్ళలు తెచ్చుకున్నాను. ఒక్కరోజులో జ్వరం తగ్గింది. కాని ప్రొద్దున మరలా జ్వరం వచ్చింది. ఇప్పుడు కొంచెం ఫర్వాలేదు" అని రామ్‌లాల్ వగరుస్తూ చెప్పాడు.

"ఇప్పుడు కూడా చాలా సుస్తీగా వున్నావు. ఇంత అనారోగ్యం పెట్టుకుని రిక్షా ఎలా తొక్కుదామని వచ్చావు? వెళ్ళు. వెళ్లి విశ్రాంతి తీసుకో అన్నాను" గట్టిగా.

కొంచెంసేపు తటపటాయిస్తూ రామ్‌లాల్ నావంక చూడసాగాడు. "మీరుచెప్పిన మాట మంచిదే. కాని ఒకటి రెండు బాడుగలున్నా వెయ్యాలి. డబ్బులవసరం వుంది." అంటూ నెమ్మదిగా చెప్పుకొచ్చాడు.

"నువ్విలా వుండి రిక్షా తొక్కలేవు. సొంతం మూలపడతావు. వెంటనే ఎవరైనా డాక్టరు దగ్గరకెళ్ళిచూపించుకో" అంటూ నా జేబులో నుంచి ఒక ఏభై రూపాయల నోటు తీసి అతనికి ఇవ్వబోయాను. "నావంక చూస్తూ నిలబడ్డాడు కాని ఆ నోటు తీసుకోలా. నేనే మరలా అన్నాను" నువ్వీ ఏభై రూపాయల్ని అప్పుగానే తీసుకో. నీకు పూర్తిగా తగ్గిర తర్వాత ఇద్దువు గాని" అని.

రామ్‌లాల్ చాలా సంకోచిస్తూ నోటు తీసుకున్నాడు. "నాకు తగ్గగానే వెంటనే మీ బాకీ తీరుస్తానని" చెప్పి రామ్‌లాల్ తన రిక్షా తీసుకొని వెళ్ళిపోయాడు.

ఆ రోజు నేను వేరే రిక్షాలో ఆఫీసుకెళ్ళాను. మరుసటి రోజూ రామ్‌లాల్ రాలేదు. అతనికి పూర్తిగా తగ్గి వుండదనుకున్నాను. జులై నెల అయినా ఎండ వేడికి జనం బెంబేలెత్తుతున్నారు. ఒంటికి పట్టిన చెమట త్వరగా ఆరటమేలేదు. అప్పుడప్పుడూ మేఘాలు కమ్మినప్పుడు మాత్రం వాతావరణం ఆహ్లాదమనిపిస్తుంది. కాని ఆ తర్వాత సూర్యుడు నిప్పులే చెరుగుతున్నాడు.

ఎప్పటిలాగానే ఆ ఉదయమూ కూడలికి చేరుకున్నాను. రామ్‌లాల్ తన మురికిపట్టిన కండువాతో మెడకు పట్టిన చెమటను తుడుచుకుంటూ కనపడ్డాడు. ఇప్పుడతడు ఆరోగ్యంగానే కనపడుతున్నాడు. అయినా "నీ ఆరోగ్యం బాగానేవుందిగా" అని నవ్వుతూ పలుకరించాను.

"బాగుంది సార్. కూర్చోండి అంటూ" తన రిక్షా వైపుకు చేయిచూపించాడు. నేను వెంటనే రిక్షాలో కూర్చున్నాను.రామ్‌లాల్ ఎప్పటిలాగే ఎగిరెగిరి రిక్షా తొక్కసాగాడు. ఆఫీసుకు చేరగానే ఎప్పట్లాగే బాడుగ పది రూపాయలు ఇవ్వబోగా రామ్‌లాల్ తిరస్కరించాడు. ఎందుకన్నట్లుగా అతని వంక చూశాను. "సార్! మీ దగ్గర తీసుకున్న అప్పు నేను తీర్చాల్సివున్నది. ఈ విధంగా అయితే రెండు మూడు రోజుల్లో అప్పు తీర్చేయగలను." అని రామ్‌లాల్ సంకోచిస్తూనే చెప్పాడు.

నాకర్థమయింది. అయినా ఆ మాటల్ని లెక్కచేయకుండా "అరే! ఇప్పుడు దానికంత తొందరేముంది? తర్వాతెప్పుడయినా నిదానంగా తీర్చొచ్చు. ఈ పూటకు బాడుగ తీసుకో" అన్నాను.

"కాదు సార్! అప్పెంత త్వరగా తీరిస్తే అంత మంచిది. అప్పు తీరేంత వరకూ మీ దగ్గర బాడుగ తీసుకోను. నాకిపుడు వంట్లో బాగానేవుంది. ఈ రోజంతా రిక్షా తొక్కుతాను. ఇబ్బందేంవుండదు." అని చెప్తూ రామ్‌లాల్ తన రిక్షాను తీసుకుని వెళ్ళిపోయాడు.

చేసేదేం లేక నేను పది రూపాయలనోటు జేబులో పెట్టుకున్నాను. మూడవ రోజు కూడా వచ్చింది గడిచిన రెండు రోజులూ ఆఫీసు దగ్గరకు తీసుకొచ్చినా మరలా ఇంటికి తీసుకెళ్ళినందుకు కూడా రామ్‌లాల్ బాడుగ తీసుకోలా. ఈ రోజు రాగానే, నేను కూడలి దగ్గర రామ్‌లాల్ కోసం వెదికాను. రోడ్డు వారగా ఒక కొత్త రిక్షా పెట్టుకుని రామ్‌లాల్ నిలబడివున్నాడు. నన్ను చూడగానే రామ్‌లాల్ రిక్షా తీసుకుని నా దగ్గరకొచ్చాడు. నాకాశ్చర్యం కలిగింది.

"ఏంటి విషయం? ఇవ్వాళ ఒక్కసారిగా కొత్త రిక్షా తీసుకుని వచ్చావు?" అనడిగాను.

"అవును సార్. ఈ రకం రిక్షాలు ఆరు మొన్నే నాగపూర్ నుండి వచ్చాయి. గారేజ్ యజమానిని నా క్కూడా ఒక రిక్షా ఇవ్వమని ఎంతో బతిమాలుకున్నాను. ముందాయన అస్సలు ఒప్పుకోలా. కాని నేను మొండిపట్టుపట్టాను. చివరికాయన ఒప్పుకొని ఈ రిక్షాకయితే రోజుకు నలభై రూపాయల బాడుగ ఇవ్వాల్సి వుంటుందని చెప్పాడు. సరేనని ఒప్పుకుని ఈ రిక్షా తెచ్చుకున్నానని" పసిపిల్లల్లాగా ఎంతో సంబరపడిపోతూ చెప్పాడు.

రిక్షా పూర్తిగా కొత్తది. మామూలు రిక్షాల కంటే కొంత ఎత్తుగానూ వున్నది. రిక్షా సీటును వత్తి చూశాను. సీటులోపల మందంగా వుండి విశ్రాంతిగా కూర్చోవటానికి వీలుగావున్నది. రిక్షాను పరీక్షించి సంతృప్తిపడ్డాను. ఆ తర్వాత రిక్షా ఎక్కి కూర్చున్నాను.

"దీని వెడల్పు కూడా చాలా పెద్దదిగానే వుంది సార్. అలా వున్నందువలన మీకు ఎండకూడా పడదు సార్" అంటూ రామ్‌లాల్ రిక్షా పై కప్పువంక చూపిస్తూ అన్నాడు.

ఎండ పెరిగింది. రామ్‌లాల్ నిశ్శబ్దంగా రిక్షాతొక్కుతున్నాడు. అతని చొక్కా అంతా చెమటతో తడిసి ముద్దయింది. రిక్షా ఓవర్ బ్రిడ్జ్ మీదకొచ్చింది. ఓవర్ బ్రిడ్జ్ మీద ఎక్కేటప్పుడు మెరక ఎక్కాల్సివుంటుంది అందువలన రామ్‌లాల్ రిక్షా దిగి తాను నడుస్తూ రిక్షాను లాగుతూ ముందుకు సాగుతున్నాడు.

“రిక్షా ఆపు రామ్‌లాల్. నేనూ కిందికి దిగితే నీకు తేలిగ్గా వుంటుంది. మెరక దాటగానే రిక్షా ఎక్కుతానులే” అన్నాను.

“మీరు రిక్షాలోనే కూర్చోండి సార్. నేను రిక్షా లాగ్గలను” అంటూ చెప్పాడు.

ఆఫీసు గేటు రాగానే రిక్షా ఆపాడు. అతడు మాత్రం చెమటతో తడిసి ముద్దయ్యాడు. తన మురికి పట్టినకండువాతో చెమటలు తుడుచుకుంటూ “ఈ రిక్షాలో కూచుంటే ఎలా వుంది సార్? మీకు హాయిగా అనిపించిందా?” అని అడిగాడు ఉత్సాహంగా.

“ఈ రిక్షాలో  బాగా వీలుగా, హాయిగానే వుంది. నాకు బాగా నచ్చిందన్నాను” మనస్ఫూర్తిగా.

రామ్‌లాల్ ముఖం నామాటలకు సంతోషంతో వెలిగిపోయింది. పది రూపాయల నోటు తీసి ఇస్తూ ఈ రోజు నువ్వు తప్పకుండా బాడుగ తీసుకోవాల్సిందే” అన్నాను.

“లేదు. సార్ ఈ పది రూపాయలతో మీ బాకీ పూర్తిగా చెల్లిపోతుంది. అందుకని ఈ పూట కూడా డబ్బులు తీసుకో”న్నాడు.

అతని మాటలు నాకంత రుచించలా. నా దగ్గర బాడుగ తీసుకోకుంటే అతను తన రిక్షా కిరాయికి సరిపోను ఎలా సమకూర్చుకుంటాడు? అని ఆలోచించి. “ఏం ఫర్వాలేదు. నీ బాకీ తీరిపోయిందే అనుకో, అదేమంత పెద్ద విషయం కాదు”. అన్నాను.

“అదేంటి సార్? ఇంకా పదిరూపాయల బాకీ వుందిగా. సాయంత్రం నుంచి తీసుకుంటాలే” అంటూ తన రిక్షాతో పాటు ముందుకెళ్ళాడు.

నేను నిశ్చేష్టుడనయ్యాను. రామ్‌లాల్ బాడుగ వద్దని, నేనేమో ఇవ్వాలనే ప్రయత్నం చేస్తున్నాన. ఆఫీసు ఎదుట మిగతా రిక్షా వాళ్ళు వున్నారు. టీ, కిళ్ళీలు అమ్మేవాళ్ళు అందరూ మా ఇద్దరి సంభాషణ ఆసక్తిగా వింటున్నారు.

“మొండిపట్టుపట్టకు. ఈ రిక్షాకొత్తది. దీనికెక్కువ కిరాయి చెల్లించాలి. తీసుకో. ఏం ఫర్లేదు” అని నేను చాలా నెమ్మదిగా, లోగొంతుకతో చెప్పాను.

“అయితే ఏమవుతుంది సార్? కొత్త రిక్షా కాబట్టి నా బాడుగ కొంచెం ఎక్కువే తీసుకుంటాను. అందరూ ఎంత తీసుకుంటారో నేనూ ఇక నుంచి అంతే తీసుకుంటాను” అంటూ పెద్ద వేదాంతి మాట్లాడాడు. అలా నా ఆఖరి తర్కం కూడా రామ్‌లాల్ ముందు వ్యర్థమయిపోయింది.

సరే నీ ఇష్టం అంటూ పది రూపాయలు నా జేబులో పెట్టేసుకున్నాను. రామ్‌లాల్ తనరిక్షాతో సహా తన దారిన వెళ్ళిపోయాడు. నేను ఆఫీసులోపలికి నడవసాగాను. మెయిన్‌గేటు నుండి ఆఫీసు ద్వారం చేరుకునే లోపు అకస్మాత్తుగా నా మనసులో ఒక ఆలోచన తళుక్కుమన్నది. “ఎవరి ఆత్మాభిమానం వారికుంటుంది. అది దెబ్బకొట్టటానికి నాకే అధికారంవున్నది” అనుకున్నాను.

## ప్రసిద్ధ రష్యన్ సాహిత్యకారుడు మాక్సిమ్‌గోర్కీ

జీవన రేఖలు : మాక్సిమ్ గోర్కీ **1868**లో జన్మించారు. వీరు నాటకం, కవిత, వ్యాసాలు, కథలు మొదలగు అన్ని సాహిత్య ప్రక్రియల్లోను ఉత్తమ సాహిత్యాన్ని వెలువరించారు. పందొమ్మిదవ శతాబ్దం చివర్లో రష్యా జీవనశైలిని వర్ణిస్తూ విస్తృతంగా కథలు వ్రాశారు.

నవలారచన : మాక్సిమ్ గోర్కీ వ్రాసిన "అమ్మ" నవల పేరెరుగని పాఠకుడుండడంటే అతిశయోక్తి కాదేమో. ఈ నవల దాదాపు అన్ని ప్రపంచ భాషల్లోనూ అనువదింపబడింది. కేవలం పది పదిహేను అనువాదాలు భారతీయ భాషల్లోనే జరిగినవని చెప్తున్నారు. అందువలనే భారతీయులందరికీ గోర్కీ చాలా ప్రియపరిచితులు.

వీరి ఆత్మకథలతో నిండిన "నా బాల్యం", "నా జీవన మార్గం", "నా విశ్వవిద్యాలయం" అను నవలలు చాలా ప్రసిద్ధి పొందినవి. అటు కథా రచనలోనూ, ఇటు నవలారచనలోను సుప్రసిద్ధ ప్రపంచ, రచనాకారులుగా గణుతికెక్కారు.

"యూరోప్‌లో గోర్కీ మహారచయిత. ఆయన లాగా ప్రజల అధికారాలను గురించి తన రచనలలో విస్తృతంగా వివరించిన వారుమరొకరు లేరని" మహాత్మాగాంధీ కొనియాడారు.

"గోర్కీ కి దేశ, కాల, భాషా బేధాలు లేవు. ప్రపంచ ప్రజలందరి కోసం, ప్రజలందరి లాభం కోసం పాటుపడిన రచయితని" శ్రీ ప్రేమ్‌చంద్ ప్రశంసించారు.

"రాబోయే తరాల రచయితల కోసం ఎంతో సామాగ్రిని, క్రాంతికార భావాల శిక్షణను గోర్కీ అందించి వెళ్ళారని రష్యన్ సాహిత్యకారులు అభిప్రాయపడ్డారు." ఇలా అందరి మన్ననలు పొందిన గోర్కీ **1936**వ సంవత్సరంలో మరణించారు.

మాక్సిమ్ గోర్కీ వ్రాసిన ప్రసిద్ధ కథలనెన్నుకుని "గోర్కీ కీ లోకప్రియ కహానియాం" అన్న పేరుతో రాధాకృష్ణ పేపర్ బాక్స్ వారు ప్రచురించారు. "శ్రీ ఫణీశ్ సింహ్" ఈ సంకలనాన్ని చేశారు. ఈ సంకలనంలో "బాజీ కా గీత్, తుఫాన్ కా అగ్రదూత్, ఏక్ పాఠక్" మొదలుగునవివున్నవి.

శ్రీ ఫణీశ్ సింహ్ ఆగస్టు **15, 1941**లో జన్మించారు. శ్రీ ఫణీశ్ సింహ్ పి.హెచ్.డి. పూర్తిచేసిన ఉన్నత విద్యావంతులు. విభిన్న పత్రికలలో వీరి రచనలు ప్రచురింపబడినవి. విశ్వశాంతి పరిషత్ వారి ప్రతినిధిగా మాస్కో నుండి చైనా వరకు ప్రపంచ దేశాలనెన్నింటినో దర్శించి తన వాణిని వినిపించారు.

ప్రస్తుత కథ 'మకర ఘుద్రక్' **1892**లో వ్రాయబడింది. ఇది గోర్కీ వ్రాసిన అద్భుత కథగా పేరుగాంచింది. స్వతంత్రంగానే జీవించాలి అనే ఉద్దేశ్యం కలిగివున్న యువకుడు "లోయికో జోబార్" అందమైన యువతి "రాద్దా". వీరిద్దరి మార్మిక ప్రేమకథను గోర్కీకి ఒక వృద్ధజిప్సీ వివరిస్తాడు. ఒకరిపట్ల ఒకరికి ప్రేమవున్నప్పటికీ స్వాతంత్ర్యం కోల్పోకూడదనే భావంతోనే తన జీవితాలను అంతం చేసికోవటాన్ని గోర్కీ ఈ కథలో వర్ణించారు.

స్వాతంత్ర్య స్వరాన్ని వినిపించటం కోసం, రష్యాలోని విద్రోహ ఆత్మల్ని చిన్నాభిన్నం చేయటం కోసం వ్రాసిన ఈ కథ ఎంతోమంది హృదయాలలో చెరగని ముద్ర వేసి గోర్కీకి చాలా పేరు తెచ్చిపెట్టింది.

# మకరచుద్రక్

శీతాకాలపు గాలి దూరంగా సముద్రపుటొడ్డుమీద విరిగి పడే అలలయొక్క నీరస మర్మర ధ్వనిని ఆ విశాల మైదానంలోకి మోసుకుని వచ్చి ఎడాపెడా వీచ సాగింది. దాంతోపాటు గాలికి వాడి ఎండిన ఆకులనూ తనతోపాటు తీసుకునివచ్చి గుడారం దగ్గర మండుతున్న నిప్పులోకి విసరసాగింది. అలా ఆకులు పడ్డప్పుడల్లా మంట మరింత పెరుగుతున్నది. నాల్గువైపులా వ్యాపించిన అంధకారం, వణుకుపుట్టిస్తుంది. కొద్దిగా పడే వెలుతురులో దక్షిణదిశగా క్షితిజ రేఖ వరకు పరుచుకున్న మైదానం. ఆ మైదానానికి కుడివైపున ఎల్లలు కనపడని సముద్రం మధ్యలో మనకు కనపడే నిర్జనత్వాన్నీ కోరుకోదగినదిగా భావింపచేస్తున్నది.

మండే మంట ఎదురుగా కూర్చున్న ముసలి జిప్సీ 'మకర ఛుద్రక్' ముఖం కూడా ప్రకాశవంతంగా మెరుస్తూ మనకు కనపడుతుంది. అతనికి గుడారపు వెంట వచ్చే గుఱ్ఱాలను సంరక్షించే బాధ్యత అప్పగించబడింది. కాని ఆ వృద్ధ జిప్సీ ధ్యాస చలికి కొంకర్లు పోయే వాతావరణం పైన లేనేలేదు. అతని వంటి మీద మతగురువులు ధరించే అంగీలాంటి పొడవాటి చొక్కావున్నది. అతని ఒళ్ళంతా దట్టమైన వెంట్రుకలున్నాయి. ఆ వెంట్రుకల క్రింద ఛాతీని, పైన వేసుకున్న చొక్కానుకూడా గాలి తీవ్రంగా ఊపేస్తున్నది.

ఆ జిప్సీ నాతో కాకుండా ఏవో పాత జ్ఞాపకాలతో కొట్టుకుపోతున్నాడు. బంధించి వుంచిన ప్రవాహపు, కట్టలు తెగినట్లుగా వుంది అతని పరిస్థితి.

"నీవూ మా ప్రజల మధ్య చేరిపోయావు. చాలా మంచి పనిచేశావు. ఏదైతే మన అదృష్టంలో వ్రాసివున్నదో అదే జరుగుతుంది. అయినా మనకేం కావాలి? ఈ ప్రపంచంలో మనం కళ్ళు తెరుస్తాం." ప్రపంచమంతా చుట్టేయాలి. ఆపని అయింతర్వాత విశ్రాంతిగా పడుకోవాలి. చివర్లో హాయిగా చనిపోవాలి. చాలు. ఇంతకంటే ఏం అక్కర్లేదు. కాని మనుష్యుడు తమాషా వ్యక్తి. అతడు తన బలిష్ఠ భుజాలతో విశాలమైన మైదానాన్ని ఆక్రమించాలనుకుంటాడు. ప్రపంచంలో ఇంత భూభాగంవున్నది. అయినా కూడా ఏ కొద్ది భూభాగం కోసమో చావటానికి, చంపుకోవటానికి సిద్ధపడతారు. ఎందుకంత వ్యామోహమో తెలియదు. నువ్వు స్వయంగా వెళ్ళి నాగలి పట్టి భూమిని దున్నే రైతును చూడు. మొదట అతడు ఆ భూమి కోసం ఎంతో శ్రమించి చివరకు ఆ పొలంలోనే భూస్థాపితం అయిపోతాడు. చివరికతని అవశేషాలు కూడా లభించవు. అతడు తన చెమటను చిందించి సంపాదించిన సంపదనే తాననుభవించలేని మూర్ఖుడవుతాడు. ఎప్పుడైనా అతను స్వాతంత్ర్యాననుభవించాడా? ఈ విశాలమైన మైదానాన్ని గుర్తించాడా? సముద్రపు మర్మరధ్వనినెపుడైనా ఆలకించాడా? సర్వాంగ సుందరమైన ప్రకృతిని చూసి పులకించాడా? ఊహు. పుడుతూనే బానిసగా పుట్టి, బానిసగానే అంతమవుతాడు. ఆ బానిసత్వపు పట్టా తొలగించుకోవాలని ఎప్పుడూ ఆలోచించుకోడు. నన్ను చూడు. నా ఈ పండిన కేశాలు ఏభై వసంతాలు చూశాయి. నీవు నా జీవిత కథ వ్రాసేందుకు కూర్చుంటే పుస్తకపు రంగే మారిపోతుంది. అయినా ఇంకా మిగిలే వుంటుంది. నేను చూడని పట్టణం పేరేదైనా నీవు చెప్పగలవా? నేను చూసిన పట్టణాల పేర్లైనా నీవు వినివుండవు. మా

సిద్ధాంతం ఏమిటో తెలుసా? ఎల్లప్పుడూ ప్రపంచాన్ని చూస్తూ వుండు. ఒకచోటి నుండి మరో చోటికి తిరుగుతూ వుండు. ప్రతిచోటా కొంచెం సేపు ఆగు చాలు. రాత్రింబగళ్ళు ఎలా ఒక దాని వెంట ఒకటి తిరుగుతూ వుంటాయో అదే విధంగా నీవూ నిరంతర ప్రయాణం చెయ్యి. జీవితాన్ని గురించి కొంచెం కూడా ఆలోచించవద్దు. అలా ఆలోచించి బుర్రను ఖరాబు చేసుకోవద్దు. నా సలహా ఏంటంటే నీవు నీ జీవితాన్ని గురించి ఎంత ఆలోచిస్తావో అంతే అసహ్యించుకుంటావు. ఇదినాకు బాగా తెలుసు. నేను ఎంతో జీవితాన్ని అనుభవించి, తెలుసుకుని నీకు చెప్తున్నాను." అన్నాడు.

నాలో ఆలోచనలు మొదలయ్యాయి. "నేను జైలులో వున్నాను. అక్కడంతా ఖాళీగా వుండేవాణ్ణి. ఈ ప్రపంచంలో నేను ఎందుకు పుట్టాను అన్న ఆలోచనల్ని కేవలం సమయం గడపటానికి మాత్రమే నన్ను నేను ప్రశ్నించుకున్నాను. అప్పుడు ఈ విషయాన్ని ఆలోచిస్తుంటే నా మనసు చాలా భారంగా మారిపోయింది. మనం ప్రపంచంలో ఎందుకోసం వుంటున్నాం? మన లక్ష్యమేమిటో తెలియదు. అలా ఆలోచించటమూ వ్యర్థమే. తన జీవితం పట్ల పూర్తి ధ్యాసపెడుతూ భ్రమణం చెయ్యి. నాల్గువైపులా కళ్ళు విప్పార్చిచూడు. మన దగ్గర లేని దానిని పొందాలన్న కోర్కె ఎలాంటిదో అది అంతా నేననుభవించాను" అని ఆ జిప్సీతో చెప్పాను.

"ఓహ్! నేనూ ఒకసారి ఒక రష్యన్‌తో మాట్లాడాను. అతనూ నీలాగే బలంగావున్నాడు. అతనేమన్నాడో చెపుతాను విను.." నీ జీవితం నీ ఇష్టానుసారంకాదు ఈశ్వరేచ్ఛ ఎలాగుంటే అలా జీవించటమే నీకర్తవ్యం. నీకు ఏదైనా కావాలంటే ఈశ్వరుణ్ణి ప్రార్థించు. ఆయన అనుగ్రహిస్తాడు. ఆయన పాదాల చెంతే నిన్ను నీవు అర్పించుకో" అన్నాడు. నేనేమన్నానో తెలుసా "నీ ఒంటి మీద బట్టలు చిరిగి జీరందాలైనాయి. చూడటానికి అసహ్యంగా వేలాడుతూ కన్పడుతున్నాయి. నువ్వు దేముణ్ణి ప్రార్థించి మంచి బట్టలు ఎందుకు పొందవు? అని.

దీనికై అతను నామీద కోపగించి నానా తిట్లు తిట్టసాగాడు. అంతకుముందే అతను, క్షమ, ప్రేమలగురించి మాట్లాడాడు. కాని నా మాటలు అతని అహంకారాన్ని దెబ్బతీశాయనుకున్నాడు. నన్ను క్షమించనూ లేక తన దారిన తాను పొయ్యాడు. ఇలాంటి శిక్షకులూ వుంటారు. వీరెలాంటి వారంటే నీవు కొంచెమే తిను అంటూ తను మాత్రం రోజుకు పదిసార్లు తినేవాళ్ళు" అంటూ ఆగాడు. మంటవంక చూస్తూ నిశ్శబ్దంగా అయిపోయాడు. తనపైపులో పొగాకు నింపుకోసాగాడు.

గాలివేగం శాంతించి నిశ్శబ్దంగా వున్నది. గుఱ్ఱాలు చీకట్లో సకిలిస్తూ వున్నాయి. గుడారానికి ఏభై అడుగుల దూరంలోనే మేము కూర్చునివున్నాం. ఇంతలో మాకు కరుణాపూరితమైన పాటొకటి విన్పించింది. ఆ గొంతు మకరఛుద్రక్ కూతురిది. ఆమె అందమైన యువతి. ఇంకా అందంగా పాటపాడుతున్నది. ఆమె పాట చాలా కోమలంగా వుండి మనసుకు హత్తుకునేటట్లు వున్నది. తీరని కొరతేదో అనుభవిస్తున్నట్లుగా, వ్యధాభరితంగా కన్పడుతూ వుంటుంది. ఇప్పుడు తన హృదయావేదన తగ్గించుకోవటానికే ఆ పాటపాడుతున్నది. అభిమాన ధనంతో తొణికిసలాడుతూ తన అందంతో మిసమిసలాడుతూ చూడటానికి

ఆమె ఎవరో రాణీలాగుంటుంది. కాని ఆమెలోతైన కళ్ళలో ఎప్పుడూ వేదనాగ్నేజ్వలిస్తూ వుంటుంది. స్వచ్ఛమైన పోకడలూ వుంటాయి. ఆమె తన అనుపమ సౌందర్యాకర్షణతో నాకు బాగా పరిచితురాలయ్యింది. కాని దురదృష్టమేమిటంటే ఆమె మనసులో ప్రజలపట్ల అసహ్యమే వున్నదికాని అందమైన భావాలు లేవు.

"తీసుకో. ఈ పొగాకు పీల్చు" అన్నాడు వృద్ధ జిప్సీ.

"ఈ బాలిక చాలా బాగా పాడుతుంది. వినసొంపుగా వుండి మనసుకెంతో హాయిగా వున్నదన్నాను."

"మంచిది. ఈ బాలికతో సమానమైన అందం కలిగినామె ఎవరైనా నిన్ను ప్రేమిస్తే ఆమెను నువ్విష్టపడతావా?" అనడిగాడు.

"లేదు. లేదు", అన్నాను.

"మంచిది. నీవైతే మనసిస్తావు. కాని స్త్రీలపట్ల ఎప్పుడూ అతిగా నమ్మకం పెట్టుకోవద్దు. వారికెంత దూరంగా వుంటే అంతమంచిది. పొగాకు పీల్చటం కంటే ఎవరైనా అమ్మాయిని ముద్దాడటం చాలా బాగుంటుంది. కాని ఎప్పుడైనా ఒకసారి ఎవరైనా స్త్రీ పెదవుల్ని నీవు ముద్దాడితే నీ స్వాతంత్ర్యాన్ని ఆమె లాగేసుకుంటుంది. నిన్ను తన ప్రేమ పాశంలో బంధించి వేస్తుంది. అదేదీ నీకు కనపడను కూడా కనపడదు. దాన్నుంచి నీవెప్పుడూ విముక్తుడవు కూడా కాలేవు. నీవు పిచ్చివాడిలా నీ ఆత్మను కూడా ఆమెకు అర్పించాలనుకుంటావు. కాని దానికి బదులుగా నీకు లభించేది ఏమీ వుండదు. నా యీ సలహా నువ్వెప్పుడూ మర్చిపోవద్దు. స్త్రీలపట్ల చాలా జాగ్రత్తగా వుండాలి. వాళ్ళు నాగినులవంటివారు. అచ్చం నాగినులే. నేనీ ప్రపంచంలో అందరికంటే నిన్నే ఎక్కువ ప్రేమిస్తున్నానని చెప్తారు. ఆ మాటలు నమ్మి నీవామె వేలు పట్టుకోవటానికి సిద్ధపడితే ఆమె నీకాలు తీసేయటానికి సిద్ధంగా వుంటుంది. ఇది నాకు బాగా తెలుసు.తెలియటం కాదు. ఇలా జరగటం నేనెరుగుదును. ఇంకా నీవు వినదలుచుకుంటే నీకొక కథ వినిపిస్తాను. ఎందుకంటే నేను చెప్పే మాటలు నీ మనసులో బలంగా నాటుకోవాలి. జాగ్రత్తగా వుండు. ఎవరి ఉచ్చులోనూ పడవద్దు. ఎప్పుడూ పక్షిలాగా స్వేచ్ఛగా వుండు." అంటూ ఒక నిట్టూర్పు విడిచాడు.

చాలా రోజులకిందటి సంగతి. ఒక జిప్సీయువకుడుండేవాడు. అతని పేరు జోబర్. హంగరీ, బొహేమియా, స్లావోనియా ఇలా సముద్రపుటొడ్డునున్న చాలా దేశాలు తిరిగివచ్చాడు. చాలా పరాక్రమం కలిగిన వీరుడతడు. చుట్టుపక్కల గ్రామాలలోని డజను మందికి పైగా యువకులు, జోబర్‌ను ఓడిస్తామని, లేదా చంపేస్తామని ప్రతిజ్ఞలు చేశారు. కానీ అతన్నెవరూ ఏమీ చెయ్యలేకపొయ్యారు. అతనికే గుర్రం నచ్చితే ఆ గుఱ్ఱాన్ని తీసుకుని ప్రయాణిస్తూ వుండేవాడు. ఒక సైనిక పటాలమే అతడి రాకపోకల్ని గమనించాల్సి వచ్చేది. జోబర్‌కు మనిషి భయమూలేదు, దేవుడి భయమూ లేదు. ఒకవేళ సైతాన్ అయినా తన సైన్యాన్ని తీసుకుని అతన్ని ఎదుర్కోవటానికి వచ్చినా అందరి ప్రాణాలు తీసేయగల సమర్థుడు. సైతాన్ని కూడాతన బలిష్ఠమైన చేతుల్తో చెంపదెబ్బలు కొడతాడని మేమందరం అనుకునేవాళ్ళం.

జిప్సీల దళాలన్నీ అతనికి పరిచయమే. అందరూ ఇతని పేరువినేవుంటారు.అతనికి గుఱ్ఱాలన్నా, గుఱ్ఱపుస్వారన్నా చాలా ఇష్టం. రెండు గడియల పాటు ఏ గుఱ్ఱం పై స్వారీ చేస్తే ఆ గుఱ్ఱం మంత్రించినట్లుగా అతనికి వశపడిపోతుంది. తీసుకెళ్ళిన గుఱ్ఱాన్ని అమ్మివేసుకున్నా ఆ డబ్బును గురించి కూడా ఎవరూ అతన్ని ప్రశ్నించే సాహసం చెయ్యరు. అతని దగ్గరున్న ఏ వస్తువునైనా ఇతరులకు తేలిగ్గా ఇచ్చేశేవాడు. ఒకవేళ నువ్వు అతని హృదయాన్ని అడిగినా అతడు తన చర్మాన్ని కోసి తన హృదయాన్ని నీ చేతుల్లో పెట్టేస్తాడు. కేవలం ఇలాంటి వాటి వల్లే, ఈ సంతోషాల కోసమే అతడు ఇతరుల్ని గౌరవిస్తాడు.

మా దళం అప్పుడు బుకోనియాలో వున్నది. ఇది జరిగి పదేళ్ళయింది. కాని నాకు అది నిన్నే జరిగినట్లుగా వున్నది. అది వసంత ఋతువు. మా సైనికదళం ఒక చోట గుడారం వేసుకున్నాం. ఆ దళంలో సిపాయి “దానిలా”, వృద్ధుడైన “నూర్” కూడా వున్నాడు. మరికొంత మందీ వున్నారు. వారితో పాటు దానిలా కూతురు “రాద్దా” కూడా వున్నది.

“నీవు నాన్‌కాను చూశావు. ఆమె ఒక రాణీ లాగా వుంటుందంటున్నావు. కాని రాద్దాను ఆమెతో పోల్చలేం. ఎందుకంటే నాన్‌కా, రాద్దాయొక్క పాద ధూళితో కూడా సమానం కాదు. రాద్దా అందం మాటల్లో చెప్పలేం. మల్లెపూవుతో పోల్చుకోవచ్చు. ఆ మల్లెపూవు యొక్క ఆత్మతో పరిచయం చేసుకోగలిగిన వాడొక్కడే వుండేవాడు.”

ఎంతోమంది యువకులు రాద్దా వెంటబడి మనసు పారేసుకున్నారు. ఒకసారి ఒక ధనవంతుడి దృష్టికూడా ఆమె మీద పడింది. అతడు కూడా ఆమెను చూస్తూ నిలబడిపోయాడు. కాని అతని శరీరానికి పక్షవాతం వచ్చినట్లుగా మెలికలు తిరిగిపోయాడు. గుఱ్ఱమెక్కి కూర్చున్నాడు. జ్వరతీవ్రతలో వణికినట్లుగా వణికిపోయాడు. ఆ ధనికుడు కూడా చెప్పలేనంత అందంగా వున్నాడు. అతని దుస్తుల మీద అంతటా జరీ పని చేసివున్నది. గుఱ్ఱం కాలిగిట్టలు లేపినప్పుడల్లా అతని దుస్తులు విద్యుత్ కాంతివలె మెరుపులీనుతున్నాయి. తలపై నున్న నీలిరంగు టోపీ మీద వజ్రాలు తాపడం చేయబడివున్నాయి. రాద్దా వైపు చూస్తూ వుండిపోయినతను తెప్పరిల్లి“నీవు నన్ను ప్రేమించు. దానికి బదులుగా సంచి నిండుగా ధనాన్నిస్తాను” అన్నాడు.

రాద్దా దానికి బదులుగా ముఖం తిప్పుకున్నది. “క్షమించండి. నాపై కోపం వస్తే మన్నించండి. కోపం లేకపోతే ఒక చిన్న చిరునవ్వు నవ్వండి” అంటూ ప్రాధేయపూర్వకంగా చూస్తూ నిలబడింది రాద్దా.

రూపాయిలతో నిండిన సంచి నొకదానిని ఆమె కాళ్ళ దగ్గరగా విసిరాడతను. కాని రాద్దా ఏం చేసిందో తెలుసా? వెంటనే ఆ సంచిని కాలితో తన్నేసింది. అది చూసిన ధనికుడు“నువ్వేరకం ఆడదానవంటూ తుకతుకా ఉడికిపోయాడు. చాలా విసురుగా, కోపంగా గుఱ్ఱానొక్క తన్నుతన్నాడు. ముందుకు దూకించాడు. ఆ గుఱ్ఱం వెనుక లేచిన దుమ్ము మేఘంలా కమ్ముకున్నది.

మరుసటి రోజు అతను మరలా వచ్చాడు. “ఈ పిల్ల తండ్రి ఎవరు?” అనడిగాడు. అతని గొంతు గుడారమంతా ప్రతిధ్వనించింది. ఆ మాటతో ‘రాద్దా’ తండ్రి “దానిలా” బయటికొచ్చాడు.

“నువ్వీ పిల్లను నాకమ్మేయ్. దానికి బదులుగా నీకెంత కావాలంటే అంతా తీసుకో” అన్నాడు దర్పంగా.

“ఇలాంటి పద్ధతులు మీలాంటి ధనవంతుల ఇళ్ళల్లో వుంటాయేమో, వాళ్ళు ఏ వస్తువునైనా అమ్ముకుంటారేమో? సాధారణ వస్తువుల దగ్గర్నుంచీ ఆత్మల వరకూ దేన్నైనా అమ్ముకుంటారేమో నాకు తెలియదు. నేను సైన్యంలో పనిచేస్తున్నాను. దేశం కోసం యుద్ధం చేస్తున్నాను. ఏ వస్తువునూ అమ్ముకోలేను.” అన్నాడు.

ఆ ధనికుడు కోపంగా ఎఱ్ఱగా కందగడ్డలాగా తన ముఖాన్ని పెట్టుకున్నాడు. ఉద్రేకంగా చేతిలోని హంటర్‌ను ఛెళ్ళుమనిపించాడు. ఈలోగా మేం గుఱ్ఱపు చెవి దగ్గర అగ్గిపుల్ల వెలిగించాం. దాంతో ఆ గుఱ్ఱం బెదిరి యజమానితో సహా అక్కణ్ణుంచి మాయమైంది.

మేమంతా మా పనులమీద ఇంకాస్త ముందుకెళ్ళే ప్రయాణం చేస్తున్నాం. రెండు రోజులు గడిచాయి. కాని అతను మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాడు.

“వినండి. అంటూ అరిచి చెప్పసాగాడు. నా మనసులో ఏ కల్మషమూలేదు. నాకీ పిల్లతో పెళ్ళి చేయించండి. నేను గూడా మీతో పాటే వుంటాను. నా దగ్గర చాలా డబ్బుంది. ఏ ఇబ్బందీ లేకుండా జీవితాలు, గడిచిపోతాయి” అంటూ ఆవేశపడిపోయాడు. ఎంత ఆవేశపడిపోయాడంటే తీవ్రమైన గాలిలో గడ్డిపరక వణికినట్లుగా వణికిపోయాడు.

“మాట్లాడు బేటీ, నీ సమాధానం చెప్పు” అంటూ దానిలా కూతుర్ని గద్దించి అడిగాడు.

“ఒక సింహపు బిడ్డ ఏదైనా ఒక నక్కతోపాటు వెళ్ళిపోతే లోకం ఆమెనేమంటుంది నాన్నా?” అని రాద్దా తండ్రినడిగింది.

దానిలా నవ్వాడు. అతనితో పాటే మేమందరం నవ్వాం. “బాగా చెప్పావు బిడ్డా అంటూ ధనికుని వైపుకు తిరిగి మహాశయా! నాబిడ్డ సమాధానం విన్నారుగా. జరగని పనిని గురించి ఆలోచించవద్దు. మీరు ఏదైనా మీకు తగ్గ నక్కదొకదాన్ని వెతుక్కోండి. చాలా దొరుకుతాయి.” అన్నాడు.

ఆ ధనవంతుడు తన టోపీని తీసి నేలమీద పారవేసి ఎంతో వేగంగా నేలంతా అదిరిపోయేటట్లు గుఱ్ఱాన్ని పరుగెత్తించాడు. మేమూ ముందుకెళ్ళిపోయాం. రాద్దా అటువంటిపిల్ల.

ఒకరోజు మేమంతా కూర్చుని వున్నాం. సంగీతం వినపడుతున్నది. మైదానంలో సంగీతపు ధార ప్రవహిస్తున్నది. ఆ మధురమైన సంగీతం వింటూంటే మా నరాల్లోని రక్తం ఉత్తేజమవుతుంది. ఇదేదో

దూరదేశపు సంగీతం లాగా వున్నది. మనదాకా తేలివస్తున్నదనుకున్నాం. మా మనసుల్ని పిలిచే ఆ సంగీతం మాలో ఒక అభిలాషను జాగృతం చేసింది. అదేంటంటే ఒక వేళ మేం మరణించినా ప్రపంచాన్నంతా జయించే మరణిస్తాం. అన్న భావనను మాలో కల్గించింది. అటువంటి రసపూరిత సంగీత ప్రతిబింబం వెంటనే మా ముందుకొచ్చింది. మా ఎదుట ముందుగా ఒక గుళ్లుం కనుపించింది. ఆ గుళ్లుం మీద కూర్చున్న మనుష్యుడొకడు. అతడి చేతిలో వయొలిన్ కనబడింది.

"జోబర్! నీవా! అన్నాడు దానిలా సంతోషంగా. అతడే జోబర్. అతని మీసాలు చాలా పొడవుగా పెరిగి వంకర తిప్పితే భుజాలకు అంటుకుంటాయా అనిపించింది. దానికి తోడు భుజాల క్రిందికి దిగిన కేశపాశం. కళ్ళేమో నక్షత్రాలలాగా మెరుస్తున్నాయి. నవ్వుతూ వుంటే మండే సూర్యుడే గుర్తుకొస్తాడు. దూరాన్నుంచి చూస్తే గుళ్లుంమీద రాతి విగ్రహమొకటి కూర్చున్నట్లుగా అనిపించింది. మాగుడారం దగ్గర వెలిగే వెలుగు అతని ముఖం మీద పడి వెలుగులు చిమ్ముతుంది. ప్రపంచంలో అతన్ని చూచినవారెవరైనా సరే మోహితులయ్యి తీరతారు. నేను నిజమే చెప్తున్నాను. నమ్మాలి నువ్వు" అంటూ ఆ జిప్సీ కొంచెం ఆగాడు.

"నిజం నిజం. ప్రపంచంలోని కొందరు మన మీద దృష్టి సారించగానే మనం మూర్ఖులమైపోతాం అలాంటి వారి కోసం సిగ్గుపడం కాని వారిని చూసి గర్వపడతాం. కాని మిత్రమా! ఎక్కువ మంది అలాంటి వారుండరు. కాని అలా వుంటే చాలా మంచిదవుతుంది. ప్రపంచంలో అంతటా మంచేవుంటే ప్రజలు అంగీకరించటానికి బదులు వ్యతిరేకిస్తారు. ప్రపంచ రివాజు ఇదే. సరే పోనిమ్ము. ఆ విషయాలకేంగాని ముందీ కథను పూర్తి చేద్దాం."

జోబర్‌ను చూస్తూ రాద్దా అన్నది. "నీవు వయొలిన్ బాగా వాయిస్తావు. నీ చేతుల స్పర్శ పొందితే వయొలిన్ తన హృదయంతో పాడుతుంది" అన్నది.

ఆ మాటలకు జోబర్ నవ్వాడు. "దీన్ని, ఈ వయొలిన్‌ను నా చేతుల్తో నేనే తయారుచేశాను. కర్రతో కాదు. ఒక నవయవ్వని హృదయంతో. ఆమెను నేను చాలా ప్రేమిస్తున్నాను. ఈ వయొలిన్‌లో వున్నది నా హృదయ తంత్రులే. ఇది చూడటానికి మాత్రమే వయొలిన్. అది వాయించేటపుడు నాచేతులను కదిపేది ఎవ్వరో నాకు తెలుసు. విషయం తెలిసిందా?" అన్నాడు.

"మా జిప్సీ ప్రజలు మొదటి నుండీ స్త్రీ పట్ల అంత ఆపేక్ష భావాన్ని కలిగివుండరు. చెప్పాలంటే కొంత ఉపేక్షిస్తూ వుంటాం. అందువలన వారు మా హృదయాలను రగుల్కొలపరు. ఎవరి హృదయాల్లో మొదటగా ప్రేమాగ్ని రగులుతుందో నని వేచిచూస్తాం. జోబర్ కూడా రాద్దా పట్ల అదే యుక్తిని పన్నాడు. కాని రాద్దా అతననుకొన్న రకానికి చెందింది కాదు. రెండవ రకానికి చెందిన స్త్రీ. జోబర్ మాటలకు ఆమె ముఖం తిప్పుకుంటూ, ఆవులిస్తూ "ప్రజలంతా జోబర్ చాలా బుద్ధిమంతుడు, చతురుడు అని అబద్ధాలే చెప్పారు". అంటూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

"ఓహ్! సౌందర్యమెంత నిష్ఠురంగా వున్నదనుకుంటూ జోబర్ గుఱ్ఱాన్నుండి దుమికాడు. అతడికళ్ళు మెరుస్తూనే వున్నాయి. స్నేహితులారా! నేనూ వస్తున్నానన్నాడు."

"నీకు మా స్వాగతం. రా జోబర్! అని దానిలా అన్నాడు. అతణ్ణందరూ ఆలింగనం చేసుకున్నాక, కబుర్లతో కాలక్షేపం చేసి ఆ తర్వాత నిద్రించటానికి వెళ్ళాం. మేమంతా బాగా నిశ్చింతగా నిద్రపోయాం. మరుసటి రోజు ఉదయమే లేచిచూస్తే జోబర్ ముఖం మీద పట్టీలేసి కట్టుకట్టి వున్నది. ఏమైందని అడిగాం.

"ఏం కాలేదు. గుఱ్ఱం వెనుక కాళ్ళతో తన్నిందన్నాడు."

"హ.హ.. మాకు తెలుసులే. ఏ గుఱ్ఱం తన్నిందో అన్నాం. గడ్డం సవిరించుకుంటూ దానిలా కూడా చిరునవ్వు నవ్వాడు. "జోబర్ కూడా రాద్దాకు నచ్చలేదా?" అనుకున్నాం.

అంతే అయివుంటుంది. "స్త్రీ ఎంత సౌందర్యవతైనా ఆమె హృదయం స్ప్రింగులాంటిది. ఆమె మెడలో బంగారు సంచి వేలాడతీసినా ఆమె మరలా యధాస్థితిలోనే వుంటుంది. నేను నిజం చెప్తున్నాను. గుర్తుపెట్టుకోనువ్వు" అన్నాడు.

ఆ విధంగా మేము రోజులు గడుపుతున్నాం. ఆ ఏరియాల్లో, మా పనులూ, వ్యాపారము కూడా బాగా సాగుతున్నాయి. జోబర్ కూడా మాతోనే వుంటున్నాడు. అతడు చాలా స్మార్ట్. మంచి మిత్రుడు. వృద్ధుల్లాగా బుద్ధిమంతుడు కూడా. పనుల్నీ చాకచక్యంగా చేస్తాడు. అతడు హంగేరియా, రష్యన్ భాషల్ని చదవగలడు. వ్రాయగలడు. అతడు మాట్లాడటం ప్రారంభించగానే మనలో ఎంత కోరిక కలుగుతుందంటే నిద్రా, గిద్రా ఏం రాదు. అతని మాటలు అలా వింటూ కూర్చుండి పోవాలనిపిస్తుంది. అతడు వయొలిన్ ఎంత బాగా వాయిస్తాడంటే ప్రపంచంలో ఇంకెవ్వరూ అంత బాగా వాయించలేరు. నిజం. నేను ఒట్టు పెట్టుకుని మరీ చెప్తాను ఈ మాట. అతడు వయొలిన్ చేతిలోకి తీసుకోగానే మన హృదయం గంతులు వేయటం మొదలుపెడుతుంది. అతడు తంత్రులు మీటటం ప్రారంభించగానే మన హృదయపు దడదడా, వేగం అన్నీ ఆగిపోతాయి. అతడు వాయిస్తూనే వుంటాడు. మనవంక చూస్తూ చిరునవ్వులు చిందిస్తూనే వుంటాడు. మన మనస్సులోనే ఒకసారి నవ్వాలని, మరొకసారి ఏడ్వాలని వుంటుంది. అతడి కరుణాపూరితమైన ఆలాపన మన హృదయాన్ని తూట్లుపొడుస్తుంది. మరలా వెంటనే ఉల్లాసపూరితమైన ఆలాపన చేస్తుంటే మన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోతున్నది. ఆకాశం, చంద్రుడు, నక్షత్రాలు కూడా అతని సంగీతానికి మైమరచి నాట్యం చేస్తున్నాయా అనిపిస్తుంది. అంత మధురమైనది ఆ వాయులీననాదం.

"అతని సంగీత ధ్వనికి మన శరీరంలోని ఒక్కొక్కనరం ఉప్పొంగి అతనికి బానిసలవుతాం. అదే సమయంలో జోబర్ మమ్మల్నందర్నీ ఆజ్ఞాపించాడు. మిత్రులారా! ఆయుధాలు ఎక్కుపెట్టండి. కర్తవ్యాన్ని పాలించండి అంటూ మేమంతా అతడు సైగచేసిన వైపుకు చూచి మా పిడి కత్తులతో దాడి చేయటానికొచ్చిన వారిని ఎదుర్కొన్నాం. ఇలా అతను మాకు సర్వం నేర్పేవాడు. అందుకే మేమంతా అతన్ని చాలా

ప్రేమించేవాళ్ళం. కేవలం రాద్దా మాత్రమే అతణ్ణి లక్ష్యపెట్టటం లేదు. ఇంత జరిగినా కూడా ఆమె అదృష్టం. జోబర్ ఆమెను ప్రేమిస్తూనేవున్నాడు. ఆటపట్టిస్తూనేవున్నాడు. తన హృదయాన్ని రాద్దాపట్ల బందీగా చేసుకున్నాడు. ఒక్కోసారి పళ్ళు పటపటలాడిస్తూ మీసాల్ని వంకర తిప్పేవాడు. అతని కళ్ళు ఒక్కోసారి తేజస్సును కోల్పోతూ వుంటాయి. మరల అప్పుడప్పుడూ ఎంతో తేజస్సుగా మెరుస్తూ వుంటాయి. మాకందరికీ ఒక్కోసారి అతన్ని చూస్తుంటే భయం కలిగేది. రాత్రపూట మైదానంలో ఒంటరిగా చాలా దూరం పోయేవాడు. ఉదయమవుతూనే వయొలిన్ సాధన మొదలుపెట్టేవాడు. అది కరుణార్ద్రతలను నింపుకుని భారంగా పలుకుతుంది. దాని స్వాతంత్ర్యాన్ని ఎవరో లాగేసుకున్నారనిపించేది. మేం మా గుడారాల్లో పడివుండి ఏమవుతుందని ఆలోచించేవాళ్ళం. రెండు బండల మధ్య తనను ఇరికించుకుని మృత్యువునే ఆహ్వానిస్తున్నాడా జోబర్ అనిపించేది.

ఒకరోజు మేం కూర్చుని మా పనులను గురించి మాట్లాడుకుంటున్నాం. మా సంభాషణ చాలా నీరసంగా, ఉత్సాహమేమాత్రం లేకుండా నడుస్తున్నది. అది గమనించిన దానిలా "జోబర్! నువ్వొకపాటపాడు. మాకు హుషారొస్తుంది." అన్నాడు.

జోబర్ దృష్టంతా రాద్దామీదున్నది. రాద్దా అతడికి దగ్గర్లోనే వెల్లికిలా పరుండి ఆకాశం వంకచూస్తున్నది. జోబర్ తన వయొలిన్ తీశాడు. ఎవరో నవ నవోన్మేషమైన సుందరిలాగా మారి ఎన్నో సోయగాలను పలకసాగింది. "విశాలమైన మైదానంలో నేను పరుగులిడుతున్నాను. ఎందుకంటే నా హృదయంలో ఎగిసే జ్వాలలకు బెదిరి నా గుఱ్ఱమూ బాణం వలె రివ్వున దూసుకుపోతున్నది" అంటూ పాడసాగాడు.

పడుకున్న రాద్దా తల విదిలిస్తూ లేచి కూర్చున్నది. జోబర్ కన్నుల్లో చిరునవ్వులు విరిసాయి. ముఖమండలం సూర్యోదయంలా వెలిగిపోతున్నది. మరలా పాటందుకున్నాడు. "హే..ఛలో.ఛలో.. మనం పారిపోదాం. రాత్రి అనే చీకటికి పారిపోయి వెలుతురనే ఉదయాన్ని చేరుకుందాం. పదండి. ఈ కుహనా పరదాను చించివేసి సూర్యుణ్ణి, కొండ శిఖరాన్నీ ముద్దుపెట్టుకుందాం. మనం కూడా సూర్యునితో పాటు ఆకాశంలో తిరుగుతూ రాత్రయ్యేవరకూ ప్రయాణం చేద్దాం. మిట్టమధ్యాహ్నం నుండి రాత్రయ్యేవరకూ ఆకాశంలో వెలుతురును వ్యాపింపచేద్దాం. మన గుఱ్ఱాన్నీ పరుగెత్తిద్దాం. చంద్రుడి శీతలమైన ఒడిలో సేదదీరుదాం, నిద్రిద్దాం" అంటూ పాడసాగాడు. ఇప్పుడెవరూ ఆనాటి జోబర్ లాగా పాడలేరంటూ ఒక నిట్టూర్పు విడిచాడు. మరలా గతంలోకి వెళ్లాడు.

రాద్దా తన చేతిలోకి చల్లని నీటిని తీసుకొని జోబర్ మీద చిలకరిస్తూ "జోబర్ నేనెప్పుడూ అంతెత్తు ఎగిరి చంద్రుని ఒడిలో నిద్రపోను. ఎందుకంటే కిందికి పడిపోయే ప్రమాదముంటుంది. పడిపోతే నీ ముక్కూ పచ్చడవుతంది. మీసాలకు బురద అంటుకుంటుంది. అందువలన జాగ్రత్తగా వుండు" అన్నది.

జోబర్ ఒక్క క్షణం వరకూ ఆమె వంక తదేక దృష్టితో చూశాడు. కాని ఏం సమాధానమివ్వలేదు. తన కోపాన్ని అదుపులో పెట్టుకుని మరలా పాడసాగాడు. "రెండవ రోజూ ఆకాశం వైపుకు వెళ్దాం. అప్పుడక్కడ గాఢ నిద్రలోకి జారుకుందాం. మనమంతా సూర్యుని ఎఱ్ఱని కాంతిలో శాశ్వతంగా నిద్రిద్దాం"

అంటూ "చాలు జోబర్! చాలు. అసలైన పాటంటే ఇదే. నా జీవితంలో నేనెప్పుడూ ఇంత మధురగానాన్ని వినలేదు. నేను అబద్ధం గనుక చెప్పినట్లైతే సైతాన్ ఇప్పుడే నన్ను రాయిగా మార్చివేస్తాడన్నాడు" ఉద్వేగంగా, దానిలా.

వృద్ధుడైన నూర్ గూడా తన మీసాలు సవరించుకుంటూ, భుజాలు ఎగురవేస్తూ, తన స్పందనను తెలియజేస్తున్నాడు. జోబర్ పాడిన ఈ పాట మా అందరి హృదయాలలో ప్రతిధ్వనిస్తూవున్నది. కాని రాద్దా మాత్రం ఈ పాటవిని ఆనందించలేకపోయింది. "ఏం వుందీ పాటలో మేక మే. మే. అని అరిచినట్లుగా వున్నదని" ఈసడించింది.

ఆమాట మాకెవ్వరికీ నచ్చలేదు. "రాద్దా! బహుశా నీకు కొరడా దెబ్బలు తినాలనివున్నట్లున్నది అన్నాడు" కూతుర్ని మందలిస్తూ వాళ్ళ నాన్న.

కాని మధ్యలో జోబర్ తన టోపీ తీసి నేలమీద వుంచి కళ్ళు విప్పార్చి "లేదు. లేదు. దానిలా! వంకర నడకలు పోయే గుఱ్ఱపు గిట్టలకు మంచి పదునైన ఇనుపనాడాలు దిగ్గొట్టాల్సి వుంటుంది. నేను నీ కూతుర్ని పెళ్ళాడటానికి నీ అనుమతి అడుగుతున్నాను. సరిగా సమాధానం చెప్పు" అన్నాడు.

దానిలా నవ్వుతూ "నీకు కోరికా, శక్తీ వున్నట్లైతే ఆమెను నీ స్వంతం చేసుకో" అన్నాడు.

రాద్దా వంకకు తిరిగి "ఓ అందమైన యువతీ! నా మాటవిను. హఠం చేయకు. నేను నీ అంత అందమైనవాళ్ళనెందరినో చూశాను. కాని నా మనసునెవరూ ఇలా ఆకర్షించలేదు. కాబట్టి రాద్దా! నా ఆత్మనే నీ బందీగా చేశాను. ఇపుడు ఇక నేను ఏం చెయ్యలేను. దేవుని ఎదుట, నీ తండ్రి ఎదుటా, ఇక్కడున్న ఈ అందరి ఎదుటా చెప్తున్నాను. నన్ను పెళ్ళి చేసుకో. కాని ఈ మాట ఎప్పటికీ గుర్తుపెట్టుకో. నా స్వాతంత్ర్యానికి భంగం కలిగించే ప్రయత్నం ఎప్పుడూ చేయకు. ఎందుకంటే నేనొక స్వేచ్ఛా జీవిని. నా మనసుకి నచ్చినట్లుగా వుంటాను" అంటూ ఆమె పెదవుల్ని ముద్దాడటానికీ, గుఱ్ఱమెక్కించి ఆమెను తీసుకెళ్ళటానికీ రాద్దావైపుకు వంగాడు జోబర్.

ఓహ్! బాగుంది. చాలా బాగుంది. ఇప్పుడు రాద్దాకు సింహానికి, సింహం పావు లభించిందని అనుకోసాగాం. కాని ఇంతలో జోబర్ గాలిలో నాట్యం చేస్తూ నేలమీద వెల్లికిలా పడటం చూశాం. గుండు దెబ్బతిన్న మనుష్యునివలె నేలమీద పడివున్నాడు. ఇదెలా జరిగింది? జరిగినదేంటంటే రాద్దా తన కొరడాను అతని కాళ్ళ చుట్టూ తిప్పి తన వైపుకులాక్కోగానే అతను నేలపై పడిపోయాడు.

ఆ తర్వాత రాద్దా నేలమీద పడుకుని నవ్వుతూ ఆకాశం వంక చూడసాగింది. మేమంతా ఊపిరి బిగబట్టి జోబర్ ఇప్పుడేం చేస్తాడు అని చూడసాగాం. కాని జోబర్ పైకి లేచి తన రెండు చేతుల్తో తన శిరస్సును అదుముకోసాగాడు. తన నుదురు ఇప్పుడే పగిలిపోయిందా అన్నట్లుగా అతను తన ముఖాన్నిపెట్టాడు. ఆ తర్వాత అతడు శాంతంగానే పైకి లేచి మా అందరి వంకా దృష్టి సారించి ఎదురుగా వున్న మైదానంలోకి నడిచాడు. వృద్ధుడైన నూర్ "చూడు. జోబర్ వెళ్ళిపోతున్నాడని" నాతో అంటే నేను కూడా ఆ చీకట్లో జోబర్ వెంట నడవసాగాను.

ఘుద్రక్ తన పైపులో నుండి నుసిని రాల్చి మరలా దానిలో పొగాకు నింపసాగాడు. నేను నా పొడుగు చేతుల చొక్కాలోకి ముడుచుకుంటూ, వణుకుతూనే అతని వంక చూడసాగాను. గాలీ, పొగా కలసివస్తూ నల్లగా కనపడసాగింది. అతడు భారంగా వున్న తన తలను విదిలిస్తూ, ఏదో గొణిగాడుగాని నాకేం వినపడలేదు. అతని పెద్ద పెద్ద మీసాలు కూడా వెంట్రుకలు ఎగిరినట్లు ఎగురుతున్నాయి. అతడొక ప్రాచీన వృక్షం వలె కనపడుతున్నాడు. దానిమీద పిడుగుపడ్డా ఆకాశం వలె శిరస్సు ఎత్తుకునే నిలబడ్డాడు. సముద్రపుటొడ్డున అలలు అల్లరిపెడుతున్నాయి. గాలిమర్మర ధ్వనులు చేస్తూ మైదానంలో పరుగులు పెడుతున్నది. నాన్కా పాడటం ఆపేసింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకోవటం వలన అంతా చీకటిగానే వున్నది. మళ్ళీ కథ మొదలైంది. జోబరు శిరస్సు వంచుకుని చేతులు వేలాడవేసుకుని అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. నది సమీపానికొచ్చి ఒక బండమీద కూర్చున్నాడు. జాలిగొల్పేటట్లుగా వుంది అతడు బాధపడేతీరు. నా మనసు జాలితో నిండిపోయింది. కాని నేను అతని సమీపంలో కెళ్ళలేదు. కేవలం మాటలతోనే మనుష్యుని బాధకు ఓదార్పులభిస్తుందా? లేదుగా. అతనా బండ మీదే ఎన్ని గంటలసేపు కూర్చున్నాడో తెలియదు.

నేనిక్కడే కొంచెం దూరంలో నేలమీద పడివున్నాను. ప్రకాశవంతమైన వెన్నెల రాత్రిలో మైదానం మొత్తం వెండిలాగా మెరిసిపోతున్నది. పరిసరాలన్నీ స్పష్టంగా కనపడుతున్నాయి. అపుడే రాద్దా తమ గుడారం నుండి జోబర్ వైపుకు రావటం చూశాను. నాకు చాలా సంతోషం కల్గింది. రాద్దా చాలా చిత్రమైన బాలిక. దగ్గరకొచ్చి జోబర్‌తో ఏదో మాట్లాడసాగింది. కాని జోబర్ వినే స్థితిలో లేడు. రాద్దా అతని భుజం మీద చెయ్యేసింది. ఉలికిపాటుతో తన ముఖాన్ని కప్పుకున్న చేతిని తొలగించి త్రుళ్ళి పడిలేచి నిలుచున్నాడు.

అతని చేతులు గట్టిగా పిడిబాకును పట్టుకున్నాయి. ఆమెనేమైనా హత్యచేస్తాడనిపించింది. ఎవరినైనా సహాయానికి రమ్మని పిలుద్దామని గుడారంవైపుకు పరుగెత్తబోయాను. అంతలో నాకేవో మాటలు విన్పించాయి.

“ఆ కత్తిని పారవేయి. లేకపోతే నీ ప్రాణాలు తీసేస్తాను. దీన్ని చూస్తున్నావా?” అంటూ జోబర్ శిరస్సుకు తుపాకి నానించింది. అటువంటి స్త్రీ రాద్దా. మంచిజంటే కుదిరింది. ఇపుడేం జరుగుతుందో చూద్దామనుకున్నాను. రాద్దా తుపాకిని లోపల వుంచుతూ, “నేను నిన్ను చంపటానికి రాలేదు. కాని, నీతో ఒప్పందం చేసుకోవటానికి వచ్చాను. నీ కత్తిని పారవేయి” అన్నది.

అతడు కత్తిని పారవేసి ఆమె వైపు కోపంగా చూడసాగాడు. అది చాలా విచిత్రమైన దృశ్యం. ఇద్దరూ ఒకరినొకరు ఎలా చూసుకున్నారంటే రెండు క్రూర జంతువులు ఒకదాని వంక ఒకటి సాహస, పరాక్రమాలతో చూచుకున్నట్లుగా. కేవలం చంద్రుడే వాళ్ళను చూస్తున్నాడు. ఆ చుట్టుపక్కల నేను తప్పితే మరెవరూ లేరు.

“జోబర్! నా మాటలు విను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను.” అన్నది.

జోబర్ తన భుజాల్ని మాత్రమే కదిలించాడు. అతనికాళ్ళూ, చేతులూ కట్టేసినట్లుగా బిగుసుకుపోయాయి. రాద్దా ఇంకా మాటలు కొనసాగిస్తున్నది. "నేను చాలా మంది యువకుల్ని చూశాను. కాని వారందరిలోనూ నువ్వు చాలా అందమైనవాడివి, పరాక్రమవంతుడివి. వాళ్ళల్లో నేను కోపంగా చూస్తేనే మీసాలు క్రిందికి తిప్పేయగలవాడున్నాడు, నేను సైగ చేస్తేనే తన శిరస్సును నాకాళ్ళ దగ్గర వుంచగలిగినవాడున్నాడు. కాని అందువలన నాకు లాభమేమున్నది? వాళ్ళు నాకు సంతోషాన్ని కల్గించలేరు. వాళ్ళు గొఱ్ఱెల్లాంటివారు. జోబర్! ఈ ప్రపంచంలో జిప్సీలు చాలా తక్కువమందున్నారు. మొదట్లో, నిన్నుగాని, మరెవర్నీగాని ప్రేమించలేదు. ఇపుడు నిన్ను ప్రేమిస్తున్నాను. నాకు స్వాతంత్ర్యమంటే ఇష్టం. కాని దానికంటె కూడా ఎక్కువగా నిన్ను ప్రేమిస్తున్నాను. నేను ఇపుడు నిన్ను వదిలివుండలేను. ఏ విధంగా నువ్వు నన్ను వదిలివుండలేవో అదే విధంగా ఇపుడు నేను నన్ను గాఢంగా ఇష్టపడుతున్నాను. నీవు నా వాడివికా. నా మాటలు పూర్తిగా విన్నావా జోబర్!" అన్నది.

జోబర్ నవ్వాడు. "నాకు నీ మాటలు విని చాలా సంతోషం కలిగింది. చెప్పు ఇంకా చెప్పు. ఆపకు నీ మాటలు" అన్నాడు.

"ఇంకా ఎక్కువే చెప్పాలి. నువ్వెంత దూరం పారిపోయినా నేను నిన్ను నా వాడిని చేసుకునే తీరతాను. అందుకనే చెప్తున్నాను. ఇపుడు సమయాన్ని వృథాపరచను. నా వేడిముద్దు, కౌగిలింత, నీకోసం ఎదురుచూస్తున్నాయి. నా బాహువుల్లోని వేడిలో నువ్వు నీ సాహస జీవితాన్ని మొత్తం మర్చిపోగలవు. నీ సుందర గీతాలను కూడా మర్చిపోతావు. నీ ప్రణయ గీతాల్ని నాకు కూడా విన్పిస్తున్నావుగదా. రా. నా కౌగిలిలోకి. సమయం వృథా చెయ్యకు జోబర్. ఒక ఆఫీసరు ఆజ్ఞను సేవకుడేవిధంగా పాటించాలో అదే విధంగా రేపట్నుంచి నీవు నా ఆజ్ఞల్ని పాటించాల్సివుంటుంది. రేపు నీవు గుడారంలోని జనం ముందు నా పాదాల మీద పడి నాకుడిచెయ్యి పట్టుకుని ముద్దాడాలి. అప్పుడే నేను నీ భార్యనవుతాను" అన్నది.

"ఇది ఆ సైతాను బాలిక కోరిన కోరిక. ఇటువంటి విషయాలు పూర్వకాలంలో ఎక్కడైనా జరిగేవేమో? అది కూడా మా జిప్సీలలో ఎప్పుడూ జరగలేదు. ఒక స్త్రీ కాళ్ళు పట్టుకుని పెళ్ళాడటమనేది లేనేలేదు. ఇంతకంటే అవమానపడే విషయం మరొకటేముంటుంది? అదే నువ్వయితే ఏడు జన్మలెత్తినా అలాంటి పని చేయగలవా? అంటూ నావంకకు తిరిగి అన్నాడు. తనే మరలా లేదు నువ్వలా చేయలేవు. ఎప్పటికీ చేయలేవు." అన్నాడు మళ్ళీ.

రాద్దామాటలకు జోబర్ ఎగిరిపడ్డాడు. గట్టిగా హుంకరించాడు. ఆ హుంకరింపు మైదానమంతా ప్రతిధ్వనించింది. అతని శరీరం నుండి తూటా దూసుకుపోయిందా అన్నట్లుగా కూడా వుంది ఆ హుంకరింపు. రాద్దాకూడా కంపించింది కాని వెనక్కేమాత్రం తగ్గలా. "మంచిది జోబర్. రేపు కలుసుకుందాం. నువ్వు నా ఆజ్ఞను పాటిస్తావనే అనుకుంటున్నాను. నా మాటలన్నీ విన్నావుకదా! అన్నది".

"విన్నాను. నీ ఆజ్ఞ పాటిస్తాను." జోబర్ బాధాపూరిత కంఠంతో చెప్పాడు. ఆమె వైపుకు చేతిని చాపాడు. కాని ఆమె అతనికి దూరంగా జరిగింది. అతడు మొదలునరికిన చెట్టులా నేలమీద కూలబడ్డాడు.

పిచ్చివాడి వలె నవ్వుతూ మరల అంతలోనే ఏడుస్తూవున్నాడు.

అందమైన నాగినులు ఇదే విధంగా తమని ప్రేమించిన పురుషుల్ని కాటువేస్తూవుంటారు. చాలా కష్టంమీద నేను జోబర్‌ను సముదాయించాను.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. సైతాన్ ఈ విధంగా మనుష్యుణ్ణి శోకంలో ముంచి తనేం సంతోషం పొందుతాడు? స్త్రీ, పురుషుల్ని భయంకర వేదనలలోకి నెట్టి తనేం సుఖాన్ని ఆశిస్తాడు? దార్శనికులు అయిన వారి వద్ద కూడా దీనికి సమాధానమే లేదా?

నేను శిబిరంలోకి వెళ్ళి విషయాలన్నీ అందరికీ చెప్పాను. వాళ్ళంతా పరస్పరం మాట్లాడుకున్నారు. రేపటివరకూ వేచి చూద్దామనుకున్నారు. మరుసటి రోజు సాయంకాలం మేమంతా గుడారం దగ్గర కూర్చునివున్నాం. జోబర్ వచ్చాడు. అతడు చాలా దుఃఖంగా వున్నాడు. ముఖం వాడిపోయింది. కళ్ళ కింద అంతా నల్లని వలయాలు ఏర్పడ్డాయి. నేలవంక చూస్తూ కూర్చున్నాడు. మాటలు మాత్రం మాకు చెప్పసాగాడు. "మిత్రులారా! నేను రాత్రంతా ఆలోచించాను. నా హృదయాన్ని శోధించాను. దాంట్లో ఎక్కడా మునుపటి స్వాతంత్ర్యం లేదు. దాంట్లో కేవలం రాద్దాయే నివాసమున్నది. అందమైన రాద్దా నిలబడి చిరునవ్వు నవ్వుతూ ఒక రాణీలాగున్నది. ఇపుడు కూడా తను నాకంటే తన స్వాతంత్ర్యాన్నే ఎక్కువగా ప్రేమిస్తున్నది. కాని నేను నా స్వాతంత్ర్యానికంటే రాద్దానే ఎక్కువగా ప్రేమిస్తున్నాను. అందువలన ఆమె పాదాల చెంత నేను తలవాల్చటానికే నిశ్చయించుకున్నాను. ఆమె నన్ను ఇదే ఆజ్ఞాపించింది. మీరంతా దాన్ని మీ కళ్ళతోచూస్తారు. అందమైన రాద్దా పరాక్రమవంతుడైన జోబర్‌ను తన బానిసగా ఎలా చేసుకుందోనన్న విషయాన్ని పరాక్రమవంతుడైన జోబర్, రాద్దాతో కలవటానికి ముందుగా సింహం తన వేటను ఆడ సింహానికి తినిపించినట్లుగా నేను చెయ్యాల్సివుంటుంది. కాళ్ళమీద పడిన తర్వాత రాద్దా నా భార్య అయిపోతుంది. తన ముద్దుల్తో, కౌగిలింతలతో నన్ను చుట్టేసుకుంటుంది. ఆ తర్వాత నాకు అందరికీ పాటలు విన్పించే కోరిక కూడా వుండదు. నాకు నా స్వాతంత్ర్యం పోగొట్టుకున్నానన్న పశ్చాత్తాపం కూడా వుండకూడదు. నేను సరిగానే చెప్పానా రాద్దా? అన్నాడు జోబర్ తన కళ్ళెత్తి రాద్దా వంక ఉదాసీనంగా చూస్తూ.

రాద్దా బదులుగా ఏం చెప్పలేదు. కేవలం తలాడిస్తూ తన కాళ్ళవైపు సైగ చేసింది. మేమంతా దుఃఖంతో, ఊపిరి బిగబట్టి ఆశ్చర్యంతో ఆ దృశ్యం చూస్తున్నాం. మాక్కొంచెంకూడా అర్థం కావటం లేదు. మా కోరిక ఏంటంటే ఏదైనా దూరప్రాంతం వెళ్ళి అక్కడ జోబర్ ఏ స్త్రీ కాళ్ళైనా పట్టుకుంటే ఆమె రాద్దా అయివుండదు కదా. కాని ఇక్కడ ఇలా అతను అవమానంతో తలదించటం చూడలేం. మా అందరి హృదయాల్లో సిగ్గూ, బాధ, ఇంకా జాలి ఎగిసిపడ్డాయి.

ఇంతలో రాద్దా జోబర్‌ను "త్వరగా కానీ" అంటూ హెచ్చరించింది.

"ఇంత తొందరవద్దు రాద్దా. ఇంకా చాలా సమయముంది. ఈ రోజుతో నువ్వు చాలా మహిమాన్వితురాలవయిపోతావు" అంటూ జోబర్ నవ్వాడు. ఆ నవ్వు మెరుపు మెరిసినట్లుంది. జోబర్

తన మాటలు కొనసాగించాడు. మిత్రులారా! ఇదీ నా కథ. ఇప్పుడు నాకు వేరే దారేమీలేదు. నా రాద్దా పైకే ఎంతో కఠినాత్మురాలు. కాని పైకి కనుపించినంతగా లోపలి కాఠిన్యం ఆమెలో లేదు. ఇపుడు నేనా విషయం తెలిసికోవాలనే ఉబలాటపడుతున్నాను. మిత్రులారా! నన్ను క్షమించండి" అన్నాడు. జోబర్ ఏం చేయబోతున్నాడు? ఎలా తెలుస్తుంది అనుకునే లోగానే రాద్దా నేలమీద పడి విలవిలా తన్నుకుంటున్నది. ఆమె గుండెలో జోబర్ తన కత్తిని పూర్తిగా దించాడు. మేమంతా, బొమ్మల్లాగా నుంచుండిపోయాం.

రాద్దా తన చేత్తో ఆ కత్తిని తీసివేసి ఒక వైపు పారవేసింది. గాయాన్ని తన పొడవాటి వెంట్రుకలతో అదిమిపెట్టి నవ్వసాగింది. "ఆమె చాలా స్పష్టంగా, తెలివిగా మాట్లాడసాగింది. "జోబర్! నీకు వీడ్కోలు చెప్తున్నాను. నువ్విలాగే చేస్తావని నాకు తెలుసు." అంటూండగానే ఆమె కళ్ళు శాశ్వతంగా మూతలుపడ్డాయి.

"ఇప్పుడు మీకు తెలిసిందా? రాద్దా ఎంత విచిత్రమైన బాలికో?"

"నువ్వు చాలా విచిత్రమైనదానివి. నా చిలిపి చేష్టల రాణీ! నీ కోర్కె ప్రకారం నేనిపుడు నీ పాదాలపై పడతాను అంటూ జోబర్ రోదించాడు. అతని హృదయవిదారకమైన ఏడ్పు, మైదానమంతా ప్రతిధ్వనించింది. నేలమీద పడి చనిపోయిన రాద్దా పాదాలను ముద్దాడుతూ తానుకూడా అక్కడే పడి లుంగ చుట్టుకుపోయి రోదించసాగాడు.

వృద్ధుడైన నూర్ "హంతకుణ్ణి పట్టుకోండి అన్నాడు". కానిమేమెవ్వరం జోబర్‌ను బంధించటానికి ముందుకు రాలేదు. అలా జరుగుతుందని నూర్‌క్కూడా తెలుసు. కాని దానిలా ముందుకు వచ్చి రాద్దా రక్తంతో తడిసిన కత్తిని పైకి తీశాడు. ఆ కత్తి వంకే తదేక దృష్టితో చూడసాగాడు. అతడి పెదవులు ఒణకసాగినవి. కత్తిమీద రాద్దా వెచ్చని నెత్తురు అంటివున్నది. దానిలా వేగంగా ముందుకు కదిలి జోబర్‌ను గట్టిగా పొడిచాడు. దానిలా ఒక సైనికుడు ఆపై రాద్దా తండ్రి కదా?

"సెభాష్!" అంటూ జోబర్ దానిలావైపుకు దుమికాడు. కాని అతని శరీరం రాద్దాకు దగ్గరగా కుప్పకూలింది. అతని ఆత్మ కూడా రాద్దాను కలుసుకోవటానికి మరో లోకంలోకి సాగిపోయింది.

మా కళ్ళముందు రాద్దా శవం పడివుంది. ఆవిడ ఒక చెయ్యి గుప్పెడు వెంట్రుకలతో తన ఛాతీకైన గాయాన్ని కప్పుతూవున్నది. పొడవాటి వెంట్రుకలు ఆమె ముఖమంతా కూడా పరుచుకుని వుండి రాద్దా ముఖంలోని భావాలు స్పష్టంగా మాకు తెలియటం లేదు.

అంతా విచారంలో మునిగిపోయాం. దానిలా మీసాలు గూడా కంపిస్తున్నాయి. అతడి కళ్ళముందు అంతా అంధకారమే అలుముకున్నది. ఒకసారి తలెత్తి ఆకాశం వంక చూశాడు. అతని నోటి నుండి ఒక్కమాట కూడా రాలేదు. వృద్ధుడైన నూర్ మాత్రం నేలమీద పడి దొర్లుతూ రోదిస్తున్నాడు. ఏడ్వాల్సిన విషయమే. కాని ఏడ్వటం ఎందుకు? ఈశ్వరుడందరికీ మేలే చేస్తాడు. మెడను వెనక్కు తిప్పకుండా ముందుకు నడవటమే మనపని. ఎందుకంటే మధ్యలో ఎక్కడైనా ప్రయాణం ఆపేస్తే మృత్యువు వచ్చినట్లే." అన్నాడు.

కథ చెప్పటం ఆపేసి ఆ వృద్ధ జిప్సీ మౌనంగా అయిపోయాడు. తన పైపును తీసి సంచిలో వేశాడు. తన పొడవాటి చొక్కాను సరిగా లాక్కున్నాడు. వర్షం మొదలైంది. గాలి తీవ్రమైంది. సముద్రపొడ్డున అలలు ఎగిసిపడుతున్నాయి. గుర్రాలు మా నాల్గువైపులా నిలబడి తమ తమ పెద్ద కళ్ళతో మా వంక చూస్తూ నిలబడ్డాయి.

ఛుద్రక్ వెళ్ళి ప్రేమగా వాటిని నిమిరాడు. అతని గొంతు ఇంకా భారంగానే వున్నది. నా వంకకు తిరిగి "ఇపుడు నిద్రపోయే సమయమైంది అంటూ తన పొడవాటి అంగీనే ముఖం మీద దాకా కప్పుకుని నేలమీదే పడుకుని వెంటనే గాఢ నిద్రలోకి జారుకున్నాడు. కాని నాకు నిద్రపోవాలని లేదు. మైదానంలో పరుచుకున్న అంధకారాన్ని, దూరంగా గర్జించే సముద్రాన్ని, దట్టంగా పట్టబోయే మంచునూ చూస్తున్నాను. నా కన్నుల ఎదుట రాద్దా యొక్క రాణీత్వపు తేజస్సు, అభిమానంతో పైకెత్తి చూసే ఆమె శిరస్సే కపడుతున్నాయి. ఆమె తన చేతితో గుప్పెడు వెంట్రుకలతో తన హృదయపు గాయాన్ని దాచుకుంటూ తన కోమలమైన వ్రేళ్ళ నుండి అగ్ని కణాలవలె జాలువారే చుక్కలచుక్కల రక్తం భూమిని తడిపే దృశ్యమే కదలాడుతున్నది.

రాద్దా వెనుకగా పరాక్రమవంతుడైన జోబర్ పడివున్నాడు. అతని ముఖం మీద పొడవైన వెంట్రుకలు చిందరవందరగా పరచుకుని వున్నాయి. ఆ వెంట్రుకల చాటు నుండి కన్నీళ్ళ ధారలు కారబోతున్నాయి.

వర్షపు నీరు ఎక్కువవుతున్నది. గాలి వ్యథిత హృదయం లాగా ఘోషపెడుతున్నది. అటు రాద్దా ఇటు జోబర్‌ల స్మృతిలో శోకం అలా ప్రకటితమవుతున్నదని నాకనిపించింది. ఆ రాత్రి చీకటిలో రెండు నీడలు ఒక దానికొకటి దగ్గరగా వచ్చి నాట్యమాడుతున్నాయి. అయినప్పటికీ, ముగ్ధమోహన గాయకుడైన జోబర్ తన అభిమాన ప్రేమాస్పదురాలైన రాద్దాను దక్కించుకోలేకపోయాడు.

**విదుషీరత్న డా॥ సరోజినీ కులశ్రేష్ఠ సాహిత్య, పురస్కార విశేషములు**

**జీవనరేఖలు :** వీరు ఫిబ్రవరి ఒకటి 1923 వ సంవత్సరంలో మధురా ప్రాంతం, ఉత్తర ప్రదేశ్ నందు జన్మించారు. ఎమ్.ఎ. పి.హెచ్.డి. పట్టభద్రులు, రఘునాధ బాలికల డిగ్రీ కాలేజ్ మీరట్ నందు 1951 నుండి 1954 వరకు, హిందీ విభాగాధ్యక్షురాలిగా సావిత్రీ మహిళా డిగ్రీ కాలేజ్ అజమీర్ లో 1954 నుండి 1951 వరకు, కిశోరీ రమణ స్నాతకోత్తర మహిళా విశ్వవిద్యాలయం మధురలో 1957 నుండి 1983 వరకు ప్రిన్సిపాల్ గా పనిచేశారు.

**కథా రచన :** 1980 లో 'చాంద్ కీ పాయల్', 1992 లో 'బ్రజ్ కీ లోక కహానియాం', 1995 లో కపాస్ కే ఫూల్, 'ఘరౌందా టూటతాహుదా" మొదలగు కథా సంపుటాలను వెలువరించారు.

**ఇతర రచనలు :** 'హిందీ సాహిత్య మే కృష్ణ' పరిశోధన గ్రంధం - 1960
'సాధన' - కవితా సంగ్రహం - 1960
'గీలేనయనా, 'భీగీపలకేం' గీతాల సంగ్రహాలు - 1970
'బాంసురీ హుం మైతుమ్హారీ - గీత సంగ్రహం - 1980
'స్మృతియోంకే పోస్టర్' - కవితా సంగ్రహం - 1995
'ఆజా రీ నిందియాం' - జోల పాటలు - 1996
'భోర్భయీా - అబ్ జాగో ప్యారే' - ప్రభాత గీతాలు - 1996
'యే ప్యారే - ప్యారే జీవజగత్ కే' - బాల కవితా సంగ్రహం - 1991
'నన్హే - మున్నే గాయేం' - గీతాలు 1998
'హంస్ మోతీ చుగతా హై' - 1999
'విస్మృతా - ఖండకావ్యం' - 2000

**సంపాదకీయం వహించిన పుస్తకాలు :** సాత్ ఏ కాంకీ
ప్రతినిధి ఏకాంకీ సంగ్రహ్
కబీర్సాఖీ, తులసీవార్తా రెండవ భాగం
బఢతే కదమ్, బదల్ తే ఆయామ్
కథాలోక్ - పిల్లల కథలు

**ఆకాశవాణి కేంద్ర ప్రసారణ :** ఢిల్లీ, మధుర, అజ్మీర్, అహమ్మదాబాద్, లక్నో, జమ్మూ - శ్రీనగర్ కేంద్రాల నుండి వీరి కార్యక్రమాలు ప్రసారమయినాయి.

పురస్కారాలు : వీరు పొంది పురస్కారాలకు లేక్కే లేదు. అందులో కొన్ని 'విదుషీ రత్న' - అఖిల భారతీయ బ్రజ సాహిత్య సంగమ్, ఆగ్రా - 1984.

'లోక సాహిత్య వాచస్పతి' – బ్రజలోక సాహిత్య సమ్మేళన్ – ఏత్మదాపూర్

'సాహిత్య మహోపాధ్యాయ' – హిందీ సాహిత్య సమ్మేళన్, ప్రయాగ – 1990

'సాహిత్యమణి' – బాబూ వృందావనదాస్ హిందీ సంస్థాన్, మథుర – 1991

'స్మృతియోంకే పోస్టర్' భారత్ భారతీ' – అలీఘడ్ – 1997

'బాలసాహిత్య భూషణ్' – భారతీయ బాల కళ్యాణ్ సంస్థాన్ – కాన్పూర్ – 1999

'ఉత్తరప్రదేశ్ మహిళా వేదిక' – మీరట్ నుండి సత్కారాన్ని పొందారు.

'సారస్వత సమ్మాన్, భారతీయ సాహిత్య పరిషత్ ప్రయాగ వారి ద్వారా బంగారు పతకాన్ని పొందారు. వీరి ద్వారానే 'బాల కవయిత్రి' అన్న బిరుదును అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్వీకరించారు.

'బాలసాహిత్యశ్రీ' – బాలసాహిత్యసమ్మాన్ – లక్నో

'రాష్ట్ర భాషా ఆచార్య' – అఖిలా భారతీయ సాహిత్య కార్ అభినందన సమితి – మథుర

'సాహిత్య సరస్వతీ పతకం – ఉత్తరప్రదేశ్ కళా సంస్కృతీ సాహిత్య విద్యా పీఠం

'సూరసాహిత్య ఏవం బ్రజసంస్కృతసమ్మాన్ – సూర స్మారక మండలి – 2001

ఇంకను మరికొన్ని సంస్థల నుండి వీరు సత్కారాలు పొందివున్నారు. వీరికి లభించిన బిరుదులైన 'విదుషీరత్న', సాహిత్య సరస్వతీ' అనువాటిని సార్థకం చేసుకున్నారు.

ప్రస్తుత కథలు "ఘరౌందా టూటతా హువా" అనే కథల సంపుటిలోనివి. ఈ కథల్లో కల్పన తక్కువ. వాస్తవికత ఎక్కువ వున్నాయని రచయిత్రే స్వయంగా తెలియజేశారు.

మొదటి కథ 'చినగారీ', అంటే 'నిప్పు రవ్వ' అని అర్థం. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వారు నిప్పురవ్వల్లాగా ఎగిసి తోటి వారికి ఎలా వెలుగులు పంచారో, దేశభక్తిని ఎలా పెంపొందించారో విశదంగా వర్ణించబడింది.

రెండవ కథ "ఫిర్ వసంత్ ఆయా" అంటే 'మరలా వచ్చిన వసంతం' అని అర్థం. తనకు అన్యాయం జరిగిందని బాధపడుతూ కూర్చోకుండా, సమాజం ఏమనుకుంటుందో అని భయపడకుండా స్త్రీ ముందుకు వచ్చి చదువుకోవటం, ఆ తర్వాత మరలా వివాహం చేసుకోమని జీవితంలో స్థిరపడమని బోధించే కథ ఇది.

# మరలా వచ్చిన వసంతం

కుముద ఒక సాధారణ బాలిక. మధ్య తరగతి పోకడలన్నీ పుణికిపుచ్చుకున్నది. సమాజం అంటే చాలా భయపడుతుంది. యుక్త వయస్సు రాగానే సంపన్న కుటుంబానికి చెందిన ఒక యువకుడితో ఆమె పెండ్లి జరిగింది. ఆమె భర్త దినేశ్ డాక్టరీ చదివాడు. మంచి కార్య నిబద్ధత వున్న డాక్టరు. "సేవ చేయటం కోసమే జీవించు". అనే విద్యాలయ ఉద్దేశ్యం ఏదైతే వున్నదో దాన్ని తూచా తప్పకుండా ఆచరించటానికే ఎప్పుడూ కట్టుబడి వుండేవాడు.

పెండ్లి జరిగినపుడు పెండ్లి కొడుకు రూప, గుణ శీలాదులను చూచి వధువు పక్షంవాళ్ళు ఉబ్బితబ్బిబ్బైపోయారు. అచ్చం రాజకుమారుడల్లే వున్నాడు. అవును, నిజంగా రాజకుమారుడే అన్నమాటే అందరినోటి నుండి వినిపించింది. కుముదా, దినేశ్‌ల పెండ్లి చాలా ఆడంబరంగా జరిగింది. కుముద తండ్రి కూడా ఆనాటి పరిస్థితుల ప్రకారం కట్నం కూడా బాగానే ఇచ్చాడు. వరుని పక్షం వారు ఏ గొంతెమ్మ కోర్కెలూ కోరలేదు.

డా॥ దినేశ్ తన భార్య కుముదకు ఎంతో ప్రేమను పంచి ఇచ్చాడు. అతడి ప్రేమకు మైమరిచిపోయి జీవితాంతం అతని సేవ చేసుకుంటే తన జన్మ సార్థక మవుతుందని భావించింది. రెండేళ్ళ పాటు "బంగారపు పగలూ ముత్యపు రాత్రీ" లాగే గడిచిపోయినవి. రోజులు ఎలాగడిచినయ్యో కూడా తెలీదు.

ఒక రోజున ఒక బాలిక కుముద దగ్గరకొచ్చింది. ఆ సమయంలో కుముద తన మంచంమీద కూర్చొని సితార్ వాయిస్తుంది. ఆ వచ్చినామె కుముద సితార్‌నాదం విని చాలా ఆశ్చర్యపోయింది.

"మీరు సితార్ కూడా వాయిస్తారా!" అని అడిగింది.

"ఎందుకు వాయించను! నేను మీరట్‌లో కాంబోజీ గారి దగ్గర బాగా నేర్చుకున్నాను. అలాగే నాకు కవితలు వ్రాయటం కూడా చాలా ఇష్టమైన పని" అన్నది.

వచ్చిన ఆగంతుకరాలు మరింత ఆశ్చర్య పడుతూ కుముద ముఖం వంక చూడసాగింది. కుముద తనచేతిలోని సితార్ పక్కన పెట్టిలేచింది. తన మేజాబల్ల సొరుగు తీసి అందులోంచి ఒక పేపరు చూపించింది. ప్రచురించబడిన తన మొదటి కవిత తాలుకు పేపరు అది, సంపాదక మహాశయులు ఆమె కొరకు కాంప్లిమెంటరీ కాపీ పంపించారు. అది చూచి వచ్చినామె సిగ్గు పడింది.

"దినేశ్ ఇవన్నీ నా దగ్గర దాచాడు. నా భార్యకు చదువు సంధ్యా లేదు. ఏ లలిత కళా తెలియని మూర్ఖురాలు. ఇంటిపనీ, వంట పనీ మాత్రం బాగా చేస్తుంది" అన్నాడని చెప్పింది.

కుముదకేం అర్థం కాలేదు. అసలామె ఎవరు? ఏం తెలుసుకోవాలని ఇక్కడ కొచ్చింది? అన్న విషయాలు ఎంత ఆలోచించినా సమాధానాలు రాలేదు. ఈమె తనింటికి వచ్చే విషయం దినేశ్‌కు ముందే తెలుసా? తెలిసే తన దగ్గర దాచాడా? రకరకాల ఆలోచనలు కందిరీగ తుట్టెలాగా బుర్రలో మెదలసాగాయి. దినేష్ ఇంటికొచ్చాడు. "నువ్వు నా పరువునే దెబ్బతీశావు. నేను చదువు రాని దాన్నని, ఏ లలిత కళలోనూ నాకు ప్రవేశమే లేదని ఇందూతో ఎందుకు చెప్పావు? అలా చెప్పాల్సిన అవసరమేం వచ్చింది"? అంటూ భర్తను గట్టిగా నిలదీసింది.

దినేశ్ నుండి ఏ సమాధానము రాలేదు. నిశ్శబ్దాన్నే ఆశ్రయించాడు. ఈ సంఘటన జరిగిన తర్వాత కుముదకూ, దినేశ్‌కూ ఎడమొగం, పెడమొగమే అయ్యింది. అతడి ప్రేమ హృదయపూర్వక మైనది కాదని అనుకున్నది. రెండు సంవత్సరాల నుండి తాను ఎంతో ప్రేమింపబడుతున్నాని భ్రమ పడింది. ఇంతవరకూ తను భావించినదంతా వట్టి బూటకమే. పెళ్ళయి రెండేళ్లయింది. ఆఉన్మాదం తగ్గింది. తగ్గిన విషయం నెమ్మది నెమ్మదిగా హృదయానికి చేరుతుంది. ఇద్దరం ఒకరి కోసం ఒకరు అన్నట్లుగా వున్నామనుకున్నాం. కాని ఆ సమర్పణ భావం ఇక్కడలేనే లేదు. ఆమె తనువెల్లా తరుక్కుపోయింది. ఈ రెండేళ్ళ నుండీ దినేశ్‌ను ఎందుకర్థం చేసుకోలేకపోయింది? అతడెన్నో సార్లు మీటింగు వున్నదని చెప్పేవాడు. రాత్రి పన్నెండు గంటలకు ఇంటికొచ్చేవాడు. అదేమని అడిగితే వార్డులో డ్యూటీ వున్నది అంటూ రకరకాల కారణాలు సిద్ధం చేసుకొని వుండేవాడు. కుముదకు ఏ అనుమానమూ వచ్చేది కాదు. అతనేదైనా తుంటరి పన్లు చేస్తున్నాడా అన్న దృష్టే కలగలేదు. అసలాంటి ఆలోచనల కాస్కారమే లేదు.

దినేశ్ గొప్ప నటుడయివుంటాడు. అతడు బహుశా నాతోనూ, ఇందూతోనూ కూడా నాటకాలు ఆడుతూ వుండి వుండొచ్చు. ఇందూ ఇంటికి రావటం వలనే ఈ అనుమానాలు అన్నీ వస్తున్నాయి. ఇప్పటికీ దినేశ్ తప్పు చేశాడంటే మనసు ఒప్పుకోవటంలా. ఇదసలు ఎలా జరిగింది? నా భర్తే వేరొకరికి ఎలా వశపడ్డాడు? ఏదో విషయం తప్పకుండా వుండే వుంటుంది. దినేశ్ వ్యవహారం చూస్తుంటే అలా ఏం అన్పించటం లేదు. ఇందూ లేక మరేవరైనా స్త్రీ అతని జీవితంలోకి అకస్మాత్తుగా వచ్చారా? అకస్మాత్తుగా కాకపోవచ్చు. నాలోనే ఏదైనా లోటు, దోషాలు వున్నాయా? నా వల్ల తనకు అసంతృప్తిగా వున్నట్లు దినేశ్ వైపు నుండి ఏ అభ్యంతరమూ తనకెప్పుడూ కనపించలేదు. అసలు తనను పెళ్ళెందుకు చేసుకున్నట్లు? భార్యా ధర్మమని భావించి అతనికి సేవ చేయలేదు. ఒక ప్రేమికురాలిగా మారి తన భర్తకు తన్ను తాను పూర్తిగా సమర్పించుకున్నది. కాని ఇప్పటి పరిస్థితి వేరుగా వుండేటప్పటికి ఆమెను రకరకాల ఆలోచనలు చుట్టుముడుతున్నాయి.

భర్త తనను ప్రేమించకపోయినా ఆ భర్తకు సేవ చేయటమే భార్యగా తన కర్తవ్యమనుకున్నది.

ఆమె సంస్కారం ఆమెకదే నేర్పింది.

దినేశ్ హృదయంలో ఏముందో తెలియటం లేదు. కాని ఇప్పుడతనికి కుముదలో చాలా తప్పులు కనిపిస్తున్నాయి. మంచిగా వుండాలన్న నాటకం ఆడక్కర్లేదు కాబట్టి తన లోపలి స్వభావాన్ని చూపిస్తున్నాడు. మాటి మాటికీ పెద్దగా అరవటం, అలవాటైపోయింది. తాను కటువుగా వుంటే, ప్రేమ రాహిత్యాన్నే ప్రదర్శిస్తే కుముద తనంతట తానుగా ఇల్లు విడిచి వెళ్ళిపోతుందన్న భావనలో వుండి వుండవచ్చు. కాని కుముద కాలోచన రాలేదు. ఆమె ఊహల్లో అత్తిల్లు వదిలిపెట్టి వెళ్ళే సంస్కారానికి చోటే లేదు.

అప్పటికింకా హిందూ కోడ్‌బిల్ పాసవ్వ లేదు. ఎవరైనా యువకుడు రెండవ వివాహం చేసుకోదల్చినట్లైతే చేసుకోవచ్చు అనే విన్నది. దినేశ్ ఇందూను రెండవ పెళ్ళి చేసుకుంటే చేసుకోనీ. మంచిది. రెండవ ఆమెనూ రానిద్దాం. ఆమె కూడా ఇదే ఇంట్లో వుంటుంది, ఇద్దరం కల్సి భర్తను చూసుకుంటాం. అని సమధానపడింది.

“దినేశ్ ఇందూను రెండవ పెళ్ళి చేసుకోబోతున్నాడు” అని ఆకస్మికంగా వినప్పుడు కుముదలో దావానలం చేలరేగింది. తన్ను తాను సంబాళించుకోలేకపోయింది. కాని ఆలోచించి ఆలోచించి తనే తన మనస్సును దిటవుపరచుకున్నది. ఇప్పుడు ఇందూ రాకను అంతగా వ్యతిరేకించటంలా, తనూ, దినేశ్, ఇందూ ఎలా కలిసి వుండాలోనన్న ఆలోచనల్లో కొట్టుకుపోతుంది.

ఆమె తల్లీ దండ్రీ, స్నేహితురాల్లు అందరూ కుముద ఆలోచన్లని వ్యతిరేకించారు. మీరు ముగ్గురూ కలసి ఒకే ఇంట్లో ప్రశాంతంగా ఉండలేరు. అలా ఉండటం నీ భవిష్యత్‌కు మంచిది కాదని ఎన్నో విధాల నచ్చచెప్పారు.

తాను దినేశ్‌తో దూరంగా వుండే విషయమే కుముద తన మనసులో నుంచి నెట్టేసింది. అందువలనే ఇంత పెద్ద నిర్ణయానికొచ్చింది. కాని విధి తలిచింది వేరుగా వున్నది.

ఇందూ పెళ్ళికి ముందే దినేశ్‌తో అనేక షరతులు గురించి చర్చించింది, ఒప్పించుకున్నది కూడాను. తాను దినేశ్‌ను పెండ్లాలాడాలంటే కుముదను ఇంట్లో నుంచి పంపించెయ్యాలి! ఆమెతో ఇక ముందు ఏ సంబంధమూ పెట్టుకోగూడదు. దినేశ్ ధన, మాన, ప్రాణాలన్నీ ఇందూకే స్వంతం.

ఇవన్నీ విన్న కుముద హతాశురాలయ్యింది. ఇంట్లో నే వుండి భర్తకు సేవాశుశ్రూషలు చెయ్యాలన్న కుముద కోరికకూకటి వేళ్లతో పెల్లగింపబడి ఆమె భర్త ఇంట్లో నుండి పుట్టింటికి వెళ్ళవలసి వచ్చింది.

ఇప్పుడు కుముద వివాహితురాలు. భర్త జీవించి వున్నాడు కాబట్టి విధవా కాదు. ఒక స్త్రీ మాత్రమే. ఆమె తన కొత్త జీవితం భర్త తోడు లేకుండా గడపటం అలవాటు చేసుకుంటున్నది. కాని

ఎంత తేడా? వివాహానికి ముందున్న ఇంట్లోనే ఇప్పుడూ ఉంటున్నది. అన్నా, చెల్లీ, అమ్మా, నాన్న అందరికీ ఇప్పుడు చర్చనీయాంశం కుముద విషయమే. ఇంక సమాజమేం వూరుకుంటుంది?

కుముదకు చాలా దు:ఖం కలిగింది. ఆ దు:ఖంలోనే కుముద మనసులో ఏదైనా తాను చేసి చూపించాలన్న పట్టుదల మేల్కొన్నది. అప్పటికే ఆమె బి.ఏ. పాసయి వున్నది. ఇప్పుడు మరలా ఎమ్.ఏ చదవటం కోసం మీరట్ కాలేజీలో చేరింది. నెమ్మది నెమ్మదిగా తన బాధల్నీ, పాత జ్ఞాపకాల్నీ వదిలిపెడ్తూ, చదువులో పడిపోయింది. ఆమె తరగతిలో నల్గురు విద్యార్థినులూ, మిగతా అంతా విద్యార్థులూ వున్నారు. చదువుతూ, చదువుతూ ప్రొఫెసర్లూ చెప్పే పాఠాలు వింటూ, వింటూ కుముద బుద్ధి విశాలమవసాగింది. అంతకు ముందున్న పతిసేవ, పాదపూజలాంటి ఆలోచనలన్నీ అడుగునపడిపోయినాయి. ఎమ్.ఏ మొదటి సంవత్సరంలో ఆమెకు చాలా ఎక్కువ మార్కులు వచ్చాయి. దాంతో కాలేజీలో అందరికి ఇష్టురాలయ్యింది. క్రమేణా ఆమె దృష్టి మిగతా కార్యక్రమాల వైపుకు మళ్లింది. విద్యాలయ మాగజైన్ లో ఆమె వ్రాసిన కవితలూ, వ్యాసాలూ కనిపిస్తున్నాయి. "భాషా దర్బారు" నాటకంలో ఆమె సంస్కృత జ్ఞానమయిగా అలరించింది. ఆప్రదర్శనకు గాను ఆమె ప్రథమ బహుమతి అందుకున్నది. ఈ వరుస విజయాలతో ధైర్యం, కాస్త గర్వమూ కలిగాయి కుముదలో.

అప్పుడే రవి మోహన్ అనే పేరు గల యువకొడకడు ఆమెకు పరిచయమయ్యాడు.

అతడు లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చి కుముదకివ్వసాగాడు. ఆ పుస్తకాలు ఇచ్చి పుచ్చుకోవటం, వారిద్దరూ కలిసి మాట్లాడుకోవటానికి కారణమయ్యింది, అసలు రవిమోహనే కుముద పట్ల చాలా ఆకర్షణను పెంచుకున్నాడు. ఆమె తన్ను బాగా ప్రభావితం చేస్తున్నదనుకున్నాడు. నెమ్మది నెమ్మదిగా ఆ ఆకర్షణ, ప్రభావితం అన్నీ కలసి ప్రేమగా మారాయి. కుముదకు కూడా రవిమోహన్ అంటే చాలా ఇష్టం. కాని అతని పట్ల కుముద మనసులో ఏవికారాలూ ఉత్పన్నం కాలేదు. ఆమెకున్న సంస్కారం ఆమెను దారి తప్పన్విలేదు. రవి మోహన్ ఒక ప్రేమికుడుగా కనపడలేదు కుముదకు. కాని కుముద అనుకున్నట్లు జరగలేదు. ఒక రోజు లైబ్రరీలో కూర్చొని రవి మోహన్ ఆమెతో వివాహ ప్రస్తావన తెచ్చాడు. ఆమె తుళ్లి పడింది. " ఈ రోజు నువ్వన్న మాట మరెవ్వరితో అనవద్దు. నేను వివాహితను. వివాహితకు మళ్ళీ పెళ్ళి జరగదు. ఈ వివాహ పర్వం నా వైపు నుండి సమాప్తం అయింది. కాని నీ పరంగా మరలా మొదలు పెట్టాలని చూస్తున్నావు" అన్నది.

రవి మోహన్‌కు సమాధానమయితే చెప్పి వచ్చింది గాని ఇంటికొచ్చి ఆలోచించసాగింది. తను ఇంటికొచ్చేసే ముందు దినేశ్ తనతో కొన్ని మాటలన్నాడు. "కుముదా నువ్వు కూడా త్వరలో నీకు నచ్చినవాడిని పెళ్ళి చేసుకో. మనిద్దరం కలిసి వుండలేమని అనిపించింది. అంతే కాని నీతో నాకు శతృత్వం ఏమీ లేదు. ముందు ముందు నీ జీవితంలో కొన్ని సమస్యలు వస్తాయి. సమస్యలన్నీ

పరిష్కరించుకో. త్యాగాలు చెయ్యటం కానీ మనసులో బాధలు పెట్టుకోవటం కానీ చెయ్యకు. నీవు నిరపరాధివి. నిరపరాధులకు త్యాగాలు చెయ్యటంలో కష్టమేమీ వుండకపోవచ్చు. కాని అలా వద్దు. నీ జీవితాన్ని నీవు చక్కదిద్దుకో" అని

నాకంతా తెలుసు, కాని నేను స్త్రీని. వేరే పర పురుషుల్లో ఎంత నిజాయితీ వున్నదో, అతను మాట మీద ఎంతవరకు నిలబడతాడో తెలుసుకుంటాను. ఒక వేళ రవి మోహన్ నా యీ పరిస్థితికి రాజీ పడితే పరీక్షించి చూడొచ్చు, అనుకొన్నది కుముద.

ఒక వైపు స్త్రీ అబల మరొక వైపు సహనశీలి. ఆమె ఏమన్నా నిర్జీవపదార్థమా? ఆమెను కోరుకున్నప్పుడు హృదయంలో పెట్టుకోవటం, అవసరం తీరగానే దుమ్ము ధూళిలోకి విసిరిపారవెయ్యటం జరుగుతుంది. సమాజం కూడా ఆమె పట్ల సానుభూతి చూపించదు. అక్కునా చేర్చుకోదు. ఆమె సచ్చరిత్ర కాదని అంటుంది. అంతకన్నా కూడా కాకులూ, గద్దలూ ఆమెను ముట్టడించటానికి సిద్ధపడతాయి. అలాంటి వాటిని ఎదుర్కొవటానికి సిద్ధంగా వుండాలి. అని ఆలోచించింది కుముద.

రవి మోహన్ నిజమే మాట్లాడి వుంటాడు. తన తల్లీ దండ్రీ ఇదే కోరుకుంటారు. అన్నా, వదినా కూడా తనను, తమకు భారమే అని భావిస్తారు. పెళ్ళి కాని యువతి ఇంట్లో వుంటేనే ఎంతో దిగులుగా ఉంటారు. అందులోనూ భర్త చేత వదిలి పెట్టబడిందంటే మరింత బరువు మోస్తున్నామనుకుంటారు. ఇవన్నీ ఆలోచించి తాను మరలా వివాహం చేసుకుంటేనే మంచిదన్న ఆలోచనకొచ్చింది.

ఆ ఆలోచన వచ్చిందే తడవుగా తల్లి దగ్గర కెళ్లింది. రవి మోహన్ ప్రస్తావన చెప్పింది. అమ్మ సంతోషానికవధులు లేవు. ఆమె వెళ్ళి తన భర్తకు చెప్పింది. పడుకున్నవాడల్లా లేచి వచ్చాడు. "కుముదా! నువ్వు తీసుకున్న నిర్ణయం మంచిదే. నాకయితే దినేశ్ మీద కేసు వేయాలని ఉన్నది. నువ్వు ఇష్టపడలేదని ఊరుకున్నాను. ఆ తర్వాత నేను కూడా ఆలోచనలో పడ్డాను. కోర్టు నష్టపరిహారం ఇప్పిస్తుంది. కాని దినేశ్‌ను తీసుకొచ్చి కాపురం చేయించలేం కదా!" అన్నాడు.

"కాని నాన్నగారు! నన్ను మరలా వివాహం చేసుకోమని దినేశే చెప్పాడు. నేను వివాహం చేసుకున్నప్పుడు తను తప్పకుండా వచ్చి చూస్తానని చెప్పాడు. అలా వివాహం చేసుకుంటేనే నేను సంతోషపడతానని చెప్పాడు. నా వివాహం జరగటం తన కోర్కె అనీ, ఆ పెళ్ళికి రావటం తన బాధ్యతనీ చెప్పాడు" అన్నది.

"ఇప్పుడతను వచ్చి చేసేదేముంది కుముదా! మాకందరకూ అతని మీద చాలా కోపంగా వుంది", అన్నాడు తండ్రి. కాదు నాన్నగారూ! కోసం తెచ్చుకునే పని అయితే లేదు. సమస్య వచ్చినప్పుడు చూపు సమాధానం వైపు వుంటుంది. దినేశ్ కూడా ఒకానొక క్షణంలో బలహీనుడయ్యుంటాడు. ఫలితంగా

ఇందూ గర్భవతి అయ్యింది. అప్పుడామె దినేశ్‌ను బెదిరించి పరిష్కారం అడిగుంటుంది. ఆ సమయంలో ఇందూకు అండగ నిలబడకపోతే ఆమె సమాజపు దృష్టిలో పతిత అవుతుంది. అందువలన పెళ్ళి జరగటం అనేది సమాధానమవుతుంది. దినేశ్‌ను తప్పు పట్టటానికే లేదు. నా అదృష్టంలో అలా రాసి పెట్టి ఉన్నది. ఎవరైతే నా మీద పూర్తి ప్రేమను పంచారో అది చాలా రోజుల పాటు నిలబడలేకపోయింది. ప్రేమను పంచినందుకైనా అతనికి ధన్యవాదాలు చెప్పాలి. ఇప్పుడు నేను రవిమోహన్‌ను చేపడితే ధన్యురాలినే అవుతాను. అప్పుడు దినేశ్ నాకు మంచి మిత్రుడవుతాడు. అతడు నా పెళ్ళికి తప్పక వస్తాడన్నది" ఎంతో నమ్మకంగా.

పెళ్ళి ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. మొదటి వివాహమంత ఆడంబరంగా చేయకపోయినా ఇంటిల్లిపాదీ ఎంతో ఉత్సాహంగా వున్నారు. తమ తమ అభిప్రాయాలు వెల్లడించి అందరూ సంతోషంతో తమ తమ పనులు చేస్తున్నారు.

పెండ్లి ఊరేగింపు వచ్చింది. ఈసారి పెండ్లి కొడుకు గుఱ్ఱం మీద కాకుండా కారులో వచ్చాడు. దినేశయితే బాసికంతో వచ్చాడు. కాని రవి మోహన్ కేవలం కుచ్చుపైకి వచ్చేలా తల పాగాను చుట్టుకున్నాడు. నిరాడంబరంగా వున్నా ఎంతో అందంగా వున్నాడు. వరునికి స్వాగత సత్కారాల తర్వాత జయమాల కార్య క్రమం వుంటుంది. కుముద కళ్ళు దినేశ్ రాకకోసం వెతుకుతున్నాయి. అతన్ని వెతుకుతూ వరమాల వెయ్యకుండా వేచి చూస్తున్నది. అకస్మాత్తుగా అందరి దృష్టి ఒక వైపున నిలబడి వున్న పురషునిపై పడింది. అతడే దినేశ్. దినేశ్‌ను ఎదురుగా చూసి కుముద మనసు హాహాకారాలు చేసింది. ఓరి భగవంతుడా! ఈ రెండవ పెండ్లి సమయంలో కూడా అతడే పెళ్ళికొడుకు. రవిమోహన్ రూపంలో ఆమె దినేశ్‌నే చూస్తున్నది. దినేశ్ ఇంకా దూరంగా వుండలేకపొయ్యాడు. అతడు నెమ్మదిగా కుముద దగ్గరకొచ్చాడు. 'కుముదా! ధైర్యంగా వుండు. నీకు వివాహపు శుభాకాంక్షలు. రవి మోహన్ రూపంలో వచ్చిన అదృష్టం, నీ ఎంపిక బాగున్నది. ఏదైతే నేను ఇవ్వలేకపోయానో అవన్నీ నీకు భగవంతుడు అనుగ్రహిస్తాడు. రవిమోహన్ ద్వారా నీకవి దొరకుతాయి' అన్నాడు.

**విదుషీరత్న డా॥ సరోజినీ కులశ్రేష్ఠ్ సాహిత్య, పురస్కార విశేషములు**

**జీవనరేఖలు :** వీరు ఫిబ్రవరి ఒకటి **1923** వ సంవత్సరంలో మధురా ప్రాంతం, ఉత్తర ప్రదేశ్ నందు జన్మించారు. ఎమ్.ఎ. పి.హెచ్.డి. పట్టభద్రులు, రఘునాధ బాలికల డిగ్రీ కాలేజ్ మీరట్ నందు **1951** నుండి **1954** వరకు, హిందీ విభాగాధ్యక్షురాలిగా సావిత్రీ మహిళా డిగ్రీ కాలేజ్ అజమీర్ లో **1954** నుండి **1951** వరకు, కిశోరీ రమణ స్నాతకోత్తర మహిళా విశ్వవిద్యాలయం మధురలో **1957** నుండి **1983** వరకు ప్రిన్సిపాల్ గా పనిచేశారు.

**కథా రచన : 1980** లో 'చాంద్ కీ పాయల్', **1992** లో 'బ్రజ్ కీ లోక కహానియాం', **1995** లో కపాస్ కే ఫూల్, "ఘరౌందా టూటతాహుదా" మొదలగు కథా సంపుటాలను వెలువరించారు.

**ఇతర రచనలు :** 'హిందీ సాహిత్య మే కృష్ణ' పరిశోధన గ్రంధం – **1960**
'సాధన' – కవితా సంగ్రహం – **1960**
'గీలేనయనా, 'భీగీపలకేం' గీతాల సంగ్రహాలు – **1970**
'బాంసురీ హుం మైతుమ్హారీ – గీత సంగ్రహం – **1980**
'స్మృతియోంకే పోస్టర్' – కవితా సంగ్రహం – **1995**
'ఆజా రీ నిందియాం' – జోల పాటలు – **1996**
'భోర్‌భయీ – అబ్ జాగో ప్యారే' – ప్రభాత గీతాలు – **1996**
'యే ప్యారే – ప్యారే జీవజగత్ కే' – బాల కవితా సంగ్రహం – **1991**
'నన్హే – మున్నే గాయేం' – గీతాలు **1998**
'హంస్ మోతీ చుగతా హై' – **1999**
'విస్మృతా – ఖండకావ్యం' – **2000**

**సంపాదకీయం వహించిన పుస్తకాలు :** సాత్ ఏ కాంకీ
ప్రతినిధి ఏకాంకీ సంగ్రహ్
కబీర్‌సాఖీ, తులసీవార్తా రెండవ భాగం
బఢతే కదమ్, బదల్ తే ఆయామ్
కథాలోక్ – పిల్లల కథలు

**ఆకాశవాణి కేంద్ర ప్రసారణ :** ఢిల్లీ, మధుర, అజ్మీర్, అహమ్మదాబాద్, లక్నో, జమ్మూ – శ్రీనగర్ కేంద్రాల నుండి వీరి కార్యక్రమాలు ప్రసారమయినాయి.

పురస్కారాలు : వీరు పొంది పురస్కారాలకు లేక్కే లేదు. అందులో కొన్ని 'విదుషీ రత్న' – అఖిల భారతీయ బ్రజ సాహిత్య సంగమ్, ఆగ్రా – **1984.**

'లోక సాహిత్య వాచస్పతి' – బ్రజలోక సాహిత్య సమ్మేళన్ – ఏత్మదాపూర్

'సాహిత్య మహోపాధ్యాయ' – హిందీ సాహిత్య సమ్మేళన్, ప్రయాగ – **1990**

'సాహిత్యమణి' – బాబూ వృందావనదాస్ హిందీ సంస్థాన్, మథుర – **1991**

'స్మృతియోంకే పోస్టర్' భారత్ భారతీ' – అలీఘడ్ – **1997**

'బాలసాహిత్య భూషణ్' – భారతీయ బాల కళ్యాణ్ సంస్థాన్ – కాన్పూర్ – **1999**

'ఉత్తరప్రదేశ్ మహిళా వేదిక' – మీరట్ నుండి సత్కారాన్ని పొందారు.

'సారస్వత సమ్మాన్, భారతీయ సాహిత్య పరిషత్ ప్రయాగ వారి ద్వారా బంగారు పతకాన్ని పొందారు. వీరి ద్వారానే 'బాల కవయిత్రి' అన్న బిరుదును అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా స్వీకరించారు.

'బాలసాహిత్యశ్రీ' – బాలసాహిత్యసమ్మాన్ – లక్నో

'రాష్ట్ర భాషా ఆచార్య' – అఖిలా భారతీయ సాహిత్య కార్ అభినందన సమితి – మథుర

'సాహిత్య సరస్వతీ పతకం – ఉత్తరప్రదేశ్ కళా సంస్కృతీ సాహిత్య విద్యా పీఠం

'సూరసాహిత్య ఏవం బ్రజసంస్కృతసమ్మాన్ – సూర స్మారక మండలి – **2001**

ఇంకను మరికొన్ని సంస్థల నుండి వీరు సత్కారాలు పొందివున్నారు. వీరికి లభించిన బిరుదులైన 'విదుషీరత్న', సాహిత్య సరస్వతీ' అనువాటిని సార్థకం చేసుకున్నారు.

ప్రస్తుత కథలు "ఘరౌందా టూటతా హువా" అనే కథల సంపుటిలోనివి. ఈ కథల్లో కల్పన తక్కువ. వాస్తవికత ఎక్కువ వున్నాయని రచయిత్రే స్వయంగా తెలియజేశారు.

మొదటి కథ 'చినగారీ', అంటే 'నిప్పు రవ్వ' అని అర్థం. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వారు నిప్పురవ్వల్లాగా ఎగిసి తోటి వారికి ఎలా వెలుగులు పంచారో, దేశభక్తిని ఎలా పెంపొందించారో విశదంగా వర్ణించబడింది.

రెండవ కథ "ఫిర్ వసంత్ ఆయా" అంటే 'మరలా వచ్చిన వసంతం' అని అర్థం. తనకు అన్యాయం జరిగిందని బాధపడుతూ కూర్చోకుండా, సమాజం ఏమనుకుంటుందో అని భయపడకుండా స్త్రీ ముందుకు వచ్చి చదువుకోవటం, ఆ తర్వాత మరలా వివాహం చేసుకోమని జీవితంలో స్థిరపడమని బోధించే కథ ఇది.

# నిప్పు రవ్వ

ప్రఫుల్ల కుమార్ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వీరుడు. ఒకసారి రైల్లో వారి పరిచయమయ్యింది. ఇప్పుడు వృద్ధులయ్యారు. తెల్లని శరీర ఛాయ, స్వాతంత్ర్య పోరాటం నాటి తేజస్సు ఇప్పటికీ వారి కళ్ళలో కనపడుతుంది. లేత ఎరుపు రంగులో వున్న వస్త్రాలు ధరించియున్నారు. వృద్ధాప్యపు సౌందర్యానికి అలంకారంగా వుంది ఆయన గడ్డం. మొత్తం కలగలిపి భవ్యవ్యక్తిత్వం రూపుదిద్దుకున్నట్లుగా సహజమైన ఆకర్షణ కల్గిస్తుంది ఆయన ఆకారం. వారు మధుర నుండి ఢిల్లీ గుండా మీరట్ వెళ్తున్నారు.

ఢిల్లీ స్టేషన్‌లో నేను ట్రైను ఎక్కినప్పటి నుండి వారు హిందీ పేపరు చదువుతూనే వున్నారు. వారి పక్క సీట్లోనే నేను కూర్చున్నాను. పది నిముషాల తర్వాత వారు రైలు దిగి వచ్చి ప్లాట్ ఫామ్ మీద పచార్లు చేయనారంభించారు. ఎందుకంటే బండి బయల్దేరటానికి ఇంకా సమయముంది కాబట్టి. కుతూహలంగా నేను వారి బ్యాగు మీద వ్రాసి వున్న పేరు చదివాను. ప్రఫుల్ల కుమార్ అన్న పేరు వినగానే పాత జ్ఞాపకాలు నన్ను తట్టి లేపినాయి. కాని వారిని ఎక్కడ చూసానో గుర్తురావటం లేదు. మీరట్‌తో నా గతస్మృతులు ఎన్నో ముడి వేసుకున్నాయి. నా కాలేజీ చదువు ముఖ్యంగా ఆ సమయంలో జరిగిన 1942 సంవత్సరం నాటి "భారత్ ఛోడో ఆందోళన" జరిగినప్పటి జ్ఞాపకాలెన్నో.

ప్రఫుల్లకుమార్ గారు మరలా రైల్లోకి వచ్చి కూర్చున్నారు. నేను వారి వంక చూస్తూ మాటలు కొనసాగించాను, "మీరు మీరట్‌లో వుండేవారా?"

"ఒక విధంగా మీరట్లోనే వుంటున్నాను"

"అంటే అర్థమేమిటండీ?"

"ఇప్పుడు బృందావనం గాని, హరిద్వారానికి గానీ తిరుగుతున్నాను".

"మీరు సన్యాసమేమైనా తీసుకున్నారా?"

"అదేం లేదు, దేన్ని బట్టి మీరు అలా అంటున్నారు? సన్యాసమంటే మీ ఉద్దేశ్యమేమిటి? అంటూ ప్రఫుల్లకుమార్ గారు నన్నే ప్రశ్నించారు.

"మీరు సన్యాసాన్ని ఎలా నిర్వచిస్తారో చెప్తారా?" ప్రస్తుతం మీరు చేసే పని" అంటూ ఆగాను.

"సాధువుల మధ్య వుండి వారిని సంఘటిత పరచి దేశసేవ చేయాలన్న సంకల్పమే వారిలో కల్గించాలని ప్రయత్నిస్తున్నాను. సాధువులందరూ శ్రేష్ఠ మనుష్యులు. కాని వారందరూ తమ ఆశ్రమాలు, సంప్రదాయ పరిరక్షణ, వాటి ప్రచారంలో నిమగ్నమైవున్నారు. దేశ క్షేమం సంపూర్ణ రక్షణ గురించి ఆలోచనే చేయటం లేదు. వారందరూ సంఘటితంగా కూడా ఉండటం లేదు, 'తన డప్పు తన రాగం' అనే సామెతను చరితార్థం చేస్తున్నట్లుగా వుంటున్నారు". అని తన అభిప్రాయం చెప్పారు.

నేను మీరట్ ను వదిలి చాలా సంవత్సరాలు అయింది. మీరట్ విశేషాలు ఏమన్నా తెలుసుకోవాలని నా మనస్సు తహ తహలాడుతుంది. అందువలనే వారితో సంభాషణ కొనసాగిస్తూనే వుందామనుకున్నాను. "నేను మీరట్ కాలేజీ విద్యార్థినిని. **1942** లో జరిగిన భారత్ ఛోడో ఆందోళన సమయంలో అక్కడే చదువుకుంటున్నాను. రాజనీతిశాస్త్రం నా సబ్జెక్టు. అప్పట్లో జాతీయగీతాలు పాడి వినిపించిన ప్రఫుల్ల కుమార్ గారు మీరేనా?" అన్నాను.

"ఓ మీరు నన్ను బాగా గుర్తించారు. ఆనాడు స్వాతంత్ర సంగ్రామంలో నా మనసులో వున్న అగ్ని అంతా కవితలు వ్రాస్తే కాని చల్లారేది కాదు. విద్యార్థులు, విద్యార్థినులు ఒక చోట చేరి నాతో జాతీయ కవితలు పాడి వినిపించుకునేవారు. వారి కోరిక తీరేంత వరకు విన్పిస్తూనే వుండేవాణ్ణి. అయినా నా మనసుకు తృప్తి వుండేది కాదు. ఇంటికి వెళ్ళి గోడల వైపుకు తిరిగి వాటికి విన్పించే వాణ్ణి. పెరట్లోకి వెళ్ళి చెట్లకూ, మొక్కలకూ విన్పించేవాణ్ణి. జాతీయ భావన అణువణువులో నిండాలన్నదే నా కోరిక, స్వాతంత్ర్యం సంపాదించాలి, అది పొందటానికే ప్రయత్నించాలి. ఆ ప్రయత్నం వైపుకే నడవాలి అదే కోరిక". అన్నారు అలనాటి ఉత్సాహం ఏ మాత్రం తగ్గకుండా.

వారి మాటలు వింటుంటే నా మనస్సు కూడా ఉప్పొంగుతున్నది. ఆ ఉత్సాహంతోనే మరలా మాటలు కొనసాగించాను. నేనప్పుడు బి.ఏ. మొదటి సంవత్సరం చదువుతున్నాను. విద్యాలయానికొచ్చి ఒక నెలే అయింది. అందరితో పూర్తిగా పరిచయం కూడా కాలేదు. మా విద్యార్థినుల తరగతి గది ఎదురుగా పెద్ద వేప చెట్టుండేది. ఆరోజు ఆగష్టు ఎనిమిదవ తారీఖు చాలా మంది విద్యార్థినులం ఆ చెట్టు క్రింద చేరాం. నలుగైదుగురు అటూ ఇటూ తిరుగుతున్నారు కాని కొంతమంది మాత్రం అక్కడే నిలబడ్డారు. నాకు తెలియకుండానే ఎంతో ఉత్సాహంతో, ఉద్రేకంతో అక్కడున్న విద్యార్థినుల్ని సంభోదిస్తూ రేపు ఆగష్టు తొమ్మిదవ తేదిన ఏదో హడావుడి, కలకలం తప్పకుండా జరుగుతుంది. మనమంతా ఈ విధంగా నింపాదిగా కూర్చోకూడదు" అంటూ చెప్పుకుపోతున్నాను.

నన్ను అడ్డగిస్తూ నాకు పరిచయమున్న నాతోటి విద్యార్థిని "ఏం చెప్తున్నావు నువ్వు"? ఇటువంటి మాటలు మాట్లాడకు, కలకలమేంటి, హడావుడి ఏంటి? అవన్నీ రావాలనుందా నీకు?" అన్నది.

"వీరబాల అనే విద్యార్థిని ఆ సమయంలో అక్కడకొచ్చి నిలబడి మా మాటలు విన్నది. ఇంకా, "విమల సరిగానే చెప్పింది. రేపు ఏదైనా జరగొచ్చు, మీరంతా సిద్ధంగా వుండండి" అన్నది.

నా మాటల్ని ఇంతగా సమర్థిస్తూ మాట్లాడే విద్యార్థిని ఎవరై వుంటుందీమె అని కుతూహలంగా ఆమె వంక చూడసాగాను. సాదా అంచున్న తెల్లని ఖాదీ చీరకట్టుకుని వున్నది. వెంట్రుకలను ముడిగా చుట్టుకొని వున్నది. కనీసం పాపట కూడా తీసుకోలేదు. రెండు చేతులకు గాజులంటూ లేవు. ఎడమ మణికట్టుకు ఒక గడియారం పెట్టుకుని వున్నది. గుండ్రని ముఖం చెక్కినట్లున్న ముక్కు, తీక్షణమైన తేజస్సు ఉట్టిపడే కళ్ళతో వున్నది. ఆమె ముఖంలో దాస్యభావపు ఉదాసీనత ముద్రించి నట్లుగా కనపడుతున్నది. మొత్తం మీద చూడటానికి కర్తవ్యనిష్ఠాపరాయణురాలిగా వున్నది" అని వివరంగా చెప్పాను.

"ఎవరన్నావు? ఆమె పేరేంటి?" అని ప్రఫుల్ల కుమార్ గారు ఒక్కసారిగా అడిగారు.

ఆమె పేరు వీరబాల అని చెప్పాను.

నేను ఆ మాట చెప్పగా విని వారు కిటికీ బయట నుండి చెట్లను వాటి మీద వాలిన పక్షుల్నీ చూడసాగారు. చాలా సేపటి వరకు క్షితిజరేఖవైపు చూపులు నిగిడ్చారు. మరలా నా వైపుకు తిరిగి "వీరబాలా? ఎవరా వీరబాల" అని అడిగారు.

"స్వాతంత్ర్య సంగ్రామం లో దూకిన వీరనారీమణి, మీరట్ స్వాతంత్ర్య పోరాటంలో ఆమెలాగా పాటుపడిన మహిళ మరొకరు లేదు. అప్పుడామెకు వయస్సు కూడా తక్కువే. కాని దేశభక్తి కలిగి వుండి దేశం కోసం పాటు పడుతూ ఎంతో ప్రౌఢ వ్యక్తిలా ప్రవర్తించింది. వెలుగు కోసం, ఏ ఆందోళన చేయటానికైనా వెనుదీయని వ్యక్తిత్వం ఆమెది" అన్నాను మనస్ఫూర్తిగా.

"అవును ఈ విషయం ముమ్మాటికీ నిజం. ఆమె విప్లవం కోసమే ఎదురు చూస్తూ వుండేది. విప్లవంతోనే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందనేది. భగత్‌సింగ్, రామ్‌ప్రసాద్ బిస్మిల్ అస్ఫాన్‌లను ఉరి తీయటంతో ఆమె హృదయం కంపించిపోయింది. తానూ కఠినంగా మారిపోయింది. దేశం కోసం తన సుఖాలన్నింటినీ త్యాగం చేసింది" అన్నారు ప్రఫుల్లకుమార్ గారు.

"మీరు కూడా ఆమెనెరుగుదురా? మీ కవితలు ఆమె చాలా ఇష్టంగా వినేది" అన్నాను.

వారు మర్మంగా నవ్వారు.

నేను అదే ఉత్సాహంతో మాట్లాడసాగాను. "ఆరోజు ఆగష్టు తొమ్మిదవ తారీఖు, నేను కాలేజీ కొచ్చాను. కాలేజి అంతటా నిశ్శబ్దంగా వున్నది. కొన్ని క్షణాలు కాగానే ప్రొఫెసర్ కపూర్ గారు ఇంచుమించుగా పరిగెత్తుకొచ్చి విమలా! నువ్వు ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. వెనక్కు తిరిగి ఇంటికెళ్ళు. నీతోపాటు నా కూతుర్నీ తీసుకొని బండి చేసుకుని వెళ్ళండి, అని చెప్పారు. ఒక వైపు నా మనసెంతో ఉత్సాహంగా వుండి సమరంలో పాల్గొనటానికి ఉరకలు వేస్తున్నది. నిన్న వేప చెట్టు క్రింద ఈ సమరానికి, వెలుగును చూడటానికి అంకురార్పణ జరిగింది. నాకు సహకారం కూడా లభించింది. నేను ఆరవ తరగతి చదివేటప్పటి నుండే దేశానికి స్వాతంత్ర్యం రావాలి. దానికోసం నేను కూడా ఏదైనా చెయ్యాలి అనుకునేదాన్ని. దాన్ని గురించే ఎన్నో కవితలు వ్రాశాను. ఇటువంటి భావాలెన్నో నాలో చెలరేగుతున్నాయి. మనం చచ్చిపోయినా సరే, దేశానికి స్వాతంత్ర్యం మాత్రం రావాలి. ఇప్పుడు నాకొక అవకాశం వస్తుంటే ఈ ప్రొఫెసర్ కపూర్ గారు నన్ను ఇంటికి తిరిగి వెళ్ళమని చెప్తున్నారు. కాని నేను తిరిగి వెళ్లను. నేను కూడా ఊరేగింపులో పాల్గొనవలసిందే. ఆంగ్లేయులారా! మా భారతదేశాన్ని వదిలివెళ్ళండి. భారతమాతాకీ జయ్ అన్న నినాదాలు వినిపిస్తున్నాయి అన్ని తరగతి గదుల్లోని, ప్రయోగశాలలలోని అద్దాలు భళ్ళున పగిలే శబ్దం వినపడుతున్నది.

కాని ప్రొఫెసర్ కపూర్ గారు అరవసాగారు, "విమలా! నీ తండ్రి ప్రభుత్వోద్యోగి, ఆఫీసరు హోదాలో పనిచేస్తున్నారు. ఆలోచించు, నువ్వు వెంటనే తిరిగి ఇంటికెళ్ళు. నా కూతుర్ని గూడా తీసుకెళ్ళు అంటూ ఆయన నా చెయ్యి పట్టుకుని బయటకు లాక్కొచ్చారు. అలా మేం తిరిగి వెళ్ళే సమయంలో ఊరేగింపుకు వీరబాల నాయకత్వం వహించి కనపడింది. ఆమెనన్ను చూడలేదు. అయితే ఆమెతో పాటు మరొక పురుషుడున్నాడు. వారిని నేను సరిగా చూడలేదన్నాను."

" ఆ పురుషుణ్ణి నేనే అన్నారు" వెంటనే.

"నిజంగానా? మీకు వీరబాలతో బాగా పరిచయమున్నదా?" అని ఎంతో ఆశ్చర్యంగా అడిగాను.

"పరిచయమే కాదు, చాలా గొప్ప స్నేహితులంకూడా".

"చాలా మంచిది, అలాంటి స్వచ్ఛ బాలికతో స్నేహం అంటే అంత తేలిక ఏం కాదు. కాలేజీలో ఈ విషయం ఎవరికీ ఏమి తెలియదు".

"మా విషయం కాలేజి దాకా వచ్చుండకపోవచ్చు. మధ్య మధ్యలో మేం కొద్దిగా ప్రేమాలాపాలు కూడా చేసేవాళ్ళం. కాని కేవలం మా ధ్యాసంతా దేశ స్వాతంత్రం మీదే. అదే మా వ్రతంగా పెట్టుకున్నాం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే పెండ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం". అంటూ వారు గాఢంగా నిట్టూర్చారు.

"వీరబాలకు కఠిన కారాగార వాస శిక్ష పడిందని విన్నాను" అన్నాను నెమ్మదిగా

"అవును, నేను గూడా అక్కడే వున్నాను. మా పార్టీలో పని చేసే ఇతర సభ్యుల పేర్లు చెప్పమని మమ్మల్ని వత్తిడి చేశారు. అలా చేస్తే మమ్మల్ని జైల్లో నుండి వదిలి పెడ్తామనే ఆశ చూపించారు. తరువాత కొన్నాళ్ళకు నేను విడుదలయ్యాను. ఆరు నెలల పాటు జైలు యాతనలనుభవించి ఆమె అక్కడే వీరమరణం పొందింది. దేశం కోసం ప్రాణం అర్పించి వీరస్వర్గం అధిరోహించింది. అన్నారు" ఎంతో బాధగా.

"వీరబాల వీరమరణం పొందిందన్న వార్త వినగానే విద్యార్థినులందరిలో రోషావేశాలు పెల్లుబుకినాయి. నాకు ఆగష్టు ఎనిమిది, పందొమ్మిదివందల నలభై రెండు నాటి మధ్యాహ్నం జ్ఞాపకం వచ్చింది. నాలో నేను చాలా దు:ఖ పడ్డాను. ఆమె స్థానంలో నేను ఎందుకు పనిచేయకూడదు. ఆమె స్థానంలో నేనూ ఎందుకు జైలుకు వెళ్ళగూడదు? అని ఆలోచించాను" అన్నాను.

"మీరైతే చాలా కోమలంగా వున్నారు. అదే విధంగా ఆలోచిస్తున్నారు. వీరబాల చాలా కఠోరంగా వుండేది. అవసరమొస్తే విరుచుకుపడేది, ఎక్కడ, ఎవరికీ లొంగే స్వభావం కాదు" అన్నారు

"వీరబాల కవితలు కూడా రాస్తూ వుండేది" అన్నాను.

"కవితలు ఎలా వ్రాసేదో తెలుసా? "నిప్పులు చెలరేగుతున్నవి, వాటిని ఇంకా ఎగదోద్దాం అంటూ, నేనూ అలాంటి కవితల్నే చాలా వినిపించే వాడిని, మా ఇద్దరిలో ఎవరు వ్రాసినా ఎవరు పాడినా ఒకటేనన్న భావంతో వుండేవాళ్ళం. మేం ఇద్దరం కాదు. ఒకరమే అనుకునేవాళ్ళం. చనిపోయే ముందు ఆమె ఏం చెప్పిందో తెలుసా? "నీవు నా కలల్ని పూర్తి చేయాలి, మనం కలలుగన్న భారతదేశాన్ని నిర్మించాలి" కాని అంటూ ఆయన క్షణం సేపు ఆగి మరలా ప్రారంభించారు". ఇప్పుడేం జరుగుతుంది? మనమేమీ చెయ్యలేకపోతున్నాం, నానాటికీ నైతికంగా దిగజారే వాళ్లను గురించి రోజు రోజూ వింటున్నాం" అన్నారు బాధగా "అందుకనే మీరు సాధువులయ్యారా?"

"వీరబాల చనిపోగానే, నేను కూడా ఒక విధంగా చనిపోయినట్లే, సాధువుగా మారాను. కాని ఆ తర్వాత నాలో జీవించాలని, భారతదేశ అఖండత కోసం పని చేయాలనే కోరిక ఉత్పన్నమయింది"

"వీరబాల అటు తన పేరుతోనూ, ఇటు తనపనులతోనూ నిజంగా వీరబాలే. కాని ఆమె ఎంత అదృష్టవంతురాలో? ఎంత సౌభాగ్యశీలో? ఆమె మృత్యువు తరువాత ఆమె ప్రేమికుడు ఆమె సమాధి మీద ఈ రోజు వరకు ఆమె ఆశయాల పుష్పాలనే అర్పిస్తున్నాడు". అన్నాను వినమ్రంగా.

మీరట్ స్టేషను రాగానే ఆయన్నుండి వీడ్కోలు తీసుకున్నాను. మా ఇద్దరి కన్నుల్లో కన్నీటి బాష్పాలు. చాలా సంవత్సరాలు క్రిందటి వీరబాల నేడే వీరగతి పొందిందా అన్నట్లు వుంది మా పరిస్థితి.

## ఆధునిక కథాకారుడు శ్రీ లక్ష్మీకాంత్ త్రిపాఠి

జీవన రేఖలు : వీరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని, ప్రతాప్ గఢ్ జనపదం దగ్గర కూరాడీహ్ గ్రామమునందు **1965**వ సంవత్సరంలో జన్మించారు. అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఎ. పట్టాను పొందారు. విభిన్న పత్రికల్లో వీరి గీతాలు, గజల్సు, కవితలు, కథలు ప్రచురింపబడినవి.

కథారచన : ఆత్మ నివేదన్, సుబహ్‌హోనే తక్, మనోహర్‌లాల్, ఝూర్, బడేబాబ్, ఏక్‌రాత్, వహ్‌బూఢా ఆద్మీ మొదలగు కథలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి.

ఇతర రచనలు : “శహర్‌మే అజన బీహు” అనే గజల్ సంకలనాన్ని వెలువరించారు.

రచనా విశేషం : టాల్‌స్టాయ్ వ్రాసిన “కితనీ జమీన్” అనే కథ తనను చాలా ప్రభావితం చేసిందని, అలాగే టాల్‌స్టాయ్ వ్రాసిన ‘పునరుద్ధాన్’నవలా ప్రభావం కూడా తనమీద చాలా వుందని శ్రీలక్ష్మీ కాంత్ త్రిపాఠి గారే వ్రాసుకున్నారు. వీరు రాసిన కథల్లో పూర్తి ప్రపంచ విషయాలు పాఠకులకు గోచరమవుతాయి.

వీరి ప్రస్తుత కథలు “నయారిక్షా”, “నోనీలు”. సమాజంలో మన చుట్టూ జరిగే సంఘటనలపట్ల స్పందిస్తూ పేదవాడైన రిక్షావాలా కష్టాన్ని తెలియజేస్తూ అతని ఆత్మాభిమానాన్ని ప్రశంసిస్తూ రచయిత పొందిన అనుభూతిని నయారిక్షా కథలో చక్కగా వర్ణించారు.

ఛత్తీస్ గఢ్‌లోవున్నప్పుడు ఇంట్లో పనిపాటలు చేసే “నోనీ” అనే ఆదీవాసీ బాలికపట్ల తనలో కలిగిన భావాలను, తన కర్తవ్యాన్ని గుర్తెరిగి మసలుకున్న తీరు, కథలోని ప్రధాన పాత్ర ద్వారా చక్కగా విశ్లేషించారు. **2004** నుండి **2006**వ సంవత్సరము వరకు శ్రీ నరేంద్ర పుండరీక్ అనే మిత్రుని సాహచర్యంలో చక్కగా గడిపానని అప్పుడే ఈ “నయా రిక్షా, నోనీ” కథలు “అక్షర పర్వ్”, “పాఠ్” అనే పత్రికల్లో ప్రచురింపబడి తనకు చాలా మంచి పేరు తెచ్చిపెట్టాయని రచయిత తెలియజేస్తున్నారు.

# కొత్త రిక్షా

గౌరవప్రదమైన నా విధినిర్వహణలో బాందా ఆఫీసులో చేరాల్సిన మొదటి రోజు. ఆఫీసుకు వెళ్ళటానికి తయారయి తొమ్మిదిన్నర గంటలకల్లా బయలుదేరి బయటకొచ్చాను.

జూన్ 16న అకస్మాత్తుగా అలహాబాద్ నుండి బాందాకు నాకు బదిలీ అయ్యింది. వెంటనే డ్యూటీలో చేరి బాధ్యతలు చేపట్టవలసిందిగా నాకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. అలా అందిన మరుసటి రోజే నేను బాందా వెళ్ళి, పన్నుల విభాగాధికారిగా నా బాధ్యతలు స్వీకరించాను. ఆనాటి రాత్రికి మరలా అలహాబాద్ తిరిగి వెళ్ళిపోయాను.

బాందాలో అధికార నివాసం ఏమీ లేదు. బాందాలో పనిచేసేవారందరూ శాఖాధికారితో సహా అద్దె ఇళ్ళలోనే వుండేవారు. కొద్దిమంది ఉద్యోగులకు మాత్రం స్వంత ఇళ్ళున్నాయి. రెండు రోజుల తర్వాత మరలా బాందా వెళ్ళి ఇద్దరు ఉద్యోగుల సహకారంతో ఇళ్ళవేటలో పడ్డాను. వికాస్ కాలనీలో మూడు గదుల ఇల్లు మూడు వేల రూపాయలు అద్దెలో లభించింది. ఇల్లు దొరికింది కాబట్టి అలహాబాద్ నుండి సామాను వేసుకుని భార్యాపిల్లలతో బాందా వచ్చేశాను.

ఈరోజే మొదటిసారిగా బాందా ఇంటిలో నుండి ఆఫీసుకు బయలుదేరుతున్నాను. ఇంటి దగ్గర నుండి నడుచుకుంటూ తిందవారీ కూడలి దగ్గరకొచ్చాను. ఆ కూడలికి ఎదురుగా కొంతమంది రిక్షా వాలాలు తమతమ రిక్షాలతో నిలబడి బాడుగలకోసం చూస్తూ వున్నారు. వాళ్ళంతా రిక్షాకావాలా బాబూ అన్న దృష్టితో నావంక చూస్తున్నారు. నేనొక రిక్షా అతన్ని చేతితో సైగ చేసి పిలిచాను. అతను ఇంచుమించు ఏభై ఏళ్ళవాడు. తలంతా తెల్లబడిపోయింది. గడ్డం కూడా తెలుపు నలుపులతో వున్నది. అంతే కాకుండా అస్తవ్యస్తంగా బాగా పెరిగివున్నది. నా సైగ అందుకుని అతను తన రిక్షాతో పాటు నా ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. బాగా అలసిపోయినట్లుగా వున్నాడు. పైగా చాలా బలహీనంగా కూడా వున్నాడు. అతడు తన పరిస్థితులవలన వయసుకు మించి వృద్ధుడిగా కనపడుతున్నాడు. వెంటనే, నేను టైముకు ఆఫీస్‌కు వెళ్ళాలన్న స్పృహ కల్గింది. ఈ రిక్షా అతను చాలా నెమ్మదిగా తొక్కుతాడు. అలా అయితే నేను టైమ్‌లోపల ఆఫీసుకు చేరలేకపోవచ్చు అనుకుని "నువ్వాగు" అన్నాను అతనితో. అతడు నిరాశగా నావంక చూడసాగాడు.

కొంచెం దూరంలో నిలబడ్డ ఒక బలిష్ఠుడైన రిక్షావాలా నావంక తదేక దృష్టితో చూడగం గమనించి అతణ్ణి రమ్మని చెయ్యివూపాను.

నా దగ్గరగా నిలబడ్డ వృద్ధ రిక్షా వాలా తన మిణుకుమిణుకుమనే చూపులతో నన్ను చూస్తూ "కూర్చోండి సార్! నేను కూడా త్వరగానే మిమ్మల్ని ఆఫీసుకు చేరుస్తానన్నాడు."

సరే అని అతని రిక్షాలోనే కూర్చున్నాను. అతను ఎగిరెగిరి రిక్షా తొక్కుతున్నాడు. రిక్షా సీటంతా చిరిగిపోయివున్నది. లోపలవున్న మెత్త అంతా ధ్వంసమైపోయివున్నది. సీటు లోపల వుంచిన కొబ్బరిపీచు బయటకొచ్చి కనపడుతున్నది. రిక్షా పెడలుకూడా విరిగిపోయివున్నది. ఇలాంటి రిక్షా నడపటానికి అతను చాలా శ్రమ పడవలసివస్తున్నది. ఆ రిక్షాలో కూర్చున్ననాకు కూడా చాలా అసౌకర్యంగా వున్నది. రిక్షా

# నోనీ

తొమ్మిదిన్నరకల్లా నేను నా, గవర్నమెంటు బంగళానుండి బయటకు వచ్చి ఆఫీసుకు బయలుదేరాను గాని, నా ఆలోచనలన్నీ "నోనీ" చుట్టూనే తిరుగుతున్నాయి. నా మనసులోని చికాకును, బాధను దాచుకోవటానికి చాలా ప్రయత్నం చేస్తున్నాను. ఏ భ్రమల్లో పడకుండా, ఏ ఆలోచనల్లో కొట్టుకునిపోకుండా బుద్ధి జీవిలాగా ఆలోచించాలి. వ్యావహారికంగా నేను సఫలుణ్ణికావాలి. అటువంటి వ్యవహారశైలిలోనే నా ఆశయాలన్నీ భౌతికంగా సఫలమవుతాయి. ఇలాంటి ఆలోచనల్లో పడి తహసీల్దారు ఆఫీసుకెప్పుడొచ్చానో, మెయిన్ గేటు ఎప్పుడు తెరిచారో నా వాహనం లోపలికెళ్ళటానికి, నేను గమనించనేలేదు. నా బంట్రోతు బ్రీఫ్ కేసునూ, వాటర్ బాటిల్ అందుకోవటానికి నా ముందుకొచ్చినపుడు నాకు చైతన్యం కల్గింది.

విశ్రాంతిగా, కుదురుగా నాకుర్చీలో కూర్చున్నాను. నాలోపల సుడులు తిరిగే ఆలోచనల్ని వెనక్కు నెట్టేయాలని, దూరంగా గెంటేయాలని ఎంతో ప్రయత్నిస్తున్నా. కాని సాధ్యపడటం లేదు. నా ఎదురుగా వున్న టేబుల్ మీదున్న ఫైల్స్ క్రమ పద్ధతిలో సర్దివుంచబడ్డాయి. వాటన్నింటిని తనిఖీ చేసే బాధ్యత నామీదే వున్నది. రోజూ కన్నా ముందే ఇవ్వాళ ఆఫీసుకొచ్చాను. ఇంటి నుండి బయలుదేరేటప్పుడు రోజంతా ఆఫీసులోనే వుండాలి. ఎటూ విజిట్‌పెట్టుకోకుండా పెండింగ్‌లోవున్న ఫైల్సన్నీ తనిఖీ చేసి పంపేయాలనుకుంటూ వచ్చాను. కాని ఇక్కడి కొచ్చి గంటపైగా అయింది. నేను ఆలోచిస్తూ కూర్చోవటమే కాని ఏ పనీ చెయ్యలేకపొయ్యాయని అర్థమయ్యింది.

అకస్మాత్తుగా "నోనీ" వచ్చి విగ్రహం లాగా, నిశ్శబ్దంగా నిలబడి నావంక జాలిగా చూస్తున్నది. ఆమె ప్రత్యక్షంగా ఇక్కడ లేదు. కాని మాటి మాటికీ నా కళ్ళముందే కనపడుతున్నది. ఈ రోజు ఉదయమే "నోనీ" వెళ్ళిపోయింది. అలా చెప్పేకన్నా ఆమె బలవంతంగా బయటకు పంపేయబడింది అనటమే సరియైనది. ఎందుకో తెలియదు. నోనీ ఆలోచనల్లో పడి ఎందుకు కొట్టుకుపోతున్నానో నాకే తెలియదు.

కొన్ని విషయాలు బుద్ధినంటి పెట్టుకునే వుంటాయని పెద్దవాళ్ళు చెప్తారు. నోనీ నాకేమవుతుంది? ఆమెతో ఏ సంబంధమున్నది? ఆమె వెళ్ళిపోయిందంటే నేనెందుకింత బాధపడుతున్నాను? నాకళ్ళలో తడి కూడా ఊరుతుంది. ఇదేమి భావుకత? ఇంత అశాంతి ఎందుకో అసలర్థం కావటం లేదు. నోనీ ఎందుకు ప్రత్యక్షమవుతుంది? నా యక్ష ప్రశ్నలకు నాకే సమాధానం తెలియటం లేదు. జీవితంలో ఎంతో మంది కలుస్తూ వుంటారు. విడిపోతూ వుంటారు. ఈ ఉరుకుల, పరుగుల జీవితంలో ఎవరు? భావాల సంకెళ్ళలో బంధించివేస్తుంది? ఆలోచనల కంతూ దరే లేదు.

పెద్దగుమాస్తాగారు చాలా గౌరవంగా నా టేబుల్ ఎదురుగా వచ్చి నిలబడ్డారు. ఆయన చేతిలో ఏదో ఫైలున్నది. గుమస్తాగారిని చూస్తూ ఉండిపోయాను. నా స్థితి నుండి నన్ను బయటపడవెయ్యటానికి ఆయనన్నాడు. "చూడండి సార్! ఈ ఫైలు చాలా అర్జంట్. ఈ రోజే స్టేట్‌మెంట్ పంపించాలి. అంటూ ఆ

ఫైల్ నాకందించాడు. నేను దానివంక చాలా శ్రద్ధగా చూశాను. కాని అదేదో నాకు తెలియని విషయంలా అనిపించింది. "సరే మంచిది. అలాగే పంపిద్దాం" అంటూ ఆయనకు భరోసా ఇచ్చాను. ఆయన వెళ్ళిపోయాడు.

అర్జంటు ఫైలయితే తప్పనిసరిగా చూడాలనుకుంటూ ఆ ఫైలును తిరగేశాను. మెదడుకు పదునుపెట్టి కార్యభారపు గుఱ్ఱాలను పరుగెత్తించాను. కాలింగ్ బెల్ కొట్టగానే చపరాసీ వచ్చాడు. స్టెనోను పిలవమన్నాను. వచ్చిన స్టెనోకు డిక్టేషను ఇచ్చాను. స్టెనో మేటరు టైపు చేసి తెచ్చాడు. సరిచూచి నా సంతకంచేసి దాన్ని డిస్పాచ్‌లో పంపే గుమస్తా దగ్గరకు పంపాను. అంతా యాంత్రికంగా జరిగిపోయింది. మళ్ళా నాలో శూన్యస్థితి ఏర్పడింది. నాచుట్టూ అంతా ఉదాసీనత పేరుకుంటుందా?

తలవిదిలించుకుంటూ మిగతా ఫైల్స్‌ను కూడా పంపేయాలి. పని మొదలుపెట్టాలి అనుకుంటూ ఒకసారి బాత్‌రూమ్‌కు వెళ్ళి వచ్చి కూర్చున్నాను. మరలా, నోనీ ఆలోచనలే వచ్చాయి. నోనీ ఇక తిరిగిరాదా? ఇంకెప్పుడూ నన్ను కలవదా? నన్ను నేనే ప్రశ్నించుకోసాగాను. ఈరోజు ఏ కాస్త ఖాళీవున్నా అప్రత్యక్షంగా వుండి నన్ను ఉరిమి చూస్తూ నన్నీ విధంగా చుట్టిముట్టి ఇబ్బంది పెడుతుంది.

ఉత్తరప్రదేశ్‌లోని బలియా జనపద మూలాలకు చెందిన వాణ్ణి నేను. పదేళ్ళ క్రిందట ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా వర్తమాన మధ్యప్రదేశ్‌లోని ఒక భాగమే. ప్రజాసేవ చెయ్యాలనే నిబంధనతో నేను డిప్యూటీ తహసీల్దారుగా నియమింపబడ్డాను. ఇపుడు నేను తహసీల్దారు నయ్యాను. ప్రతి రెండు మూడేళ్ళకొకసారి బదిలీ వుంటుంది. అప్పుడప్పుడూ అంతకంటే ముందే నా బదిలీ జరిగేది.

సుమారు నాలుగు నెలలముందు బదిలీపై నేను బిలాస్‌పూర్ నుండి అంబికాపూర్ వచ్చాను. ఈ బదిలీ నా భార్యకేమాత్రం ఇష్టం లేదు. ఎవరో పుణ్యాత్మురాలు ఇరుగుపొరుగునున్నావిడ ఏం చెప్పిందంటే బిలాస్‌పూర్‌తో పోలిస్తే అంబికాపూర్ చాలా చిన్నది. అక్కడ ఏ విధమైన మంచి హొటల్ వుండదు. బ్యూటీపార్లర్ అసలే వుండదు. ఇంతెందుకు అంబికాపుర్‌లో మంచి కాలేజ్‌కాని, స్కూల్‌కాని లేనే లేవు. అక్కడకెళ్ళి పిల్లలేం చదువుకుంటారు?" అని.

"ఈ ప్రపంచంలో చాలా విషయాలు అసత్యంగా, అభూతకల్పనల్లాగా వుంటాయి" అన్నీ నమ్మొద్దని నా భార్యకు నేను నచ్చచెప్పాను. కాని నా భార్య తన స్నేహితురాలు చెప్పిన విషయాలన్నీ నిజమనుకుని చిరచిరలాడసాగింది. ఇలా రావటం రావటమే కొంత చికాగ్గా అంబికాపూర్ వచ్చింది.

వచ్చిన మరుసటిరోజు నా కార్యాలయానికి వెళ్ళి ఛార్జి తీసుకున్నాను. ఒక వారంలోపలే మాకు కేటాయించిన ప్రభుత్వ నివాసంలోకి మారిపోయాం. ఇంట్లో నా భార్యతోపాటు నాకొక పదేళ్ళ కూతురున్నది. తను ఐదవ క్లాసు చదువుతున్నది. తనతల్లివలె ఆ పిల్ల కూడా మహాచురుగ్గా మాటలు విసురుతుంది. కోపం ముక్కు మీదే వుంటుంది.

నా భార్యక్కలిగిన మొదటి సమస్య ఇంటిపని చేసేవాళ్ళు దొరకలేదు. గిన్నెలు కడగాలి, ఇల్లంతా ఊర్చి శుభ్రం చెయ్యాలి. పనివాళ్ళను వెతికి పట్టుకోవటం మొట్టమొదటగా చేయాల్సిన పెద్ద పని అయికూర్చుంది. యుద్ధ ప్రాతిపదికను పనివాళ్ళకోసం గాలింపు జరిగింది. కాని ఏ ప్రయత్నమూ ఫలించలేదు. దాంతో నా భార్యకు రోజంతా విసుగూ, కోపమే.

అప్పుడే నోనీ పేరు మాకు తెలిసింది. తన పేరేంటో గాని నోనీ అని పిలిచేవాళ్ళం. మా పొరుగునే ఒక సివిల్ జడ్జిగారు వుండేవారు. ఉదయం పూట చేసే నడక కార్యక్రమంలో నాకు వారి పరిచయం కల్గింది. రోజూ ఇద్దరం కలుసుకుని ఒకరి క్షేమ సమాచారాలు మరొకరం తెలుసుకుంటూ వుండేవారం. నిజంగా సివిల్ జడ్జిగారు చాలా సజ్జనులు. గొప్పగా చెప్పుకోదగిన మనిషి కూడా. నా పరిచయంతో మా ఆవిడకు వాళ్ళింట్లోకెళ్ళటానికి దారి దొరికింది. ఆయన భార్యతో పరిచయమూ, స్నేహమూ, అంతకంతకూ ఎక్కువైనాయి. మొదటగా నోనీ వాళ్లింట్లో పనిచేస్తూ వుండేది. నా భార్య చాలా చాతుర్యంతో అక్కడికెళ్ళినపుడు నోనీని మా ఇంట్లో కూడా పనిచేయటానికొప్పించింది. ఈ విషయంలో తన స్నేహితురాలితోనూ ఒప్పందం కుదుర్చుకున్నది. జడ్జీగారింట్లో పనయిన తర్వాత మా ఇంటి కొచ్చి పనిపాటలు చేసేటట్లుగా మాట్లాడుకున్నారు. ఈ విధంగా నోనీకి రోజంతా పనే సరిపోయేది. అక్కడ వెనుకటిలాగానే ఐదువందల జీతం లభిస్తున్నది. నా భార్య ఒక వంద రూపాయలిస్తానన్నది. దీనికి నోనీ తల్లి కూడా ఒప్పుకున్నది. ఇంత మాత్రంతో నా భార్య శాంతిస్తుందా? తరచూ దేనికో దానికి కోపగించుకుంటేగాని ఆమెకు తోచదు. ఎప్పుడైనా జడ్జీగారింట్లో పనెక్కువయితే ఆరోజు నోనీ మా ఇంటికొచ్చేది కాదు. అపుడు నా భార్య కోపం ఆకాశాన్నంటేది. పనిచేసుకుంటూనే బడబడా వాగుతుండేది. “పాపం నోనీ! రోజంతా గానుగెద్దులాగా తిరుగుతూనే వుంటుంది. చిన్న ప్రాణం కదా పిచ్చినోనీ. దానికా యింట్లోపని తెమిలితేగదా మనింటి కొచ్చి చేయటానికి?” అంటూ నిప్పురాజేసేది. “ఈ చోట్లోకి తీసుకొచ్చి పడేశారు. ఇక్కడ పనివాళ్ళే దొరకటం లేదు. మీకేం మీరు కాలు మీద కాలు వేసుకుని, చేతి మీద చెయ్యి వేసుకుని కూర్చుంటారు” అంటూ నన్ను సాధించిపోసేది.

“నోనీ విషయంలో ఏం చేయాలో చెప్పు” అన్నాను. “అంతా నా ఖర్మ” అంటూ రుసరుసలాడింది.

“మమ్మీ! నేహా ఏమంటుందో తెలుసా? మా నాన్న కన్నా తన నాన్నే గొప్పవాడట. ఆయనదే పెద్ద ఉద్యోగమట నిజమేనా?” అంటూ ఒక చెత్త ప్రశ్న వేసింది వాళ్ళమ్మను.

నేహా సివిల్ జడ్జిగారమ్మాయి. మా అమ్మాయితో పాటు ఐదో క్లాసే చదువుతున్నది.

నా భార్య అలాగా అంటూ నిప్పులు కురిసేటట్లు చూసింది కాని కూతురికేం జవాబు చెప్పలేదు.

“సరే మమ్మీ! తహసీల్దారు, సివిల్ జడ్జి ఇద్దరిలో ఎవరు గొప్పవాళ్ళు? చెప్పు” అంటూ వాళ్ళమ్మను కుదిపేస్తూ తను తెలుసుకుని తీరాలన్న పంతంతో అడిగింది.

"తహసీల్దార్ గొప్పవాడు. తహసీల్దారంటే మొత్తం తాలూకాకే అధికారి. నువ్వు రోజూ చూట్టంలా? ఆ జడ్జిగారు రోజూ రిక్షాలో కోర్టుకెడతారు. మనముండేది గవర్నమెంటు బంగళా. మీ నాన్నగారు రోజూ గవర్నమెంట్ జీపులో ఆఫీసుకెడతారు. అని వివరించి చెప్తే నా కూతురి సందేహం తీరిపోయింది. ఆపై శాంతించింది. డ్రాయింగ్ రూమ్‌లో పేపరు చదువుకుంటూ ఈ సంభాషణంతా విన్నాను. ఈ ఆడవాళ్ళు ఎలాంటి విషయాలు మాట్లడతారో కదా అనిపించింది.

చివరికొక రోజు మా ఆవిడ నోనీ వాళ్ళమ్మను రహస్యంగా పిలిపించి మాట్లాడింది. ఈ విషయమంతా రాత్రి పడుకున్నాక, నా దగ్గర ఏకరువు పెట్టింది. "రేపట్నుండి నోనీ కేవలం మనింట్లోనే పనిచేస్తుంది. నెలకు ఆరొందల జీతం నేనే ఇస్తానన్నాను. ఈ విషయాన్ని గురించి ఇంకేం మాట్లాడాల్సింది లేదు. మీరూ దీన్ని గురించి ఏం మాట్లాడకండి అంటూ" ఎంతో ఉబలాటంగా చెప్పింది.

తన స్నేహితురాలిముందు తాను గర్వపడాలనేదే ఆమె ఆశయం. జడ్జిగారి భార్య ఇవ్వగలిగింది ఐదువందలే. తానేమో పనిమనిషికి ఆరొందల జీతం ఇవ్వగలదు. నా భార్య చాలా జిత్తుల మారిది, అపాయకరమైనది అని కూడా నాకనిపించింది.

"నీవు ఎలా చేశావు ఈ పని. మంచీ చెడూ ఆలోచించావా?" అన్నాను.

"ఇవన్నీ ఆడవాళ్ళు చూసుకునే ఇంటి వ్యవహారాలు. ఇందులో మీ జోక్యం అనవసరం. మీరు మీ తహసీల్దారీ పనులు చూసుకోండి. అవి చక్కపెట్టుకుంటే చాలు," అంటూ నన్ను మాట్లాడనివ్వకుండా చేసింది.

"సరే. సరే. పడుకో. నాక్కూడా నిద్రవస్తుంది అంటూ నేనే ఆటాపిక్ మార్చాను.

ఇప్పుడు నోనీ మా ఇంట్లో ఫుల్‌టైమ్ పనికత్తె. నా భార్య నోనీ చేత ఢంకా బజాయించి పని చేయించేది. ఆమె తొమ్మిది పదేళ్ళ ఆదివాసీ బాలిక. ఎక్కువ భాగం ఆదివాసీలు ఒక విధమైన నల్లని చెక్కరంగులో వుండి సాధారణ ఎత్తులో వుంటారు. నోనీ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. చెప్పలేనంత దుర్బలంగా, బక్కచిక్కి వుంటుంది. కొంత కొంత నీగ్రోలపోలికలతో చెక్కపేడులాంటి ముఖంతో వుంటుంది.

ఇల్లంతా శుభ్రం చేయటం, గిన్నెలు కడగటం, అంతా నోనీ చెయ్యాల్సిందే. ఎప్పుడైనా శ్రీమతికి మూడ్ బాగా లేకపోతే, వంటపని గూడా నోనీ చేతే చేయించేది.

ఒకరోజు నోనీ వంట చేస్తున్నది. అంతే వయసున్న నా కూతుర్ని మందలిస్తూ "నోనీ ఎంత పనిచేస్తుందో చూడు. వంట కూడా నేర్చుకున్నది. నీకైతే ఒక కప్పు టీ పెట్టడం కూడా రాదన్నాను."

"నేనేమన్నా నోనీలాగా పనిదాన్నా?" అంటూ నా కూతురు కొట్టినట్లు సమాధానం చెప్పింది.

ఆమె సమాధానం విని నేనేం ఆశ్చర్యపోలా. నోనీతో నా కూతుర్ని పోల్చటం నా భార్యకూ నచ్చలేదు. రాత్రి పడుకున్నప్పుడు "మీరిలా నౌకర్లు, చాకర్లు ముందు ఇలా మాట్లాడకూడదు. ఇదంతా పిల్లల మనస్సులపై ఎంతో ప్రభావం చూపుతుంది" అన్నది.

అది ఎలాంటి ప్రభావమని నేను అడగనూ లేదు. ఆమె చెప్పనూ లేదు.

ఆరోజు ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. ఉదయాన చాలా మంది వచ్చి నాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పివెళ్ళారు. కొంతమంది ఫోన్ చేసి ఆచారాన్ని పాటించారు. కొంత సావకాశం చిక్కగానే నేను వెలుపలికి వెళ్ళి బయటి లాన్‌లో తిరగసాగాను. ఆ సమయంలో ప్రపంచంతో సంబంధం లేకుండా లాన్‌లో పడివున్న ఒక గొట్టానికి పైపు జోడించి మొక్కలకు నోనీ, నీళ్ళు పడుతున్నది.నోనీ తన బరువులో సగం బరువున్నరెండు నీళ్ళ బకెట్లను తన బలహీనమైన రెండు చేతుల్తో ఎలా మోసుకుని వెళ్తుందోనన్న ఆశ్చర్యం కల్గుతుంది నాకు. పైపుతో మొక్కలకు నీళ్ళు పడుతున్న నోనీ దగ్గరకెళ్ళి చిరునవ్వుతో నోనీ! కొత్త సంవత్సర శుభాకాంక్షలన్నాను. ఆ పిల్ల కళ్ళు విప్పార్చుకుని బొమ్మలాగా నావంక చూడసాగింది. ఊరికినే ఇలా చెప్పాలని నాకెలా తట్టిందన్న సిగ్గుతో నిశ్శబ్దంగా ఇంట్లోకెళ్ళిపోయాను. కొంచెంసేపు మౌనంగా వుండి అటూ ఇటూ చూశాను. డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని నా కూతురు ఏదో జంతువు బొమ్మ వేయసాగింది. నా కూతురు చదివేది తక్కువ. జంతువుల బొమ్మలుగీసేది ఎక్కువని నాకనిపిస్తుంది.

"చాలా బాగా వేశావు. ఏ జంతువు బొమ్మగీశావన్నాను."

ఆమె నవ్వుతూ ఎంతో ఉత్సాహంగా "కుక్క, కుక్క బొమ్మ గీసానని" చెప్పింది.

"నేను నిన్న నాల్గు చాక్లెట్లు తెచ్చాను. అన్నీ తినేశావా? ఏమన్నా ఒకటీ, అరా మిగిలివున్నాయా" అని అడిగాను.

"ఒకటుంది ఎందుకు?" అనడిగింది.

"నాకో చాక్లెట్ ఇస్తావా?" అని యాచిస్తున్నట్లుగా అడిగాను. అప్పుడప్పుడూ మనం స్వయంగా కొనుక్కొచ్చిన వస్తువుల్ని కూడా మరలా బతిమాలి తీసుకోవటం చాలా మజాగా అన్పిస్తుంది.

"ఏంటి చాక్లెట్ మీరు తింటారా?" అని కుతూహలంగా అడిగింది.

"కాదు. నోనీ కిద్దామని. నేను నీకు మరలా తెచ్చిస్తాను." అని నచ్చచెప్పాను.

కొంచెంసేపు మకురుతనం చూపించి మా అమ్మాయి చాక్లెట్ తెచ్చి నాకిచ్చింది. నేను చాక్లెట్ తీసుకెళ్ళి "నోనీ! ఈ చాక్లెట్ తీసుకో. నీకోసమే తెచ్చానన్నాను.

కొంచెంసేపు సందేహించిన తర్వాత చాక్లెట్ తీసుకున్నది.

"సార్! ఐదున్నర గంటలైంది అంటూ హెడ్ గుమాస్తాగారు నా కాబిన్‌లోకొచ్చి చెప్పారు. నా ఆలోచనలు కట్టిపెట్టి నేనూ లేచాను. ఆఫీసులో ఎవరూ కూడా ఆలస్యాన్ని భరించలేరు. మిగతా ప్రభుత్వ కార్యాలయాలలాగానే నా ఆఫీసుకూడా ఐదుగంటలకే పూర్తవుతుంది కాని బాస్ లోపల కూర్చుంటే మిగతా సిబ్బంది బయటికెలా వెళ్ళగలరు?

"మంచిది. నేను కూడా బయలుదేరతాను. ఈ ఫైల్స్ నేను రేపు చూస్తాను." అని టేబుల్ మీదున్న ఫైళ్ళ వంక చూస్తూ చెప్పాను. పెద్ద గుమాస్తా ఆ ఫైళ్ళన్నీ సర్దివెళ్ళారు. నేను కూడా ఇంటికి వెళ్ళటానికి కాబిన్ నుండి బయటికొచ్చాను.

ఆ మధ్య మాటల్లో మా ఆవిడ నాకొకసారి చెప్పింది. పనిపిల్ల పేరు నోనీ కాదట. ఇక్కడ ఆదివాసీ అమ్మాయిల్ని "నోనీ" అంటారట. ఆ పిల్ల పేరు గీత అట. ఆ పిల్లపేరు సార్థకమైందనిపించింది. కారణం ఏదైనా కానీ, నోనీ చాలా తక్కువగా మాట్లాడుతుంది. ఎప్పుడూ నిశ్శబ్దంగా వుంటూ ఏదో ఒక పనిలో నిమగ్నమైపోయుంటుంది.

మొదట్లో నా భార్య నోనీ పట్ల చాలా సంతృప్తితో వుండేది. రెండు మూడు సార్లు బాగా పొగిడింది కూడా. కాని ఆ పరిస్థితి ఎన్ని రోజులో లేదు. క్రమంగా నా భార్యకు నోనీలో అన్నీ తప్పులే కనపడుతున్నాయి. ఒక రోజు రాత్రి పడుకోబోయే ముందు నోనీ గురించి మొదలుపెట్టింది. "ఆ పిల్ల చాలా బద్ధకస్తురాలు. ఒక పద్ధతీ, పాడూ లేదు. ఏదో గత్యంతరం లేక చేయించుకోవటమే" అంటూ.

ఆ టైంలో నాకు బాగా నిద్రముంచుకొచ్చి ఆమె మాటలనేం పట్టించుకోలా. నిజానికి నా భార్య ఏదైనా మాటలు మొదలుపెడుతుందీ అనుకుంటే ఆమె ఎదుట పడకుండా సాధ్యమైనంత వరకూ తప్పించుకుంటాను. నేనామె మాటలు వినాల్సి వచ్చినా ఆ.. ఊ... అంటూ దాటవేస్తూ వుంటాను. మా ఇద్దరి మధ్య జరిగే సంభాషణలూ తక్కువే.

సైకిలతను తెచ్చే ఆవుపాలు చాలా పల్చగా వుండేవి. దానికై అతణ్ణి కూడా గట్టిగా మందలించేసరికి అతడు పాలు తేవటం మానేశాడు. వీధిలోనే వుండే యువతి ఒకామె రోజుకొక రూపాయి తీసుకుని డైరీ నుండి తాజా పాలు తెచ్చివ్వసాగింది.

ఇప్పుడు నోనీలో మరొక లోపం కనపడుతున్నది. అప్పుడప్పుడూ చెప్పాపెట్టకుండా ఒకటి రెండు రోజులు పనిమానేస్తున్నది. ఆ రోజుల్లో నా శ్రీమతి మీద కొండ విరిగిపడ్డట్టే. ఇంటి పని మొత్తం ఆమే చేసుకోవాలి మరి. అటువంటి స్థితిలో ఆమె పడేగింజులాట, విసుగు చాలా స్వాభావికం అయిపోయాయి. నోనీ పట్ల ఆవిడ కోపం రోజు రోజుకూ ఎక్కువవుతున్నది.

ఆరోజు తీజ్ పండుగ. మా ఆవిడ భర్త క్షేమం కోసం తీజ్ వ్రతం మొదలుపెట్టింది. ఆరోజు నోనీ రాలేదు. మరుసటిరోజు నోనీ పనిలోకి రాగానే విచిత్రమైన పెద్ద గొంతుతో నోరు చేసుకుని బెదిరింపుగా నోనీతో మాట్లాడింది. "ఏమే నిన్నెందుకు రాలేదు. ఏమయిందినీకు? ఇలా అయితే నాక్కుదరదు" అంటూ ఎన్నో మాటలన్నది.

నోనీ ఏం బదులివ్వలేదు. నిర్ఘాంతపోయి ఆమెనే చూస్తూ వుండిపోయింది. ఆ పిల్ల ఏమీ జవాబివ్వకుండా నిలబడటం మా ఆవిడకు నోనీ చాలా నిర్లక్ష్యంగా వుండి తనను అవమానిస్తుందనిపించింది. ఇంకా తిట్లు ఎక్కువ చేసింది. ఏంటా చూపు మూగదానిలా. నీనోరేమైనా పడిపోయిందా? నీలాంటి మూర్ఖురాలితో మాట్లాడటం అనవసరం అంటూ విసురుగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

నోనీ మాట్లాడటం నేను చాలా తక్కువసార్లు విన్నాను. నేనా పిల్లనెప్పుడూ దండించిందీ లేదు. బెదిరించిందీ లేదు. అన్నిటికీ మా ఆవిడ చాలు. నా భ్రమ ఏమో కాని అప్పుడప్పుడూ అనుకుంటాను. నోనీకూడా నాలాంటిదే. అచ్చం నాలాగే అని. ఎందుకంటే తక్కువ పన్నులు వసూలు చేశానని డి.ఎమ్.నన్ను బెదిరించినప్పుడు నేనూ నోనీలాగే మొహం పెట్టుకుంటాను.

ఒకరోజు అకస్మాత్తుగా మా శ్రీమతికి పుట్టింటి ప్రయాణం తగిలింది. మా బావమరిది కొత్తగా కట్టిన ఇంటి గృహ ప్రవేశానికి వెళ్ళాల్సివచ్చింది. భార్యలు ఇలాంటి అవకాశాల కోసం వెతుకుతూ వుంటారు. వెళ్ళటానికి నాకు కుదిరినా, కుదరకపోయినా నా శ్రీమతి మాత్రం వెంటనే పుట్టింటికి వెళ్ళటానికి తయారయిపోయింది. ఏ ఫంక్షన్లు వచ్చినా ఆమె వెంటనే తయారయిపోవటం, నేను గైరుహాజరు కావటం తరచూ జరుగుతుంది. ఇలాంటప్పుడు ఎక్కువ అడ్డు ప్రశ్నలు వేయటం కూడా అంతమంచిది కాదనిపించింది. మధ్యే మార్గం ఎన్నుకోవటం ఉత్తమమని భావిస్తాను. మా ఆవిడ, అమ్మాయితో కలసి పుట్టింటికి వెళ్ళటం నిశ్చయమైంది. అంతే ఎక్కడా ఆలస్యం చేయకుండా వెంటనే వెళ్ళిపోయింది. వెళ్తూ, వెళ్తూ నోనీని పనిచేయమని, నాకు పని చేయించుకోమని కుప్పలు తెప్పలుగా సలహాలు, సూచనలూ ఇచ్చివెళ్లింది.

మరుసటి రోజు నేను పక్కమీద వుండగానే కాలింగ్ బెల్ మోగింది. టైమ్ చూస్తే ఏడుబావయింది. పక్క మీద నుండి లేచి త్వరగా ముఖం కడుక్కుని మెయిన్‌గేటు తెరిచాను. ఎదురుగా నోనీ నిలబడివున్నది. నాతోపాటే లోపలికొచ్చింది.

నీ పనులు నువ్వు చూసుకో అంటూ నేను బాత్‌రూమ్‌కెళ్ళాను. ఏడు ముప్పావుకల్లా నేను స్నానం చేసి తయారయ్యాను. నోనీ బెడ్‌రూమ్ తుడుస్తూ కనుపించింది. స్నానం చేయగానే, నేను టీ తాగుతాను. కాబట్టి నోనీ చేత టీ కాయించుకోవాలి. "టీ తయారుచేస్తావా?" అంటే పైకీ, కిందకూ తలాడించింది. తుడిచే గుడ్డ అక్కడ పడవేసి వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుని వెంటనే వంట ఇంట్లోకెళ్ళింది. కొంచెం సేపున్నాక కప్పు నిండుగా టీ తీసుకుని నా ఎదురుగా వున్న టేబుల్ మీద పెట్టింది. మొదటిసారి సిప్

చేయగానే టీలో పంచదార వేయలేదని తెలిసింది.

"టీలో పంచదార వెయ్యలేదు నోనీ" అన్నాను.

ఆమె ఏం జవాబివ్వలేదు. నావంక ఒక చూపు మాత్రం చూసింది. ఆ చూపు టీలో పంచదార వెయ్యకుండా మంచి పని చేశాననుకుంటుందేమో?

"టీలో పంచదార లేకపోతే ఎలా తాగుతాను?" కొంచెం కోపంగా అన్నాను.

వంట ఇంట్లోకి వెళ్ళి పంచదార తెచ్చి కలిపింది. కలిపేటప్పుడు టీ కొంత ఒలికిపోయింది.

"నువ్వు టీ పెట్టుకోలేదా?" దానికీ నోనీ ఏం మాట్లాడలేదు.

"నీకోసం కూడా టీ పెట్టుకో. నాకింత పెద్దకప్పుతో టీ అఖ్ఖర్లేదు. దీంట్లో రెండు కప్పుల టీ పట్టింది" అన్నాను.

నోనీ ఏం జవాబు చెప్పకుండా నా చెప్పులు పాలిష్ చెయ్యటం మొదలుపెట్టింది. మంగళవారం కావటం మూలాన నేను ఈరోజు ఉపవాసముంటాను. అందువలన వంట చేసే పని లేదు. నేను సోఫాలో వాలి టీ,వీ. చూడసాగాను. నోనీ ఇంట్లో పని చూసుకుంటుంది. ఇంతలో కరెంటు పోయింది. టీ.వీ. ఆగిపోవటం వలన నేను వెలుపలికి వచ్చాను. నోనీ వంట ఇంటి బయట నేలమీద కూర్చుని ఏదో పోగొట్టుకున్నట్లుగా కూర్చుంది.

"పనులన్నీ అయిపోయాయా? అని అడిగాను.

ఆమె ఏం మాట్లాడకుండా ఊరికే కళ్ళప్పగించి చూడసాగింది.

"ఇప్పుడు నువ్వెళ్ళు. ఈ పూట వంటేమీ వద్దు. సాయంత్రం రా" అని చెప్పగానే నోనీ వెంటనే వెళ్ళిపోయింది. నేను నా ఆఫీసుకెళ్ళటానికి తయారవ్వసాగాను.

సాయంత్రం ఇంటికొచ్చేటప్పుడు పండ్లు కొనుక్కుని ఇంటికొచ్చి మెయిన్‌గేటు తాళం తీశాను. వంట ఇంట్లో నుంచి శబ్దం వస్తున్నది. వెళ్ళి చూస్తే వంట ఇంటి తలుపు వేసిలేదు. కుళాయి నుండి నీళ్ళు ధారగా పోతున్నాయి. నేను వెంటనే కుళాయి కట్టేశాను. ఉదయం కుళాయి కట్టేయటం మర్చిపోయినట్లుంది అనుకుంటూ వంట ఇల్లంతా పరిశీలనగా చూశాను. పగిలిపోయిన కప్పొకటి నేలమీద పడివున్నది. ఒక మూల ఆలూ, ఉల్లి తునకలు పడివున్నాయి. తెరచివున్నా హాట్‌పాక్‌లో నుంచి ఎండిపోయిన రొట్టెలు కనపడుతున్నాయి. వాటి నిండా చీమలు పట్టాయి. మూతలేని గిన్నెలో పాచిపోయిన కూర మీద ఈగలు ముసిరివున్నాయి. ఇదంతా క్రిందటి రోజు మిగిలిపోయిన ఆహారం తాలూకు ఆనవాళ్ళు. నామూడంతా ఖరాబయ్యింది. వంట ఇంట్లో నుండి బయటికొస్తూ ఈ రోజు నోనీని బాగా

కోప్పడాలనుకున్నాను.

నేను బెడ్‌రూమ్‌లో కొచ్చి చూశాను. టి.వి. దాని మానాన అది మోగుతుంది. పక్కనే టేబుల్ మీద టీ తాగి వదిలేసిన ఎంగిలి కప్పు. నేనూ వంట ఇంట్లో పెట్టం మర్చిపోయాను. అపుడే కాలింగ్‌బెల్ మోగింది. మెయిన్ గేటు తెరిచాను. ఎదురుగా నోనీ, నా వెనుకే లోపలికొచ్చింది. అప్పటివరకూ నోనీ పట్ల వున్న కోపం శాంతించింది. సంయమనమే పాటించాను.

"నోనీ!" అంటూ పిలిచాను. నిర్వికారంగా వచ్చి నా ఎదురు నిలబడింది. కొంచెం సేపాగి గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకుని "వంటిల్లంతా అలాకంగాళీగా వదిలేశావేంటి? శుభ్రం చేయాలని తెలీదా? పగిలిపోయిన కప్పును బయట పారవెయ్యి. మిగిలిపోయిన ఆహారాన్ని డస్ట్‌బిన్‌లో వెయ్యి. వంటిల్లంతా చెత్తకుప్పలాగా చేశావు. అందుకనే మీ ఆంటీ నిన్ను అంతలా కేకలేస్తుంది" అన్నాను.

నోనీ నిశ్శబ్దంగా వున్నది. "ఏం మాట్లాడవెందుకనీ" అన్నాను కొంచెం పెద్దగా.

ఆమె కొంచెం తటపటాయించింది. సంబాళించుకుంటూ ఉత్సాహంగా నవ్వింది. "మతిమరుపు" అంటూ.

"నీ మొహం. ఇక ముందైనా పనిమీద ధ్యాసవుంచు. టీ చేసి తీసుకురా." అన్నాను.

నోనీ, నిశ్శబ్దంగా వెళ్లిపోయింది. నేను డ్రాయింగ్ రూమ్‌లో సోఫా మీద కూర్చుని టీ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా సేపటి వరకూ ఎదురు చూసినా కూడా నోనీ టీ తీసుకుని రాలేదు. విసుగ్గా వంట ఇంటి వైపుకు వెళ్ళాను. వంట ఇంటికి ఒక పక్కగా వున్న బాత్‌రూమ్‌లో, కూర్చుని బట్టలు బాదుతున్నది. ఆ మురికిలో, సబ్బు నురగతో బాత్‌రూమంతా కంపరంగా వున్నది.

"ఏం చేస్తున్నావ్? ఇక్కడ కూర్చుని. ఇవన్నీ తర్వాత చేసుకోవచ్చు. ముందు లేచి నాకు టీ పెట్టివ్వు." అన్నాను.

కొంచెంసేపున్నాక టీ కప్పు తెచ్చి టేబుల్‌మీద పెట్టింది. నేను టీ తాగుతూ వున్నాను. కొంచెం సేపుండి మరలా నోనీ నా ఎదురుగా వచ్చి నిలబడింది. ఆశ్చర్యంగా చూశాను. ఐదువందల నోట్లు నాలుగు టేబుల్ మీద పెట్టి నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది. పొరపాటున పాంటు జేబులో పెట్టి మర్చిపోయి ఉతుక్కేశాను. అవి చినిగి ముక్కలు కాకుండా నోనీ జాగ్రత్త చేసి తెచ్చింది. ఆ సాయంత్రం నోనీ చాలా పాత గౌను వేసుకున్నది. ఆ గౌను నాకూతురు కోసం ఎప్పుడో ఏడాది క్రింద చాలా ఇష్టంగా నేను కొన్నాను. ఆ పిల్లకస్సలు నచ్చక వేసుకోవటానికి చాలా నఖరాలు పోయేది. నా భార్య ఎన్నో సార్లు ప్రయత్నించింది దాన్నాపిల్లవంటి మీదపెట్టటానికి. శాపనార్థాలు పెట్టేదికాని ఒంటి మీద గౌను పెట్టలా. నా భార్య దయతో ఆ గౌనును నోనీకిచ్చింది. అప్పట్నుంచి వేసుకుంటుంటే నోనీ ఒంటిమీద

పాతదయిపోయింది. నోనీ నల్లని ఒంటి మీద పాత గౌనయినా ఆ గులాబిరంగు గౌను చాలా బాగా అమిరింది. చూడటానికి నోనీ కూడా బాగుంది.

నోనీలో చాలా మార్పు వచ్చింది. ప్రతి పనీ, చాలా ఉత్సాహంగా, శ్రద్ధగా చేయసాగింది. చెప్పకుండానే బూట్లుకూడా పాలిష్ చేసేస్తుంది. దానికి బదులుగా అప్పుడప్పుడు ఆ పిల్ల వంక అభిమానంగా చూసేవాడిని. నోనీ చాలా తక్కువగానే మాట్లాడుతున్నది. అయినా ఆ పిల్ల మాటల్లోని భావాన్ని నేను గ్రహించేవాడిని. ఇన్ని సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలలో వుంటున్నా, తాలూకా అధికారిగా సేవలందిస్తున్నా, ఛత్తీస్ఘడ్, సర్గుజియా ప్రాంతాల నుండి నేను నేర్చుకున్నదేమీలేదు.

ఆరోజు పాలు తెచ్చే మనిషి పాలు తేలేదు. నోనీ ఇంట్లో పనంతా చేసి వెళ్ళిపోయింది. ఆ తర్వాత నేనూ ఆఫీసుకు వెళ్ళటానికి బయటికివచ్చి మెయిన్గేటు తాళం వెయ్యటానికి వస్తే అపుడు పాల మనిషి పాలు తెచ్చింది. నేను విసుగ్గా "నీవు ఇపుడు పాలు తెచ్చావు. రేపట్నుంచి సమయానికి తీసుకునిరా. పాలు లేకపోతే ఇబ్బంది గదా" అన్నాను.

"అర్జంటు పనిలో ఇరుక్కుపోయాను సార్! అందుకే లేటయ్యింది అంది" ఆవిడ నవ్వుతూ. "నోనీ కూడా వెళ్ళిపోయింది. ఇపుడ పాలెవరు కాస్తారు?" అన్నాను.

"నేను కాచిపెడతాను. ఐదు నిముషాలు చాలు" అన్నది.

"సరే త్వరగా కానివ్వు. లేకపోతే ఆఫీసుకెళ్ళటానికి లేటవుతుందని చెప్పి నేను డ్రాయింగ్రూమ్లో సోఫా మీద కూర్చున్నాను. ఆవిడ వంట ఇంట్లోకెళ్ళి పాలు వేడిచేసింది. ఆ తర్వాత నా ఎదురుగా వచ్చి నిలబడి "పాలుకాచాను. పాత్రలో పోసి భద్రపరచానని" చెప్పింది.

సరేనని నేను బయటకు రావటానికి ప్రయత్నించగా "సార్! నేను మీతో కొంచెం మాట్లాడాలి." అన్నది.

"చెప్పు. ఏం చెప్తావో త్వరగా" అన్నాను టైం చూచుకుంటూ.

"సార్! నాకిక్కడ పనివ్వండి. నోనీ కంటె లక్షరెట్లు బాగా పనిచేస్తాను. మీరు ఎట్లా కోరితే అట్లా. పని విషయంలో మీకు ఫిర్యాదు చేసే అవకాశమే రానివ్వను. నాకిద్దరు చిన్నపిల్లలున్నారు. భర్త నన్ను వదిలేసి వేరే స్త్రీతో వుంటున్నాడు. ఒక్క ఇంట్లోనే పని చేసి పిల్లల్ని పెంచాలంటే నావల్ల కావటం లేదు. నేను హైస్కూల్కు దగ్గర్లో వుంటాను. అంటూ ఒక్క గుక్కలో ఇవ్వన్నీ చెప్పేసింది.

"ఈ స్త్రీ ఎంత నిర్భయంగా మాట్లాడుతున్నది. ఇంత అందమైన పెళ్ళాన్ని వదిలేసిపోయిన ఆమొగుడెంత గాడిద?" అనుకున్నాను. "నోనీ కూడా బాగానే పనిచేస్తున్నది. ఆ పిల్ల చాలా చిన్నదవటం వలన మరొక్కసారి చెప్పి చేయించుకోవాల్సివస్తుంది. నువ్వు ఇంకెక్కడన్నా ప్రయత్నం చేసుకో" అన్నాను.

నా జవాబు విని ఆమె ముఖం వేలాడవేసింది. "నాకు తెలిసిన వాళ్లెవరికయినా పనిమనిషి కావాలేమో అడుగుతాను. నీ గురించీ చెప్తానులే" అని ఓదార్పుగా చెప్పాను.

ఆమె నిశ్శబ్దంగా వెళ్లిపోయింది.

సుమారు ఒక వారం పాటు నోనీని గురించి తెలుసుకోవటానికీ, అర్థం చేసుకోవటానికి అవకాశం దొరికింది. ఆమె రోజూ సమయానికే వస్తుంది. ప్రతి పనిలోనూ శ్రద్ధ పెరిగింది.

తాననుకున్న పని వెంటనే చేసేస్తున్నది. నేను పని చెప్పినా మీరెళ్ళి కూర్చోండి అంటూ వెంటనే ఆ పనిచేస్తున్నది. ఇంటికి వెళ్ళు అనగానే వెంటనే వెళ్తుంది. వెళ్తూ, వెళ్తూ అయోమయంగా ఒక పెళుసు నవ్వు నవ్వి నా వంక చూస్తూ వెళ్తున్నది. ఆ వారం రోజుల్లో మరోసారి పని చెప్పటానికి గానీ, కోప్పడటానికి గానీ ఆ పిల్ల అవకాశమే ఇవ్వలేదు.

వారం గడిచింది. నా భార్య తిరిగి వచ్చేసింది.

నా జీపు ఒక కుదుపుతో వాకిట్లో ఆగగానే నా ఒంట్లో కూడా ఒక కుదుపు కలిగింది. జీపుదిగి ఇంట్లోకి రాగానే బాగా అలంకరించుకుని నా భార్య డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చునివున్నది. నన్ను చూడగానే ఆమెనవ్వుతూ "వచ్చారా? మీ కోసమే చూస్తున్నాను. ఇవాళ కొత్త పని మనిషి వస్తుంది టీ పెట్టించుకుని తాగండి. ఆవిడ ఈ పాటికి వస్తూనే వుంటుంది. నాకు కొంచెం పని వుంది వెళ్తున్నానంటూ ఆవిడ వెళ్ళిపోయింది. నేను సోఫా మీద వాలిపోయాను. నా కూతురు స్టడీ రూమ్‌లో చదువుకుంటూనో, లేదా ఇంట్లో ఎక్కడో ఆడుకోవటమో చేస్తుంది.

ఇవాళ నోనీ రాదు. కొత్త పనిమనిషి కోసం ఎదురు చూడమని చెప్పివెళ్ళింది నా భార్య.

రెండ్రోజుల క్రిందట నోనీ చెప్పాపెట్టకుండా పనిమానేసింది. నా భార్య చిందులు తొక్కుతూ "ఈ పనివాళ్ళు చాలా విశ్వాస ఘాతకులు. వీళ్ళకన్ని విద్యలూ తెలుసు. పాలుపోసే మనిషిని పనిలో పెట్టకుందామనుకుంటున్నాను. నోనీని గెంటేస్తాను. ఎవరు భరిస్తారు? ఈమతిమాలిన దాన్ని అన్నది. ఆ మాటలు విన్న తర్వాత నేను లాన్‌లో తిరగటానికెళ్ళాను.

మరలా నిన్న ఉదయం నోనీ రాగానే మా ఆవిడ ఆ పిల్లమీద విరుచుకుపడింది. ఆ పిల్లను చాలా సేపటి వరకూ నానా దుర్భాషలాడుతూ వుండిపోయింది. పనిదొంగవి, విశ్వాస ఘాతకురాలివి అంటూ నానా తిట్లు నోనీ కడుపు నిండా తినిపించి తర్వాత తను చెప్పదలుచుకున్నది చెప్పేసింది. ఇవాళ నీ పనంతా కానివ్వు. ఈ రోజు వరకూ నీకు ఎంత జీతమొస్తుందో లెక్కచూచి ఇచ్చేస్తాను. ఇకనుంచీ నువ్వు పనిలోకి రావద్దు అంటూ ఆర్డరు పాస్ చేసింది. ఎందుకు మాన్పిస్తుందో, కారణమేమిటో ఏమీ చెప్పలేదు.

నోనీ ఏం మాట్లాడలేదు. ఇంచుమించు మూగదానిలా ఏం మాట్లాడదెందుకు? నన్ను ఎందుకు మాన్పిస్తున్నావనీ అడగదు. ఏం పిల్ల అన్పించింది.

నేనెక్కడో చదివాను. అప్పుడప్పుడూ ఆవశ్యకతల్ని గడుపుకుంటూ దయ నిషేధింపబడుతుందని. అదే విధంగా నా భార్య నియంత్రణలో ఇదొక ఇంటి వ్యవహారం. ఈ విషయంలో వెంటనే వేలుపెట్టటం నాకు మంచిదనిపించలేదు. నోనీ తన లెఖ్ఖ చూపించుకుని తనకు రావలసిన డబ్బు తీసుకెదుతూ చాలా అమాయకంగా నావంక చూసింది. ఆమె ముఖంమీద పరుచుకుని వుండే అమాయక్తం ఉదాసీనత అనే దుప్పటికప్పుకొని వుంటుంది. ఆమె నిర్మలంగా చూసిన చూపు నా గుండెల్లో దిగబడింది. నోనీ నిశ్శబ్దంగా వెళ్ళిపోయింది.

నా భార్య ఆశలకు తగ్గట్టే నిన్న సాయంత్రం కానీ, ఇవాళుదయం కానీ నోనీ పనిలోకిరాలేదు. నోనీ తిరిగిరాదని నేనూ అనుకున్నాను. నా భార్యే ముక్కుతూ, మూలుగుతూ ఇంటి పనంతా చేసింది.

ఈ మధ్యలో పాలుపోసే ఆవిడ నా భార్యను బాగా ఆకట్టుకోవటంలో సఫలమైంది. ఇవాళ పనిచేయటానికీ వస్తుంది. నోనీ స్థానాన్ని మరొకరు తీసుకుంటారు. మరలా నోనీ జ్ఞాపకాలు ఈ ఇంట్లోనూ, నా మెదడులోనుంచి కూడా నెమ్మది నెమ్మదిగా మాయమయిపోతాయి, అనుకున్నాను. అపుడే కాలింగ్ బెల్ మోగేసరికి జాగ్రదావస్థలోకి వచ్చాను. కొత్త పనిమనిషనుకున్నాను. నేను సోఫాలో నుండి లేచి తలుపు తెరిచి ఆశ్చర్యంతోనే నిలబడిపోయాను. మందమతిలాగా నవ్వుతూ నోనీ నిలబడివున్నది. కొంచెంసేపు సందేహించిన తర్వాత పూర్తిగా తలుపు తెరిచి రా.రా. అన్నాను.

నోనీ ఏం మాట్లాడకుండా నిశ్శబ్దంగా లోపలికెళ్ళిపోయింది. తలుపు వేసి నేనూ లోపలికొచ్చాను. మరలా కాలింగ్ బెల్ మోగింది. తలుపు తెరిచిచూస్తే పాలుపోసే మనిషి నిలబడివున్నది. నాకామె సరాసరి బ్యూటీపార్లర్ నుండి వచ్చినట్లుగా వున్నది. ముఖం మీద పౌడర్ పూత, పెదవులు గూడా ఎఱ్ఱగా వున్నాయి. చాలా అసహ్యంగా అనిపించింది. ఆమె బహుశా కిళ్ళీ నములుతూ వుండి వుంటుంది. నేనాశ్చర్యంగా ఆమెవంక చూస్తుంటే పని చేయటానికొచ్చానన్నది.

నోనీ తిరిగొచ్చింది. నీవెళ్ళు అన్నాను. ఆమె నన్ను గుర్రుగా చూసింది. గొణుక్కుంటూ వెళ్ళిపోయింది. తలుపులేసి వచ్చాను. నేను సోఫా మీద కూర్చోగానే నా కూతురు పరుగెత్తుకొచ్చింది. రొప్పుకుంటూ అన్నది. “నాన్నా! నోనీ మళ్ళా తిరిగొచ్చింది. వంటింట్లో పని చేస్తుందని”.

“మనమీ ఊళ్ళో వున్నంతవరకు నోనీయే పనిచేస్తుంది. మీ అమ్మాకూతుళ్ళు కలసి ఆ పిల్లను కష్టపెట్టకండి అని గంభీరంగా అన్నాను.

నా కూతురు నావంక ఆశ్చర్యంగా చూస్తూ లోపలికెళ్ళింది.

నేను చాలా పెద్దయుద్ధమే గెలిచాననుకున్నాను.

## పద్మభూషణ్, యశ్‌పాల్‌జీ సాహిత్య సమాలోచన

జీవన రేఖలు : యశ్‌పాల్ జీ డిసెంబరు మూడు, పంథొమ్మిది వందల మూడవ సంవత్సరంలో, ఫిరోజ్‌పూర్ నందు జన్మించారు. ప్రేమ దేవి, హీరాలాల్ దంపతులు వీరి తల్లిదండ్రులు. హిందీ భాషలో పేరెన్నికగన్న సాహిత్యకారుల కోవలోకే వీరూ చెందుతారు. భారత దేశ ప్రసిద్ధ హిందీ రచయితగా పేరుగాంచారు. ఎంతో అమూల్యమైన, సాహిత్య సంపదను పాఠకులకందించి వీరు ఇరవైఆరు డిసెంబరు, పంథొమ్మిది వందల డెబ్భై ఆరున పరమపదించారు.

కథాసృజన : యశ్‌పాల్‌కీ "ఛోటీ కహానియాం" అను పేరుతో వీరి కథలు వెలువరింపబడినవి. అందులో "ఫూలో కా కురతా" అనుచిన్న కథ చాలా ప్రసిద్ధి పొందింది. పరదా, ఝూఠాసచ్, దివ్యా, శివ్ ఔర్ పార్వతీ మొదలగు కథలు పాఠకుల మనసులో బాగా చోటు సంపాదించుకున్నవి.

నవలా రచన : మనుష్యకే రూప్, వతన్ ఔర్ దేశ్, దాదా కామ్రేడ్, మేరీ తేరీ ఉస్‌కీ బాత్, అనునవి వెలువరించారు.

**1970**వ సంవత్సరంలో "పద్మభూషణ్" సత్కారాన్ని పొందారు. మేరీ తేరీ ఉస్‌కీ బాత్ అనునవలకు సాహిత్య అకాడెమీ వారి పురస్కారాన్ని **1976**లో అందుకున్నారు.

ఇవేకాక వీరు ఎన్నో నిబంధ్‌లు, నాటకాలు రచించారు. తన ఆత్మ కథనూ వెలువరించారు.

"ఫూలో కా కుర్తా" (ఫూలూ సిగ్గు అన్న పేరు పెట్టాను) అనే ప్రస్తుత కథలో ఫూలూ అనే చిన్న పిల్ల సంప్రదాయాన్ని తప్పకుండా పాటించాలనే విషయం పట్లే ధ్యాస పెట్టిన విధానం పాఠకులకు నవ్వునూ, ఆహ్లాదాన్నీ పంచుతుంది. రాశిలో చిన్న కథైనా, వాసిలో పెద్దదనిపించుకుని యశ్‌పాల్‌జీకి తిరుగులేని పేరును సంపాదించిపెట్టింది.

పరదా అనే కథలో కులీన కుటుంబాల మర్యాదల ముసుగులో పరదాచాటున తమ బ్రతుకుల్ని దాచుకున్న విధం మనసును ద్రవీభూతం చేస్తుంది, అప్పులిచ్చే వడ్డీ వ్యాపారి దౌర్జన్యం గగుర్పాటు కల్గిస్తుంది.

# పరదా

హిందీమూలం : యశ్‌పాల్
తెలుగు సేత : దాసరి శివకుమారి

పీర్‌బక్షు చౌధరీలనే ఉన్నత కుటుంబానికి చెందినవాడు. అతని తాతగారు పన్నుల విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేసేవారు. ఆదాయం కూడా బాగానే వచ్చేది. విస్తీర్ణంలో చిన్నదేగాని చాలా గట్టి కట్టుబడిలో ఒక భవంతి కట్టుకున్నాడు. కొడుకులిద్దరికీ చదువూ చెప్పించాడు. వాళ్ళిద్దరూ మెట్రిక్ పరీక్ష పాసయ్యి, రైల్వేలోనూ, పోస్టాఫీసులోనూ గుమాస్తాలయ్యారు. చౌధరీ మహాశయులు తన ఇద్దరికొడుకుల పెళ్ళిళ్ళు చేశారు. వాళ్ళు పిల్లాపాపల్తో సుఖంగా వున్నారు. వాళ్ళకు కుటుంబ వృద్ధి జరిగిందిగాని ఉద్యోగ విషయంలో కాని, రాబడి విషయంలోకాని పెరుగుదల లేదు.

చౌధరీగారికి అదొక పెద్ద అసంతృప్తి. "మా రోజులే బాగుండేయి. ఆనాడు మిడిల్ పరీక్ష పాసయితేనే డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగమొచ్చేది. ఇవాళ్టి చదువులేంటి? మెట్రిక్‌లేషన్ దాకా ఇంగ్లీషు చదువులు చదివినా ముప్పై, నలభై రూకల కంటే ఎక్కువ సంపాదించలేకపోతున్నారు." అంటూ కొడుకుల జీతభత్యాల గురించి అసంతృప్తిపడుతూనే కాలం చేశారు.

అల్లా దయవలన చౌధరీగారి వంశవృక్షం బాగా విస్తరించింది. పెద్దకొడుకు చౌధరీ ఫజల్ కుర్‌బాన్ రైల్వేలో పనిచేశాడు. అల్లా ఆయనకు నల్గురు కొడుకుల్నీ, ముగ్గురు కూతుళ్ళనూ అనుగ్రహించాడు. రెండో కొడుకు చౌధరీ అల్లాబక్షు పోస్టాఫీసులో పనిచేసేవాడు. ఆయన క్కూడా అల్లా నలుగురు కొడుకుల్నీ, ఇద్దరు కూతుళ్ళనూ ప్రసాదించాడు.

చౌధరీ కుటుంబీకులు తమ ఇంటిని హవేలీ అనిపిలిచే వాళ్ళు. పేరుకు హవేలీయేకాని లోపల మాత్రం బాగా ఇరుగ్గావుండేది. సూపరింటెండెంట్ గారి హయాంలో వారి జనానా అంతాలోపలే వుండే వాళ్ళు. ఆయన మాత్రం హవేలీ ముందున్న చోట్లో ఆసనమేసుక్కూచుని హుక్కా పీలుస్తూ వుండేవాళ్ళు. స్థలం సరిపోక ఆయన దాటిపోయిన తర్వాత ఆ చోటు కూడా జనానాలో కలిపివేయబడింది. ఇంటి సింహద్వారానికి ఒక పరదా వేలాడతీసివుండేది. ఇంటి వెలుపల ఎవరూ చేరి గుమిగూడకపోయినా గౌరవం పెంచుకోవటం కోసం పరదా వేసివుంచేవాళ్ళు. ఏనాసిరకంతోనో, ముతకదో, గోనెసంచిలాంటిదో కాకుండా మేలైన రకాన్నే పరదాగా వాడేవాళ్ళు.

ఆ హవేలీలో అన్నదమ్ములిద్దరూ తమపిల్లాజెల్లాతో కలసి ఒకే ఇంట్లో వున్నట్లుగా బయటి వారికి కనుపించేది. కాని లోపల ఎవరి కాపురం వారికే విడివిడిగా వుండేది. సింహద్వారపు పరదాగుడ్డ అన్న తేవాలా? తమ్ముడు తేవాలా? అన్న సమస్య లేకుండా సూపరింటెండెంట్ గారి హయాంలో వాడిన సిల్కు, పట్టుదుప్పట్లు ఒక దాని తర్వాత ఒకటి తెరగుడ్డగా వేలాడసాగాయి.

వీళ్ళ వంశంలో తరవాతి తరం వారికి కూడా పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. చివరకు ఈ వంశస్థులు తమ ఆడంబరాన్ని పక్కకు పెట్టి హవేలీ వదిలి మరొకనివాసానికి మారవలసివచ్చింది. అల్లాబక్షు పెద్దకొడుకు మెట్రిక్ పాసయ్యి పోస్టాఫీసులో ఇరవైరూపాయల జీతంతో గుమాస్తాగా చేరాడు. రెండో కొడుకు మెట్రిక్

పరీక్ష పాసయి హాస్పిటల్లో కాంపౌండర్‌గా చేరాడు. కాలం ఇంకా ఇంకా మారుతున్నది. నానాటికి చదువులూ, ఉద్యోగాలూ కష్టమైపోతున్నాయి. మూడో కొడుకు తెలివిగలవాడు. స్కాలర్‌షిప్‌తో చదివి మిడిల్ స్కూల్ ఉపాధ్యాయుడయ్యాడు. నాల్గో కొడుకు పీర్‌బక్షు ప్రాథమిక విద్యతోనే సరిపెట్టాడు. ప్రస్తుతపు చదువులు తల్లిదండ్రులకు ఎంతో భారంగా మారినయి. నెలనెలా స్కూల్ ఫీజులు, పుస్తకాలు, కాపీబుక్కులు, డ్రాయింగ్ సామాగ్రులకోసం ఖర్చు మీద ఖర్చు చేయాల్సివస్తుంది.

పీర్‌బక్షు క్కూడా పెళ్ళయ్యింది. అల్లా దయతో వెంటనే బీబీ కడుపు పండింది. జీవనోపాధికోసం నూనెమిల్లులో నౌకరీకి కుదిరాడు. చదువు ఎక్కువ లేకపోయినా తెల్లని బట్టలు ధరించి తమ కుటుంబ గౌరవానికి భంగం కలక్కుండా పనిచెయ్యాలనుకున్నాడు. కూలిపనుల్లాంటివి కాకుండా బల్లమీద కూర్చుని కలాన్ని, సిరాబుడ్డిని వుపయోగించి చేసే పనిలో కుదురుకున్నాడు.

అతని నెల జీతం పన్నెండు రూపాయలు కాబట్టి తక్కువ అద్దెలో ఒక మారుమూల బస్తీలో ఇల్లు తీసుకోవాల్సివచ్చింది. ఆ చుట్టు ప్రక్కలంతా పనిపాటలు చేసుకుని పొట్టబోసుకునే నిరుపేదలే ఎక్కువ.

అస్తవ్యస్తంగా వున్న వీధి మధ్యలో ప్రజల సౌకర్యం కోసం వేయబడిన నీళ్ళ కుళాయి నుంచి తరచూ కలుషితమైన నీరే వస్తూ వుంటుంది. నిరంతరం సన్నగా నీరు కారిపోతూ కాలువలాగా మడుగు కట్టింది. దాని అంచున గడ్డి మొలిచి ఈగల, దోమల మేఘాలు చుట్టుముడుతూవుంటాయి. ఎదురుగానే చాకలి రమ్‌జానీ పొయ్యిమీద బానల్లో నుంచి వచ్చే వేడి ఆవిరి, చవుడుతో కలసి ఉడికే బట్టలమురికి వాసన, పొయ్యి సరిగ్గా మండనప్పుడు వచ్చే పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తూ వుంటుంది. ఎడమ వైపున రోజువారీపనులు చేసుకునే కూలీల ఇళ్ళూ, కుడివైపున మాదిగల ఇళ్ళూ వున్నాయి.

ఈ బస్తీ మొత్తంలో తెల్లని బట్టలు ధరించి చదువు సంధ్యలున్న ఏకైక వ్యక్తి పీర్‌బక్షు. అక్కడ కేవలం ఆయనుండే ఇంటికొక్కదానికే సింహద్వారానికి పరదా వేలాడుతూ వుంటుంది. అక్కడివాళ్ళందరూ ఆయన్ని చౌధరీ బాబని, గుమాస్తాగారనీ పిలుస్తూ, ఎదురుపడ్డప్పుడు నమస్కారం చేస్తూవుంటారు. ఆ యింటి ఆడవాళ్ళను ఎవరూ, ఎప్పుడూ ఆ వీధిలో చూడలేదు. వాళ్ళ ఆడపిల్లలు కూడా నాలుగయిదు ఏళ్ళు వచ్చేవరకే ఏదైనా పనిమీద బయటికొచ్చేవాళ్ళు. ఆ తర్వాత ఇంటి పద్ధతుల ననుసరించి వెలుపల కన్పడేవాళ్ళేకాదు. పీర్‌బక్షే అందరితోటి నవ్వుకుంటూ వీధి కుళాయి నీళ్ళు పట్టి రెండుపూట్లా ఇంట్లోకి మోసుకెడుతూ వుండేవాడు.

పీర్‌బక్షూ జీతం ఈ పదిహేనేళ్ళలో పన్నెండు నుంచి పద్దెనిమిది రూపాయిలయ్యింది. కాని ఈలోపు ఐదుగురు పిల్లలు పుట్టుకొచ్చారు. మొదటి ముగ్గురూ ఆడపిల్లలు, ఆ తర్వాతి ఇద్దరూ మగపిల్లలు. సంతానాభివృద్ధి చెందినంతగా ఆదాయం పెరగలేదు. రెండో కూతురు పుట్టినపుడు ఇంట్లో సాయం చేయటానికని తల్లివచ్చింది. ఇంతలో తండ్రికి చావు ముంచుకొచ్చింది. తల్లిని తీసుకెళ్ళి ఆలనా పాలనా చూడటానికి ఏ అన్నా రాలేదు. దాంతో ఆమె కూడా ఈ కొడుకు దగ్గరే వుండిపోయింది. పిల్లల్తోపాటు వందరకాల సమస్యలు కూడా చుట్టుముడుతున్నాయి. ఒకసారి పసిబిడ్డకు సుస్తిచేస్తే మరొకసారి బాలింతకు

ముంచుకొచ్చేది. అలాంటపుడు అప్పు చేయక తప్పేది కాదు. ఒక దాని వెంట మరొక ఖర్చు వచ్చిపడుతుంటే అప్పు మీద అప్పు తెచ్చుకోవాల్సివస్తుంది.

నూనె మిల్లు యజమాని చాలా పట్టుదల కలిగినవాడు. లెక్కసరి మనిషి. ప్రతినెలా ఏడవతారీఖున నెలజీతం లెఖ్ఖగట్టి ఇచ్చేవాడు. మధ్యలో అడ్వాన్సు అడిగితే కోపగించుకునేవాడు. ఎప్పుడైనా మరీ అవసరపడితే పీర్‌బక్షు ఇంటి నుండి చిన్నో, పెద్దో వస్తువు తాకట్టు పెట్టుకుని అప్పు ఇచ్చేవాడు. తాకట్టుకిచ్చే అప్పు రూపాయికి పన్నెండణాలే. వడ్డీ కలుపుకుని పదహారణాల లెక్క చెప్పేవాడు. తాకట్టు పెట్టిన వస్తువు తిరిగి ఇంట్లోకి రావటం మాత్రం జరిగేది కాదు.

వీధిలో పీర్‌బక్షుకు గౌరవమున్నది. పట్టు పరదా వేలాడతీసుకోగలిగినందుకు కల్గిన గౌరవమది. లోపల సంసార స్థితి ఎలావున్నా పరదా బయటకు వచ్చి సలామ్‌లు పొందగలుగుతున్నాడు. ఎప్పుడైనా పిల్లలు గట్టిగా గుంజితేనో, గాలికి అటూ, ఇటూ కొట్టుకొనో పరదాకు చిరుగులు పడేవి. సూదీ, దారం తీసుకుని పరదా చాటునుండే దానికి మరమ్మత్తులు చేసేవాళ్లు.

రోజులు గడిచే కొందికీ ఇంటి సింహద్వారపు తలుపు శిధిలమైపోతున్నది. ఎన్ని అతుకులుపెట్టినా పొట్టుపొట్టుగా రాలిపోతూనే వున్నది. చిట్టి చివరికది పెద్ద పెద్ద బెజ్జాలు పడేదాకా వెళ్లింది. ఇంటియజమాని సురజూపాండేకు దీన్ని బాగుచేయించే వుద్దేశ్యమేలేదు. ఎప్పుడైనా పీర్‌బక్షు వెళ్ళి అడిగితే “నువ్విచ్చే అద్దె నెలకు రెండురూపాయలు. అదీ, ఆరేడు నెలలు బకాయిపెడతావు. ఇప్పుడు కలపరేటెంత వుందో తెలుసా? బాగుచేయించటం కుదరదు. ఇష్టముంటే వుండు. కష్టమైతే ఖాళీచేసివెళ్ళు.” అని కటువుగా మాట్లాడేవాడు.

చివరకా తలుపు విరిగిపడిపోయింది. రాత్రంతా మేల్కొని గడపమీదా, ద్వారబంధం మీదా టక, టక మని చప్పుడు చేస్తూ దొంగలకు కాపలా కాస్తూ వుండేవాడు పీర్‌బక్షు.

తెల్లబట్టలు వేసుకుని తిరుగుతూ గుమాస్తాగారనే గౌరవాన్ని పొందటం తప్పిస్తే దొంగలు దోచుకోవడానికి ఆ ఇంట్లో ఏమీలేదు. విలువైన వస్తువులూ లేవు. ఖరీదైన వస్త్రాలూ లేవు. కాని దొంగ, దొంగతనం చేస్తాడు అనే భయంతో మేల్కొని వుంటున్నాడు. దొంగతనం భయం కన్నా తన ఇంటి గౌరవ మర్యాదల దిగులు ఎక్కువగా వున్నది. తలుపులేకపోయినా పరదా వాటిని కాపాడుతున్నదని భావిస్తున్నాడు. ఒకనాటి రాత్రి తుఫానులో పరదా వీళ్ళ ద్వారబంధానికి వుండలేక ఎటో కొట్టుకుపోయింది. ఇంట్లో ఇక మిగిలిన ఏకైక పట్టుదుప్పటిని ఆనాటి ఉదయమే పరదాగా వేలాడతీశారు. దాన్ని ఆ వీధి వాళ్లంతా చూశారు. “గుమాస్తాగారూ! పట్టుగుడ్డను ఆ విధంగా ఎందుకు నాశనంచేస్తారు? బజార్లో గోనెసంచినో, ముతకగుడ్డనో ఏదో ఒకటి తెచ్చుకుని వేసుకోండి” అన్నారు.

పీర్‌బక్షు బజారుకెళ్ళినపుడు ముతకగుడ్డల రేట్లు చాలాసార్లు అడిగివున్నాడు. పరదాకు సరిపోయే రెండుగజాల గుడ్డ ఎనిమిదణాలకు తక్కువ రాదని చెప్పారు. ఆ విషయాన్ని కప్పిపుచ్చుకుంటూ “పరదా

పాడయితే పాడవనివ్వండి. పూర్వం నుండీ మా హవేలీలో ఇలాంటి పట్టుదుప్పట్లనే తెరలుగా వాడేవాళ్ళం" అని చెప్పి తన బీదరికాన్ని దాచుకునేవాడు.

బట్టలరేట్లు విపరీతంగా పెరిగినందువలన ఇంట్లో వున్న ఐదుగురు ఆడవాళ్ళు చిరిగిన పీలికలయిన బట్టలతోనే కాలక్షేపం చేస్తున్నారు. బెరడుతో సహా రాల్చుకుని మోడుగా వున్న చెట్లలాగా వున్నారు. పీర్‌బక్షు జీతంతో రోజుకు ఒక పూటైనా కడుపునింపుకోవటానికే చాలనపుడు బట్టలు కొని కట్టుకునే అవకాశం లేని నిర్భాగ్యులైన ఆడవాళ్ళు వాళ్ళు. అతనేమో నౌకరీ చెయ్యటానికి బయటికెళ్ళాలి. అతని బట్టలకు వీలైనన్ని మాసికలు వేసి ఇక వీలుకాక కొత్త పైజామా, చొక్కా కొనవలసిన అవసరం ఏర్పడింది. ఆ ముతక గుడ్డ కూడా కొనుక్కోలేని నిస్సహాయుడయ్యాడు.

తాకట్టుపెట్టటానికి ఇంట్లో వస్తువులేం లేని బీదవారికి పంజాబీ ఖాన్ అప్పిచ్చి ఆదుకుంటాడు. వాళ్ళు వుంటున్న ప్రదేశాన్ని చూసి దాని అంచనాతో అప్పులిస్తాడు. పదినెలల క్రిందట చంటివాడు బర్కత్ పుట్టినపుడు పీర్‌బక్షుకు డబ్బు అవసరమయ్యింది. ఎక్కడా అవకాశం లేక ఆ పంజాబీ బబర్ ఆలీఖాన్ దగ్గర నాల్గురూపాయలు అప్పుచేశాడు.

ఆలీఖాన్ రోజువారీ కూలీ చేసుకునే ఈ కాలనీ వాసులకు అప్పులిచ్చి బాగా గిట్టుబాటు చేసుకుంటూ వుంటాడు. అక్కడున్న మాదిగలు, కూలీలు, చాకలి అందరూ ఈ ఖాన్ దగ్గర అప్పు తీసుకున్నవాళ్ళే. చాలాసార్లు అప్పు, అసలు వాయిదాలు కట్టలేనివాళ్ళ దర్వాజా మీద తన చేతిలో వున్న కర్రతో బాది రగడ చేయటం అలవాటుగా చేసుకున్నాడు. ఖాన్‌కూ, అప్పు తీసుకున్న వాళ్ళకూ పీర్‌బక్షూ కొన్ని సార్లు మధ్యవర్తిత్వం వహించేవాడు.

ఖాన్ అంటే సైతాన్ అని తెలిసీ, గత్యంతరం లేక అతని దగ్గర నాలుగు రూపాయలు అప్పుచేయవలసివచ్చింది. రూపాయికి రూపాయి నెలకు నాలుగు అణాలు వడ్డీ చెల్లించాలి. మర్యాదస్తుడు, ముసల్‌మాలన్ సోదరుడని ఎంచి ప్రతినెలా ఒకరూపాయి చొప్పున కిస్తీ కట్టాలని, ఎనిమిదినెలల్లో అప్పు మొత్తం తీర్చెయ్యాలని షరతుపెట్టుకున్నారు. ఖాన్ దగ్గర చేసిన అప్పు తీర్చలేకపోతే అతను ఇంటి ముందటి కొచ్చి చేసే అవమానం గుర్తొచ్చి పీర్‌బక్షూ ఒంటి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఏడు నెలలపాటు అనుకున్న విధంగా ఖాన్, బాకీ కిస్తీ ఇచ్చివేశాడు. ఇలా ఇచ్చే క్రమంలో ఇంటిల్లిపాదీ పస్తులుండటానికైనా వెనుకాడలేదు. కాని శ్రావణ మాసంలో కురిసే వర్షాలు కురవక పంటల దిగుబడిరాలేదు. చివరకు సజ్జలు కూడా రూపాయికి మూడుశేర్లు మాత్రమే అమ్మారు, కాబట్టి ఆ నెల కిస్తీ ఇవ్వలేకపొయ్యాడు. ఏడవతేదీ సాయంత్రమే ఖాన్ బాకీ వసూలు కొచ్చాడు. అతని గడ్డం పట్టుకుని అల్లా సాక్షిగా ఒక నెల గడువు ఇస్తే బాకీ తీర్చివేస్తానని పీర్‌బక్షూ ఎంతగానో బతిమాలుకున్నాడు. మరుసటి నెల రూపాయి పావలా ఇవ్వటానికి ఒప్పించుకుని ఖాన్‌వెళ్ళిపొయ్యాడు.

బాద్రపద మాసంలో పరిస్థితి మరింత విషమంగా మారింది. పిల్లలతల్లి ఆరోగ్యం రోజురోజుకూ దిగజారుతున్నది. ఏం తిన్నా, ఏం తాగుతున్నా ఆమెకు ఇమడటం లేదు. రోగిపథ్యానికి గోధుమ రొట్టె

పెట్టటం తప్పనిసరయింది. అతి కష్టంమీద ఒక రూపాయి ఖర్చుపెట్టి రెండున్నర శేర్ల గోధుమలు కొనగలిగాడు. జబ్బుపడిన నోటికి ఉల్లి తునకగాని, ఔషధగుణాలున్న ధనియాలు కాని హితవుగా వుంటాయి. సోంపుకాని, వాముకాని, చివరకు నల్ల ఉప్పు అవసరమైనా ఒక్కపైసా గూడా ఖర్చుపెట్టికొనే స్థితిలో లేనిదయింది ఆ కుటుంబం. రాగులన్నపేరే బజార్లో వినపట్టంలేదు. కాని కాలం వచ్చి తీర్చుకోలేని సమస్యలను తెచ్చిపెట్టింది. పీర్‌బక్షుకు రెండురూపాయల బత్తెం లభించింది. కాని నెల మధ్యలో తీసుకున్న అడ్వాన్సులన్నీ చెల్లు వేస్తే కేవలం నాలుగురూపాయల నెల జీతమే చేతికొచ్చింది.

ఇంట్లో పిల్లలు క్రిందటి వారమంతా దాదాపు పస్తే వున్నారు. ఎప్పుడైనా బజార్లో రెండు పైసలకు తోటకూరకొనితెస్తే సజ్జగింజలతో అంబలికాచుకుని ఇంట్లో వాళ్లంతా తలా ఒక గిన్నె తాగి సరిపెట్టుకునే వాళ్ళు. ఇటువంటి స్థితిలో ఖాన్‌కు రూపాయి పావలా ఇచ్చేస్తే ఇల్లెలా గడపాలో అర్థం కాక ఏం చెయ్యాలోపాలుపోక తెగ మథనపడిపోయాడు, పీర్‌బక్షు.

మిల్లునుండి ఇంటికెళ్ళే సమయంలో మార్కెట్‌కెళ్లి, అటూ, ఇటూ పదిసార్లు పచార్లుచేశాడు. ఖాన్‌కివ్వటమా? ఆ డబ్బుల్తో పిల్లల ఆకలి తీర్చటమా? ఎటూ తేల్చుకోలేకపోయాడు. రెండు గంటలు ఆలోచించిన తర్వాత ధాన్యపు మూట కొని ఇంటికి చేరుకున్నాడు. ఖాన్ అంటే వున్న భయం వలన గుండెలు గుబగుబలాడుతున్నాయి. మరొకవైపున ఆకలితో నకనకలాడే నలుగురు పిల్లలు ఆ పిల్లల కన్నతల్లి. తల్లిపాలు చాలక ఎండిపోయినపుల్లవలె వుండి కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకున్న చంటి బిడ్డ, ముసలితనంతో అటూ, ఇటూ కదలలేని తల్లీ వీళ్ళందరూ కళ్ళముందు కదలాడి, వాళ్ళ ఆకలీ గుర్తుకొచ్చి అవే దృశ్యాలు మాటిమాటికీ కలవరపెట్టసాగినయి. ”అల్లా అంతా చూస్తూనే వున్నాడు. ఆయనే నాకు మంచి చేయాలి. ఖాన్ నుండి నా మర్యాద కాపాడాలి” అనుకున్నాడు.

ఏడవ తారీఖు సాయంత్రం తన పనికాలేదు కాబట్టి ఎనిమిదోతారీఖు ఉదయాన్నే పీరుబక్షూ మిల్లుకెళ్ళేముందే తన లాఠీ కర్ర చేతిలో తిప్పుకుంటూ ఖాన్ ప్రత్యక్షమయ్యాడు. రాత్రంతా ఆలోచించి ఖాన్ కేంచెప్పాలో వివరంగా ఆలోచించి పెట్టుకున్నాడు. “మిల్లు యజమాని లాలా గారు నాల్గురోజులముందే పొరుగూరుకెళ్ళారు. ఆయన సంతకం లేకుండా ఎవరికీ జీతాలివ్వరు. జీతం వస్తేనే మీ రూపాయి పావలా ఇవ్వగలుగుతాను.” అని తెలివిగా కథ అల్లి చెప్పినా ఖాన్ చాలాసేపు గుర్రుమంటూనే “నేను నా ఊరొదిలిపెట్టి పరాయి ఊరొచ్చి పడివున్నాను. ఇలా బాకీలు వసూలు కానట్లయితే నేనిక్కడ పడివుండక్కర్లేదు. నాకూ పిల్లలున్నారు. నాల్గ రోజుల్లో నా డబ్బు నాకివ్వకపోతే నీ అంతు చూస్తాను” అంటూ బెదిరించివెళ్ళాడు.

ఐదవరోజు రూపాయిలు ఎక్కడ నుంచి వస్తాయి? జీతమిచ్చి ఇంకా వారం కూడా కాలేదు. ఇక అడ్వాన్సు ఇవ్వనని యజమాని ఖరాఖండిగా చెప్పేశాడు. ఆరోరోజు అదృష్టవశాత్తూ ఆదివారమొచ్చింది. మిల్లుకు శెలవయినా ఖాన్ వచ్చి అల్లరి పెడతాడన్న భయంతో ఉదయాన్నే బయటికొచ్చిపడ్డాడు, పీర్‌బక్షూ.

“ఒకరూపాయి పావలా ఇవ్వండి. వెంటనే తిరిగి తీర్చేస్తానని ఎరిగున్నవాళ్ళను చాలా మందిని అడిగాడు.”

“ఈ రోజుల్లో డబ్బెక్కడుంటుంది? చిల్లుకానీ కూడా వుండటం లేదు. చేతిలో పడకుండానే అప్పులవాళ్ళు తన్నుకుపోతున్నారన్న సమాధానమే అందరి దగ్గర్నుంచొచ్చింది.”

మధ్యాహ్నమయింది. ఖాన్ వచ్చి వెళ్ళిపోయివుంటాడులే అనుకుని పీర్‌బక్షూ ఇంటిముఖం పట్టాడు. ఇంట్లోకి రాగానే ఖాన్ చేసిన గందరగోళమంతా ఇంట్లో వాళ్ళు ఏకరువు పెట్టారు. “సింహద్వారం దగ్గర నిలబడి పరదాను కర్రతో బాది గంటసేపు నానా తిట్లు తిట్టాడు. పరదా చాటున నిలబడి అల్లా మీద ఒట్టుపెట్టుకుని “మీ బాకీ తీర్చటానికే ఏదో ఒక విధంగా డబ్బు తెచ్చే ప్రయత్నంలోనే పీర్‌బక్షూ బయటికివెళ్ళారు. నామాట నమ్మండి అంటూ బీబీ బతిమాలుకున్నది.

కానీ అతను నమ్మక రూపాయిలు తేవటానికి బక్షూ వెళ్ళలేదు. బద్మాష్ లోపలే దాక్కున్నాడు. సాయంకాలం నాలుగు గంటలకు మరలా వస్తాను. నా డబ్బేమైనా తేరగా వుందా? మీలాంటి వాళ్ళకు ధారబోయ్యటానికి అంటూ నానా దుర్భాషలాడి వెళ్ళిపొయ్యాడని దిగులుగా చెప్పారు.

నాలుగ్గంటలు కాకముందే ఖాన్ గొంతు “చౌధరీ” అంటూ కర్కశంగా వినిపించింది. పీర్‌బక్షూ ఒంటిలో షాక్ కొట్టినట్లుగా బొత్తిగా నిస్తేజంగా అయిపోయాడు. కాళ్ళూ, చేతులూ పడిపోయినట్లుగా గొంతు మూగబోయినట్లుగా మాటే రాకుండా పోయింది.

తిట్లు తిడుతూ పరదామీద కొట్టి చప్పుడు చేసేసరికి నిర్జీవంగా లేచి నిరామయస్థితిలోనే లేచి బయటికొచ్చాడు.

ఖాన్ మండిపడుతూ “డబ్బివాల్సివస్తుందని లోపల దాక్కున్నావు” అంటూ తిట్లు లంకించుకుని నోటికొచ్చినట్లుగా బక్షూ పూర్వీకుల్నీ, వారి ఆరాధ్యాలైన పీర్లతో సహా శాపనార్థాలు పెట్టసాగాడు. ఈ ఘాతుకానికి వంశాచార ప్రకారం రక్తం ఉడుకెత్తటానికి బదులు మరింత నిర్వీర్యంగా తయారయ్యాడు. మోకాళ్ళ మీద కూర్చుని తన ఇబ్బందుల్ని చెప్పుకుని క్షమించమంటూ వేడుకుంటున్న కొద్దీ ఖాన్ స్వరం పెంచి బూతులు తిట్టసాగాడు. ఆ గోలకు ఇరుగుపొరుగునున్న వారంతా వచ్చి పోగయ్యారు.

తన చేతిలోని లాఠీని ఝులిపిస్తూ, “డబ్బులియ్యలేవా? ఇవ్వలేని వాడివి నా దగ్గర ఎందుకప్పుచేశావ్? నీ జీతమంతా ఎటుపోయింది? తేరగా నా సొమ్ము మింగాలని చూస్తున్నావు. నేను నీ చర్మం ఒలుస్తాను. డబ్బుల్లేవుగాని ఇంటి ద్వారానికి పరదా తగిలించి నవాబుల పోకడలు పోతావా? నీ పెళ్ళాం నగలుంటే ఇవ్వు. కనీసం ఏమైనా పాత్రలున్నా ఇవ్వు డబ్బు కింద జమేసుకుంటాను అంతే కాని నేను ఖాళీ చేతుల్తో మాత్రం తిరిగి వెళ్ళేది లేదు.” అంటూ రంకెలువేశాడు.

నిస్సహాయతతో రెండుచేతులెత్తి “ఖుదాసాక్షిగా చెప్తున్నాను. ఆయన నీకు మేలు చేస్తాడు. నా మాటనమ్ము. నీకివ్వటానికి ఇంట్లో ఏమీలేవు. చివరికి పాత్రలుకాని, విలువైన వస్త్రాలు కాని లేవు. నువ్వు కోరుకున్నట్లుగానే నా చర్మమే ఒలిచి అమ్ముకో. నాకేం అభ్యంతరం లేదు” అన్నాడు. ఆ మాటలకు ఖాన్

మరింత ఉగ్రుడయ్యాడు. "నీ ఆశీస్సులు, నీ ఖుదా ఆశీస్సులు ఎవడిక్కావాలి? నీ చర్మాన్ని ఒలిచి నేనేం చేసుకోను? దాంతో చెప్పులు కూడా కుట్టరు. నీ చర్మంకంటే ఈ పట్టుపరదాకు కొంతైనా దబ్బొస్తుంది" అంటూ వేలాడే పట్టు తెరను ఒక్క గుంజు గుంజాడు.

సింహద్వారాన్నుండి తెగిపడింది పరదా కాదు. పీర్‌బక్షూ జీవనసూత్రమే తెగి నేలపడింది.

తెగిపడిన పరదాతో అతను కూడా విచలితుడయ్యి నేలమీద పడిపొయ్యాడు. ఈ దృశ్యాన్ని చూచి తట్టుకునే శక్తి ఆ చౌధరీ వంశస్థునికి లేదు. అక్కడ పోగయిన గుంపుకు నిలువు గుడ్లు పడిపొయ్యాయి. ఇంట్లో వున్న బాలికలు, స్త్రీలు బెంబేలెత్తిపోయి ఇంటి మధ్యలో ఒక చోట గుమిగూడి వణుకుతూ నిలబడివున్నారు. పరదా తెగిపడగానే ఆ ఆడవారంతా తమ శరీరంమీద వస్త్రాలన్నీ లాగివేసినట్లుగా ముడుచుకుపోయారు. ఆ పరదానే ఇంటోని ఆడవారి మానాన్ని కప్పే ఆచ్ఛాదనగా వున్నది. ఎందుకంటే వాళ్ళ శరీరాలు మీద చిరిగి జీరండాలైన గుడ్డపీలికలు వాళ్ళ మూడవ వంతు శరీరాన్ని కూడా దాచలేకపోతున్నాయి.

ఆ దృశ్యాన్ని చూచిన గుంపంతా కలవరంతోనూ, సిగ్గుతోనూ కళ్ళు తిప్పుకున్నారు. వారి నగ్నత్వం ఇచ్చిన గగుర్పాటుతో ఖాన్ మనస్సులో నుంచి కాఠిన్యం కరిగి ద్రవీభూతమైనది. బాధతోనే తుపుక్కున ఉమ్మివేసి చేతిలోని పరదాను అక్కడే పారవేసి క్రోధంతో, నిరాశతో వీళ్ళ సిగ్గు చిమడ అనుకుంటూ వెనుదిరిగాడు.

భయంతో, సిగ్గుతో అరుస్తూ లోనికి పరుగెత్తే, స్త్రీల మీద దయచూపిస్తూ పోగయిన గుంపు కూడా చెల్లాచెదురయ్యింది.

పీర్‌బక్షూ స్పృహలేకుండా అలాగే పడివున్నాడు. స్పృహలోకి వచ్చిన తర్వాత చూస్తే సింహద్వారానికుండాల్సిన పరదా వాకిట్లో పడివుండి కనుపించింది. కాని దాన్ని తీసి మరలా వేలాడ తీసే ధైర్యం అతనిలో మిగల్లేదు. ఇంకా ఆ అవసరం కూడా లేదు పరదావేసిన ఉద్దేశ్యం, సంప్రదాయం ఇవాళ్టితో చచ్చిపోయాయి.

## శ్రీ మోహన్ రాకేశ్ యదార్థ వాద సాహిత్యము

జీవన రేఖలు : వాస్తవిక సంఘటనలను చిత్రీకరిస్తూ సమాజంలోని రుగ్మతలను తన రచనల ద్వారా బహిర్గతం చెయ్యటంలో శ్రీమోహన్ రాకేశ్‌కు ప్రత్యేకస్థానమున్నది. ఇటువంటి ఎన్నో రచనలను సమాజానికి అందించి వీరు జనవరిమూడు, పందొమ్మిది వందల డెభ్భై రెండున ఢిల్లీలో స్వర్గస్థులయ్యారు.

కథా రచన : మోహన్ రాకేశ్ కీ సంపూర్ణ కహానియాం, ప్రతినిధికహానియాం మొదలగు కథా సంపుటాలను అందించారు.

ఇతర రచనలు : "ఆఖిరీ చట్టాన్‌తక్"ను **1953**లో వెలువరించారు. "ఆషాఢ్ కా ఏక్ దిన్"ను **1958**లో వ్రాశారు. "మై పాకిస్థాన్, మై భారత్ కే జాసూస్ కా అంధేరేబంద్ కమరే'' అను రచనను పందొమ్మిది వందల అరవై ఒకటిలో పాఠకలోకానికందించారు. **1963**వ సం॥లో "ఇంజనీరింగ్ మాథ్‌మాటిక్స్ బై మోహన్ రాకేశ్" అనే రచనను విద్యార్థులకు పరిచయం చేశారు.

"రాతా కీ బాహెూం మే" అను రచనను **1965**లోనూ, మేరీ సాక్షాత్కార్, లహరోంకే రాజహంసా మొదలగు వాటిని ప్రకటించారు. ఆథా అంధేరే **1969**లోనూ "టుది ఫార్‌దెస్ట్ లాక్"నూ ప్రచురించారు. 'మోహన్‌రాకేశ్ సంచయనా', మరికొన్ని నాటకాలు కూడా వీరికి మంచిపేరు తెచ్చిపెట్టినవి.

"పరమాత్మాకా కుత్తా" అంటే పరమాత్ముని శునకం. ఈ కథలో ప్రస్తుతపు రోజుల్లో గవర్నమెంటు ఆఫీసుల్లో జరిగే జాప్యమూ, వారి దురాశా, లంచాల పట్ల కోరికలపై వ్యంగ్యాస్త్రాలను సంధించారు. బంట్రోతు దగ్గరి నుంచీ పై అధికారి మనస్తత్వం వరకూ ఎంతో రమ్యంగా చిత్రీకరించారు. టైపు మిషన్ టకటకలు, పని ఎగవేసి బాతా ఖానీ కొట్టే గుమాస్తాల కవితా పఠనం వరకూ అత్యంత సహజంగా చిత్రించి గవర్నమెంటు ఆఫీసు వాతావరణాన్ని కళ్ళ ముందు సాక్షాత్కరింపజేశారు.

హిందీమూలం: మోహన్‌రాకేశ్ 

# పరమాత్ముని శునకం

అనుసృజన: దాసరి శివకుమారి

ఏదో శవం దగ్గర నిలుచున్నట్లుగా చాలామంది అక్కడ ముఖం వేలాడేసుకుని నిలబడి వున్నారు. తమతోపాటు తెచ్చుకున్న ఆహారం తిని కొంతమంది ఆకలి తీర్చుకుంటుంటే మరికొందరు తలగుడ్డలు విప్పి, కాంపౌండ్ వెలుపల రోడ్డువారగా ఉండి కాలక్షేపం చేస్తున్నారు. ఆ వేడి వాతావరణంలోనే ఎవరి పనుల్లో వారున్నారు. కమ్యూనిటీ మంచినీటి కుళాయి దగ్గర ఒక క్యూ వున్నది. దానికి దగ్గర్లోనే కుర్చీ వేసుకుని కూర్చుని, అర్జీలు వ్రాస్తూ వాటిని టైపు చేస్తున్నాడు టైపిస్టు. నుదుటి నుండి కారే చెమట పెదాల్ని తడుపుతున్నా సరే అతను దాన్ని తుడుచుకునే ధ్యాస కూడా లేకుండా వున్నాడు. తెల్లని గడ్డాలతో వున్న ఎత్తైన జాట్ వ్యక్తులు తమ లాఠీలను గడ్డం కింద ఆన్చుకుని నిలబడి తమ టైపు పని కోసం వేచి చూస్తున్నారు. టైపు చేసే వ్యక్తి ఎండబారి నుండి కాపాడుకోవటానికి ఒక గోనె పట్టా పరదాలాగా పైన వేయించుకున్నాడు కాని గాలికి అది అటూ, ఇటూ ఎగురుతున్నది. కొద్ది దూరంలోనే అతని కొడుకు కూర్చుని ఇంగ్లీషు పదాలు వల్లె వేయసాగాడు. " సిఎటి క్యాట్ అంటే పిల్లి, బిఎటి బ్యాట్ అంటే బ్యాటు, ఎఫ్ఎటి ఫ్యాట్ అంటే లావు" అంటూ మాటి మాటికీ వల్లించసాగాడు.

చొక్కా పై బటన్‌లు విప్పుకుని ఆఫీసు వారు కొందరు ఫైళ్లను అక్కడ వదిలేసి, ఒకరిపై ఒకరు ఛలోక్తులు విసురుకుంటూ రిజిస్ట్రేషన్ రూమ్‌నుండి రికార్డు రూమ్‌కు వెళ్తున్నారు. ఎఱ్ఱని పటకా వేసుకున్న జవాను వరండాలో స్టూలు మీద కూర్చుని వరండా దిగువనున్న జనాన్ని ఉదాసీనంగా చూస్తూ కూర్చున్నాడు. ఆనాడు వాళ్లను లోపలికి పంపించినందుకు తనకెంత ఆదాయం లంచంగా ముడుతుందో మనసులోనే లెక్కవేసుకుంటున్నాడు. సెప్టెంబరు మాసపు ఎండ. పక్కనే వున్న చెట్టు మీద పక్షిపిల్లలు నెమ్మది నెమ్మదిగా పైకీ, క్రిందకూ తిరగటం అలవాటు చేసుకుంటున్నాయి. కాకులు ఎక్కడ ఆహారం దొరుకుతుందా అన్న ఆలోచనలో అటూ ఇటూ పరికించి చూస్తున్నాయి. ఇంతలో డెబ్భై, డెబ్భై అయిదేళ్ల ముసలామె వణుకుతూ వచ్చి నిలబడింది. ఎముకలు కప్పుకుని ముడతలు పడ్డ చర్మంతో వున్నది. "నా కొడుకు చచ్చిపోయాడయ్యా. వాడి పేరు మీదున్న భూమి నాదవుతుందా? లేదా?" అని అక్కడున్న వాళ్లను అడుగుతున్నది.

లోపలి హాల్లో ఫైల్స్ నెమ్మది నెమ్మదిగా కదులుతున్నాయి. ముగ్గురు నలుగురు ప్రోగయ్యి ఒక టేబుల్ దగ్గర కూర్చుని ఫైల్స్ సంగతి వదిలేసి, టీలు తాగుతూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. ఆఫీసు కాగితం పైన వ్రాసిన గజల్‌ను చదివి ఒక వ్యక్తి తన తోటి వారికి వినిపించసాగాడు. ఏదో పాత సంచికలో నుంచి ఎత్తి రాసుకుని వచ్చినదని అనుకుంటూ, వింటున్నట్లు నటిస్తూనే "అజీజ్ సాహెబ్! కొత్తగా రాశారా ఈ గజల్‌ను, లేదా ఎప్పటిదో జ్ఞాపకం, చేసుకుని ఇప్పుడు విన్పిస్తున్నారా?" అని అడిగారు.

"అబ్బే, ఇది పాతది కాదు. పూర్తిగా కొత్తది. ఇలాంటి సబ్జక్టు మీద, ఇంతబాగా ఇంతకుముందెవరూ వ్రాసినట్లు కనపడదు తెలిసిందా? నమ్మాలి మీరు" అంటూ కోర్టులో సాక్ష్యం చెప్పినట్లుగా గట్టిగా చెప్పాడు. తోటి ఉద్యోగులు సరేనని ఆమోదించారు. దేవుని మాన్యానికి సంబంధించిన ఫైలు కదిలించటం కోసం సుర్జీత్‌సింగ్ ఆ టేబుల్ దగ్గర కొచ్చి కొంత సొమ్మును కాగితాల కింద పెట్టి వెళ్లాడు. అజీజ్

సాహెబ్ నెమ్మదిగా మరొక గజల్ అందుకున్నాడు.

పెద్దయ్యగారి గదిలో బజర్ మోగింది. స్టూలు మీద కూర్చున్న నౌకరు చురుగ్గా కదిలి లోపలికెళ్లి అంతే చురుగ్గా మరలా తిరిగి వచ్చి కూర్చున్నాడు. నౌకరు లోపలికొచ్చి కిటికీ తెరలు సరిచేసి వెళ్లగానే కొన్ని ఫైల్స్ మీద సంతకాలు పెద్దయ్యగారు చేశారు. పైప్ వెలిగించి “రీడర్స్ డైజెస్ట్” తాజా సంచిక తీసి జె.డి. రైట్ క్లిఫ్ వ్రాసిన గుండె ఆపరేషన్ కొత్త పద్ధతులున్న నూటపదకొండో పేజీ చదవసాగారు. ఇంతలో బయటి నుండి కొంత గోల వినిపించింది.

కాంపౌండ్‌లోని చెట్టు క్రిందకి మరో నాలుగు కొత్త ముఖాలు వచ్చి చేరాయి. ఒక నడి వయస్కుడు వచ్చి తన తలపాగా తీసి నేలమీద పరిచాడు. కాళ్లు బారజాపి నిర్లక్ష్యంగా ఉన్నాడు. అతనికొక వైపున వయసు మళ్లిన స్త్రీ ఒకతె, ఆమె కుమార్తె కూర్చుని వున్నారు. ఆమె కొడుకు చాలా బలహీనంగా వుండి, పరిసరాలను చూస్తూ వున్నాడు. కాళ్లను మరింత చాపి, పెద్ద గొంతుతో మాట్లాడే అతన్ని చాలా మంది గమనించసాగారు.

“అర్జీ మంజూరయితే ఐదు పది సంవత్సరాలలో మన సర్కారు తీర్పు ఇస్తుంది. ఈ లోగా యమ ధర్మరాజు కూడా మన వెంటే వస్తాడు. సర్కారు తీర్పుకు మనం జీవితాంతం ఎదురు చూడాల్సిందే” అంటూ బిగ్గరగా వ్యాఖ్యానించసాగాడు.

అతని మాటలు విన్న మిగతా వారూ, స్టూలు మీద వున్న నౌకరూ అప్రమత్తులయ్యారు. “రెండేళ్ల క్రిందట అర్జీ ఇచ్చాను. నాకు మంచి భూమి కేటాయించమని వేడుకున్నాను. ఈ రెండేళ్లలో ఆ కాయితం ఈ రెండు గదులను దాటి ముందుకు పోతే ఒట్టు. సర్కారుకు ఇంకా ఎంత సమయం కావాలో తేల్చుకోవాలని ఇంటిల్లిపాదితో వచ్చాను. ఇంకా ఎంత సమయం కావాలి మీకు? ఈ రోజు అటో ఇటో తేలిపోవాలి. ఏడేళ్ల నుండి ఆకలి పోరాటం చేస్తున్నాను. పనికిరాని పల్లపు భూమి వద్దు. మంచిది కేటాయించండని రెండేళ్లనాడు అర్జీ ఇచ్చాను. నా ఆకలి, నా పస్తులు ఏమీ పట్టకుండా కాలాన్ని మింగేస్తున్నారు మీరు.” అంటూ అరవసాగాడు.

ఆ మాటలు విన్న నౌకరు క్రోధంతో ఊగిపోతూ చేతిలోవున్న తన ఆయుధంతో ముందుకు వచ్చి గుంపును చెదరగొడుతూ “ఏయ్ మిస్టర్! ఏంటా వాగుడు? ముందిక్కడనుంచి బయటికి నడు”. అంటూ జులుం చేశాడు.

తన కాళ్లను మరింత ఊగిస్తూ “ఈ మిస్టర్ ఇవాళ రాజు. ఈ రాజుదే ఇవాళ పెత్తనమంతా. ఇక్కడనుంచి కదలనే కదలను. సిగ్గూ, ఎగ్గు లేనివాడను. ఎవర్నీ లెక్క చేయను. ఈ రాజునివాళ ఎవరూ శాసించలేరు. తెలిసిందా నౌకరు మహాశయా?”

“ఎవరి మీద హుకుమ్ చేస్తావో నేనూ చూస్తాను. పోలీసులకు కబురు చేస్తే నీ పెత్తనాన్ని వాళ్లే సవరదీస్తారు”.

"పిలువు పోలీసుల్ని. ఏ పోలీసులొచ్చి నా రాజరికాన్ని లాగేస్తారో చూస్తాను. పోలీసులెదుటే నగ్నంగా నిలబడి తీసేయి నా రాజరికాన్ని అంటాను. నాతో బాటు ఇంకా ముగ్గురు నా తోటి పెత్తందార్లున్నారు. మొదటి ఆమె నా అన్న భార్య. ఆమె భర్తనే పాకిస్తాన్‌లో ఏడేళ్ల క్రిందట నరికి చంపారు. వీడు నా అన్నకొడుకు రోగిష్టివాడు. నా అన్న కూతురు ఇప్పుడు పెళ్లీడుకొచ్చింది. దీని కంటె పెద్దది ఇంకా పాకిస్తాన్‌లోనే వున్నది. ఈ రోజు వీళ్లందరికీ అధికారం, రాజరికం నేనే ఇచ్చాను. నీవు నీ పోలీసులను పిలిచి మా అందరి రాజరికాన్ని పీకేయ్ రా కుక్కా, సాలా?" అంటూ తిట్లు లంకించుకున్నాడు.

ఈ గోల విని లోపలి నుండి ఉద్యోగి ఒకరు బయటకు వచ్చారు.

"నీచమైన కుక్కా, అంటావురా నన్ను. నిన్నీ వేళ చంపేస్తాను" అంటూ తన బూటుకాలెత్తి జాడిస్తూ అతని భుజాన్ని పట్టుకొని గట్టిగా పట్టు బిగించాడు నౌకరు.

అతని వదిన, వదిన కూతురు భయపడి అక్కడి నుండి బయటకి వెళ్లారు. కొడుకు ఏడ్వసాగాడు.

"ఆగు ఆగు. అతనితో కలబడకు" అంటూ ఉద్యోగి నౌకరును వెనక్కు లాగాడు.

"మీకు తెలియదు సార్! మీరుండండి. ఈ నీచుడు మన ఆఫీసు కొచ్చి మనల్నే తిడుతున్నాడు. వీడి అంతు చూస్తాను".

"నువ్వొక్కడివే కాదు. ఇక్కడ అందరూ కుక్కలే. నేను కూడా కుక్కనే. మీకూ, నాకు వున్న తేడా ఏంటంటే మీరంతా సర్కారు కుక్కలు. మా లాంటి వారి ఎముకలను కూడా నమిలేసి సర్కారు తరపున మొరుగుతూ వుంటారు. నేను పరమాత్ముని కుక్కను. ఆయనిచ్చిన గాలి పీల్చి బతికే వాడిని. భగవంతుడి తరపునే మొరుగుతాను. ఆయనిల్లు మానవత్వంతో నిండి వుంటుంది. ఆ ఇంటికే నేను కాపలా కాస్తాను. మీరంతా న్యాయాన్ని, మానవత్వ సంపదను దోచుకుంటున్నారు. మీమీద మొరిగి నా కర్తవ్యాన్ని నెరవేర్చమని నా యజమాని ఆజ్ఞ, శాసనం కూడా. నాకు మీతో ఆ జన్మవైరమున్నది. కుక్కకు మరో కుక్కే శతృవు. మీరంతా కలసి నన్నిక్కడ నుండి గెంటి వేసినా నేను మొరగటం ఆపను. నా నోరు మూయించడం మీ వల్లకాదు. నా యజమాని యొక్క పురుషత్వం, నా మూల గురువు యొక్క తేజస్సు నాలో వున్నాయి. మనుష్య రూపంలో వున్న కుక్కలు మీరంతా. చచ్చిపోయిన శవాల దగ్గర కూడా తోకలూపుకుంటూ తిరిగే రకాలు" అంటూ పెచ్చుటిల్లిపోతున్నాడు.

"చాలు, చాలు ఆపు నాయనా నీ తిట్లదండకం. ఇకనైనా మా మీద దయ వుంచి నీసూక్తి ముక్తావళి ఆపు. ఇంతకీ నీ పేరేంటి? నీ కేసేంటి?" అంటూ అడిగాడు ఆ ఉద్యోగి.

"నా తల్లీదండ్రి పెట్టిన పేరును మీ ఆఫీసు కుక్కలే తినేసి నన్ను పన్నెండు వందల ఇరవై ఆరు బై ఏడు అంటూ పిలుస్తున్నారు. నీ డైరీలో అదే వ్రాసుకో. అదే నాపేరు".

"ఇవాల్టికెళ్లు.  రేపో, ఎల్లుండో రా.  నీ అర్జీ మీద చర్య తీసుకుంటాం.  దాదాపుగా నీపని, అయిపోతుంది."

"దాదాపుగా, ఇంచుమించుగా, అనే పదాలకు కాలం చెల్లిపోయింది.  ఇప్పుడు ఆ అర్జీ సంగతి, నేనే స్వయంగా తెలుసుకుంటాను.  పని అయిపోవచ్చు అంటూ సర్కారు తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంటే మరొక వైపు పరమాత్ముని నైపుణ్యాన్ని తోడు తీసుకుని నేను నిలబడతాను.  నీ ఇంచుమించుగా అనే పదాన్ని నీ దగ్గరే వుండనీ.  నీవు చేద్దాం, చూద్దాం అనేసరికి నా శవంపై గుడ్డ కప్పే సమయమవుతుంది. సంవత్సరాల తరబడి మీరు చదివి నేర్చుకున్నది ఇదేగా.  కాగితాలు పైకి పంపించాం.  పని పూర్తవ్వచ్చు అనే మాటలే మళ్లీ మళ్లీ చెప్తారు.  నేనిక్కడే కూర్చుంటాను.  నా పని కావాలి ఇవాళే, ఇప్పుడే.  చేస్తాం, చూస్తాం.  ఇంచుమించుగా అయిపోవచ్చింది అనే మాటలు ఎవరైనా వినే వాళ్లుంటే వాళ్లకు చెప్పి మోసం చెయ్యి.  నన్ను కాదు" అంటూ భీష్మించుకుని కూర్చున్నాడు.  "వాడ్ని చచ్చేదాకా మొరగనివ్వండి. మనదేం పొయ్యింది" అనుకుంటూ ఉద్యోగులంతా ఆఫీసు లోకి వెళ్లారు.  "నేనైతే ఈ సాలేగాడి పళ్లూడగొట్టి చేతిలో పెట్టేవాణ్ణి.  నాపై వాళ్లొచ్చి చెప్పబట్టి వాళ్ల మాట నేను వినాల్సి వచ్చింది అనుకుంటూ" నౌకరు పళ్లు కొరుక్కుంటూ కూర్చున్నాడు.

"రేయ్ బాబూ! నిదానంగా వుండి ఓపిగ్గా పని చేయించుకునే దాకా వాళ్ల చుట్టూ తిరగాలి. వాళ్లకు మొక్కాలి.  లంచం పెట్టాలి.  బెదిరిస్తే పనులు చేయర్రా" అంటూ గుంపులోని ఒక వ్యక్తి సమాధాన పరచాలని చూశాడు.  అతనికీ మాటలేం నచ్చక లేచి నిలబడ్డాడు.

"దేవుని మాట ప్రకారమే నేను నడుచుకుంటాను.  వీళ్ల మాట కాదు చెల్లుబాటయ్యేది.  పరమాత్ముని ఆజ్ఞే అంతటా చెల్లుబాటవుతుంది.  నా చొక్కా విప్పేస్తాను.  ఈ బికారి చక్రవర్తి ఇలాగే కమీషనరు గారి గదిలోకి వెళ్తాడు.  ఆయన చేత వీపుమీద కర్ర దెబ్బలూ తింటాడు.  బూట్ల తాపులతో సొమ్మసిల్లి, ప్రాణాలివ్వటానికైనా వెనుకాడడు.  అంతే కాని ఈ రాజు ఎవర్నీ ప్రాధేయపడడు.  ఎవరికీ లంచం ఇవ్వడు.  అంతరాత్మ చెప్పిందే చేస్తాడు" అంటూ తన లుంగీ కూడా విప్పబోతే విప్పనివ్వకుండా ఒకరిద్దరు అడ్డుపడి అతని చేతుల్ని పట్టుకోబోగా విడిపించుకోవటానికి పెనుగులాడాడు.

"మహాత్మాగాంధీ మనకు సొరాజ్జెం ఇప్పించెందుకు?  దాన్ని వీళ్లు మట్టిలో కలిపేస్తారా?  దాన్ని ఫైళ్లలో బంధించి ఆయన పేరుకు కళంకం తెస్తారా?  మానవత్వంపై గుడ్డ కప్పి మూసివేసి మిమ్మల్ని మోసం చేస్తున్నారు.  మేలుకోండి.  నేను కుక్కను.  మొరుగుతున్నాను.  నిజాలు తెలుసుకోండి" అంటుంటే ఆ మాటలు ప్రజల క్కూడా బాగా నాటుకున్నాయి.

కనుబొమ్మలు ముడివేస్తూ నుదురు చిట్లించి ఆఫీసులో నుంచి బయటకు గుంపు మధ్యకొచ్చాడు కమీషనరు.

"ఏం కావాలి నీకు? విషయమేంటి?" అని అడిగాడు.

"మిమ్మల్నే కలవాలనుకుంటున్నాను. చాలా కొద్ది పల్లపు భూమి నాకు మంజూరు చేశారు. దాన్ని తిరిగి ఇచ్చివేస్తాను. మీ సర్కారు వారు దాంట్లో ఒక చెరువు తవ్విస్తే అధికారులు సాయంత్రం పూట చేపలు పట్టుకుంటారు. లేదా ఆ గుంటలో ఒక భూగర్భ గృహం కట్టి నాలాంటి కుక్కల్ని దాంట్లో కట్టి పడవేయవచ్చు". అన్నాడు వెటకారంగా..

"ఎక్కువగా చెత్త వాగకు. నీకేసు తీసుకుని నా దగ్గరకురా".

"నా కేసు నా దగ్గరెక్కడుంది? రెండేళ్ల నుంచి అది సర్కారు దగ్గర అంటే మీ దగ్గరేవుంది. నా దగ్గరున్నది నా శరీరం దానిపై రెండు గుడ్డలు మాత్రమే వున్నాయి. రెండు రోజులు పోతే ఇవీ వుండవు. అందుకని వీటిని కూడా ఇవాళే తీసివేస్తున్నాను. అటు తర్వాత కేవలం పన్నెండు వందల ఇరవై ఆరు బై ఏడు మాత్రమే వుంటాడు. వీడిని కూడా చంపి పరమాత్ముని దగ్గరకే పంపేస్తారు మీరు".

"వాగుడాపి నాతోపాటు లోపలికి రా" అంటే కమీషనరు తో పాటు అతను కూడా లోపలికి నడిచాడు. "రెండేళ్ల బట్టి కాళ్లరిగేటట్లు తిరుగుతున్నాను. ఇచ్చకపు మాటలు చెప్పటమే కాని నా మాట ఎవరూ పట్టించుకోవటంలే"దన్నాడు.

నౌకరు వచ్చి మరలా కిటికీ పరదా సరి చేశాడు. కమీషనరు బజర్ నొక్కాడు. లోపలికి వచ్చిన వారితో "ఇతనికి సంబంధించిన ఫైలును తెండి" అని చెప్పాడు.

అరగంట తర్వాత మన రాజ్యం లేని రాజుగారు చిరునవ్వు నవ్వుకుంటూ బయటికొచ్చాడు.

"ఏం జరిగిందేంజరిగిందని" అంటూ ఉత్సుకతగా అడిగారు.

"ఎలుకల్లాగా బొరియల్లో వుండి అటూ, ఇటూ తిరిగితే పని జరగదు. అందరికందరూ అధికారుల చెవులు చిల్లులు పడేటట్లుగా మొరగాలి. కుక్కల్లాగా మొరగాలి గుర్తు పెట్టుకోండి. అప్పుడే పన్లు అవుతాయి" అంటూ బయటికి నడిచాడు.

అతని కుటుంబ సభ్యులు బయటి గేటు దగ్గర అతని కోసం ఎదురు చూస్తున్నారు. పిల్లలిద్దరి భుజాల మీద చేతులు వేసి అతను నిజంగా రాజులాగా రోడ్డు మీద నడుస్తూ వెళ్తున్నాడు.

"పిల్లలూ! వినండి. వినయంగా, ముఖం వేలాడవేసుకుని నిలబడి, కుళాయి నీళ్లు తాగుతూ, అర్జీలు టైపు చేయిస్తూ వున్నంత కాలం సర్కారు సమయం తీసుకుంటూనే వుంటుంది. సిగ్గు విడిచి పెట్టి చూడు. ఎంతో లాభం జరుగుతుంది." అంటూ బిగ్గరగా నవ్వసాగాడు.

అతను వెళ్లిన తర్వాత ఆ కాంపౌండ్ మళ్లీ దీనస్థితిలో, చెల్లా చెదరయిన గుంపంతా గంభీర స్థితిలోనూ పడిపొయ్యారు. నౌకరు మళ్లా కాళ్లూపుకుంటూ స్టూల్ మీద కూర్చుని పెత్తనం చేస్తున్నాడు. కాంటీన్ కుర్రాడు లోపలున్న బాబుగార్లకు చాయ్‌లు తీసుకెళ్లాడు. అర్జీలు టైప్ చేసే అతను టిక్, టిక్ మంటూ టైపు చేస్తుంటే అతని కొడుకు పిఇఎన్, పెన్ అంటే కలం, డిఇఎన్ డెన్ అంటే చీకటి గుహ, అంటూ పదాలు వల్లించసాగాడు.

## శ్రీ విశ్వంభర్‌నాథ్‌శర్మ కౌశిక్ స్థానమూ-సాహిత్యము

జీవన రేఖలు : వీరు అంబాలా ప్రాంతంలో 1891 వ సంవత్సరములో జన్మించారు. ప్రేమ్‌చంద్, జయశంకర ప్రసాద్, గులేరీ లాంటి సాహిత్య దిగ్గజాలతో సమాన స్థానం కౌశిక్‌జీకి కూడా హిందీ భాషలో ఇవ్వబడింది. వీరి భావాలు ప్రేమ్‌చంద్ భావాలకు దగ్గరగా వుంటాయని విశ్లేషకుల భావన. హిందీ భాషకు ఎనలేని సాహిత్య సేవలను అందించి 1945 లో వీరు స్వర్గస్థులయ్యారు.

కథాసృష్టి : ప్రముఖ కథా సృష్టి కర్తలలో వీరొకరుగా గుర్తింపబడ్డారు. కౌశిక్‌జీ మూడువందల కథలు వ్రాశారు. 'తాయీ' అన్న కథ అత్యుత్తమ కథగా నిర్ణయింపబడినది. ఈ కథలో స్త్రీ మానసిక స్థితిని వర్ణిస్తూ వీరు వెలిబుచ్చిన భావయుక్త భాషా, శైలీ దీనికంత పేరు తెచ్చిపెట్టినది.

ఛోటాబేటా, పారిస్‌కీ నర్తకీ, సాథ్‌కీహోలీ, చిత్రశాల, మణిమాల, కల్లోల్ అనే కథా సంపుటాలు వెలువరించారు. సరస్వతి, మాధురి, సుధ మొదలగు రచనలు చేశారు. కౌశిక్‌జీ "విజయానంద్‌దుబే" అను పేరుతో వ్రాసిన "దుబేజీకీ చిట్టియాం" "దుబేజీకీ డైరీ" అనే రచనలు ఆనాటి పత్రికల్లో ప్రచురింపబడి ఎంతో ఖ్యాతిని గాంచాయి. వారి హాస్య పూరిత సాహిత్యం ఆనాటి పరిస్థితులకు దగ్గరగా వుండి పాఠకులను మనసారా నవ్వించింది.

నవలా సాహిత్యం : మా, భిఖారిణి అను నవలలు కూడా మంచి నవలలుగా ప్రసిద్ధి పొందినవి. ప్రస్తుత కథ "తాయీ" అంటే పెద్దమ్మ. ఇది కౌశిక్‌జీ సర్వశ్రేష్ఠ కథగా ప్రశంసలందుకున్నది. మానవ మనస్తత్వాలను యథాతథంగా ప్రతిబింబించే రచన ఇది. ఈ కథలో సంతాన విహీనురాలైన ఒక స్త్రీ పడే మనోవేదన తెలిపారు. ఆమె ఆలోచనా తరంగాలు ఎలా వీస్తాయో హృద్యంగా వర్ణించారు. పాఠకులకు కలకాలం గుర్తుండిపోయే రచన ఇది.

హిందీ మూలం: విశ్వంభర్‌నాథ్ శర్మ కౌశిక్

# పెద్దమ్మ

అనుసృజన: దాసరి శివకుమారి

రామ్‌జీదాస్ ధనవంతుడే కాక బట్టల వ్యాపారి కూడా. అతని తమ్ముడు కృష్ణదాస్. కృష్ణదాస్ పిల్లలు మనోహర్, చున్నీలు. మనోహర్, చున్నీలు తమ ముద్దు మాటల్తో పెద్దవాళ్ళను మురిపిస్తూ, ఇల్లంతా సందడి చేస్తున్నారు. రామ్‌జీదాసు భార్య రామేశ్వరి. ఈ దంపతులకు పిల్లల్లేరు. రామ్‌జీదాసుకు మనోహరంటే చాలా ప్రేమ. ఆ ప్రేమను చూసి, పరాయి వాళ్ళ పిల్లల పట్ల ఇంత ప్రేమేమిటని రామేశ్వరి చాలా చిరాకుపడుతూ వుంటుంది. తన అయిష్టతను తరచూ భర్తకూ తెలియజేస్తూవుంటుంది.

"పెదనాన్నా! పెదనాన్నా! నాకు లైలుబండి తెచ్చిపెట్టవూ? చుక్.. చుక్... అంటూ నేను చాలా దూలం పోతాను అన్నాడు గారంగా.

"రైలుబండి కావాలా? మరీ నీ రైలు బండిలో ఎవరెవర్ని ఎక్కించుకుంటావు? చెప్పు."

"నిన్నూ, ఇంకా చున్నీని, నాలైలు బండిలో తీచుకుపోతాను" అన్నాడు వచ్చీరాని ముద్దు మాటలతో.

"మీ పెద్దనాన్ననే తీసుకుపో నీ రైల్లో. ఇక్కెడెవరూ వచ్చేవాళ్ళు లేరులే" అంది వెటకారంగా రామేశ్వరి. ఆమె ధోరణిని గమనించకుండా "మరి పెద్దమ్మను కూడా మనతో తీసుకెళ్దామా మనోహర్!" అంటూ రామ్‌జీదాసు ప్రశ్నించాడు.

"పెద్దమ్మకు నేనంటే ఇష్టమే లేదు. నేను తీచుకుపోను." అన్నాడు తల అడ్డంగా వూపుతూ.

మనోహర్‌ను చేతుల్తో ఎత్తి రామేశ్వరి ఒళ్ళో కూర్చోబెడుతూ "నువ్వు మనోహర్‌ను బాగా చూసుకో, నువ్వు గనక ప్రేమతో వున్నావంటే మాతో బాటు నిన్ను కూడా రైలెక్కించుకుని చాలాదూరం తీసుకుపోతాం. కదురా మనోహర్!" అన్నాడు రామ్‌జీదాసు.

ఈలోగానే రామేశ్వరి తన ఒళ్ళోనుండి పిల్లవాడిని క్రిందకు ఒక్క నెట్టు నెట్టింది. వాడి శరీరానికి పెద్ద దెబ్బ తగల్లేదు కాని బాగా చిన్నబుచ్చుకున్నాడు. రామ్‌జీదాసు క్కూడా ఈ సంఘటన చాలా కోపం తెప్పించింది. ఆ రోజు మధ్యాహ్నం భోజనమయింతర్వాత విశ్రాంతిగా పడుకున్నప్పుడు రామ్‌జీదాసు ఇదే ప్రస్తావన తెచ్చాడు. "చూడు రామేశ్వరీ! ప్రొద్దున వాడ్ని నీ ఒళ్ళోంచి తోసివేయటం చాలా అమానుషంగా వున్నది. పిల్లల్తో ప్రేమగా ఉండాలని ఎన్నిసార్లు చెప్పినా నీ బుఱ్ఱకెక్కటం లేదు." అన్నాడు కోపంగానే.

"ఎక్కాల్సింది నా బుఱ్ఱక్కాదు. పండితులు చెప్పిన విషయాలు మీరు గుర్తు చేసుకోండి. మనకు పిల్లలు తప్పకుండా పుడతారు. కాని పిల్లల కోసం మనమే ఏ ప్రయత్నాలూ చెయ్యటం లేదు. ఇదంతా నా ఖర్మ." అన్నది రామేశ్వరి ముక్కు చీదుకుంటూ.

"నాకీ జ్యోతిష్కుల మీద ఏ మాత్రం నమ్మకం లేదు. నా సంగతి తెలిసీ అనవసర వాదనలు చెయ్యొద్దు" అన్నాడు గట్టిగా.

"అవునవును. నా వన్నీ అనవసరవాదనలే. ఏ పూజో, పునస్కారమో చేసి బిడ్డల్ని పొందాలన్న ఆలోచనే ఆ భగవంతుడు మీకు రాకుండా చేస్తున్నాడు. ఏ జ్యోతిష్కుడి మాటా వినరు. ఏ పండితుడు చెప్పిందీ పాటించరు. ఏ ప్రయత్నం చెయ్యకుండా ఫలితమెలా వస్తుంది? ఊరందరిదీ ఒకదారి, మీరొక్కరిదీ ఒకదారి".

"జ్యోతిశ్శాస్త్రము మంచిదే. పూజా పునస్కారాలూ మంచివే. కాని వాటిని నిష్ఠగా ఆచరించే వాళ్ళే ఈనాడు కనపట్టం లేదు. ఇప్పటి వాళ్ళు ఏవో నాలుగు ముక్కలు ఒంటబట్టించుకుని మిడిమిడి జ్ఞానంతో క్రతువులు చేయించటానికి వస్తున్నారు. అదే నాకు నచ్చటం లేదు."

"చూడండి, ఈనాటి పూజా పునస్కారాల వలన పని జరుగదు. మరి ఎలా? మన తర్వాత మన వంశం పేరు నిలబడాలా? వద్దా? పరాయి వారి పిల్లలు మన పిల్లలవుతారా?"

"పిచ్చిదానా పిల్లలుంటేనే, వంశమూ, పేరు ప్రతిష్ఠలూ నిలబడతాయా? మహాకవి తులసీదాస్ జీకి ఏ సంతానముంటే వారిని ఈనాటికీ స్మరించుకుంటున్నాం? వారికాపేరు వారి రచనలైన, రామాయణం లాంటి వాటివలన, వారి భక్తి వలనా వచ్చింది. అలాగే మన ఊరి సత్రపు ధర్మకర్తకు ఏ పిల్లలున్నారు?వారి పేరును, యాత్రికులంతా ఎందుకు స్మరించుకుంటున్నారు? అన్నదాతా సుఖీభవ! అని దీవిస్తూ వున్నారు. ఎందుకంటే ధర్మసత్రం నిర్మించి దాని నిర్వహణక్కావలసిన ఏర్పాట్లన్నీ చేసి వెళ్ళాడు కనుక ఆయన పేరు పదే పదే వినపడుతున్నది.

"ఇవన్నీ నాకనవసరం. ఒక్కమాట చెప్పండి. మీకసలు మీసంతానాన్ని చూచుకోవాలన్న కోర్కె వున్నదా? లేదా?" అంటూ రామ్‌జీదాసు హృదయాన్ని గాయపరిచే ప్రశ్నవేసింది.

"తన ప్రతిబింబాన్ని చూచుకోవాలని రాతి గుండెవున్న పశువైనా అనుకుంటుంది. మూర్ఖంగా మాట్లాడకు" అంటూండగానే మనోహర్ అక్కడికొచ్చాడు. "రైలుబండి తెచ్చావా?" అనుకుంటూ, వాళ్ళ పెద్దమ్మ నెట్టివేసిన బాధను పోగొట్టాలి అనుకుంటూ రామ్‌జీదాసు తాను తెచ్చిన రైలుబండిని ఇచ్చి వాడిని ఆడించసాగాడు.

కృష్ణదాసు పిల్లల్నే తన పిల్లలుగా భావిస్తున్నాడు కాబట్టి రామ్‌జీదాసుకు పిల్లల్లేరు అనే బాధేమీలేదు. కాని రామేశ్వరి అలా సరిపెట్టుకోలేకపోతున్నది. తాను స్వయంగా తల్లి కాలేకపోయింది కాని, ఆమె మనసు నిండా తల్లి ప్రేమవున్నది. మరిది పిల్లలు, తన కన్నబిడ్డలు కాదన్న వాస్తవాన్ని కలలో కూడా మర్చిపోలేకపోతున్నది. ఎంత హీనమైనదైనా మనుషులకు, తమ స్వంత వస్తువుల పట్ల జాగ్రత్తా, మమకారం జాస్తి. ఎంత విలువైనవైనా పరాయి వస్తువులపట్ల అజాగ్రత్త, తిరస్కారమూ జాస్తే. తమ్ముని పిల్లలే స్వంతమనుకుని రామ్‌జీదాసు వారి ప్రేమను అనుభవిస్తూవుంటే వారు పరాయివారేనని రామేశ్వరి రోజురోజుకూ, వారిని ఎడం పెడుతున్నది. ఈ పిల్లల కారణంగానే నా భర్త నన్ను చిన్నచూపు చూస్తున్నాడు అన్న భావం నానాటికీ ఆమెలో బలపడుతున్నది.

ఆరోజు సాయంకాలం తోటి కోడళ్ళిద్దరూ డాబా మీద కూర్చునివున్నారు చల్లగాలి కోసం. పిల్లలిద్దరూ వాళ్ళదగ్గరే ఆడుకుంటూవున్నారు. చున్నీ రామేశ్వరి ఒళ్ళో దాక్కున్నది. చీరచెంగు కప్పి చున్నీని కనపడకుండా దాచేసింది. చెల్లిని వెతుక్కుంటూ వచ్చి మనోహర్ కూడా రామేశ్వరి ఒళ్ళో దూరాడు. పిల్లలిద్దర్నీ పొదివిపట్టుకుని, పిల్లల్తోనే ఒడి నింపుకుని పెద్దగా నవ్వుతూ, మాతృ పరిష్వంగ సుఖాన్ని అనుభవిస్తూ మైమరిచివున్నది రామేశ్వరి. “ఈరోజు అక్క చాలా సంతోషంగా వున్నది” అనుకున్నది తోటికోడలు. అలా చాలా సేపు రామేశ్వరి ఒడిలోనే ఆడుకున్నారు, పిల్లలిద్దరూ.

ఇంతలో వీళ్ళను వెతుక్కుంటూ రామ్‌జీదాసు డాబామీదికి వచ్చాడు. ఆ దృశ్యాన్ని చూసి, చాలా సంతోషించాడు. బావగార్ని చూసి  మరదలు క్రిందికి వెళ్ళిపోయింది.

“చూశావా! పిల్లల్ని దగ్గరికి తీస్తే ఎంత సంతోషంగా వుంటుందో? ఇప్పటికైనా నా మాటలు నీకర్థమయ్యాయి. ఇక మీదట ఇలాగే ఉండు” అన్నాడు మనస్ఫూర్తిగా భార్యతో. తన బలహీనత భర్త ముందు బయటపడిందన్న అక్కసుతో” ఈ పిల్లల్ని ప్రేమించాలా? వీళ్ళకు చావెప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నాను. మీరేం కలలు, కనకండి” అన్నది ఈసడింపుగా.

“ఛీ, ఈ జన్మకు నువ్వు మారవు. ఇప్పటి దాకా పిల్లల్ని ముద్దాడుతూ అంత మురిసిపోయావు. అదే మాట నేననేసరికి ఊసరవెల్లి లాగా రంగులు మార్చటం నీకే తగును.” అంటూ అక్కణ్ణుంచి పిల్లల్తో సహా కిందికి వెళ్ళిపొయ్యాడు.

రోజురోజుకూ భార్యాభర్తలిద్దరి మధ్యా దూరం పెరుగుతున్నది. రామేశ్వరికి ఏం చేస్తున్నా, ఇవే ఆలోచన్లు, తన మనస్సూ, తన భర్తా, రెండూ తన వశంలో వుండటం లేదు. అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భర్త కేవలం తనను, ఈ పిల్లల కారణంగానే దూరంపెట్టేస్తున్నాడు. దీనికి పరిష్కారమేమిటో ఎంత ఆలోచించినా అర్థంకావటం లేదు. నా మొర, ఆలకించి దేవుడు త్వరగా వీళ్ళని తీసుకెళ్తే నేతితో దేముడిముందు దీపాలు వెలిగిస్తానని కూడా మొక్కింది. ఆరోజు సాయంకాలం ఆదే అశాంతితో డాబా మీద కూర్చునివున్నది. ఇంతలోకి మనోహర్ అక్కడికొచ్చాడు. వాడువచ్చిన అలికిడికి తిరిగి చూసింది. సాయంకాలపు నీరెండలో వాడి ముఖం ఇంకా కాంతివంతంగా కనుపిస్తున్నది. చిరుగాలికి ముంగురులు రేగుతూవున్నాయి. అందమైన పద్మంలాంటి చిన్నారి లేత ముఖం. ఎంతముద్దుగా, మరెంత అందంగా వున్నాడు? వీడే కనుక నాకడుపున పుట్టినట్టైతే నాకంటే సౌభాగ్యవంతమైన స్త్రీ మరొకరు వుండే వారుకాదు. ఈ ఆలోచనల్లో వుండగానే వాడు మరొకసారి పెద్దమ్మా!” అని పిలిచాడు.

ఉలిక్కిపడి పిల్లవాడి వంక చూస్తూ “ఏం కావాలి?” అంది కటువుగా.

పైన ఆకాశంలో ఎగిరే గాలిపటం వంక ఆశగా చూస్తూ “పెద్దమ్మా! నాక్కూడా ఒక్క గాలిపటం కావాలి. ఎగరేసుకుంటాను. ఒక్కటి తెప్పించి ఇవ్వవా” అన్నాడు జాలిగా. వాడి మాటలు బాగా ముద్దువచ్చి దగ్గరగా వచ్చి చెక్కిలి నిమరబోయింది.

“గాలిపటం తెప్పించకపోతే పెదనాన్నతో చెప్పి కొట్టిస్తాను” అంటూ మాటలతూటాను ఆమె మీదకు పేల్చాడు. ఆమె మురిపెం కాస్తా కోపంగా మారింది.

“నన్నే కొట్టించే మొనగాడివయ్యావా? ఇదంతా పెదనాన్న ఇచ్చిన అలుసుకదూ? ముందు ఫో ఇక్కణ్ణుంచి. మీ పెదనాన్నతో ఏం చెప్పుకుంటావో చెప్పుకో” అని అరిచింది, రామేశ్వరి.

ఇంతలో ఆకాశంలో ఎగిరే గాలిపటమొకటి దారం తెగటంతో నెమ్మదిగా క్రిందకు జారుతూ వీళ్ళు నిలబడిన వైపుకు రాసాగింది. మనోహర్ ఆనందానికి హద్దుల్లేవు. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని గాలిపటం వంకే చూడసాగాడు. రామేశ్వరి ప్రక్కనుంచే వెళ్ళి పిట్టగోడ దగ్గర నిలబడి చూడసాగాడు ఎందుకంటే గాలిపటం క్రిందకి దిగుతూ, దిగుతూ పెరటివైపుకు రాసాగింది. వాడు సంతోషం పట్టలేకపోతున్నాడు. డాబా మీద నుండి క్రిందికిదిగే వాకిలి వైపుకు వెళ్ళబోతూ పిట్టగోడను చేతితో పట్టుకుని కాళ్ళెత్తి ఒక్కసారి క్రిందకు చూసి వేగంగా వెనుదిరగబోయాడు. ఆ, వెనుదిరగటంలో కాలుజారి పిట్టగోడమీద జారిపడ్డాడు. ఆసరా కోసం తన రెండు చిన్న చేతుల్తో పిట్టగోడను పట్టుకున్నాడు. కాళ్ళు క్రిందకి వేలాడుతున్నాయి. అలా వేలాడుతూనే “పెద్దమ్మా, రా! త్వరగా వచ్చి నన్ను పైకి లాగు” అంటూ అరవసాగాడు. రామేశ్వరి ఒక క్షణం నివ్వెరపోయింది. వాడినా స్థితిలో చూసి “మాబాగా అయ్యింది, ఇప్పుడక్కడ్నుంచి జారిపడితే శాశ్వతంగా వీడి పీడ నాకు వదిలిపోతుంది. అని భావించిది. కాని వాడి దీనాలాపాలు విని మనసు కరిగిపోయింది. చప్పున లేచి వచ్చి మనోహర్‌కు తన చెయ్యి అందించింది. కాని అప్పటికే మనోహర్ చేతులు పట్టు తప్పి, వాడు కిందకు పడిపొయ్యాడు. డాబా మీదున్న రామేశ్వరి కూడా నాయనా! మనోహర్! అంటూ అరచి మూర్ఛపోయింది. ఒక వారం వరకూ అలా అచేతనావస్థలోనే గడిపింది. ఏ కొంచెం తెలివివచ్చినా “నాయనా, మనోహర్! నేను నిన్ను చంపుకున్నానురా, కాపాడలేకపొయ్యాను” అంటూ ప్రేలాపనలు సాగించేది. వాణ్ణి కాపాడండి. పడిపోతున్నాడు. పట్టుకోండి” అంటూ ఇవే మాటలు పలవరించసాగింది. వారం తర్వాత స్పృహలోకి వచ్చీరావటంతోనే “ఏడీ? నా మనోహర్? ఎలా వున్నాడు?” అని అడిగింది. వాణ్ణి ఎదురుగా తీసుకొచ్చారు. విరిగిన కాలుకు కట్టు కట్టివున్నది.

రామేశ్వరి లేచి కూర్చుని వాణ్ణి ఒళ్ళోకి లాక్కున్నది. ఇప్పుడు ఆమెకు వాడే ప్రాణాధారం. పిల్లలిద్దర్నీ విడిచి ఇప్పుడొక క్షణం కూడా వుండలేని పరిస్థితికొచ్చింది రామేశ్వరి.

## పద్మభూషణ్, యశ్‌పాల్‌జీ సాహిత్య సమాలోచన

జీవన రేఖలు : యశ్‌పాల్ జీ డిసెంబరు మూడు, పంథొమ్మిది వందల మూడవ సంవత్సరంలో, ఫిరోజ్‌పూర్ నందు జన్మించారు. ప్రేమ దేవి, హీరాలాల్ దంపతులు వీరి తల్లిదండ్రులు. హిందీ భాషలో పేరెన్నికగన్న సాహిత్యకారుల కోవలోకే వీరూ చెందుతారు. భారత దేశ ప్రసిద్ధ హిందీ రచయితగా పేరుగాంచారు. ఎంతో అమూల్యమైన, సాహిత్య సంపదను పాఠకులకందించి వీరు ఇరవైఆరు డిసెంబరు, పంథొమ్మిది వందల డెభ్భై ఆరున పరమపదించారు.

కథాసృజన : యశ్‌పాల్‌కీ "ఛోటీ కహానియాం" అను పేరుతో వీరి కథలు వెలువరింపబడినవి. అందులో "ఫూలో కా కురతా" అనుచిన్న కథ చాలా ప్రసిద్ధి పొందింది. పరదా, ఝూఠాసచ్, దివ్యా, శివ్ ఔర్ పార్వతీ మొదలగు కథలు పాఠకుల మనసులో బాగా చోటు సంపాదించుకున్నవి.

నవలా రచన : మనుష్యకే రూప్, వతన్ ఔర్ దేశ్, దాదా కామ్రేడ్, మేరీ తేరీ ఉస్‌కీ బాత్, అనునవి వెలువరించారు.

**1970**వ సంవత్సరంలో "పద్మభూషణ్" సత్కారాన్ని పొందారు. మేరీ తేరీ ఉస్‌కీ బాత్ అనునవలకు సాహిత్య అకాడెమీ వారి పురస్కారాన్ని **1976**లో అందుకున్నారు.

ఇవేకాక వీరు ఎన్నో నిబంధ్‌లు, నాటకాలు రచించారు. తన ఆత్మ కథనూ వెలువరించారు.

"ఫూలో కా కుర్తా" (ఫూలూ సిగ్గు అన్న పేరు పెట్టాను) అనే ప్రస్తుత కథలో ఫూలూ అనే చిన్న పిల్ల సంప్రదాయాన్ని తప్పకుండా పాటించాలనే విషయం పట్లే ధ్యాస పెట్టిన విధానం పాఠకులకు నవ్వునూ, ఆహ్లాదాన్నీ పంచుతుంది. రాశిలో చిన్న కథైనా, వాసిలో పెద్దదనిపించుకుని యశ్‌పాల్‌జీకి తిరుగులేని పేరును సంపాదించిపెట్టింది.

పరదా అనే కథలో కులీన కుటుంబాల మర్యాదల ముసుగులో పరదాచాటున తమ బ్రతుకుల్ని దాచుకున్న విధం మనసును ద్రవీభూతం చేస్తుంది, అప్పులిచ్చే వడ్డీ వ్యాపారి దౌర్జన్యం గగుర్పాటు కల్గిస్తుంది.

# పూలూసిగ్గు

మా వైపున ఊళ్లు విస్తీర్ణంలో చాలా చిన్న చిన్నవిగా వుంటాయి. ఒక ఊర్లో ఐదారు ఇళ్ళుంటే మరో వూళ్ళో పదీ ఇరవై ఇళ్ళుంటాయి. ఆ ఇళ్ళన్నీ దగ్గరదగ్గరగానే కట్టుకుంటారు. ఒక ఊరు కొండ దిగువనవుంటే మరొకటి ఎగువన వుంటుంది.

బంకూ సాహు పూరింటి కప్పు కింద నడిచే దుకాణమే ఆ ఊరి వాళ్ళ అవసరాలు చాలా వరకు తీరుస్తుంది. దుకాణపు వసారానే కచేరీ సావిడి అయ్యింది. ఆ వసారా ఎదురుగా వున్న లోగిట్లోని రావిచెట్టు క్రింద పిల్లలు ఆడుకుంటూ వుంటారు. గడ్డి మేసొచ్చిన పశువులు అక్కడేపడుకుని నెమరువేస్తూ వుంటాయి.

ఆరోజు ఉదయాన్నే కురిసిన వాన తగ్గి కొద్దిగా ఎండవస్తున్నది. ఇంట్లో వాము అయిపోయినందువలన దానికోసం దుకాణం దగ్గరకొచ్చాడు బంకూ సాహు. అక్కడి వరండాలో ఐదారుగురు పెద్ద మనుష్యులు కూర్చుని హుక్కా పీలుస్తూ వున్నారు. వాళ్ళ ఎదురుగ్గానే పిల్లలు ఎగురుతూ, పాకుతూ ఆడే ఆటలు ఆడుతున్నారు. వాళ్ళలో, సాహు ఐదేళ్ళ కూతురు పూలూ కూడా వున్నది.

ఆ ఐదేళ్ళ పిల్ల ఒంటిని కప్పటానికి చొక్కా ఒకటి భుజాల నుండి వేలాడుతున్నది. పూలోకి నిశ్చితార్థం కూడా అయింది. పెళ్ళికొడుకు అక్కడికి ఫర్లాంగు దూరంలో వున్న గ్రామానికి చెందిన సంతూ. సంతూ, వయసు ఏడేళ్ళు వుంటుంది. అక్కడ ఏడేళ్ళున్న మగపిల్లలు సామాన్యంగా పశువుల్ని కాస్తూ వుంటారు. సంతూ వాళ్ళింట్లో రెండు గేదెలు, ఒక ఆవు, రెండు ఎడ్లూ వున్నాయి. ములుగర్ర ఒకటి తీసుకుని, వాటిని అదిలిస్తూ, మేపుకుంటూ వుంటాడు. మధ్యమధ్యలో ఆటలాడుతూ వుంటాడు. ఈలోగా పశువులు ఎవరి చేలోకైనా పరుగెత్తుతూ వుంటాయి. పెద్దగా కేకలు పెట్టి వాటిని మళ్ళేసుకుని సాయంకాలానికి ఇంటికి తోలుకెడుతూ వుంటాడు.

వర్షం తగ్గింది కాబట్టి సంతూ తన పశువుల్ని కొండకిందున్న పచ్చికలో మేపటానికి తోలుకెడుతున్నాడు. దుకాణం ఎదురుగా వున్న రావిచెట్టు క్రింద పిల్లలాడే ఆటల్ని చూస్తూ అటువేపొచ్చాడు. సంతూ ఆట దగ్గరకి రావటం చూసిన హరియా అనే ఆరేళ్ళ పిల్లాడు “పూలూను పెళ్ళాడే పెళ్ళికొడుకు ఆటలోకొచ్చాడు. పెళ్ళికొడుకొచ్చాడు” అంటూ ఆత్రంగా అరిచాడు. మిగతా పిల్లలు హరియాను అనుసరించారు.

తమకంటే పెద్దవాళ్ళను, ముసలివాళ్ళను చూసినపుడు ఎవరూ చెప్పకుండానే పిల్లలు వాళ్ళను గమనిస్తూ వుంటారు. వాళ్ళు చేసే పనులు తామూ అనుకరిస్తారు. పూలూ కూడా అంతే. పెళ్ళికొడుకును చూస్తే, సిగ్గుపడాలి.తనతల్లివలె, గ్రామంలో వున్న ఇతర స్త్రీలవలె బిడియపడుతూ మేలిముసుగు వేసుకుని ఆ ముసుగులో ముఖాన్ని దాచుకోవాలి. పెద్దవాళ్ళు పాటించే అలవాట్లను తానూ గౌరవించాలి అన్న విషయాం ఆ చిన్న బుర్రకు అర్థమయింది. పెళ్ళికొడుకు వచ్చాడన్న పిల్లల అరుపులతో తత్తరపాటు

కలిగింది. సిగ్గు ముంచుకొచ్చింది. వెంటనే మేలిముసుగు వేసుకోవాలన్న ఆలోచన కలిగింది. తన భుజాల్నుంచి వేలాడుతూ ఏకైక ఆచ్ఛాదనగా వున్న చౌక్కా అంచుల్ని రెండు చేతుల్తో ఎత్తిపట్టుకుని తన ముఖాన్ని దాచుకున్నది. వసారాలో చుట్టూతా కూర్చుని హుక్కా పంచుకునే పెద్దలంతా కలకలానవ్వారు. పూలూ పరిస్థితి చూసి, కాకారామ్ సింహ్ దగ్గరగా వచ్చిచౌక్కా క్రిందికి దించుకోమని నచ్చచెప్పాడు. అక్కడున్న కొంటె కుర్రాళ్ళు హే.. హే.. అంటూ అల్లరి చేయటం మొదలుపెట్టారు.

కొద్దిగా వాము తీసుకెడదామని వచ్చిన బంకూ సాహు కూతురి అమాయకత్వం చూసి మనసు కష్టపెట్టుకున్నాడు. వాము తీసుకోకుండానే వెనుదిరిగాడు. మారుతున్న కాలంలో కూడా, నైతికతను, సిగ్గును రక్షించుకోవటానికి చేసే ప్రయత్నంలో చిన్నారి పూలూ లాంటి వారికి సంప్రదాయ రక్షణ తప్ప వాటి పరిణామాలు తెలియవు.

## శ్రీ ప్రేమ్‌చంద్ సాహిత్య పరిచయము

జీవన రేఖలు : వీరు బెనారస్ సమీపంలోని లమ్‌హీ అనే ప్రాంతంలో క్రీ.శ **1880** జులై ముప్పై ఒకటిన జన్మించారు. తల్లీదండ్రీ పెట్టిన పేరు ధనపతిరాయ్. పినతండ్రి పిలిచిన పేరు నవాబ్‌రాయ్. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. స్వయంకృషితోనే చదివి బి.యే. పూర్తి చేశారు. **1906** వ సం॥లో శివరాత్రి పర్వదినాన బాలవితంతువైన శివరాణిని పెండ్లాడారు.

సాహిత్య ప్రవేశం : **1901** వ సం॥ నుండి నవలా రచన ప్రారంభించారు. **1907** లో వీరు వ్రాసిన "సో జే వతన్" కథల సంపుటి ప్రభుత్వ నిషేధానికి గురైంది. ఆ తర్వాత ప్రేమ్‌చంద్ అనే పేరుతో తన కలం నుండి పుంఖాను పుంఖాలుగా సాహిత్య సంపుటాలను సృజించారు.

**1921** వ సం॥లో సత్యాగ్రహంలో పాల్గొని ఆ ప్రభావంతో చేసే ఉద్యోగాన్ని కూడా వదిలిపెట్టారు. ఆ తర్వాతన తన పూర్తి సమయాన్ని సాహిత్య సేవలోనే గడిపారు. మాధురీ, జాగరణ పత్రికలకు సంపాదక బాధ్యతలు వహించారు. **1923** లో సరస్వతీ ప్రెస్‌నూ, **1930** లో హంసపత్రికనూ స్థాపించారు. **1936** అక్టోబరు **8**న వీరు దివంగతులయ్యారు. ఎల్లప్పుడూ సాహిత్యాకాశంలో వీరొక ధృవతారగానే కీర్తించబడతారు.

కథానికా సంపుటములు : ప్రేమ్‌చంద్‌కీ ప్రతినిధి కహానియాం, ప్రేమ్‌చంద్‌కీ కాలజయ్‌కహానియాం, గ్రామీణ జీవన్ కీ కహానియాం, ప్రేమ్‌చంద్ కీ బాలకహానియాం, ప్రేమ్‌చంద్ సంపూర్ణ కహానియాం **1** నుండి ఐదు భాగాలు, ప్రేమ్‌చంద్ కే విచార్ ను వెలువరించారు. ఇంకనూ మరొకొన్ని కథలు వున్నవి.

నవలలు : గోదాన్, గబన్, కాయాకల్ప్, రంగభూమి, ప్రతిజ్ఞ, నిర్మల, కర్మభూమి, మానసరోవర్ **1** నుండి **8** భాగాలు, యహ్ మేరీ మాతృ భూమి హై, ఈద్‌గాహ్, గుప్తధన్ రెండు భాగాలు రచించారు. ఇంకా కర్బలా, సంగ్రామ్, ప్రేమ్‌కీవేదీ, కలమ్, తలవార్ ఔర్ త్యాగ్, రామ్‌చర్చా మొదలగునవి రచించి పాఠకలోకానికి అందించారు.

వీరు మరణించే కొద్దికాలానికి ముందు రచించిన ఈ "కఫన్" అనే కథ, కథా సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. ఉత్తరదేశ హిందీ పాఠకులనే కాక దక్షిణ భారతదేశ పాఠకులను కూడా ఎంతగానో ఆకట్టుకున్నది. 'కఫన్' అంటే శవం మీద కప్పే వస్త్రం. సోమరిపోతులూ, తాగుబోతులూ అయిన తండ్రీ కొడుకులిద్దరి మానసిక దౌర్బల్యం ముందు 'బుధియా' అనే అమాయిక స్త్రీ బలైపోయిన విధానం ఎంతో రసాత్మకంగా వర్ణించారు. ఆర్థిక బలహీనతలో వున్నవారి ఆలోచనా విధానాన్ని విశ్లేషణాత్మకంగా వర్ణిస్తూ ప్రేమ్‌చంద్ లేఖని నుండి జాలువారిన కథే ఈ కఫన్.

హిందీ మూలం : ప్రేమ్‌చంద్ **శవం పై వస్త్రం** అనుసృజన : దాసరి శివకుమారి

# శవం పై వస్త్రం

దరిద్రావస్థలో నున్న పూరింటి ముందు చలి మంట వేసుకొని తండ్రి ఘీసూ, కొడుకు మాధవ నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు. ఇంటి లోపలి నుంచి కోడలు బుధియా ప్రసవ వేదనతో గొడ్డులా, మూలుగుతూ మధ్య మధ్యలో స్పృహ తప్పిపోతూ వున్నది. శీతాకాలపు చలిరాత్రి, నిశ్శబ్దంగానూ, చీకటి గానూ వున్నది. బుధియా పురిటి నొప్పుల ఆక్రందనలు తండ్రీ కొడుకులకు చికాకుగా వున్నది. "రేయ్ మాధవా! నీ పెళ్లామేం బ్రతికి బట్ట కట్టేటట్లు లేదు. పగలంతా మూలుగుతూనే వున్నది. లోపలకెళ్లి ఒకసారి చూసిరా". తండ్రి సలహా ఇచ్చాడు.

"చచ్చే పనైతే త్వరగా చస్తేపోలా? లోపలకెళ్లి చూసి మాత్రమేం చేస్తానునాన్నా?"

"నీది మరీ రాతిగుండెరా. సంవత్సరం పాటు దాంతో సుఖంగా కులికావు. ఇప్పుడిట్లా, దుర్మార్గంగా మాట్లాడుతున్నావు."

"అదేం కాదు నాన్నా. దాని బాధ నేను చూడలేను. అందుకే లోపలికి పోనంటున్నాను."

చర్మకారుల కుటుంబానికి చెందిన ఈ తండ్రీ కొడుకులు పని దొంగలుగా ఊళ్లో పేరు మోశారు. ఇంట్లో పిడికెడుగింజలు అవసరపడితేనే ఏ కట్టెలో కొట్టి అమ్మి, ఆ పైసల్తో బలాదూరు తిరిగేవాళ్లు. వంటిమీద చింకిపాతలు, ఇంట్లో రెండు మట్టి పాత్రలు మాత్రమే కలిగి వున్నవాళ్లు. వీలైనన్ని చోట్ల అప్పులు చేసి, తీర్చలేక తన్నులు తిన్నా, చివాట్లు పడ్డా దులిపేసుకుపోగలిగిన వాళ్లు. బంగాళాదుంపలు, బటాణీల లాంటివి ఇతరుల పొలాల నుండి పీక్కొని వచ్చి కాల్చుకుని తింటూ, చలికాగుతూ, నికరాదాయం అంటూ ఏమీ లేకనే అరవై ఏళ్ళ నుంచీ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు ఘీసూ, కొడుకు మాధవ కూడా ఈ విషయాల్లో తండ్రిని మించిపోయాడు.

బుధియా పురిటి నొప్పులు పడే రాత్రి కూడా, ఎక్కడో పీక్కొచ్చిన బంగాళా దుంపలు కాల్చుకుంటూ, ఆ మంట ముందు చలికాగుతూ కూర్చున్నారు తండ్రీ కొడుకులు. మాధవకు తల్లి, చాలా క్రితం క్రిందటే చనిపోయింది. పెండ్లి మాత్రం నిరుడే బుధియాతో జరిగింది. ఆ పిల్ల వీళ్లింటి కొచ్చింది మొదలు పిండి విసిరో, గడ్డి చెక్కో, ఒక సేరు పిండైనా సంపాదించి తెచ్చి వీళ్లను పోషిస్తున్నది. వీళ్ల సోమరితనంతో, నిర్లజ్జభావాలతో, నరకాన్నంతా బుధియా ఇక్కడే చూస్తున్నది.

ఇంట్లో నుంచి ఏ మూలుగులూ వినపడక పోతే బాగుండును. బంగాళాదుంపలు తినేసి కంటినిండా నిద్రపోవచ్చన్న ఆలోచనలతో వున్నారు. కాల్చిన బంగాళదుంపలు బయటికి తీస్తూ "రేయ్! ఇప్పుడైనా ఓ

పాలి లోపలకెళ్లి చూసిరా. నీ పెళ్లాం పిశాచానికేమైనా అయితే బాపనాయనకు ఒక్కరూకైనా ఇచ్చుకోవాల్సి వుంటుంది". అన్నాడు ఘీసూ. తను లోపలి కెళ్తే బంగాళాదుంపలు ఎక్కువ తండ్రే బొక్కేస్తాడని కొడుక్కు భయం వుంది.

"నాకు లోపలికెళ్లటానికి భయం వేస్తుందని చెప్పాగా. అంతగా అయితే నువ్వే ఓపాలి లోపలికెళ్లిరా". అని మాధవ అన్నాడు.

"నా పెళ్లాం సచ్చినప్పుడే నేను దగ్గరకు పోలేదు. కాళ్లూ, చేతులు బారసాచి పురిటి నొప్పులు పడేదాని దగ్గర కెళితే దానికి కాళ్లూ, చేతులూ కూడా బిగుసుకుపోతాయి".

"పిల్లో, పిల్లాడో పుడితే ఇంట్లో ఒకతులమైనా బెల్లంకానీ, శొంఠి కానీ లేవునాన్నా".

"అన్నిటీకి ఆ భగవంతుడే వున్నాడు. నా తొమ్మిదిమంది సంతానం పుట్టినప్పుడూ ఆ భగవంతుడే నా కొంపను కష్టాల్నుంచి దాటించాడు" అంటూ కొడుక్కు ధైర్యం చెప్పాడు. శ్రమ జీవులైన రైతుల దగ్గర కాకుండా, వారిని దోపిడి చేస్తూ, పెత్తనం వెలగబెట్టే ధూర్తుల దగ్గరే, ఘీసూ ఎప్పుడూ చేరుతూ వుండేవాడు. ఇప్పుడు కూడా రైతుల కళ్లలో దుమ్ముకొట్టి తెచ్చుకున్న బంగాళదుంపలను కాల్చుకుని బాగా వేడిగా వుండగానే వాటిని మింగసాగారు. పైన కొద్దిగా చల్లారినట్లు అనిపించిన దుంప లోపల బాగానే వేడిగా వుండి మింగుతుంటే పళ్లు జివ్వుమంటూ, అంగిలంతా కాలుతున్నా నిప్పు కణకల్లాంటి ఆ దుంపల్ని మింగుతూ, కళ్ల వెంబడి నీరు కారుతున్నా లెక్క చేయకుండా మింగుతూనే వున్నారు, ఆకలి దెయ్యాల్లాగా ఇద్దరూ ఆ సమయంలో ఘీసూకు, ఆ ఊరి ఠాకూర్ పెండ్లి విందు గుర్తుకు వచ్చినోట్లో నీరూరుకుంటూ కొడుక్కు చెప్పసాగాడు. "అచ్చమైన నేతితో కాల్చిన పూరీలు, చట్నీ, రైతా, వరుగులతో వడ్డించారు. ఎన్నో కూరలు, పెరుగూ, మిఠాయిలూ, కచోరీలు, విస్తళ్ల నిండా వడ్డించారు. తాంబూలం వేసుకునే ఓపిక కూడా లేక, నీటి చుక్క పట్టే ఖాళీ కూడా లేనంతగా తిని ఇంటికొచ్చిపడ్డాను. ఠాకూర్ ఎంతో దయగల వాడు కాబట్టి అలాంటి భోజనాన్ని పెట్టించాడు". ఆ మాటలు విన్న మాధవకు నోరూరిపోతున్నది. "ఇప్పుడెవరూ అలాంటి భోజనాన్ని ఒక్కసారీ పెట్టించటం లేదు". అన్నాడు.

"ఇప్పుడుందరూ పొదుపు పాటించేవాళ్లే. పెళ్లిళ్లూ, చావులూ, దేనికీ ఖర్చు చెయ్యరు. పేదవాళ్ల నుండి పిండిన డబ్బంతా ఎక్కడ దాస్తున్నారో? ఇప్పుడెవరైనా మనకు విందు భోజనం పెట్టినా ఏభై పూరీల దాకా లాగించవచ్చు". అనుకుంటూ ఇద్దరూ నీళ్ళు తాగి ఒంటి మీదున్న పంచెల్నే కప్పుకుని పొట్టలోకి కాళ్లు ముడ్చుకుని, రెండు కొండచిలువలు చుట్ట చుట్టుకున్నట్లుగా పడుకుని అక్కడే నిద్రపోయారు. అప్పటి వరకూ బుధియా బాధతో, మూల్గుతూనే వున్నది.

ఉదయాన్నే మాధవ గుడిసెలోకి వెళ్లి చూశాడు. భార్య చల్లగా అయిపోయి నీలుక్కుపోయి వున్నది. నోట్లో ఈగలు ముసురుతున్నాయి. నిస్తేజమైన కళ్లు తెరుచుకుని పైకి చూస్తూ వున్నాయి. ఒళ్లంతా దుమ్ముకొట్టుకుని వున్నది. కడుపులో బిడ్డ కడుపులోనే పోయింది. పరిగెత్తుకుంటూ తండ్రి దగ్గర కొచ్చాడు. మరలా ఇద్దరూ లోపలికి పోయి గుండెలు బాదుకుంటూ ఏడుపు ప్రారంభించారు. ఇరుగుపొరుగువారు అప్పుడు పరిగెత్తుకు వచ్చి వీళ్లిద్దర్నీ పరామర్శించారు. ఇక్కడ ఏడుపులు, రాగాలు తీసినా అవసరాలు తీరవు. శవం మీద కప్పేటందుకు కొత్త గుడ్డ కావాలి. తగలెట్టటానికి కట్టెలు కావాలి. గద్దగూట్లో మాంసపు తునక మిగలనట్లు వీళ్ల ఇంట్లో చిల్లు కానీ వుండదు. తండ్రీ కొడుకులు ఉరుకులు, పరుగుల మీద ఊరి జమీందారు దగ్గరికి పొయ్యారు. వీళ్లిద్దరి పని తీరుతో గతం నుంచీ జమీందారు విసిగివున్నాడు. అనేకమార్లు దండనా విధించివున్నాడు. ఆయన దగ్గర నేలమీద కూలబడి ఏడుస్తూ "దొరా! చాలా ఆపదలో వున్నాం. నా కోడలు రాత్రి చనిపోయింది. రాత్రంతా విలవిలా తన్నుకుంటూనే వున్నది. దాని తల దగ్గరే కూర్చొని మందూ, మాకు వేసి అన్ని ప్రయత్నాలు చేశాం. కాని అది మమ్మల్ని దగా చేసి వెళ్లిపోయింది. ఇప్పుడు మీరే మాకు దిక్కు. మీరు దయ వుంచితేనే దానిని సాగనంపుతాం" అంటూ శోకాలు తీశారు.

ఘీసూ మీద దయచూపటం నల్లని కంబళిపై రంగు పూయటం లాంటిదని జమీందారుకు తెలుసు. అయినా ఇది కోపగించుకునే సమయం కాదని రెండు రూపాయలు తీసి విసిరేసి వెళ్లిపోయాడు జమిందారు. ఆ రెండురూపాయల దానాన్ని చాటింపు వేసి, మిగతా వారందరి దగ్గరకూ తిరిగి నాలుగణాలు, రెండణాలు, చొప్పున వసూలు చేసుకుని మొత్తం ఐదు రూపాయలు పోగు చేసుకున్నాడు ఘీసూ. ధాన్యము, కట్టెలూ కూడా సంపాదించాడు.

మధ్యాహ్నమయింది. తండ్రీ కొడుకులు బజారు కెళ్లి శవం మీద కప్పటానికి కొత్త గుడ్డ కొనుక్కొస్తామని వెళ్లారు. మనిషి బ్రతికున్నప్పుడు చింకిపాత ఇవ్వటానికి ముందుకు రానివారు ఇప్పుడు శవానికి కొత్త గుడ్డ కావాలని చెప్పే ఆచారమేమిటో? ఆ గుడ్డ మంటల్లో పడి కాలిపోయేదే. ముందే ఆ ఐదు రూపాయలు దానంగా ఇస్తే బుధియాకు మందూ, మాకు ఇప్పించటానికి వీలయ్యేది. ప్రసవ వేదన పడేటప్పుడు పరామర్శకు రానివారు ఇప్పుడొచ్చి రెండు కన్నీటి బొట్లు కార్చి వెడుతున్నారు. తండ్రీ కొడుకుల కళ్లకు రకరకాల బట్ట దుకాణాలూ, అందులో పట్టు, నూలు లాంటి గుడ్డలు కనపడ్డాయి. ఏం కొనాలో తేల్చుకోలేక సాయంకాలం వరకూ అటూ, ఇటూ తిరిగి ఏదో శక్తి ప్రేరేపించినట్లుగా ఒక సారాయి కొట్టులోకి వెళ్లి తచ్చాడుతూ, చివరకు ఘీసూ ఒక బల్లమీద చతికిలబడ్డాడు.

"షావుకారూ! నాక్కూడా ఒక సీసా సారా ఇవ్వు" అంటూ అడిగాడు ఘీసూ. దాంతోపాటు నంజుకు తినటానికి చీకులు, వేయించిన చేపలూ వచ్చాయి. తండ్రీ కొడుకులిద్దరూ అక్కడి వరండాలో చేరగిలబడి నింపాదిగా తాగుడు మొదలుపెట్టారు. ఇద్దరికి నిషా ఎక్కింది.

"బుధియా కోసం కొత్త గుడ్డ కొంటే ఏం లాభమొస్తుంది? అదేమైనా కోదలి వంటినంటి పెట్టుకుని వుంటుందా? మంటల్లో కాలిపోవలిసిందేగా" అన్నాడు ఘీసూ.

ఆకాశం వంక చూస్తూ మాధవ తాగుడు మొదలు పెట్టాడు. "గొప్పగొప్పవారు తమ దగ్గరున్న ధనాన్ని వెదజల్లి, బాపనోళ్ల చేత తతంగాలు చేయించి చనిపోయిన వారి కోసం దేవతలకు మొక్కుతారు. వెదజల్లటానికి మన దగ్గరేం వుంది? కానీ బుధియాకు కప్పే గుడ్డెక్కడా? అని జనం మనల్ని నిలదీస్తారు".

"బొడ్లో దోపుకున్న డబ్బులు జారిపోయాయి. ఎంత వెదకినా దొరకలేదు అని చెప్తాం. వాళ్లు నమ్మరు. అయినా మరలా సాయం చేత్తారు". అంటూ ఘీసూ నవ్వసాగాడు. కొడుకు వంత పాడాడు.

"పిచ్చి బుధియా తను చచ్చిపోయి కూడా మనకింత మేలు చేసిపోతున్నది. బాగా తాగిస్తున్నది. ఇక తిండి మీద పడదాం" అంటూ రెండుశేర్ల పూరీలు, చట్నీ, ఊరగాయలు, లివర్ మాంసం కలిపిన రెండు విస్తళ్ల భోజనం తెప్పించుకున్నారు. దానికి ఒకటిన్నర రూపాయి ఖర్చయింది. చాలా హుషారుగా, గర్వంగా సింహం తను వేటాడిన జంతువును చంపి తింటున్న విధంగా వారు ఆ విస్తళ్ల మీద కలియబడి తినసాగారు. బాధ్యతలకూ, సమాజానికి వెరవని వారు. దేనికీ జవాబుదారీతనం వహించని అతీతులు వారు. ఇంకొన్ని పైసలు మాత్రమే మిగిలాయి వాళ్ల దగ్గర. "మాధవా! నీ పెళ్లాం మనల్ని ఇంత సంతృప్తి పరిచింది. తనకు ఆ పుణ్యం దక్కకుండా వుంటుందా?"

"అవున్నాన్నా! తప్పకుండా ఆ దేవుడు దాన్ని వైకుంఠానికే తీసుకెళ్లి అక్కడ రాణిని చేస్తాడు. ఇలాంటి భోజనం ఇంతవరకూ నేను నా జన్మలో తినలేదు. నాన్నా! మనమూ చచ్చింతర్వాత, పైకి వెళ్తే అదక్కడ కనపడి ఈ విషయం అడుగుతుందేమో?"

"ఓరి పిచ్చోడా! సుఖంగా తినక ఇప్పుడు చావు, పరలోకం వెళ్లే సంగతి దేనికిరా?"

"పోనీ! ఇంటి దగ్గర చేరినవాళ్లైనా శవం మీద కప్పటానికి గుడ్డ ఎక్కడ? అని అడిగితే ఏం చెప్తాం?"

"అడిగితే అడగనీ, నేనంత సమాధానం చెప్పలేని గాడిదను కాను. అరవై ఏళ్లు నెట్టుకొచ్చివాణ్ణి. నీ పెళ్లానికి ఎవరో ఒకరు కొత్త గుడ్డతెచ్చి కప్పే వుంటారు. నువ్వేం ఫికరవ్వకు.

"డబ్బులు నీ బొడ్లో వుంటే వేరే ఎవరు గుడ్డ తెస్తారు? నా పెళ్లం నొష్టన బొట్టు పెట్టింది నేను. జవాబు కూడా నేనే చెప్పాల్సి వుంటుంది. జనం ఏమంటారో ఏమో"?

"ఒరే ఊరికే ఇదవ్వకు. ఈపాటికి దానికి గుడ్డ తెచ్చి కప్పే వుంటారు" అంటూ ఘీసూ కొడుక్కి ధైర్యం చెప్పాడు.

నెమ్మది నెమ్మదిగా చీకటి పడింది. సారా కొట్లో జనం సందడీ పెరిగింది. తాగుతూ, నానా రభసా చేస్తున్నారు. మజాగా గుటకలు వేస్తూ కూర్చున్న తండ్రీ కొడుకుల్ని అక్కడున్నవాళ్లు, పట్టి పట్టి చూడసాగారు. వీళ్ల దృష్టి మాత్రం సారాసీసా పైనే వున్నది. ఇద్దరి పొట్టా నిండిన తర్వాత మిగిలిన పూరీలున్న విస్తరాకును అక్కడున్న భిక్షగాడికి దానం చేసిన గౌరవాన్ని జీవితంలో మొదటిసారి పొందారు. "ఇప్పుడీ బిచ్చగాడి దీవెనలు కూడా, నీ పెళ్లానికే ఎల్తాయిరా. మనం ఎంతో కష్టపడి ఈ సొమ్మును సంపాదించాం. కర్చుపెట్టాం." మాధవ మాటి మాటికీ తలెత్తి ఆకాశం వంక చూస్తూ "అది వైకుంఠానికే ఎల్లి, రాణీ అవుతుంది". అని వాగుతున్నాడు.

ఉల్లాసంలో తేలియాడుతూ, "అవునవును. వైకుంఠానికే సరాసరి ఎల్తుంది. అక్కడ, ఎవరి బెదిరింపులూ, చీదరింపులూ ఉండవు. అదిపోతూ, పోతూ, మనమనసులో వున్న, పెద్ద కోరికను పూర్తి చేసి వెళ్లింది. అది వైకుంఠానికే ఎల్తుంది. పేదోళ్లను పీల్చి పిప్పిచేసి గంగాతానాలుచేసి గుళ్లూ గోపురాలూ తిరిగే బడా బాబులు ఎందుకెల్తారు సొర్గానికి? ఆళ్లు నరకానికే పోతారు. నా కోడలు లాంటి వాళ్లే సొర్గానికి పోతారు" అంటూ కైపులో రకరకాల మాటలు మాట్లాడుతున్నాడు ఘీసూ.

"కాని నాన్నా అది ఒట్టి పిచ్చిది. అది మనింటికి వచ్చి అన్నీ బాధలే పడింది. పోతూ, పోతూ కూడా ఎంతో దు:ఖాన్ననుభవించిపోయింది" అంటూ కళ్ల మీద చెయ్యి పెట్టుకుని వెక్కి వెక్కి పడ్డాడు మాధవ.

"పిచ్చివాడా! దాని కోసమెందుకు ఏడుపు? అది ఈ మాయా పెపంచం నుంచి, అన్ని బంధనాల నుంచి తప్పించుకుందిరా. చాలా అదృష్టవంతురాలు కాబట్టే తొందరగా విముక్తి దొరికింది". అంటూ కొడుకును సముదాయించాడు.

"మోసం చేశావే! కన్ను గప్పిపోయావే" అంటూ మత్తుగా పాటందుకున్నారు తండ్రీ కొడుకులు. అక్కడున్న తాగుబోతులందరూ వీరిని గమనిస్తున్నారు. వాళ్లిద్దరూ పాటతోనే ఆపకుండా గెంతారు. దుమికారు. చివరకు కులుకును కూడా అభినయిస్తూ నిషాలో కూరుకుపోయి అక్కడే నేలమీద పడి దొర్లుతూ వున్నారు.

## వర్ధమాన రచయిత్రి శ్రీమతి రేణు నారాయణ్

| | | |
|---|---|---|
| జీవన రేఖలు | : | వీరు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని శామలీ జిల్లాయందు గల ముజప్ఫర్ నగర్ నందు జన్మించారు. జన్మతిథి మే **25, 1962**. శ్రీమతి శ్రీలత, శ్రీ సత్యప్రకాశ్‌లు ఆమె తల్లిదండ్రులు. |
| విద్యాభ్యాసం | : | ఎమ్.ఎ.బి.ఎడ్.లలో పట్టభద్రురాలు. కొద్ది రోజులపాటు అధ్యాపక వృత్తి చేపట్టారు. |
| సాహిత్య రచన | : | నందన్ మొదలగు పత్రికలలో అనేక కథలు, కవితలు వెలువరించారు. బాల సాహిత్యాన్ని కూడా రచించారు. |

వీరి మొదటి సంపుటి "టూటతీజడేం".దానిలోని కథే ఈ 'అపరిపక్వరిస్తే". ఇంకా ఈమె కథల్లో టూటతీజడేం, బదలా, గురూజీ, బేటీకీ మా, శహర్, మొదలగు కథల్లో మధ్య తరగతి కుటుంబాలు, అప్పుడప్పుడే ధనవంతులయిన వారి మనస్థితిని గురించి వర్ణనలూ ఎక్కువగా కనపడతాయి.

ప్రస్తుత కథ 'అపరిపక్వరిస్తే' అంటే పరిపక్వం కాని బంధుత్వాలని అర్థం. బంధుత్వాలే కాదు మనసులు కూడా పరిపక్వం కాని దశలో ఒకరు గడుసుగా, మరొకరు అమాయకంగా, అజ్ఞానంలో పడిపోవటాన్ని పాఠకుల మనస్సుకు హత్తుకునేటట్లుగా చిత్రీకరించబడింది. దీనిని నేను 'స్వార్ధము-నిస్వార్ధము' అనే పేరుతో అనువాదం చేశాను.

వీరి మరొక కథ "టూటతీజడేం" అంటే తెగిపోయే వ్రేళ్ళని అర్థం. తల్లిదండ్రుల ప్రేమ అనే వ్రేళ్ళను పిల్లలు మొదలంటా పెరుకుతుంటే ఆ వృద్ధులుపడే వేదనే ఇందులో వర్ణించబడింది. నేను దీన్ని 'భూమి గుండ్రమే' అన్న కథగా వ్రాశాను.

# స్వార్థము - నిస్వార్థము

కార్తీక్‌కు ఇంజనీరింగ్ చదువుపూర్తయ్యి మూడేళ్ళు గడిచిపోయింది. ఇంజనీరింగ్ చదువుతో పాటు వాళ్ళ నాన్న చేసే వ్యాపారపు పనులు కూడా చూసేవాడు. ఇన్వర్టర్లు తయారు చేసే కంపెనీ వున్నది. ఆ కంపెనీ పనులతో పాటుగా వాటిని మార్కెటింగ్ చేసే పద్దతుల్లో కూడా ఎప్పటికపుడు చురుగ్గా వుండాలి. కాలేజీ నుండి ఏ కాస్తముందు వచ్చినా తల్లి కార్తీక్‌ను ఫ్యాక్టరీకి వెళ్ళమని చెప్పేది. మిగతా శెలవులప్పుడు సరేసరి. రోజంతా ఫ్యాక్టరీలోనే వుండాల్సి వచ్చేది. మొదట్లో ఫ్యాక్టరీకి వెళ్ళాలంటే చాలా అయిష్టంగా, విసుగ్గా వుండేది. అమ్మ చాలా బలవంతం చేస్తే ఆ ఒత్తిడి తట్టుకోలేకే నేను ఫ్యాక్టరీకి వెళ్ళేవాణ్ణి. నెమ్మది నెమ్మదిగా అక్కడికి వెళ్ళటం అక్కడి పనుల్లో లీనమవటంలో ఆనందం కనుపించసాగింది. ఫ్యాక్టరీకి వచ్చి టెక్నికల్‌గా పనిచేస్తున్నందుకు ప్రతిగా, నాన్నగారి హోండాకారు వేసుకుని తిరిగే అవకాశం దక్కింది. దానిలో షికారు చేయటం చాలా ఆనందంగా వుండేది. అంతకంటే కూడా కార్లో నా పక్కన నా ఇష్ట సఖి నేహాను కూర్చోపెట్టుకుని తిప్పటం, మరీ నా సంతోషానికి పట్టపగ్గాలు లేకుండా వుండేది. నేహా కూడా అలా తిరగటంలో చాలా ఉత్సాహాన్ని చూపించేది. నాకు నేహా ఒక పెద్ద బలహీనత.

ఈ రోజు మరలా నేహా పదే పదే గుర్తొస్తున్నది. నా జీవితాన్నుంచి నేహా దూరంగా వెళ్ళిపోతుందా? నేహా అలా ఎందుకు చేస్తుంది? నేహా దూరం పోవటమనేది వాస్తవం కాదు. కాని మనం చూస్తూ వుండగానే జీవితంలో ఎన్నో జరిగిపోతూ వుంటాయి. మనకిష్టం లేనివి కూడా. మన ఆలోచనలకు, మన కలలకు విరుద్ధంగా ఏవేవో జరిగిపోతూ వుంటాయి. మన పెంపుడు పావురానికైనా ఏదైనా కష్టమొస్తే మనం నిజాయితీగానే దుఃఖపడతాం. నిజాయితీ వున్నపుడు మన భావాలు మనల్ని వశపరచుకుంటాయి. కాని నిజాయితీ మనలో వుండాలి గదా!

పదో తరగతి చదివే రోజులు ఎంత బాగుండేవి! స్కూలు మొత్తం మీద నాకే ఎక్కువ మార్కులు వచ్చాయి. నా ఫ్రెండ్సందరూ కలసి నన్ను వాళ్ళ చేతులతో పైకెత్తేశారు. స్కూలు ప్రిన్సిపల్ స్వయంగా ఆఫీసు రూమ్ నుండి బయటికొచ్చి ఆప్యాయంగా కౌగిలించుకుని అభినందించారు. అమ్మ, నాన్నల కన్నుల్లో ఆనంద భాష్పాలు ఆగకుండా వస్తూనే వున్నాయి. స్కూలు మేనేజ్‌మెంటు వారు అభినందన సభా ఏర్పాటు చేసి నన్నూ, నాతోపాటు అమ్మా, నానల్ని కూడా వేదికమీద కూర్చోబెట్టారు. అందరూ నన్నొక వి.ఐ.పి. లాగా చూశారు. అమ్మకయితే ఏదో ఆకాశంలో విహరిస్తున్నట్లుగా వున్నది. ఈ సంఘటనతో ఆమెకు స్నేహితురాళ్ళ మధ్య గౌరవం చాలా పెరిగింది. అప్పటివరకూ ఎంతో బిడియంగా వుండే అమ్మ ఎంతోమందికి సలహాలివ్వటం ప్రారంభించింది. రిజల్టు రాగానే ఇంతగా గౌరవిస్తారని, ఇంతగా అభినందనలు వెల్లువెత్తుతాయని ఊహించలేదు. కాని మా స్కూలు యాజమాన్యం వారు ఎంతో సంరంభంగా ఉత్సవం చేసి నా ప్రాముఖ్యాన్ని పెంచారు.

అక్కడే తరువాతి సంవత్సరం ఇంటరు క్లాసులు మొదలయ్యాయి. ఇపుడు నా చుట్టూ తోటి విద్యార్థులు నన్ను అంటిపెట్టుకునే వుంటున్నారు. అందులోనూ ఎక్కువ భాగం అమ్మాయిల సంఖ్యే వున్నది. స్వాతి, నిధి, ఆకృతి, నేహా ఇంకా సాక్షి మొదలైనవారు ఎప్పుడూ నాతో కలసి తిరిగేవారు. వారంతా నన్ను కంప్యూటర్, డూడ్, కూల్ అనే రకరకాల పేర్లతో పిలిచేవారు. కార్తీక్‌కు ఎప్పుడేం కావాలా? ఏం పనిచేసిపెట్టాలా అనే ధ్యాసతో వుండేవారు. అది అదునుగా తీసుకుని తాను క్రమశిక్షణనుల్లంఘించినా టీచర్లు పట్టించుకోలేదు. అది ఎలాగంటే వంతులవారీగా రూమ్స్ శుభ్రం చెయ్యాలి. కాని శృతి తరచుగా చీపురూ, చేటనూ నా చేతిలోంచి లాగేసుకుని తానే నా పనిని చేసేసేది. ఆ తర్వాత తానెప్పుడూ ఏ శుభ్రం చేసే పనిని చేసి ఎరుగడు.

మార్కులు ఎక్కువ తెచ్చుకున్న విజయ గర్వం, ఆమత్తు ఒక నెలపాటు బాగా నన్ను వదిలి పెట్టకుండా వున్నది. నెమ్మది, నెమ్మదిగా ఫ్రెడ్సందరూ తమ తమ క్లాసులు, ఎక్స్ట్రా క్లాసులు, ట్యూషనూ, హోమ్‌వర్క్ యూనిట్ టెస్టులు వగైరాల్లో మునిగిపొయ్యారు. తాను కూడా నెమ్మది నెమ్మదిగా చదువు ధ్యాసలో పడిపోయాడు. కాని ఇంతపేరూ, గుర్తింపు వచ్చేటప్పటికి  అతనికి తెలీకుండానే కొంత మార్పు వచ్చేసింది. దాన్ని ఇంట్లో తల్లి కాని, స్కూల్లో ఉపాధ్యాయులుకాని గుర్తించలేదు. అన్నింట్లో తాను ప్రత్యేకంగా కనపడాలనే తాపత్రయం మొదలైంది. అందం పట్ల చాలా శ్రద్ధ పెరిగింది. జుట్టును అందంగా కత్తిరించుకోవటం కోసం తరుచూ హెయిర్ డ్రస్సర్ దగ్గరకూ ఇంకా హెయిర్ స్టైయిలిస్టు దగ్గరకు వెళ్ళటం మొదలుపెట్టాడు. బట్టలూ, బూట్లు, ఇతర అలంకారాల పట్ల ఇంకెన్నో మార్పులు చేసకుంటున్నాడు.

అమ్మకయితే కార్తీక్ ఏం చేసినా ఇష్టమే. కొడుకేం చేసినా విపరీతంగా సమర్థిస్తుంది. ఏ విషయాన్నైనా పట్టించుకుని నాన్న కొంచెం కోపగించబోతే మధ్యలోనే అమ్మ ఆయన్ని  ఆపేసేది. కార్తీక్‌కు ఇచ్చే పాకెట్ మనీ చాలా ఎక్కువైందిపుడు. ఎంత ఇస్తున్నదో అమ్మకు లెఖ్ఖ అంటూ వుండటం లేదు. ఎంత ఖర్చు చేస్తున్నాడో కార్తీక్‌కూ తెలియటం లేదు. క్రమేపీ శ్రద్ధగా చదువుకునే మగపిల్లలెవరూ కార్తీక్ చుట్టు పక్కలకు రావటం లేదు. కేవలం ముగ్గురు, నలుగురు ఆడపిల్లలగుంపే అతని చుట్టూ కనపడేది. వారిలో నేహా ముఖ్యమైనది. నేహా ఏదో ఆషామాషీగా చదివే పిల్ల కాదు. స్కూల్లో రెండవస్థానంలో చదివే విద్యార్థిని. ఇప్పుడుకార్తీక్‌కు ముఖ్య స్నేహితురాలయ్యింది. లోపల్లోపల మాత్రం కార్తీక్‌ను అధిగమించి తానే మొదటిస్థానం పొందాలని తీవ్రంగా తపన పడుతుంది.  పూర్తిగా రోజంతా ఖాళీ దొరికినప్పుడల్లా కార్తీక్‌తో కాంటీన్‌కు, లైబ్రరీకి, లేదా ప్లేగ్రౌండ్‌కూ తిరుగుతూ వుండేది. కాని ఇంటికి వెళ్ళిన తర్వాత ఎంత రాత్రయినా పట్టుదలగా చదివి ఏ రోజు సిలబస్‌ను ఆ రోజు పూర్తి చేసుకునేది.

మొదటి యూనిట్ టెస్టులో నేహా ఫస్టున వచ్చింది. ఆ మార్కులు చూచి మిగతా విద్యార్థులు ఎవరూ ఆశ్చర్యపడలా. కానీ కార్తీక్‌లో చదువుపట్ల ఉత్సాహం కొంత మేల్కొన్నది. సీరియస్‌గా చదవాలనుకున్నాడు కాని నేహా అతడికి తరచూ ఏదో ఒక పని పురమాయించేది. తన హోమ్ వర్కంతా చేసి పెట్టమనేది. కొన్ని సార్లు తను చేయాల్సిన ప్రాజెక్టు వర్కునూ అప్పజెప్పేది. వీటితో పాటు ఖాళీగా

వున్నప్పుడల్లా కాంటీన్‌కెళ్ళి బర్గర్ తినొద్దామని పిలిచేది. నేహా మాట వినటంలో, ఆమె చెప్పిన పనులు చేయటంలో ఏ విధమైన నష్టంగా కాని, ఇబ్బందిగా కాని భావించేవాడు కాదు. అదే మహాభాగ్యం అన్నట్లుగా నేహా పనులన్నీ చేసేవాడు.

నేహా, కార్తీక్‌ల జంట అంటూ స్కూలంతా పేరుమోగిపోయారు. ఆఫ్ ఇయర్లీ తర్వాత విద్యార్థులంతా ఐ.ఐ.టీ. అనీ, ఎమ్‌సెట్ లాంటి ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌కు ఇప్పట్నుంచే ప్రిపరేషన్ కావాలని దాంట్లో మునిగిపోయారు. శ్రద్ధ కలిగిన వాళ్ళంతా తమ తమ కోచింగ్‌లో కల్లే ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేసుకునే పనిలో పడి చాలా బిజీగా సబ్జెక్టును గురించి మాట్లాడుకోవటమూ, చర్చించుకోవటమూ చేస్తున్నారు. అప్పుడప్పుడూ నేహా కూడా వాళ్ళతోపాటు కలిసి కూర్చునేది. వాళ్ళ చర్చల్లో తనూ పాల్గొనేది. మరలా వచ్చి కార్తీక్‌తో తిరిగేది. అర్థ సంవత్సర పరీక్షా ఫలితాల్లో కార్తీక్‌కు చాలా తక్కువ మార్కులు వచ్చాయి. మరలా నేహాదే ఫస్టు మార్కు. ఒక్కసారిగా కార్తీక్‌కు దుఃఖం ముంచుకొచ్చింది. కాని నేహా నవ్వుతూ అతని దగ్గరకొచ్చి 'అరే పిచ్చీ! ఈ ఒకటో స్థానం రెండో స్థానం అంటూ వచ్చే ఈ నెంబర్లకేం విలువుంటుంది? ఒకసారి ఫస్ట్ రావచ్చు. మరోసారి రాకపోవచ్చు. నువ్వేమైనా చదువురానివాడవా? తెలివితక్కువవాడివా? మార్కులదేమంత ముఖ్యం కాదు. పరస్పరం మన మధ్య వుండే స్నేహం, ప్రేమా ఇవి ముఖ్యం. ఈ వయసులో కలిగే స్నేహం చిరకాలం మన మధ్య వుండిపోతుంది. అదే నిజమైన స్నేహం, ప్రేమా కూడా. గుర్తుపెట్టుకో. పద. పద కాంటీన్‌కెళదాం. నాకు చాలా ఆకలిగా వుంది. ఒక దోసె పెట్టిద్దువు గాని" అంటూ కార్తీక్‌ను పక్కదారి పట్టించేది.

ఆ మాటల్తో కార్తీక్ ఒక్కసారిగా తన రిజల్ట్ సంగతి మర్చిపోయేవాడు. కాని ఇంటికొచ్చిన తర్వాత తండ్రి మాత్రం తీవ్రంగా మందలించాడు. "కార్తీక్! చదువు మీద దృష్టిపెట్టు. సీరియస్‌గా చదువు, వెనుకటి మార్కులు మళ్ళీ రావాలి" అన్నాడు.

చూస్తూ వుండగానే మొదటి సంవత్సరపు వార్షికోత్సవం వచ్చేసింది. ఆ వార్షికోత్సవానికి కార్తీక్ తన తల్లిని కూడా తీసుకొచ్చాడు. అక్కడ మొదటిసారిగా అమ్మ నేహాను చూసింది. చూడగానే "నువ్వు నేహావనుకుంటాను'' అని పలకరించింది. ఈ అమ్మాయిలో అందం, తెలివితేటలు కలబోసుకునివున్నాయనుకుంది. ఆ అమ్మాయి విషయం కార్తీక్‌నూ ఏమీ హెచ్చరించలేదు. ఈ పిల్ల వ్యామోహంలో పడి తన చదువు నాశనం చేసుకుంటున్నాడు. వాడు చాలా తెలివిగలవాడు. ఈ పిల్లతో గడిపి కొంత సమయం వృథా చేసుకున్నా తర్వాత తనే తెలుసుకుని చదువుకోగలడని గట్టిగా నమ్మింది.

ఇప్పుడు నేహా మరొక అలవాటు కూడా చేసుకున్నది. స్కూల్లో తన చుట్టూ కార్తీక్‌ను తిప్పుకుంటూనేవున్నది. ఆ తర్వాత ఇంటి కొచ్చిన తర్వాత ఫోన్ చేసి చాలా సేపటి వరకూ కార్తీక్‌తో మాట్లాడుతూనే వుండేది. నువ్వైతేనే సరియైన సలహా ఇవ్వగలవు అంటూ కార్తీక్‌ను ఐస్ చేసేది. ఎంతసేపూ తన చదువూ, తన సిలబస్, తను తీసుకునే కోచింగ్, తను చెయ్యాల్సిన ప్రాజెక్ట్ వర్కూ ఇంతవరకే, మాట్లాడేది. వాటన్నిటికీ సమాధానాలు చెప్పేసరికి కార్తీక్ దగ్గరున్న సమయమంతా అయిపోయేది. అంతే

కాకుండా నేహాకిచ్చిన ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయటానికి కార్తీక్ గంటలకొలదీ నెట్‌ముందు కూర్చుని సమాధానాలు వెతుకుతూ వుండేవాడు. మరికొన్ని సార్లు ఇంకా డౌట్స్ వస్తే సంబంధిత టీచర్‌తో కూడా చర్చించేవాడు. నేహా పనంతా తనదిగానే భావించి ఎంతో తపనపడి ఆ పనిని పూర్తి చేసేవాడు. అన్నిటికన్నా ముందు నేహా చెయ్యాల్సిన ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయటమే కార్తీక్ ప్రధాన లక్ష్యం. ఈ విధంగా ఆడుతూ, పాడుతూ రెండేళ్ళు గడిచిపోయాయి. పరీక్షలూ వచ్చి వెళ్ళాయి. ఎంట్రెన్స్ వ్రాయటానికి వెళ్ళి ఎగ్జామినేషన్ హాల్లో పేపరు చేతిలోనికి తీసుకున్నాక అందులోని చాలా ప్రశ్నలకర్థం తెలీక ఇదేదో వేరే సిలబస్ నుంచి ఈ పేపర్ ఇచ్చారా అనుకున్నాడు. తనకు తెలిసినంత వరకూ ఆన్సరు చేసి బయటికొచ్చాడు. బయట చాలా మంది ఎంట్రెన్స్ పేపర్ చాలా టఫ్‌గా వుందిరా అనుకోవటం విని అమ్మయ్య. నాకే కాదు వీళ్ళందరికీ కష్టం అనిపించింది అనుకుని లోపల్లోపల చాలా సంతోషించాడు. నేహాకు ఫోన్ చేసి అడిగితే “పేపరు నాకేమంత కష్టంగాలేదు”. అంత తెలియని ప్రశ్నలు ఏమున్నాయి దానిలో అన్నది. “నాకు తప్పకుండా మంచి రాంకే వస్తుంది” అని కూడా చెప్పింది.

అనుకున్నట్లుగానే నేహాకు ఇంటర్లో మంచిమార్కులు వచ్చాయి. మెరిట్ లిస్ట్‌లో కార్తీక్ నంబరెక్కడా లేదు. ఏదో కాస్త మంచి మార్కులొచ్చాయి అంతే. ఇప్పుడు ఇంటర్ మార్కులు కాదు ప్రధానం. పెద్దపెద్ద కాలేజెస్‌లో పెట్టే ఎంట్రన్స్‌లను క్లియర్ చేసుకుని, వాటిల్లో ఎడ్మిషన్ పొందటం మీదే ధ్యాసపెట్టాలి. దాని కోసం ప్రిపేరవ్వాలి అనుకుంటూ బాగానే కష్టపడ్డాడు. శెలవులకని నేహా తన అంకుల్ దగ్గరకు ఆస్ట్రేలియా వెళ్ళింది. నేహా లేకపోవటం చాలా వెలితిగా అనిపించింది. ఆమె తనకొక స్నేహితురాలే కాదు. ఎల్లప్పుడూ చెలికత్తెలాగా ఆమె తన వెంటే వుండాలి. ఆమెతోనే ప్రతి నిముషం గడపాలి. ఆమే తన సర్వస్వం. ఆమె లేకుండా బయటికెక్కడికీ వెళ్ళాలనిపించటంలేదు. ఆస్ట్రేలియానుంచి అప్పుడప్పుడూ ఫోన్‌లో చాట్ చేస్తుంది. అది కూడా చాలా తక్కువ సార్లు. ఆ కొద్ది టైంలోనూ సిడ్నీలోని విశేషాల గురించి చెప్పుకొచ్చేది. అదీ కాకపోతే, వాళ్ళ అంకుల్, ఆంటీల గురించి వాళ్ళుండే విల్లాలాంటి ఇంటి గురించే ఏకరువు పెట్టేది. నువ్వెలా వున్నావు? ఏం చేస్తున్నావు? అని ఏం అడిగేది కాదు.

నేహా తిరిగి వచ్చేటప్పటికి ఎంట్రన్స్ రిజల్టు వచ్చేసింది. కార్తీక్ రిజల్టు అతను ప్రిపేర్ అయిన దానికి తగ్గట్టే వున్నది. కాని నేహాకు బ్రహ్మాండమైన ర్యాంకు వచ్చింది. దేశంలో వున్న పెద్ద పెద్ద ఇంజనీరింగ్ కాలేజెస్‌లో చదవటానికి అవకాశం వచ్చేటట్లుగా వున్నది. కార్తీక్ మాత్రం ఒక మోస్తరు కాలేజిలో సీటు తెచ్చుకోవాల్సివచ్చింది. అతని నోటి నుండి నేహా చేరబోయే కాలేజీ పేరు విన్న కార్తీక్ తల్లి కళ్ళలో ఎన్నో భావాలు కదలాడాయి. “నీ సర్వస్వాన్నీ తెలివితేటల్నీ నేహా తీసుకున్నది. టెన్త్‌క్లాసులోని నీ తెలివితేటలన్నీ ఏమయిపోయాయి? నేహా నుండి ఎందుకు దూరం కావు?” అనుకున్నది. తల్లి భావాలు అర్థమయినా అతనికా దృష్టి కలగలేదు. ఇంటి నుండి బయటికి వచ్చాడు. ఎవరితో నైనా మాట్లాడాలని, ప్రత్యేకంగా ఒక చోటికి వెళ్ళాలన్న ధ్యాసేమీలేకుండా నడవసాగాడు. తన మీద తనకే న్యూనతా భావం ఏర్పడింది. తనకి చాలా తక్కువ రాంక్ వచ్చి నేహా ముందు మరుగుజ్జుగా మిగిలిపోయానన్న బాధ కలిగింది. తను కలలుగన్న కాలేజ్‌లో తనకు చేరే అవకాశమే లేదు. దానికన్నా నేహా తనను దూరం పెట్టేస్తుంది అన్న బాధే

పట్టి పీడిస్తుంది. తనెందుకు వెనుకబడిపోయాడో, ఏం జరిగిందో తెలుసుకునే చైతన్యం కూడా కార్తీక్‌లో మిగలకుండా పోయింది. రాత్రయ్యేదాకా అటూ, ఇటూ తిరిగి ఇంటికి చేరుకున్నాడు. తిండి తిని మంచం మీద పడుకుని నిరాశా, నిస్పృహలతో కూడిన నిట్టూర్పు విడిచాడు. ఇప్పుడెవరీ దృష్టీ తన మీద లేదు. ఎవరూ తనను తెలివైన వాడిగా గుర్తించటం లేదు. ఎవరూ తనను ప్రశ్నల బోనులో వుంచి నిలబెట్టకపోయినా తన స్థితి ఏమిటో తనకే అగమ్యగోచరంగా వున్నది.

మరుసటి రోజు ఉదయం అమ్మ నాన్నగారి నిర్ణయమేంటో చెప్పింది. "కాలేజీలో చేరటానికింకా టైమున్నది. అప్పటివరకూ నిన్ను మన ఫ్యాక్టరీకి రమ్మని చెప్పారన్నది."

బహుశా రాత్రి అమ్మా, నాన్నా ఆలోచించి ఈ నిర్ణయాన్ని తీసుకునివుంటారు. అమ్మ నన్ను నేహా దృష్టి నుండి తప్పించాలని చూస్తున్నది. దీనికంతటికీ ఫుల్‌స్టాప్ పెట్టించటానికి నాన్నగారు ఈ తిరుగులేని నిర్ణయాన్ని తీసుకుని వుంటారు. తను నిద్రలేచేసరికి నాన్నగారు ఫ్యాక్టరీకి వెళ్ళిపోయారు. నాకు చెప్పేది చెప్పి అమ్మ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుకుంటూ కూర్చున్నది. ఏ విషయాన్ని గురించైనా కాదు, నేను చెయ్యను అని చెప్పే ధైర్యాన్ని కోల్పోయాననుకున్నాడు. కాలేజీలు తెరవటానికి ఇంకో నెలటైమున్నది. అప్పటిదాకా ఫ్యాక్టరీకి వెళ్ళి కూర్చోవటం కంటే అతనికింకోపని లేదు. మరేవుపాయము తన దగ్గర మిగలలేదు. అలాగే మనసుకు నచ్చచెప్పుకుని ఫ్యాక్టరీకి వెళ్ళి వర్క్ జరిగేచోట కొంచెంసేపు వున్నాడు. వర్కర్స్ టేబుల్ దగ్గర కుర్చీ వేసుకుని  కూర్చుని పనిని గమనించాడు. వాళ్ళ నాన్న ఉండే ఆఫీసు రూమ్ వైపుకు మాత్రం వెళ్ళలేదు. ఆయన తన కొడుకుతో ఇప్పటివరకూ రిజల్ట్ గురించి కానీ, రాంక్ గురించిగానీ ఏమీ మాట్లాడనేలేదు. కాని ఆయన లోపల ఒక జ్వాలాముఖి వెలుగుతుంది. దాని బాధను చిన్నాభిన్నాం చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. ఆ బాధ తగ్గేదాకా కొడుక్కు దూరంగానే వుండాలనుకున్నాడు. కార్తీక్ కూడా కాస్త బయట తిరగటానికి వెళుతున్నాడు.పాత స్నేహితుల్ని కలుస్తున్నాడు. ఒకళ్ళూ, ఇద్దరూ ఫోన్లో కూడా మాట్లాడుతున్నారు. తన పాత మిత్ర బృందంతో ఎవరితో తనకేం పేచీ లేదు. ఇపుడు నెమ్మదిగా అతనికి తన పరిస్థితి అవగతమవుతున్నది. నేహా నిర్లక్ష్యాన్ని మౌనంగా భరిస్తున్నాడు. తాను కష్టపడి నేహాను ఉన్నత స్థానం పొందే స్థితికి తెచ్చాడు. ఇప్పుడామెను మర్చిపోతూ తన గమనం సాగించాలనుకున్నాడు. మర్చిపోయే స్థితినీ నేహా పొందనివ్వకుండా, కార్తీక్ కాలేజీలో చేరే ముందు రోజు ఫోన్ చేసింది. అతడు ఇంజనీరింగ్ కాలేజీలో చేరబోతున్నందుకు కంగ్రాట్స్ చెప్పింది. తన కాలేజీ ఏర్పాట్ల గురించి చెప్పింది. తాను చాలా బట్టలు కొనుక్కోవాలని యూనిఫామ్‌గోల లేదు కాబట్టి వీలైనన్ని నచ్చిన బట్టలుకొంటూ ఇంకా చాలా షాపింగ్ చేస్తూ బిజీగా వున్నానని చెప్పింది.

తన రిజల్ట్ తర్వాత నేహా ఫోనే చేయలేదని గుర్తుకొచ్చింది. కంగ్రాట్స్ ఇప్పుడు చెప్తుంది. ఓహ్! ఎంత స్వార్ధపరురాలు. ఎటువంటి మనిషి. చేసినదంతా మర్చిపోయిందని తను ఎంత బాధపడ్డాడు. కాని నేహా అలాంటిదికాదు. తీరికలేకే ఫోన్ చేయలేదు ఖాళీ దొరగ్గానే తనను ఫోన్‌లో పలుకరించిందనే మూఢత్వంలో మళ్ళీ పడిపోతున్నాడు. ఆ ఒక్క ఫోన్‌తో అతనికి ప్రాణవాయువు అంది ఊపిరి వచ్చినట్లైంది.

ముడుచుకుపోయిన అతని ముఖం వికసించింది. నేహా పట్ల కలిగిన వ్యతిరేక భావనలన్నీ కర్పూరం కరిగినట్లు కరిగిపోయాయి. ఇప్పుడామె మాటలతో పక్షుల కలకూజితాలు విన్పించాయి. తనెంత మూర్ఖుడు. నేహానే తప్పుబట్టాడు. తనకూ, నాకూ మధ్య తక్కువ రాంక్, స్థాయి తక్కువ కాలేజ్ ఇలాంటివేమీ వుండవని తనకు తానే నచ్చచెప్పుకున్నాడు. తను పొరపాటు పడ్డాడని తెగ పశ్చాత్తాపపడ్డాడు.

ఇప్పుడే కాలేజీకి ఇష్టంగానే వెళుతున్నాడు. అపుడపుడు నేహాతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. రాత్రిపూట చాట్ చేసేది. తాను మాత్రం కాలేజీలో నేహా తోడులేక ఒంటరినయిపోయాననుకున్నాడు.

"తన ఇంటర్ క్లాస్‌మేట్స్ ఎవరూ తను చదివే కాలేజీలో చేరలేదు. తన రూమ్‌మేట్ రూమ్‌దాటి కొంచెం పచార్లు చెయ్యటానికి కూడా రాదు. ఆమె జబల్‌పూర్ నుండి వచ్చింది. రాత్రి పూట పొద్దుపోయే దాకా మేల్కొని వుండటం ఆమెకిష్టం వుండదు. తలనిండా నూనె పెట్టుకుని ఒంటి మీదెప్పుడూ సల్వార్ కమీజ్‌లు వేసుకుని తిరుగుతూ వుంటుంది. ఆమె ఏమేం తింటుందో కూడా చెప్పేది. ఇట్లా నేహా చెప్పే ఈ చెత్త కబుర్లను కూడా కార్తీక్ ఇష్టపడేవాడు. మరలా ఆమె ఎప్పుడు చాట్ చేస్తుందా అని ఎదురు చూసేవాడు. సెకండియర్ వచ్చేసరికి ఆమె పూర్తిగా కాలేజీకి, చదువుకే అంకితమైపోయింది. మొదట్లో ఏదైనా ప్రాబ్లమ్ అంటూ ఫోన్‌లో అడిగేది. క్రమేణా అదీ తగ్గిపోయింది. ఫోన్లు చేయటం కూడా తక్కువయింది. కార్తీక్ కూడా చదువులోపడ్డాడు. కబుర్లు చెప్పటానికి అంత సమయమూ వుండటం లేదు. ఏ మాత్రం ఖాళీగా వున్నా ఫ్యాక్టరీకి వెళ్లిపోతున్నాడు. తన చదువు పూర్తవగానే ఈ ఫ్యాక్టరీ తనే చూడాలని నిర్ణయమైపోయింది. చూసుకోవటమే గాదు. దాన్ని బాగా అభివృద్ధి చేయాలని నాన్నగారి కోరిక. అతని కెరీరంతా ఇపుడు ఆ ఫ్యాక్టరీ మీదే ఆధారపడివుంది. అమ్మా, నాన్న అప్పట్లో తనకెంత తక్కువ రాంక్ వచ్చినా అంతగా స్పందించకపోవటానికి ఇదే కారణమనుకున్నాడు. తన దృష్టి మరల్చటానికి ఫ్యాక్టరీకి పంపించాలని, అతను ఒప్పుకోకపోతే బలవంతంగానైనా ఫ్యాక్టరీ పనుల్లో మగ్నం చేయాలని వాళ్ళు గట్టిగా నిర్ణయించుకున్నారని అప్పట్లో కార్తీక్కి తెలియలేదు. అమ్మతోనే కాని, నాన్నతో ఎక్కువగా మాట్లాడే అలవాటు మొదట్నుండీ కార్తీక్‌కు పెద్దగాలేదు. నాన్నెప్పుడూ బిజినెస్ పనుల్లోనూ, ఆ తర్వాత సామాజిక సేవా కార్యక్రమాల్లో మునిగివుంటారు. అమ్మ ఇంట్లోనే వున్నా తన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమై వుంటుంది. తనక్కూడా ఏదైనా వ్యాపకం కల్పించుకోవాలని అన్పిస్తుంది.

ఫోర్తియర్‌కు వస్తూనే ప్రతి విద్యార్థికి తర్వాత ఏం చెయ్యాలి? అన్న ప్రశ్న వస్తుంది. ఎమ్.బి.ఏ.నా ఎమ్మెస్సా? లేదా జాబా అనే లెఖ్ఖలు వేసుకుంటారు.

ఒకరోజు నాన్న అడిగారు. "ఇంజనీరింగ్ అయిపోగానే ఏంచెద్దామనుకుంటున్నావని"? "ఫ్యాక్టరీ చూసుకుంటాను. దాని డెవలెప్‌మెంట్‌కు కొంత ప్లానింగ్ చేసుకుంటానని" స్పష్టంగా చెప్పాను. ఇక ఆ తర్వాతి నిర్ణయం నాన్న తీసుకోవాలి. బాగా ఎస్టాబ్లిష్ అయిన ఫ్యాక్టరీని కొడుక్కోసం వదిలేసి తను ఇంకో కొత్త ప్రాజెక్టు ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ నాలుగేళ్ళలో నేను కూడా వ్యాపారంలోని మెళకువలన్నీ బాగా

తెలుసుకున్నాను. ఫ్యాక్టరీలో నాన్నలాగే, నేను కూడా తక్కువ మాట్లాడుతూ, దూరదృష్టితోను, క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగాను నడుచుకుంటున్నాను.

ఇపుడు నన్ను చూసి నాన్నగారు చాలా సంతోషపడుతున్నారు. ఆయన మాటల్ని, ఆయన నిర్ణయాలను ఇదివరకటి కన్నా ఇపుడు నేను బాగా గౌరవిస్తున్నాను. కాలేజీ చదువు అయిపోగానే ఫ్యాక్టరీకి క్రమం తప్పకుండా వెళ్తున్నాను. నేహా పూనాలోని ఒక బ్యాంకులో చేరింది. ఈ విషయం తను కాలేజీ నుండి బయటికొచ్చేముందే చెప్పింది. అంతకంటే పెద్ద విషయమూ వున్నది. ఆ విషయము నాకు చెప్పటానికామె మూడేళ్ళు ఆగింది. ఆమెకొక బాయ్‌ఫ్రెండ్. అతడామెకు సీనియర్. ప్రస్తుతమతడు యమ్మెస్ చేసి అమెరికాలోనే వున్నాడు. అక్కడే ఉద్యోగమూ వచ్చింది. అతణ్ణి పెళ్ళి చేసుకుని ఆమె కూడా అమెరికాలో సెటిలవుతుందట.

నెట్‌లో పెట్టిన నేహా పెళ్ళి పత్రికను చూసి కార్తీక్ మనసు అదిరిపడింది. ప్రస్తుతం తనతో నేహా అంత చనువుగా, వుండటం లేదు. అయినా కూడా మనసులో నేహా జ్ఞాపకాలు పదిలంగానే వున్నాయి. అమ్మ తెచ్చిన పెళ్ళికూతుళ్ళ ఫోటోలవంక కూడా చూడలేదు ఇన్నాళ్ళూ. అమ్మకూడా నేహా పెళ్ళి పత్రికను నెట్‌లో చూసింది. "కార్తీక్! నీ క్లాస్‌మేటేగా ఈ అమ్మాయి. ఆ నేహాలాగానే వుందిగా అన్నది. నిరాశనిండిన గొంతుతో అన్నాను." అవునమ్మా, ఆ నేహే."

"చూడు కార్తీక్! మనం నకిలీని చూసి అసలు వస్తువనుకోవటం వృధా. అది భ్రమే అవుతుంది. మనం కూడా మన నిర్ణయాన్ని తీసుకుందాం. మనకిష్టమైన అమ్మాయిని చూచుకుందాం. కాని మా ఆలోచనలూ, మా నిర్ణయాలు నీమీద రుద్దం. ఇప్పటికీ మేం నీ నిర్ణయానికే విలువనిస్తాం. పెళ్ళి చేసుకునే వాళ్ళ ఇష్టాఇష్టాలే ముఖ్యమని మా ఉద్దేశ్యం. ఒక సంబంధం కలుపుకోవాలంటే ఒక యువతికి కలల్లోని రాజకుమారుడే అఖ్ఖర్లేదు. కాని ఆమె తనకన్నా ఎక్కువ సంపాదించే వాడిని కోరుకుంటుంది. తను పెట్టే ప్రతిపరీక్షలో నెగ్గాలనుకుంటుంది. కేవలం మనసులోని కోరికలకనుగుణంగా బంధుత్వాలు ఏర్పడవు. ఏ రాముడైనా సీతన పెళ్ళాడాలంటే అతనికి విల్లువంచటం వచ్చివుండాలి. అర్జునునికి చేపకన్ను చేధించి ద్రౌపదిని గెలవాల్సి వుంటుంది. శతాబ్దాల నుండి వచ్చే ఆచారాలివి. వీటినిప్పుడు కాదని పాశ్చాత్య దేశాల సభ్యతనలవరచుకోవటానికి చాలా సమయం పడుతుంది. అలా చేయటానికి స్వయంగా చాలా ధైర్యం కూడా కావాలి. కాబట్టి ఇప్పుడీ విషయాన్ని మర్చిపో. యదార్థాన్ని గ్రహించు.

అమ్మ మాటలు నా మనసుకు ఒక స్థిరత్వాన్ని, ఊరటను కల్గించాయి. నేను అమ్మకు వాగ్దానం చేశాను. నాకోసం నీవే నిర్ణయమైనా తీసుకోవచ్చని.

## శ్రీ జయశంకర ప్రసాద్ కవి పరిచయము

జీవన రేఖలు : **1889** జనవరి **30**వ తేదిన ఉత్తరప్రదేశ్ నందలి వారణాసిలో జన్మించారు. ప్రాథమిక అభ్యాసంతోనే స్కూలును వదిలిపెట్టారు. ఆ తర్వాత ఇంట్లో వుండే ఇంగ్లీషు, సంస్కృతం, పాలీ, ప్రాకృత లాంటి భాషల్ని నేర్చుకున్నారు. అంతేకాక భారతీయ దర్శనాలు, చరిత్ర, సాహిత్య సంస్కృతులను బాగా ఔపోసన పట్టారు. ఆ జ్ఞాన సముపార్జనంతా వారి రచనల ద్వారా పాఠకుల కందించారు.

వృత్తి వ్యాపారాలు : నస్యము, పొగాకు వ్యాపారాల్లో వీరి కుటుంబం ప్రసిద్ధి చెందింది. తండ్రితో పాటు బాల్యంలోనే చాలా ప్రదేశాలను తిరిగివచ్చారు. కుటుంబ సభ్యులందరి మరణంతో జయశంకర ప్రసాద్ తన వారసత్వపు వ్యాపారాన్ని చూచుకోవాల్సివచ్చింది. వీరు **1937** నవంబరు **15**న స్వర్గస్థులయ్యారు.

సాహిత్య సృష్టి : హిందీ సాహిత్య శ్రేష్ఠ సృష్టికర్తల్లో అగ్రగణ్యులుగా జయశంకరప్రసాద్ పేరుగాంచారు. తక్కువ వయసులోనే మరణించినా ఆ చిన్న జీవితంలోనే సాహిత్యపు విభిన్న పార్శ్వాలను స్పృశించి భారత దేశ చరిత్రను, మానవుని అనేక మనోవృత్తులను అత్యంత సామర్థ్యంగా చిత్రించారు.

కథలు : వీరి కలం నుండి జాలువారిన కథలు వీరికి కథా సాహిత్యంలో ఒక వున్నత స్థానాన్ని కల్పిస్తున్నవి. వీరి నాటకాలు, నవలలు, కావ్యాల వలె వీరి కథలు కూడా ఒక ప్రత్యేక శ్రేణికి చెందినవిగా సాహిత్య సమాలోచకులు భావిస్తున్నారు. అందువలన వీరి కథలు చదివిన పాఠకులు ఎంతో ఉత్తేజితులవుతూ, మానసికోల్లాసాన్ని పొందుతారు. పురస్కార్ గుండా, మధువా మొదలగు కథలు చాలా ప్రాచుర్యం పొందినవి.

ప్రముఖ రచనలు : ఝర్‌నా, ఆంసూ, లహర్, కామాయనీ, స్కంద్ గుప్త్, చంద్రగుప్త్, ధ్రువస్వామినీ, జనమేజయ్‌కా నాగయజ్ఞ్, రాజశ్రీ, విశాఖ్ కామనా, కంకాల్, తితలీ ఔర్ ఇరావతి చాలా ప్రసిద్ధిపొందినవి.

“ఘీసూ” అన్న కథలో (చెదిరిన స్వప్నం అన్నపేరు పెట్టాను) ఆనాటి సామాజిక పరిస్థితులు, ఒక అమాయక ప్రేమికుని బలిదానం, అత్యాంత సహజంగా వర్ణించబడి వున్నది. “చూడీవాలీ’ (విలాసిని) కథలో వేశ్యావృత్తి నుండి తప్పుకుని కులవధువుగా జీవితం గడపటానికి ఒక యవతి చేసిన ప్రయత్నమే కన్పిస్తుంది. విలాసిని పాత్ర పాఠకుల ఆదరణను పొందుతుంది. ఆభిజాత్యపుపొరలు కరిగిన విధానమూ ఆకట్టుకుంటుంది. “ఆకాశదీపం” అనే కథ హిందీ కథా సాహిత్యంలో ఆణిముత్యమంటిదని పరిశీలకుల భావన, ఈ కథలో భారతీయ మహిళ తన ఆత్మ గౌరవాన్ని, ఆత్మ ప్రభోధాన్ని కాపాడుకున్న విధానాన్ని పాఠకుల కళ్లముందు సాక్షాత్కరింప జేస్తారు. ‘చంప’ పరిస్థితికి వగచే పాఠకులను రచయిత తన వర్ణనలతో ఊరడించే సఫలీకృత ప్రయత్నమూ చేస్తారు. ‘ఆంధీ” కథ నిజంగా తుఫాను లాగే వివరంగా, తీవ్రంగా విస్తరించిన కథ. ఇందలి భారత ఔన్నత్యం, భారతీయ శిల్ప, చిత్రకళా వర్ణన పాఠకులకు ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. అలాగే మానవుని మానసిక దౌర్బల్యాలు, బౌద్ధుని విశాల, ఉదార స్వభావమూ, చాలా విపులంగా చర్చించబడ్డాయి. లైలా తుఫానులాగే విజృంభించి ప్రకృతిలో కలసిపోయి పాఠకుల మనసులో తుఫాను వాతావరణాన్ని మిగిల్చి వెళ్ళే ఉదంతం పాఠకుల మనస్సులపై చెరగని ముద్ర వేస్తుంది. తుఫాను అన్న పేరు ఈ కథకు ఎంతో సార్థక నామంగా ఉన్నది.

# తుఫాను

చందా సరోవరతీరం. చాలా ప్రశాంతమైన ప్రదేశం. దాని ఒడ్డున బాగా విస్తరించివున్న చెట్లకొమ్మలనీడ ఆ ప్రదేశాన్ని చల్లగా వుంచుతుంది. కాని నేను అక్కడున్న ఇప్పచెట్టు దగ్గరే పచార్లు చేస్తాను. పచార్లు చేయటం అయింతర్వాత మరలా అక్కడే కూర్చుంటాను. అప్పుడప్పుడూ వెన్నెల్లో తడుస్తూ కునికిపాట్లు కూడా పడుతూవుంటాను. అదే నాకు విశ్రాంత స్థలం. అక్కడే నా మనసుకు పదిలంగా కూడా అన్పిస్తుంది. నాకక్కడొక సహచరి కూడా వున్నది. ఆమె పేరు సధియా. కాని ఆమె ఏమీ మాట్లాడదు. బావిగిలకల్లాంటి గిలకల్తో తయారయిన ఎలుకబోనులాంటి గుడిసెలో వుంటుంది. ఆమెకొకకొడుకు. వాడు లావుగా, నల్లగా వుండి పెద్ద పొట్టతో పడుకుని వుండేవాడు. రెండు మణికట్లలో తలను ఆసరగా వుంచుకుని భగవంతుని అనంతకరుణకు నమస్కరిస్తున్నట్లుగా వుండేది వాడు పడుకున్న విధానం. సధియా పేదరాలుకాబట్టి ఆమెకు ఏదైనా సహాయం చెయ్యాలనుకునే వాణ్ణి. కాని ఆమె ఎప్పుడూ నా సహాయాన్ని తిరస్కరిస్తూనే వుండేది. ఆమె తన శ్రమనే నమ్ముకుని జీవించేది. మిగతా నిమ్నజాతుల వారి వలె ఆమెకు నేరాలు చెయ్యటం కూడా తెలీదు. వారి నుండి దూరంగా వచ్చి ఈ ప్రాంతంలో ఒంటరిగా వుండేది. ఆమె ఇప్పపూలను పోగుచేసి అమ్మేది. బూరుగదూదిని తీసేది. కలపనిచ్చే చెట్లగింజలు ఏరి అమ్మేది. ఈ పనులన్నీ ఆమె ఒక్కతే చేసుకునేది. శ్రమచేస్తూ, చేస్తూనే ఆమె శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయింది. అపుడు కూడా ఆమె కొడుకు కల్లూ మణికట్టు మీద నుండి తలెత్తి ఒత్తిగిలిపడుకుంటూ ఆవులిస్తూ, ఒళ్ళు విరుచుకుంటూ ఒకసారి చూసి వూరుకున్నాడు.

స్నేహం, మాయ, మమత వీటన్నింటిని కూడా శిశువుకు నేర్పేది పాఠశాల లాంటి ఇల్లే. మాయా, మమత ఏ ప్రాణి హృదయంలో వుండదు. ఇంట్లోనే పెరిగే శిశువులు నెమ్మదినెమ్మదిగా శిక్షణ పొందుతారు. పొందిన శిక్షణనే కనపరుస్తూవుంటారు.

సధియా పోయిన సంగతి ఆమె బంధువులకు తెలిసింది. వారొచ్చి కల్లూను తీసుకెళ్ళారు. అప్పటినుండి ఆ ప్రాంతమంతా నిర్జనంగానే వున్నది.

రోజులాగే నేను ఆ చెట్టు కిందకు చేరాను. ఎన్నిసార్లు అక్కడ గడిపినా ఆ చెట్టునీడకే నేను ఆకర్షితుడనవుతాను. అక్కడ ప్రకాశించే సూర్యోదయాల్లో నాకు సరసత కనుపిస్తుంది. నా హృదయం చాలా తేలిగ్గా వుంటుంది. అక్కడి గాలిలో ఒక మత్తు గొలిపే హాయి, చల్లదనం వుంటాయి. అక్కడి చెరువు మీద నాట్యం చేసే ఎర్రెర్రని సూర్యకిరణాలు వృక్షాగ్రాలమీద కూడా పడి వింత సౌందర్యాన్ని కల్గిస్తున్నాయి. అక్కడున్న పొగడచెట్టు పూల పరిమళాల్లో నాశిరస్సును నెమ్మది నెమ్మదిగా ముంచి నాలో నేను ఏదో గుణించుకుంటూ నడుస్తూపోతున్నాను. సరిగ్గా ఇప్ప చెట్టు క్రింద నుండి కొంతమంది మనుష్యుల అలికిడి వినిపించింది. కుతూహలంతో నేనూ అటే నడిచాను. లోగడ అక్కడొక సత్రవ వుండేది కాని తర్వాత అది శిథిలమైపోయింది. ఇంకా ఒకటి రెండు చిన్న గదులు మాత్రమే మిగిలున్నాయి. కాని వెనుకటి అలవాటు ప్రకారం ఇప్పుడు కూడా బాటసారులు ఇక్కడ ఆగుతూనే వుంటారు.

నా ప్రియమైన చెట్టు చుట్టూ ఒక విచిత్రమైన గుంపు కొలువుతీరివున్నది. అద్భుతంగా శిబిరాలవలె, అడవిలోని ఇళ్ళవలె, తోట నివాసంలాంటి తాత్కాలిక బస్తీలాంటి దానిని ఏర్పరచుకున్నారు.

సృష్టి ఆరంభం నుండి ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. కాని ఈ అభాగ్యులకు ఏ ప్రాంతంలోనూ, స్థిరనివాసం లేదు. కొండచరియల్లోనో, నదీమైదానాలలో కూడా ఉండే ఏర్పాటు లేదు. వాళ్ళు ఇప్పటికీ అటూ, ఇటూ తిరుగుతూ తమ ఇంటి సామాగ్రిని జంతువుల చేత మోయించుకుంటూ ఒక ప్రాంతాన్నుండి మరొక ప్రాంతానికి తరలిపోతూవుంటారు. సభ్యమానవజాతికి విద్రోహులు వీరు. అయినప్పటికీ వీరికొక సమాజమున్నది. సభ్యసమాజపు నియమాలు పట్టించుకోకుండా వీరు తమ నియమాలను తామే ఏర్పరచుకుంటారు. ఏదో ఒక ఉపాయంతో నాగరికుల దగ్గర వున్నదానిని సంగ్రహించి, స్వతంత్రంగా జీవిస్తూ వుంటారు. విశేషమేమిటంటే నేటి ప్రపంచపు విచిత్రమైన వస్తు సంపద వీరి దగ్గరుంటుంది. గుఱ్ఱపుస్వారిలో మంచి నేర్పరితనం వుంటుంది. సభ్యసమాజంతో వీరు చేసే వ్యాపారం భయంకరంగా వుంటుంది. కఠోరపరిశ్రమ చేస్తారు. ప్రపంచయాత్ర చేయగల సమర్థప్రాణులు. కాని వీరు ఎక్కడా స్థిరనివాసం ఎందుకు ఏర్పరుచుకోరో తెలియదు. ఇవన్నీ ఆలోచించుకుంటూ నెమ్మదినెమ్మదిగా వాళ్ళ దగ్గరకు నడిచాను. వీళ్ళను గురించి చాలా విషయాలే వినివున్నాను. వీరి రాకతో నాకెంతో ప్రియమైన ఈ నిర్జన ప్రాంతం నాకీనాడు అసంతృప్తిని కల్గిస్తున్నది. నా ప్రియమైన చెట్టు దగ్గరకు నడిచాను. దాని కొమ్మకు తాళ్ళతో కట్టివేయిబడిన గుఱ్ఱపుపిల్ల గరిక మేస్తూవున్నది. లెహంగా, పొడవాటి చొక్కా ధరించి రుమాలుతో తలవెంట్రుకలను బంధించుకున్న బాలిక ఆ గుఱ్ఱపు పిల్లకున్న మురికిని ఎండుగడ్డితో రుద్ది శుభ్రం చేస్తున్నది.

నన్ను గమనించి "గుర్రం కావాలా బాబూ" అనడిగింది.

"వద్దు" అంటూనే ముందుకు నడిచాను. ఇంతలో ఒక యువతి వాళ్ళ శిబిరంలో నుంచి తల బయటకు పెట్టి చూసింది. ఆమె వెంటనే బయటకు వచ్చింది. "మీకు చదవటం వచ్చా? హిందువులు వ్రాసిన దానిని చదవగలరా?" అనడిగింది.

నేను ఆ అందమైన ముఖాన్ని కళాత్మక దృష్టితో చూడసాగాను. బౌద్ధకళ, గాంధార కళ, ద్రవిడకళ అనే పేర్లతో భారతీయ మూర్తిసౌందర్యం విరాజిల్లుతూవున్నది. దీనికొక ఆకృతిని కల్గించుకుంటాను. నా ఏకాంత జీవనానికి ఈ విధమైన జడ సౌందర్యమే ఆలంబనగా వుంటుంది. నా హృదయం సజీవ ప్రేమలో ఎప్పుడూ స్నానించదు, మునగదు. నేను ఇలాంటి మూక సౌందర్యంతోనే అప్పుడప్పుడూ మానసిక ఆనందాన్ని పొందుతాను. ఉత్తరం చదవగలరా? అని ఆమె అడిగనపుడు కూడాఈమె నిజమైన గాంధార ప్రతిమా లేక గ్రీసు, భారత సౌందర్య సమన్వయమా? అని ఆలోచించాను.

నా ఆలోచనల్లో నేనుండగా ఆవిడ విసుగ్గా 'ఇంతకీ ఉత్తరం చదవగలరా లేదా? అది చెప్పండి" అన్నది.

"కళ్ళజోడు లేదు" అని వెంటనే అనేశాను. నాకు కళ్ళజోడు అవసరం లేదు కాని స్త్రీలతో మాట్లాడటానికి సంకోచపడతాను, బిడియపడతాను. ఇంకా ఇప్పుడు నేను విన్నదాన్నిబట్టి ఈ తెగవారు ఏదైనా వస్తువు అమ్మటానికి చాలా వత్తిడి పెట్టటం, కొన్ని చోట్ల మనుష్యులనే మాయం చేసి బెదిరించి తమ పనులు పూర్తి చేసుకుంటారని గుర్తుంది. ఇటువంటి పనుల్లో స్త్రీలే సమర్ధులు. వారికి పురుషులు సాయం వస్తారని గుర్తుకొచ్చి ఆమె అంటే భయపడ్డాను.

నేనేమో ఆమె సౌందర్యారాధనలో మునిగి వాస్తవాన్ని మర్చిపోయాను. నాదైనందిన ప్రకారం వాహ్యాళి కొచ్చి ఈ అచంచల ప్రతిమముందు నిలబడిపోయాను. తెప్పరిల్లి "ఏం కావాలి? ఏం చెయ్యాలి?" అనడిగాను. "కళ్ళజోడు కావాలంటే మా దగ్గరుంటుంది తెచ్చేదా? అనడిగింది. ఆగాగు. కళ్ళజోడు వద్దులే" అన్నాను. వీరి దగ్గర నేనేమీ కొనే ఉద్దేశ్యంలో లేనే? వత్తిడి పెడితే ఏం చేయాలా అని ఆలోచిస్తూ వుండగానే" ఇంతకీ చదవగలరా? లేదా?" అని మరలా అడిగింది.

"అదేదో చదవందే నన్ను పోనిచ్చేటట్లు లేదనిపించి సరే. తీసుకురా! చదవగలిగితే చదువుతాను" అన్నాను. ఆమె తన జేబులో నుండి బాగా మడతలు పెట్టిన ఉత్తరానొకదాన్ని తీసిచ్చింది. నేను మనసులోనే చదువుకోసాగాను. "లైలా! నువ్వు వ్రాసిన ఉత్తరం చదివాను. నువ్వూ, దుఃఖం రెండూ వచ్చాయి. మరొకరిదగ్గర నీ మనసు విప్పి చెప్పావు. అమాయకంగా నీ ఆలోచనలన్నీ వేరే వారికి చెప్పి ఉత్తరం వ్రాయించినందులకు నవ్వు వచ్చింది. నీలాంటిసంచార కుటుంబాలు ఇలాంటి బంధనాలను సహిస్తాయా? ప్రేమ విషయాలు గుంభనగా వుంచుకోవాలన్న విషయం కూడా నీకు తెలియలేదా? నన్ను ప్రేమిస్తున్నానని వ్రాసిన విషయం చదివాను. ఇదెంత భయంకర విషయమో కదా అని దుఃఖం వచ్చింది. ఇది మనిద్దరికీ కూడా మంచిదికాదు. నీవు నన్ను నీ ప్రేమ సామ్రాజ్యంలోకి ఆహ్వానించావు. స్వతంత్రంగా జీవిద్దామని అన్నావు. కాని నాకు నా జీవితంలో దృఢమైన బంధనాలున్నాయి. వాటిని తెంచుకోలేను. ఇంట్లో నాకు భార్య, ముగ్గురు పిల్లలూ వున్నారు. వారందరి కోసం నేను పాటుపడాలి. వారిని సుఖపెట్టాలి. భార్యా, బిడ్డల బంధనాలు లేకున్నా నేను నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించలేను. ఎందుకంటే నేనొక హిందూ గృహస్థుని. నువొక స్వేచ్ఛా విహంగానివి. మన ఇద్దరి దారులు వేరు. మన ఇద్దరినీ కలిపే పాశాలు ఏమీ లేవు. నువ్వు కన్న కలలో నువ్వూ, నేనూ ఇద్దరమే వుంటాం. ప్రపంచపు ఊసే లేదు. ఇలా జరగటం అసంభవం. నన్ను మర్చిపో. నేనీ ప్రపంచంలో సుఖాలు పొందుతూనే జీవితపు విభిన్న అవస్థలను సమన్వయపరుచుకోవటానికి ప్రయత్నిస్తున్నాను. ఎప్పటి నుండి మనుష్యుడు ఈ భయంకర సుఖాన్ని అనుభవిస్తున్నాడో తెలియదు. నేనూ ఆ మనుష్యులలో మినహాయింపు కాదు. ఎందుకంటే నా ఈ సుఖం కూడా నీ స్వేచ్ఛా స్వతంత్ర ఫలమే. అది ఆరంభం. ఇది పరిణామం. అయినా కూడా నేను నాయింటిలో వుండాల్సివస్తుంది. అనేక సమస్యలు ఎదురొస్తాయి. అపుడు నీ కలలకు విఘాతం కల్గుతుంది. భూమి దృఢత్వంలో కంకర కలిసి వుంటుంది. గాలి వీస్తే పూలు ఎగిరిపోతాయి. ఆకాశపు విరాట్ రూపం సమస్త వెన్నెలనూ మింగివేస్తుంది. అంధకారమే విసుగునూ, పశ్చాత్తాపాన్నీ, జీవితాన్నీ, గాయాలపాలు చేస్తుంది. అందువలన లైలా! ఇదంతా మర్చిపో. నీవు వెండి నాణాలు అమ్ముతావు. చీకటి వ్యాపారపు దొంగలు పట్టుబడతారు. కాని తన మనసులోని దొంగను పట్టుకోవటం చాలా మంచిది. నిన్ను ఏది దొంగిలిస్తుందో

దాన్ని బయటకు తియ్యి. నీవమ్మే పాత నాణేలు నేను కొంటాను. ఈసారి నువ్వు పడమటి ప్రాంతానికి వెళ్ళు. అక్కడుండే విలువైన వాటిని వెతికి తీసుకొనిరా. నేను వాటికి తగిన మూల్యం ఇచ్చి తీసుకుంటాను. నీకు అమ్మటం బాగా తెలుసు. కాని నిన్ను నీవు అమ్ముకోవద్దు. అలా చేసి నన్ను ప్రేమించాననే పొరపాటు చెయ్యవద్దు. వ్యర్థంగా ఇంకెప్పుడూ ఇలాంటి ఉత్తరాలు వ్రాసి పంపవద్దు. రామేశ్వర్."

నేను ఒక్క ఉదుటున ఆ పెద్ద ఉత్తరం చదివాను. నేను చదివినంత సేపూ లైలా నా ముఖంవంకే చూస్తూవున్నది. నాకు నేను చెప్పుకున్నట్లుగానే ఆ ఉత్తరం చదివి ఆ కాగితాన్ని ఆమెకిచ్చివేశాను.

"దీంట్లో ఏం రాసున్నదో చెప్పండి" అన్నది లైలా.

దీంట్లోని విషయాలు మరెప్పుడైనా చెప్తాను. ఇప్పుడు నాకు టిఫిన్ చేసే సమయమైంది. నేను వెళ్ళాననగానే "బాబూ! మీ ఇల్లెక్కడ" అనడిగింది. చందా ఒడ్డునున్న నా తెల్లని బంగళాను చూపించాను. కాగితాన్ని చేతిలో వుంచుకుని లైలా అక్కడే నిలబడింది. నేను నా ఇంటి వైపుకు నడిచాను.

మనసులో ఎడతెగని ఆలోచనలు. ఆ రామేశ్వర్‌నాథ్‌వర్మే. కొంగొత్త వస్తువులుకొనే వ్యాపారి. ఎప్పుడూ రకరకాల వస్తువుల గురించి తెలిసికోవాలనుకుంటాడు. ఈ దస్తూరీ అతనిదే. అతడు నాకు బాగా పరిచయం. మిత్రుడనుకోవటానికి ఒక చిన్న ఇబ్బంది ఏంటంటే మిత్రులను కూడా మనసులోనే సంభోదించుకుంటూ వుంటాను. మిత్రుడనిభావించిన మనుష్యుడు తనను శివునికి సమానంగా ఆత్మ త్యాగాన్ని, బోధి సత్వునిలాగా సర్వసమర్పణ చేయాలన్న ఆశతో గోరంతను, కొండంతగా చూస్తాడు. అటువంటి స్థితిలో అతణ్ణి పడవేసి, కాల్పనిక గణిత ఆధారంగా జీవితపు లెక్కలు వుంచటం నాకలవాటు లేదు.

ఒంటరి జీవితానికి సాధారణ వ్యయప్రయాసలు నాకు చాలు. సుఖంగా వుండగలను. టిఫిన్ చేసి వచ్చిన తర్వాత నాకొచ్చిన పోస్టును చూచుకుంటూ కూర్చున్నాను. అందులో ఒక కవరు ఇంతకు ముందు నేను చూసి వచ్చిన అక్షరాలవంటివే వ్రాసివున్నది. దాన్ని నేను చించి చదవసాగాను.

"భాయీ! శ్రీనాథ్! నీ సమాచారం చాలా రోజుల్నుంచి తెలియటం లేదు. రెండు వారాలలోపలే మేం నీ అతిథులుగా రాబోతున్నాం. ఇది నీకు సంతోషమే కల్గిస్తుందనుకుంటాను. చందా నుంచి వీచే గాలుల్ని మేం కూడా పీలుస్తాం. మన్నాకు అనారోగ్యంగా వున్నందువలన అతని తల్లికి గూడా అక్కడికి వచ్చివుండి రోజంతా చిన్నపడవలో విహరించాలని, అక్కడి నీరు తాగాలని అందరూ ఉవ్విళ్లూరుతున్నారు. నీకే ఇబ్బందీ ఉండదుగా? నీ రామేశ్వర్."

ఉత్తరం చదవటమయిన తర్వాత నాలోకుతూహలం, ఆనందం నాట్యం చేయిసాగినయి. రామేశ్వర్ కుటుంబంతో పరిచయం, వారి స్నేహం, చిలిపి తగాదాలు, తృప్తీ, అసంతృప్తీ, సంతోషాలూ ఎంతో సుందరంగా వుండేవి. రామేశ్వర్ ఒక కదంబ వృక్షమయితే మాలతీలత తన ఆనందాల స్నేహాలింగన సురభిళమైనవందల శాఖల్ని పెనవేసివున్నది.

రామేశ్వర్ పెళ్ళికి నేను వెళ్ళాను. రామేశ్వర్ చేతి మీద మాలతి పచ్చని అరచెయ్యి. వాటి మీద నీటిధారపడింది. వారిద్దరి అనుబంధానికి అవి సాక్షీ భూతాలు. మాలతీ బాలికను కిశోర రామేశ్వర్‌కు అని నేను నవ్వుతూ అన్నాను. భూచలనాలూ, బడబాగ్నులూ, వరదలూ ఏ ఉత్పాతమూ లేకుండా రామేశ్వర్,మాలతిల సుఖాల పంటగా ముగ్గురు పిల్లలు పుట్టుకొచ్చారు. నా మనసులో కొచ్చిన ఆలోచల్ని తెలియజేస్తే నా నీచత్వపు మంట, కోపం రూపంలో వెలువడుతుంది. రామేశ్వర్‌పై కోపమేంలేదని నిజమే అంటున్నాను.

ఈ మనోవిజ్ఞాన యుగంలో తమ మానసిక ప్రవృత్తుల కోసం హృదయాన్ని పావురాలగూడుగా మలుచుకుంటున్నారు. రకరకాల శ్రేణుల్లో విభజించుకుంటున్నారు. ఆ ప్రకారంగానే మనోవృత్తుల లెక్కింపూ చేస్తున్నారు. నాయీ సాధారణ జీవితంలో ప్రసన్నత్వ స్నిగ్ధ తరంగమొకటి ఎగిసిపడింది. పారివారిక, సుఖాలు, ప్రణయ కలహాల బాధ్యతలేని నా జీవితానికి మానసిక ఆనందమే ముఖ్యం. ఆ కారణాలతోనే నేను రామేశ్వర్‌కు ఉత్తరం వ్రాయసాగాను.

"భాయీ! రామేశ్వర్! నీ ఉత్తరంలో నాపై ఎంతో ప్రసన్నత్వాన్ని కురిపించావు. నా శూన్య జీవితంలో ఆనంద కోలాహలాన్ని కొన్ని రోజులైనా పంచటానికి నీవు చేసే ప్రయత్నం నాకు తప్పకుండా సుఖం కల్పిస్తుంది. అందరూ కలసి రండి. నీ శ్రీనాథ్. ముఖ్య విషయం : బొంబాయి నుండి వచ్చేటప్పుడు తప్పకుండా "కంద"ను తీసుకునిరండి. ఇక్కడది దొరకదు. కందకు వేడిచేసే స్వభావముంటుంది. కాని చందా మీది నుంచి వచ్చే చల్లని గాలులు ఆ వేడిని హరిస్తాయి.

మధ్యాహ్నం భోజనంతర్వాత కొంచెంసేపు తప్పకుండా పడుకుంటాను. ఎవరైనా అడిగితే మాత్రం అబ్బే నిద్రెక్కడ? ఏదో కొంచెం కునికిపాట్లు పడతానని చెప్తాను. వైద్యులనడిగి సలహా తీసుకున్నా, నాకేమంత రుచింపలేదు. వర్తమాన డాక్టర్లపై వున్న విశ్వాసమే పురాతత్వ శాస్త్ర వేత్తలపైనావున్నది. సాంచీ, అమరావతీ స్థంబాలపైనున్న శిల్పాలు వస్త్రాలు ధరించిన గ్రీకుశిల్పకళా జాడలు చెప్తాయి. భారతీయ బౌద్ధకళ, త్రిపిటక ప్రయాణం ఎందుకు కాదు? చికిత్సకుల దగ్గర తలనొప్పికీ, పొట్టకూ సంబంధాన్ని జోడించి విరోచనాలకు మందు ఇవ్వబడేది. జీవితంలో ఏ తాడనం జరిగినా శిరస్సే వేదనకు గురవుతుంది. అయినప్పటికీ నేను తేలికపాటి నిద్రను, కునికిపాటులను కేవలం ఆరోగ్యం కోసమే దరిచేర్చుకుంటాను.

శరత్‌కాలపు ప్రకాశవంతమైన ఎండ చెఱువుయొక్క నీలి జలంపై వ్యాపించి కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ వున్నాయి. మా వంటవాడు 'దులారా' వగర్చుకుంటూ వచ్చి "ఆ ఇరానీయులు, కాదు కాదు, బెలూచిస్థాన్ వాళ్ళు వచ్చారు" అన్నాడు.

"ఇరానీలేంటి? బెలూచిస్థాన్ వాళ్ళేంటి?" అని అడిగాను.

"వాళ్ళే. పచ్చలూ, నీలాలూ, పగడాలూ, నాణేలూ అమ్ముతారు. తలమీద రుమాలును కట్టుకుని వస్తారు, వాళ్ళొచ్చారు ఇప్పుడు అన్నాడు, ఒకింత గాభరాగా.

నేను వరండాలో కొచ్చాను. ఇరవై ఏళ్ళ యువకుడొకడు, అతనితో పాటు లైలా. మెడలో తోలు బ్యాగ్, వీపు మీదకు వేలాడే వెంట్రుకలు. అద్దకపు బట్టతో చేసిన రుమాలు తలకుకట్టుకునివున్నది.

ఒక విలక్షణ అందమైన చిత్రం ఆమె. లైలా నవ్వుతూ "బాబూ? వెండినాణాలు తీసుకోరా?" అనడిగింది.

"నాణాలా?" అని అడిగాను. "అవును బాబూ. మేమిక్కడే వుంటున్నాం. వీని దగ్గర బంగారు, వెండి నాణాలుంటాయి. వీడి సంచెప్పుడూ ఖాళీగా వుండదు. దొంగసొత్తును కూడా త్వరగా పట్టుకుంటాడు." అన్నది లైలా.

"తీసుకోండి బాబూ మేలిమి బంగారు, వెండి నాణాలున్నాయి. మా దగ్గరున్న ఇతర వస్తువులు కూడా చాలా విలువైనవి. ఒక బాబుగారు తెమ్మంటే తెచ్చాం. ఆయన కనపడలేదు అన్నాడు" లైలాతో వచ్చినతను.

నేను అప్పటివరకూ వాళ్ళ అందమైన కళ్ళను చూస్తూ కూర్చున్నాను. లావణ్యాన్ని చుట్టుకున్న తెల్లని ముఖం మీద కళ్ళు మరింత ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి. సన్నని పొడవైన మెడపైన లక్కచిట్టి లాంటి నోటితో బడబడా మాట్లాడుతున్నాడు.

"నాకు ఏ నాణాలు అక్కర్లేదన్నాను. కాని నా మాటలు ఎక్కడ వినుపించుకుంటున్నారు వాళ్ళు? ఇద్దరూ మెట్లపైకెక్కి కూర్చున్నారు." ఆ ఇద్దరూ తమ తమ బ్యాగులు వెదుకుతున్నారు. కొన్ని పొట్లాలు ఊడదీశారు. ఇంతలో లైలా ముఖం రంగులు మారింది. గాభరగా తమ భాషలో అతనికేదో చెప్పింది. యువకుడు వెంటనే లేచాడు. నాకేం అర్థంకాలేదు. అతడు వెళ్ళిపోయాడు. లైలా వెంటనే చిరునవ్వు నవ్వుతూ బ్యాగులో నుండి ఇంతకు పూర్వమిచ్చిన ఉత్తరాన్నే పైకి తీసింది.

"దాన్ని నేనప్పుడే చదివానని" చెప్పాను.

"దాంట్లో వున్న విషయమేంటో చెప్పలేదు కదా" అన్నది.

"నీ దగ్గర నాణాలు కొనటానికి నేను మరలా వస్తాను అని రాసున్నదని" చెప్పాను.

"ఇంతేనా? దీంట్లో రాసున్న విషయం?"

"ఇంకా కొంతున్నది. అతను రాసిందంతా నేను చెప్పలేను."

"ఫర్వాలేదు చెప్పండి బాబూ, విషయమంతా మీరు చదివారు కదా. నాకు చెప్పండి అన్నది." "నేను నిన్ను ప్రేమిస్తున్నానని అతడు వ్రాశాడు"అన్నాను.

"వ్రాశాడా? బాబూ? అంటూండగానే లైలా కళ్ళలో ఆనంద స్వర్గం కనుపించింది. వెంటనే

పత్రాన్ని మడిచి, నవ్వుతూనే వున్నది. ఇక అతనెప్పుడువస్తాడని అడుగుతుందనుకున్నాను. ఎక్కడకనుపిస్తాడనీ అడగలేదు. ఏమీ అడక్కుండానే ఆ మెట్లమీదే అర్ధనిమీలత నేత్రాలతో ఏదో సుందర స్వప్నాన్ని చూస్తూ, చిరునవ్వు నవ్వుకుంటూ వున్నది.

ఇంతలో వెళ్ళిన యువకుడు తిరిగివచ్చాడు. తన భాషలో గాభరాగా ఆమెతో మాట్లాడాడు. లైలా అదేస్థితిలో వుండి సమాధానమిచ్చింది. ఆ యువకుడు కూడా ఆమె పక్కనే కూర్చున్నాడు.

"మీరు మా 'గుల్'తో కూడా చెప్పండి. ఆ బాబుగారొస్తారు. మా దగ్గర నాణాలుకొంటారని' అన్నది.

ఆ యువకుడి పేరు గుల్ అని నాకర్థమయింది. "అవునవును. మీ దగ్గర కొనటానికి తప్పకుండా వస్తారని" చెప్పాను. గుల్ కూడా సంతుష్టుడయ్యాడు.

నాకు మాత్రం భయమేసింది. నామీదనాకే సందేహం వేసింది. లైలా సౌందర్యవతి. కాని ఆమెలోపలున్నది దైవత్వమా? రాక్షసత్వమా? ఇదేమీ తెలియకుండానేనేం చెప్పగలను? దీని పరిణామం భయంకరంగా వుండొచ్చు. రామేశ్వర్‌ని మిత్రునిగా కాక శత్రువుగా భావించే అధికారం నాకెక్కడిది? చందా దక్షిణపుటొడ్డున సరిగా నా బంగళా ఎదురుగా ఒక పాఠశాలున్నది. ఆ పాఠశాలలో ఒక సత్పురుషుడైన సింహళీయుడు వుంటున్నాడు. ఎక్కడెక్కడి నుండి అతనికి డబ్బందుతుందో తెలియదు. ఇరుగుపొరుగునవున్న పిల్లల్ని పిలిచి కూర్చోపెట్టి చదువు చెప్తాడు. ఇద్దరు ఉపాధ్యాయుల్నీ నియమించాడు. వాళ్ళకు జీతభత్యాలూ ఇస్తున్నాడు. ఆయన నమ్మకమేమిటంటే చందా ఒడ్డునే ఏదో ఒక రోజు తథాగతుని పవిత్ర చరణాల స్పర్శ, గుర్తులు బయటపడతాయన్న నమ్మకంతో ఆయన అన్వేషిస్తూనేవున్నాడు. అతడు చాలా శాంతమూర్తి. నల్లని శరీరం, పొట్టి జుట్టు, తీక్ష్ణ దృష్టి, సింహళీయులకుండే వినమ్రత, మధుర వాక్కును కలిగివుండటం ఆయన లక్షణాలు. అప్పుడప్పుడూ నాకూ నాలుక దురదగా అనిపించి ఆయనతో మాట్లాడటానికి వెళ్తాను. నేటి లైలా సంఘటనతో కొంత వ్యగ్రత కలిగింది. నేను వెళ్ళి నా చిన్ని పడవలో కూర్చున్నాను. ఇంకా గంటా, రెండు గంటల వరకు వెలుతురు వుంటుంది. ఆ ఒడ్డుకు వెళ్ళటానికి పడవలో ఎక్కువసేపేం పట్టదు. ఖర్జూర, కొబ్బరి చెట్లు ఎత్తుగా, ఏపుగా పెరిగి విలక్షణ శోభను కలిగిస్తున్నాయి. ఒక రావిచెట్టు తన పలుచని ఆకుల పచ్చదనాన్ని వ్యాపింపజేసింది. దాని క్రిందనున్న రాతి మీద ప్రజ్ఞాసారథి కూర్చునివున్నాడు. పడవను ఆపుకుని నేను ఆయన దగ్గరగా వెళ్ళాను. అస్తమించే సూర్యుని రంగు రంగుల కిరణాలు అతని ప్రశాంత ముఖం మీద పడుతున్నాయి. తేజోమయమైన అతని ముఖ మండలం చూస్తుంటే ఐదువేల సంవత్సరాల నాటి సంగతులు స్ఫురణకు వస్తున్నాయి. భారత పవిత్రత వేలకోసుల దూరం నుండి ప్రజలకు నిరామయ, నిష్కలంకతలను నేర్పటానికి వారినిక్కడికి ఆహ్వానించింది. మహత్వమైన సాధనయొక్క ఆశీర్వాదం నేడు కూడా ఆధ్యాత్మిక రహస్యాలను రక్షిస్తూనేవున్నది. ఇపుడుకూడా ఇక్కడ బోధివృక్షాలు మొలుస్తూనే వున్నాయి. జీవితపు జటిల ఆవశ్యకతలను త్యజించి కాషాయంకట్టి సంధ్యా సమయపు సూర్యుని రంగులో వాటిని కలిపివేస్తూ, ధ్యానస్థిమిత కన్నులతోవున్న మూర్తులను ఇప్పటికీ చూస్తూనేవున్నాము. అప్పుడే నాకు మన సత్తా పట్ల నమ్మకం వుంటుంది. భారతావని యొక్క

అపూర్వతానుభవం కల్గుతుంది. నా ఉనికిని, నా అధికారాన్ని నేను కూడా త్యాగం చేస్తున్నానా? అభినయిస్తున్నానా? భారత దేశ విజయం ధర్మంలోనే వున్నది. ఆ ధర్మం సనాతనమైనది.

పెదాలపై కొద్దిగానవ్వు. కన్నుల్లో ప్రకాశం నింపుకుని ప్రజ్ఞాసారధి నన్ను చూస్తూ అన్నాడు. "మిమ్మల్ని కలవాలని నేను కూడా ఈరోజే అనుకున్నాను."

"అలాగా? స్వయంగా నేనే వచ్చాను. రాకుంటే మీధ్యానానికి బాధ కలుగుతుంది" అన్నాను నవ్వుతూ.

"శ్రీనాథ్ జీ! నాధ్యానంలో మీరు వస్తారన్న కోరికలేదు. అయినా కూడా ఒక విషయం గురించి ఈ రోజు మీతో మాట్లాడేపనుంది."

"నేను కూడా కొంచెం మాట్లాడాలనే ఇక్కడికొచ్చాను. ముందు నేను చెప్పేదా? మీరు ప్రారంభిస్తారా?"

"సధియాకొడుకు కల్లూ విషయంలో మీకేం చెప్పలేదు కదా? నేను ఎంతో నచ్చచెప్పిన మీదట ఆ నిమ్నజాతుల వారు వాడిని చదివించటానికి నాపాఠశాలకు పంపారు. కాని వాడి పోషణ భారం నుంచి వాళ్ళు పూర్తిగా తప్పుకున్నారు. వాడికిప్పుడు ఏడేళ్ళు. ఆహారాన్ని బాగానే తీసుకుంటున్నాడు. శుభ్రంగానూ వుంటున్నాడు. కొంచెం, కొంచెం చదువుతున్నాడు కూడా" అని ప్రజ్ఞాసారధి చెప్పాడు.

"కానివ్వండి. మంచే జరిగింది. వాడికీ దారి దొరకటం వాడి అదృష్టం. నేనేమో ఇలాంటి ఇంటి, కుటుంబ బంధనాల పట్ల విరక్తుడ్ని అయినా కూడా తెలియకుండానే కల్లూని గురించి ఆలోచిస్తూవుంటాను."

"అలాచేస్తే మంచిదే. మీరు ఈ కృత్రిమ వైరాగ్యం నుండి బయటపడండి. ఏదైనా పనిలో మనస్సును లగ్నం చెయ్యండి. నేను కూడా మా దేశం వెళ్ళాలనుకుంటున్నాను. పాఠశాల బాధ్యత మీరు వహించండి." అని చెప్తూ ప్రజ్ఞాసారధి నావంక గంభీరంగా చూడసాగాడు.

నా మనసులో అలజడి మొదలైంది. నేనొక సామాన్య మానవుణ్ణి. ఏ విషయం మీదనైనా గంభీరతను అభినయిస్తాను. అది కొంచెం సేపటివరకే వుంటుంది. అంతవరకే నా అభ్యాసమంతా. పనిచేయటం, ఏదైనా బాధ్యతను నెత్తినవేసుకోవటం అసంభవం. అందుకే నేను నిశ్శబ్దం అయిపోయాను. ఆయన నావంక చూస్తూనే వున్నాడు. ఏదైనా ఉపాయంతో నేనా బాద్యత నుంచి తప్పించుకోవాలని చూస్తున్నాను. కొంచెంసేపు నిశ్శబ్దంగా వున్నా అవుననో, కాదనో ఆయనకు సమాధానం చెప్పాలి. కాదని చెప్తే వివాహమాడాలనుకుంటున్న ప్రజ్ఞాసారధి సరసాలాపాన్ని బాధించటమే అవుతుంది.

మీరు విరక్త భిక్షువులు. ఇప్పుడు ఇంటికి వెళ్ళాల్సిన అవసరమేమున్నది? అన్నాను.

"విరక్తభిక్షువా? ప్రజ్ఞాసారధి ఆశ్చర్యంగా అన్నాడు. నేను బ్రహ్మచర్యంలోవున్నాను. విద్యాభ్యాసం మరియు ధర్మాచరణలో వున్నాను. నేను కోరుకుంటే సన్యాసాశ్రమం తీసుకోగలను. కాని నేనిపుడు

గృహస్థునైతే ధర్మానికి వచ్చిన ఆపద ఏమీ లేదు. సింహళంలో ఇదే పద్ధతి వాడుకలో వున్నది. నా ఉద్దేశ్యంలో ఇదే ప్రాచీన ఆర్షనీతి కూడా. నేను గృహస్థ జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాను."

"మీరు పెండ్లి చేసుకోబోతున్నారా?" మరలా ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకు చేసుకోగూడదు? ఇపుడు అదే పని మీద సింహళం వెళ్ళబోతున్నాను." అన్నాడు.

"స్త్రీలపట్ల మీకు పరిపూర్ణ విశ్వాసమున్నది. ఆ విషయం నేను గ్రహించానన్నాను."

"అవిశ్వాసం, చూపించటానికి తగిన కారణమేమున్నది? చరిత్రలోను, కొన్ని కథల్లోనూ కొంతమంది స్త్రీ, పురుషుల దుష్టచరిత్రలు చదివి నాపైన, కాబోయే నా భార్యపట్ల అవిశ్వాసం ప్రకటించటానికి నాకేమధికారమున్నది? ప్రతివ్యక్తీ తన్ను, తాను పరీక్షించుకోవాలి." అన్నాడు.

"వైవాహిక జీవితం సుఖంగా వుంటుందా?" అని నేనడిగాను.

"ఏదైనా పని చేసే ముందు దాంట్లో సుఖాన్ని వెదకటం అంత అవసరమా? సుఖమనేది దర్మాచరణలోనే లభిస్తుంది. అన్యధా ప్రపంచమంతా దుఃఖమయమే అవుతుంది. ప్రపంచపు పనులను ధార్మికతతోపాటు చేయటంలో సుఖమే వున్నదన్న భావముంటుంది."

"కాని పెళ్ళి వంటి పని వలన సాధారణ స్త్రీతోనే సంబంధముంటుంది. స్త్రీ అంటే ఎంత విచిత్రమైన చిక్కు ప్రశ్న? దీనిని తెలుసుకోవటం సామాన్యం కాదు. తెలుసుకోకుండా ఆమెతో సంబంధం కలుపుకోవటం ఎంత పెద్ద పొరపాటు? బ్రహ్మచారీజీ! బాగా ఆలోచించుకోండి అంటూ" నేను నవ్వాను.

"శ్రీనాథ్‌జీ! మీరు బాగా తెలివైన వారు. కాని నా ఉద్దేశ్యంలో సంబంధం కలుపుకోకుండా పరీక్షించటం సాధ్యం కాదని, దీనికి మరే ఉపాయం లేదని నమ్ముతున్నానని" చాలా గంభీరంగా అన్నాడు.

నేను నిశ్శబ్దంగా ఆలోచింపసాగాను. ఇప్పుడిప్పుడే నేనొక కాందపు బీజాన్ని నాటాను. అది లైలా స్వభావంతో పరిచయమయ్యి అలా చేశాను. నా మూర్ఖత్వం పట్ల లోపల్లోపలే ఒత్తిడి పడసాగాను.

లైలా ప్రతిహింసకోరే ఒక భయంకర రాక్షసి. ఒక వేళ ఆమె తన జాతి స్వభావానుసారంగా రామేశ్వర్ పట్ల ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటే ఏం జరుగుతుంది?

"నేను వెళ్ళటం ఖాయమే. తామ్రపర్ణి తరంగమాలలు నన్ను రా, రమ్మని ఆహ్వానిస్తున్నాయి. మీరప్పుడప్పుడూ వచ్చి ఈ పాఠశాల బాగోగులు చూడాలన్నదే నా ప్రార్ధన" అన్నాడు ప్రజ్ఞాసారథి.

"నాకు ఒక విషయంలో కొంత వత్తిడివున్నది. తీరి కూర్చుని ఒక వివాదంలో చిక్కుకున్నాను. కొన్నాళ్ళ పాటు ఆ విషయంపై శ్రద్ధ పెట్టాల్సి వుంటుంది" అన్నాను.

అదేమిటో నాకు చెప్పండని ప్రజ్ఞాసారథి అడిగాడు.

లైలా ఉత్తరం చదవటం, ఆ తర్వాతి కథంతా విన్పించాను.

ప్రజ్ఞాసారథి మొదట నిశ్శబ్దంగా వుండి ఆ తర్వాత “ఈ పని చేయటంలో వున్న ఆవశ్యకత పై మీరు ధ్యాసపెట్టలేదు. తరువాత దీని ఫలితం అనుభవించబోయేది మీరే” అంటూ వ్యంగ్యంగా మాట్లాడాడు.

ఈ వ్యంగ్యం నాకసలు నచ్చలేదు. “ఆ ఫలితమేదో అనుభవించటానికి నేను సిద్ధపడేవున్నానని” చెప్పాను.

“సోదరా! శ్రీనాథ్! ప్రపంచంలో చాలా మంది ఇటువంటి పనులు చేయవలసి వస్తుందని కలలో కూడా వూహించరు. అకస్మాత్తుగా ఆ విషయాలు ఎదుర్కోవలసివస్తుంది. అవి గర్జిస్తూ వుంటాయి. దీన్నించి పారిపోయి ప్రాణం రక్షించుకోవాలని అతనికుంటుంది. నేను కూడా ఇదే విధంగా పెండ్లి చేసుకోవాలని సింహళం వెళ్తున్నాను” అన్నాడు.

చీకటిని పారద్రోలుతూ శరత్కాల చంద్రుడు కొబ్బరి, ఖర్జూర చెట్ల మధ్య నుండి కనపడసాగాడు. చందా సరోవరం ప్రసన్నంగా వున్నది. నేను క్షణం పాటు ఆ ప్రకృతి సౌందర్యాన్ని తన్మయుడనై చూడసాగాను. కల్లూ వచ్చి ప్రజ్ఞాసారథిని భోజనం చెయ్యమని హెచ్చరిస్తే నాకపుడు గుర్తొచ్చింది. నేను అవతలి ఒడ్డుకు వెళ్ళాలని. మరుసటి రోజు వస్తానని చెప్పి ప్రజ్ఞా సారథి దగ్గర శెలవు తీసుకుని వచ్చేశాను. నా పడవలో కూర్చుని నేను నెమ్మదిగా గడవెయ్యసాగాను.

అన్యమనస్కంగా గడవేస్తూ ఒకసారి చంద్రుణ్ణి మరోసారి చందా సరోవరాన్ని చూస్తున్నాను. పడవ నింపాదిగానే వెడుతున్నది. మాటిమాటికీ సింహళ దేశపువాడైన ప్రజ్ఞాసారథే ఆలోచనల్లోకి వస్తున్నాడు. తిరిగి వెనక్కు చూశాను. ఒడ్డంతా వ్యాపించియున్న పాఠశాలాభవనం చందా శుభ్రజలాల్లో ప్రతిబింబిస్తూ వున్నది. చందా యొక్క అవతలి ఒడ్డు సముద్రపు ఒడ్డుయొక్క పాయే. మనసులో పరిపరివిధాల ఆలోచనలు. నేను పాఠశాల బాగోగులను చూస్తే అందులో నాకు కలిగే హాని ఏముంది? మనస్సుకు హాయిగా వుంటుంది. కాలక్షేపమూ బాగా అవుతుంది అనిపించింది.

ఎదురుగా ఇప్పచెట్టు నీలాకృతి కనుపించింది. మరలా లైలా గుర్తుకొచ్చింది. ఎంతో సరళంగా, స్వతంత్రంగా, సాహసోపేతంగా వున్న స్త్రీ ఆమె. ఆ అందమైన కళ్ళలో ఎంత నిషా వున్నది? మాదక ద్రవ్యాలకన్నా మిన్నగా రామేశ్వర్‌ను ఆకర్షించింది. ఆకర్షణా ప్రక్రియలో అతను అసమర్థుడు. ఆ సమయంలో రామేశ్వర్‌పై కోపం వచ్చింది. లైలా చుట్టూ తన ఆలోచనలేమిటని తనపై తనకే విసుగు కలిగింది. ఒడ్డు దగ్గరకొచ్చేశాను. ఇప్పచెట్టు వైపుకు పడవను తిప్పబోయాను. ఆ ప్రశాంత జలాల్లో రెండు శిరస్సులు ఈదుతూ కనుపించాయి. శరత్‌కాలపు శీతలరాత్రిలో అలా ఈదేవాళ్ళను చూచి చాలా ఆశ్చర్యం కలిగింది. వెన్నెల వెలుగులో అది లైలా సుందరముఖమని తెలిసింది. కలువలాగా వికసించి నిండు వెన్నెలలో నవ్వుతున్న లైలా ముఖం,‘లైలా’ అని పిలిచాను.

ఆమె మాట్లాడేలోగానే ఆమెతో పాటున్న ముఖం గుర్రుగా చూసింది. బహుశా రెండవ వ్యక్తి గుల్

అయి వుంటాడేమో అనుకున్నాను. కాని

"బాబూజీ! నిశ్శబ్దంగా వుండండి" అని లైలా నన్ను మాట్లాడకుండా నిరోధించింది. నేను పరీక్షగా చూస్తే అదొక ఆరోగ్యవంతమైన కుక్క అని తెలిసింది. అది లైలాతో పాటు ఈత కొడుతున్నది.

"బాబూజీ! మీరిక్కడేంటి? ఈ సమయంలో అన్నది. నా చిన్న పడవకు ఒక వైపు లైలా చెయ్యి వుంటే మరొకవైపు ఆ కుక్క రెండు ముందటి కాళ్ళు. "కాసేపు చల్లగాలిలో తిరగటానికొచ్చాను. అయినా లైలా! నువ్వు రాత్రి పూట ఈత కొడతావా?" అనడిగాను.

రోజంతా పనిచేసిన తర్వాత ఇప్పుడే విశ్రాంతి దొరికింది. శరీరం చల్లదనం కోరుకుంటున్నది. అందుకే ఇలావచ్చాను" అన్నది.

అదొక అద్భుత దృశ్యం. ఇన్ని రోజుల వరకూ జీవితంలో పగటి పూటలే గడిపివున్నాను. అనేక సందర్భాలలో, అనేక విచిత్ర సంఘటనల వలన ఎన్నో మనోరంజకతలు లభించినవి. కాని ఇలాంటి దృశ్యం నేనెప్పుడూ చూడలేదు.

"ఇవాళ రాత్రి చాలా చల్లగా వుంది లైలా" అన్నాను.

"లేదు లేదు. నాకు చాలా వేడిగా వున్నది" అంటూ ఆమె, ఆమె కుక్క నా పడవకు దారిచ్చారు. వాళ్ళిద్దరూ ఈదుతూనే వున్నారు. నేను నా బంగళావైపుకు పడవను పోనిచ్చి ఒడ్డుకువచ్చాను. అక్కడ మా 'దులారా' నిలబడి వున్నాడు. "ఎంతసేపట్నుంచీ ఇక్కడ కాచుకుని వున్నావని' అడిగాను.

"మీరీ రోజు చాలా ఆలస్యం చేశారు. వంటంతా చల్లారి పోతుంది. అందుకనే ఇక్కడ మీ కోసం కాచుకునివున్నా" నన్నాడు.

పడవ దిగి బంగళాలోకి వెళ్తూ ఆలోచించసాగాను. నేను ఎందుకాలస్యం చేశానో తెలుసుకోవటానికే దులారా అక్కడికొచ్చుంటాడు. నేను లైలాతో మాట్లాడటం అతను తప్పకుండా గమనించేవుంటాడు. నాపై దులారాకు ఏమైనా అనుమానమొచ్చిందా? అలాసందేహపడి అతను కొంత సంతోషపడివుంటాడు.

అలవాటు ప్రకారం శరీరం తన పనులు తాను చేసుకునిపోతుంది. కాని నిద్రలో కూడా అవే విషయాలు కలలోకి వస్తున్నాయి.

ఈ రోజు నిద్రలేవటంలో చాలా ఆలస్యమైంది. బద్ధకంగా వుండి ఎక్కడికీ వెళ్ళి తిరగాలనిపించలేదు. ఇంట్లోనే తిష్ఠ వేసుకుని కూర్చున్నాను. రాత్రి సంఘటనే కళ్ళముందు కనపడుతున్నది. నేను లక్ష నివారణా ప్రయత్నాలు చేసినా ఇటు లైలా, అటు సింహళ భిక్షువు ఇద్దరూ కలిసి నా హృదయాన్ని ప్రేమ దర్బారుగా మార్చివేశారు. నేను వాటిపట్ల విరక్తుడనయ్యి ఆ ఆలోచనలు తెగ్గొట్టేప్రయత్నం చేయసాగాను. అసావేరి గంభీర ఆలాపనలో మరలా లైలా ప్రేమపూర్ణ ఆకృతే తయారవుతున్నది. కలలవేణువునూదటం ఆపేసి

విశ్రాంతిగా వుండాలనుకున్నాను. కళ్ళు తెరిచి చూసే సరికి ప్రజ్ఞాసారథి ఎదురుగా నిలబడివున్నాడు.

“కూర్చోండి. పొరపాటున ఇటు వచ్చినట్లున్నారన్నాను.”

నేనేదో చనువుగా ఆ మాట అనేశాను. ఎందుకంటే ఆయన బహుశా ఇటు రావాలనే వచ్చినట్లున్నారు.

ఆయన నవ్వుతూ “పొరపాటున రాలేదు కారణముండేవచ్చాను. నేను చెప్పిన విషయం ఏం ఆలోచించారు?” అన్నాడు నేను అయోమయస్థితిలో వుండి “ఏ విషయాన్ని గురించి” అన్నాను.

“పాఠశాలను పర్యవేక్షించాలని చెప్పాగదా మీతో” అన్నాడు.

నేను విషయాన్ని ఎలాగైనా దాటవెయ్యాలనే ఊహలోనే వున్నాను. “మీరైతే బాగా ఆలోచించి పనిచేస్తారు. పనిలో అపారనమ్మకం వుంది మీకు. మనుష్యుడు బహుశాకోరిక లేకపోయినా చాలా పనులు చేయాల్సి వుంటుందని నేననుకుంటున్నాను. మీరు చెప్పిన దానిని గురించి పెద్దగా ఆలోచించవలసింది ఏమీ లేదు. అవసరం వచ్చినప్పుడు చూసుకుందామని నా ఉద్దేశ్యం” అన్నాను.

“నేను చెప్పిన మాటల్ని మీకనుకూలంగా మలుచుకుని అర్థాలు చెప్పకండి. మీ పద్ధతిలో ఆలోచించే స్వేచ్ఛ మీకుంది. కాని వాటికి క్రియాత్మక రూపం ఇచ్చే సమయంలో మీ స్వేచ్ఛలో నా విశ్వాసం సందిగ్ధమవుతుంది. బహుశా మనమే మనుకొని ఏంచేస్తున్నామోనని కూడా బాధ్యతల్నుంచి తప్పుకోలేము. లైలా హృదయంలో ఒక దురాశనుత్పన్నం చేసి మీరు రామేశ్వర్ జీవితంలో ఒక ఇబ్బందిని కల్గించారు. ఈ సంఘటన సాధారణమైంది కాదు. చూస్తూ వుండండి. ఏదో ఒక ఉపద్రవాన్నే సృష్టిస్తుంది. మీ మిత్రుడు తనకిబ్బంది కల్గించినవారిని గుర్తింపకపోవచ్చు. కాని మీ మనసులో మాత్రం అపరాధినని మీరు బాధపడుతూనే వుంటారుగదా?” అన్నాడు.

ప్రజ్ఞాసారథి మాటలు నాకసహ్యంగా అనిపించాయి. ఆ సమయంలో ఆయన రావటం, నాకుపదేశం ఇవ్వటం కపటనాటకపు మాటలు మాట్లాడటం చాలా చిరాగ్గా అనిపించాయి. అతను ఏదో ఒక విధంగా ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవటమే ఇప్పుడు నాక్కావాలి. అయినా కూడా అతనికి సమాధానం చాలా వివరంగా ఇవ్వాల్సివచ్చింది. “మీరు అస్తవ్యస్త అదృష్టవాదులంటాను ప్రజ్ఞాసారథి గారూ! నేను పనులకు తగ్గట్టుగానే పరిష్కారాన్నీ ఆలోచిస్తాను. నేరం చెయ్యటంలోనూ, శిక్ష వెయ్యటంలోనూ మనుష్యుడు ఒకదానికొకటి సహాయకారి అవుతాడు. ఏదో చెడు చేసిన వానికే హానికాని, కష్టం కాని కలిగిస్తాం. అతని అపరాధానికి వేసే శిక్ష సమాజ వ్యవస్థ నియమానుసారంగానే వేస్తున్నాను. ఇలా శిక్షించటం అపరాధమయితే ఆ ఫలితం కూడా నేనే అనుభవిస్తాను.” అన్నాను.

ఇదంతా విని అతను చిరునవ్వు నవ్వాడు. “నేను మీ శిక్షావ్యవస్థను పరిశీలించటానికే వచ్చాను. మీరు మాది వ్యర్థజీవితమనుకుంటారు శ్రీనాథ్‌జీ. దాన్ని నా వెట్టిచాకిరిలో కలిపెయ్యండి. మీ మాటల తూటాలు వదలటానికే మూడురోజులు బాగా ఆలోచించండని మీకు చెప్పాను శెలవు అంటూ” అతను

వెళ్ళిపోయాడు.

నా స్వేచ్ఛా జీవితంలో అమ్మ చనిపోయిన తర్వాత ఇది నాకు కలిగిన రెండవ కుదుపు. ఇన్ని రోజుల్నుంచి నిశ్చింతగా బతికేస్తున్నాను. నా నిరాశాపూరిత జీవితంలో ఉల్లాసపు తునకైనా లేదన్న విషయం నా హృదయపు స్పర్శకు తెలిసి ఆ బాధనన్ను స్పృశిస్తూనేవున్నది. ఆలోచించిన కొద్దీ నిశ్చింతకూ, నిరాశకూ మధ్య బేధం, నా సోమరి జీవితపు క్రియాత్మక ప్రతిధ్వని. నా నిష్క్రియా స్వభావం, వ్యంగ్యంగా చిరునవ్వులు చిందిస్తూనేవున్నది. ప్రజ్ఞాసారధి చెప్పినట్లుగా మూడు రోజులు ఆలోచించాను. అతనే గెలిచాడు. ఎందుకంటే నా ఆలోచనలకన్నా, వచ్చే మంచి పేరు కోసం ఒప్పుకున్నాను. నా మనస్సునూ దృఢపరచుకున్నాను.

“అతిధులు వస్తే మీకసౌకర్యంగా వుంటుంది. పనులు పూర్తవ్వవు. వాళ్ళు వెళ్ళినతర్వాత మీరు మీ ఇంటికి తిరిగి వెళ్ళవచ్చు. మీరిప్పుడే నా దగ్గరకు వచ్చేస్తే ఇక్కడి విషయాలన్నీ మీకర్ధమవుతాయి అంటూ ప్రజ్ఞాసారధి నన్ను ఒప్పించే ప్రయత్నం చేయసాగాడు.

“నాకసౌకర్యం కల్గుతుందనేది మీ భ్రమ” అన్నా అతను విన్పించుకోలేదు.

“మీ మిత్రులున్నా ఇక్కడ పాఠశాలలో చోటు సరిపోతుంది. నేనూ సంతోషిస్తాను. పాఠశాల మొత్తం మీ అధీనంలో వుంటుంది. భిక్షువులు వుండటానికి సంఘారామవిభాగం వేరేవున్నది. అందులో కొన్ని గదులపని మిగిలివున్నది. దానిని వెంటనే పూర్తి చేయిస్తాను. పాఠశాల ఆదాయ, వ్యయ లెక్కలన్నీ పక్కాగానే తయారుచేయించాను. మీరీ పాఠశాలకు జీవితాంతం వేతనం లేని అధ్యక్షులుగా వుంటారు. ఇందులో ఎవరూ జోక్యం చేసుకోవటానికి ఏ అధికారమూ వుండదు” అన్నాడు స్పష్టంగా.

ఆయువక బౌద్ధుని వాక్చాతుర్యం చూసి నేను చకితుడయ్యాను. ఆ సింహళీయునకు ఇంతటి బుద్ధి కుశలతా? అన్న ఏవగింపూ వచ్చింది.

ఈ విషయాలు అసమ్మతిగానే వున్నాయి. అయినా “మీకు నేను జీవితాంతం ఈ పాఠశాలను సజావుగా నడిపిస్తానన్న నమ్మకముందా?” అనడిగాను.

మనలోని శక్తిని పరీక్షించే భారం ఇతరుల మీదే వుంటుంది. ఒకవేళ మీ శక్తి సామర్థ్యాలు నా అనుభవంలోకి వస్తే ఆశ్చర్యపడాల్సింది ఏమీలేదు. ధార్మికుడు విశ్వాసం కలిగివుంటాడని మీకు తెలుసు. సూక్ష్మరూపంలో ఏ కళ్యాణజ్యోతి మానవతలో అతర్నిహితమైవుంటుందో నేను దానిలో అధిక శ్రద్ధ పెడతాను. మార్గాలు భిన్నమయినా అలాంటివారే సత్పురుషులై మనుష్యుల్ని క్రమశిక్షణలో వుంచగలుగుతారు. వాళ్ళలో పశుత్వం ప్రబలదు.” అన్నాడు.

ప్రజ్ఞాసారధి కన్నుల్లో తీవ్ర సంయమన జ్యోతి వెలగటం కనుపించింది. నేనిక వాదానికి దిగకుండా, ”అంతా మీ ఇష్టప్రకారమే జరుగుతుందిలెండి”అని చెప్పి లేచి వచ్చేశాను. ఇంటివైపు వెళ్తూండగా అకస్మాత్తుగా, దులారా పరిగెత్తివస్తూ కనపడ్డాడు. “ఏమైందని” అడిగాను.

"గుర్రపు బండిలో చాలా మంది వచ్చారు. వాళ్ళు మిమ్మల్ని అడుగుతున్నారని" వగరుస్తూ చెప్పాడు.

"రామేశ్వర్ వచ్చాడని అర్థమయింది. "దులారా! నీవు పరుగెత్తికెళ్ళి వాళ్ళను సామానుతో సహా ఇక్కడికే తీసుకొనిరా. నేనిక్కడే నిలబడివుంటానని" చెప్పాను. దులారా బంగళావైపు పరుగెత్తాడు. నేనక్కడే వున్నాను. మనసులో తుఫాను రేగసాగింది. రామేశ్వర్ వచ్చాడు. ఆ ఇరానీ స్త్రీ కూడా ఇక్కడే వున్నది. నేను చాలా మూర్ఖపు పనిచేశాను. కాని రామేశ్వర్ నా బంగ్లాలో వుండటం లేదు. ఈ బౌద్ధ పాఠశాల వైపుకు లైలా రాదు. అని నాకు నేను ధైర్యం చెప్పుకున్నాను. ఏ దైవ ప్రేరణతోనైనా లైలా ఇక్కడికొస్తే అపుడు నా పరిస్థితి ఏమిటి? ఆలోచిస్తుంటే తలగిర్రున తిరుగుతుంది. లైలా అమాయకంగా ప్రవహించే సెలయేరులాంటిది. పడమటి వైపుకు సరసరమంటూ వీచే వాయుతరంగమాల. ఆమెను ఆపటం ఎవరికి సాధ్యం? రామేశ్వర్‌తోపాటు అతని భార్యా, పిల్లలున్నారు. నా మూర్ఖత్వంతో వీళ్ళ కేం జరగబోతుంది అనుకుంటుంటే ఊపిరి ఆడనట్లుగా అవుతుంది. లేచినిలబడి సెలయేటి వంక చూస్తుంటే దానిమీద పడ్డ సూర్యకిరణాలు ప్రతిబింబించి మిరుమిట్లుగొలుపుతున్నాయి. ఒక్కసారిగా కళ్ళు మూసుకున్నాను. ఇంకే ఆలోచనా చేయలేకపోతున్నాను. టక, టకమనే బండి చప్పుడుతో జాగృతావస్థలోకి వచ్చాను. రామేశ్వర్ గుఱ్ఱపుబండి పరదా తొలిగించుకొని అక్కడే రోడ్డు మీదే బండిదిగుతున్నారు. నేను దగ్గరగా వెళ్ళి ఆలింగనం చేసుకున్నాను. మీరు బండిలో కూర్చొనండి. నేను కూడా వస్తానని చెప్పినా అతను వినకుండా బండి పోనిమ్మని బండి వాడితో చెప్పి నాతోపాటు, నడవసాగాడు. పాఠశాల ప్రాంగణంలోనే ప్రజ్ఞాసారథి స్వాగతం చెప్పటానికి నిలబడి లోలోపల నవ్వులు పూయించుకుంటున్నాడు. రెండు రోజులు సరదాగా గడిచిపోయినవి. ఇంటి మొత్తం మూలమూలల్లో కూడా అవసరమైన వస్తువులు వచ్చి చేరాయి. ప్రజ్ఞాసారది మాతో సమానంగా మెలిగాడు. అన్నిటికంటే ఆశ్చర్యంగా నాకు రామేశ్వర్ భార్య మాలతిని చూస్తే కలిగింది. సంపూర్ణ గృహిణిలాగానే ఇక్కడా అంతా సిద్ధం చేసింది. మాలతి ఆరోగ్యకరమైన యువతి. దూరాన్నుంచి చూస్తే మాత్రం తన చిన్న ఆకృతి మూలాన ఒక బాలికలాగా కన్పడుతుంది. ఆమె ముగ్గురు పిల్లలూ చాలా అందంగా వున్నారు. మిన్నా వయస్సు ఆరేళ్ళు, రంజన్‌కునాలుగేళ్ళు, కమలకు రెండేళ్ళు. కమల నిజంగా ఒక బొమ్మే. కల్లూ, కమల ఇద్దరూ బాగా కలసిపోయి ఒకరివెంటే ఇంకొకరుంటున్నారు.

ఒక ప్రాణి స్నేహంతోనే పుడుతుందా? అని నాకు సందేహం కలిగింది. అజ్ఞాత ప్రదేశాలలోకి వచ్చి అతడే ప్రపంచంలో జన్మిస్తున్నాడు. మరలా తన కొరకు స్నేహమయ సంబంధాన్ని తయారుచేసుకుంటున్నాడు. కాని నేనెల్లపుడూ చెడుకు దూరంగానే వుంటాను. ఇది అదృష్టమో, దురదృష్టమో తెలియదు.

రామేశ్వర్ పట్ల నా హృదయంలో చాలా గొప్ప స్నేహబంధముంది. ఎంత స్నేహమంటే ఒక నిమిషం కూడా అతన్ని వదలాలని లేనంత. ఇపుడు మేమంతా కలసి భోంచేస్తున్నాం. కలిసే షికారుకెడుతున్నాం. చెప్పుకునే కబుర్లకయితే అంతే లేదు. కల్లూ, పిల్లలు ముగ్గుర్నీ సంతోషపెడుతున్నాడు. మా దులారా అందరికీ తిండీ తిప్పల ఏర్పాట్లు చూస్తున్నాడు. రామేశ్వర్, నేనూ కబుర్లలో మునిగిపోతే

మాలతిమాత్రం మౌనంగా వింటూ కూర్చునేది. ఎప్పుడైనా మధ్యలో కల్పించుకుని మంచి మంచి మాటలు మధురంగా  పలికేది.

ప్రజ్ఞాసారధికయితే ఒక పాఠశాలే దొరికినట్లుగా వుంది. గృహస్థ జీవనానికి కావల్సిన విషయాలను గ్రహించుకుంటున్నాడు.

ఒక రోజు నేను వీధిలో నుండి ఒంటరిగా ఇంటికొస్తున్నాను. బంగ్లా దగ్గర్లోకి రాగానే లైలా నాక్కనుపించింది. ఆమె తన గుఱ్ఱంపై స్వారీ చేస్తున్నది. ఏం చేస్తున్నదీమె అనుకుంటూ ఒక క్షణం ఆలోచించాను. గుఱ్ఱం దిగి నా దగ్గరకు వచ్చింది. "బాబూజీ! మీరెక్కడికైనా వెళ్ళారా ఈ మధ్య" అనడిగింది. "అవును". వెళ్ళానన్నాను.

"ఇపుడు మీరు మీ బంగ్లాలో వుండటం లేదు కదా?" అనడిగింది.

"నేను నీకొక విషయం చెప్పాలనుకుంటున్నాను." అన్నాను గాభరాగా

"ఏంటది?  బాబూజీ!"

"ఆ ఉత్తరం సంగతి" అంటూ నసిగాను.

"అది నా దగ్గరే వున్నది. ఎందుకు?" అనడిగింది.

"నేను నీకు కొంత అబద్ధం చెప్పాను" అన్నాను.

"అబద్ధమా?" అంటుంటే లైలా కళ్ళలో మెరుపులు మెరవటం ప్రారంభమైంది.

"అవును లైలా. అందులో రామేశ్వర్" "నాకు నీ అవసరం లేదు. నాకు భార్యాపిల్లలున్నారని వ్రాశాడు."

"నువ్వు అబద్ధాలకోరువి. మోసగాడివి అంటూ లైలా తన చిన్న కత్తి వంక చూసుకుంటూ పళ్ళు పటపటలాడించసాగింది.

"ఇందులో నా తప్పు" అంటూ చెప్పబోయాను.

"నీవు నామనస్సునే ఎగతాళి చేశావు. ఇటువంటి విషయముందని నాకు కొంచెం కూడా చెప్పలేదు." అంటూ అక్కడే కూర్చుని ఏడ్వసాగింది.

ఏదో పెద్ద ముప్పే రాబోతుందని నాకర్థమైంది. ఎవరైనా నన్నిక్కడ ఈ పరిస్థితిలో చూస్తే ఏమనుకుంటారు? నేనిక్కడ నుంచి వెంటనే వెళ్ళిపోవాలని భావించాను. కాని లైలా నీళ్ళు నిండిన కళ్ళతో నా వంక చూస్తూ నీవు, నేనునగుబాటు అయ్యే విషయాన్ని వినిపించావు. ఇది నాకు చాలా పెద్ద విషయం.

ఇపుడు నాకెంత కోపం వస్తున్నదంటే నేను నిన్నైనా చంపాలి. లేదా నేనైనా పొడుచుకుని చావాలి అంటూ పళ్ళు నూరింది. ప్రాణ భయంతో కాదు కాని. లైలా అదృష్టంపట్ల నేనెంత మూర్ఖంగా ప్రవర్తించానో గదా అని నాలో వణుకు మొదలైంది. "లైలా! నేను నీ మనసును గాయపరిచాను. అందుకు నేను చాలా బాధపడుతున్నాను. నువ్వీ సంగతి మర్చిపో" అన్నాను.

"నువ్వు మర్చిపోతావేమో కాని నేను మర్చిపోను. నిన్ను చంపేస్తాను" అంటుంటే ఆమె కన్నుల్లో జ్వాలలు ఎగిసిపడతున్నాయి.

"ఎవర్ని లైలా చంపేది నన్నా?" అన్నాను.

లైలా దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ "నన్ను మరలా" అంటూ ఆగిపోయింది.

"నువ్వలా చేయలేవు. ఇంకా వివరంగా నేను చెప్పే సాహసం చేయలేను లైలా" అన్నాను.

"ఆ వేగంగా వీచే గాలితో మెరుపులు మెరుస్తాయి, మంచూ పడుతుంది. పెద్ద పెద్ద చెట్లూ పడిపోతాయి. మా లాంటి వాళ్ళ ఇళ్ళూ ఎగిరిపోతాయి" అన్నది.

"తుఫానేగా" అని నేనన్నాను.

"అవును. ఆ తుఫానే ఇపుడు నాలో రేగుతుంది" అంటూ లైలా తన ఛాతీమీద చేయుంచుకున్నది.

"లైలా!" అంటూ నీరసంగా పిలిచాను.

ఎంతో వ్యాకులతతో నా వంక చూస్తూ "నేను అతన్ని ఒకసారి చూడాలనుకుంటున్నాను." అన్నది.

"నేను అతణ్ణి నీకు చూపిస్తాను. కాని నీవు అతనికే హానీ తలపెట్టకూడదు." అన్నాను.

"హుష్." అంటూ తన నల్లని కళ్ళెత్తి నా వంక చూసింది.

"మంచిది లైలా అతణ్ణి చూపిస్తాను" అని హామీ ఇచ్చాను.

"రేపిక్కడే కలుస్తానని చెప్పి తన గుఱ్ఱమెక్కివెళ్ళిపోయింది. లైలా మనసెరిగిన దానిలా గుఱ్రం కూడా, నెమ్మదిగా నడవసాగింది. లైలా వంగిపోయిన దానిలాగా దానిమీద కూర్చున్నది.

అక్కడే కాసేపు నిలబడి అయిష్టంగానే పాఠశాల వైపుకు వెళ్ళాను. ప్రజ్ఞాసారధి ఎప్పట్లాగే చెట్టు క్రిందిరాతి మీద కూర్చునివున్నాడు. మిన్నా అతడి దగ్గరే వున్నాడు. ప్రజ్ఞాసారధి దరహాసం మరింత ఉ దారంగా కనపడుతున్నది. పిల్లలముద్దు మురిపాలు అతని జీవితంలో కోరుకున్న పరివర్తన అందించాయి. కాని నేను?

మర్నాడు లైలాను కలవటానికి వెళ్ళాను. అప్పటికే ఆమె అక్కడ వున్నది. నిరాశా, ఉదాసీనత

కలిసి ఆమె ముఖం ఈ రోజు మరింత పచ్చగావున్నది. మా ఇద్దరికీ నవ్వుతో పలకరింపులు లేవు.

"రేపెక్కడకు వెళ్ళి అతన్ని కలుసుకోవాలి? లోగడ నేను సూరత్‌లో అతన్ని కలిశాను. తర్వాత, అతడేనాకు ఉత్తరం వ్రాశాడు. ఇప్పుడెక్కడకు వెళ్ళి కలవాలి" అన్నది మళ్ళీ.

నేను విభ్రాంతుడనయ్యాను. లైలాకు ఎంతో విశ్వాసం. సూరత్, బొంబాయి, కాశ్మీర్ ఆమెను ఎక్కడికైనా తీసుకెళ్ళి రామేశ్వర్‌ని చూపిస్తానని. నేను చేసిన పనికి ఆమె ఈ శిక్ష విధించింది.

లైలా మరలా చెప్పసాగింది "నేను అతనికి ఏ హానీ చెయ్యను. నువ్వేం భయపడకు."

"అతడు ఇక్కడికే వచ్చాడు. వెంట భార్యా పిల్లలున్నారు. వెళ్ళి కలుస్తావా? లైలా?" అన్నాను.

ఆమె ఒక్కసారిగా తల నుండి పాదాల వరకు కంపించసాగింది. ఆ స్థితిలో ఆమెను చూసి నేను కూడా గాభరాపడ్డాను. నాలో మరొక అనుమానం పొడసూపింది. నా వల్ల మరొక పొరపాటు జరగదు కదా అనిపించింది.

ఈలోగా ఆమె తన్ను తాను సంబాళించుకుంటూ "ఆ వెళ్తాను" అన్నది. నేను పరిశీలనగా ఆమె ముఖం వంక చూశాను. అది తుఫాను కాదు కాని ఒక మలయ శీతల వికలమైన గాలి విసురు ఆమె ఉంగరాల వెంట్రుకలతో ఆటాడసాగింది.

అలా అయితే మంచిది. రా. నా వెనకాల నడువు అన్నాను. నేనూ, నావెనుక లైలా. పాఠశాల దగ్గరికి చేరాం. వెళ్తూనే హార్మోనియపు సరళీస్వరాలు, మధుర ఆలాపన వినిపించింది. నేను శ్రద్ధగా వినసాగాను.

అది రంజన్ గొంతులో నుంచి వచ్చే మధురధ్వని. లైలా కూడా ఆ సంగీతానికి తన్మయురాలైంది. అటు చూస్తే కమలను ఒళ్ళో కూర్చోపెట్టుకుని ప్రజ్ఞాసారథి కూడా పాటలో లీనమైపోయున్నాడు. తన గదిలో మాలతి కూడా చిన్న పవుడర్ డబ్బాను వాయిద్యంగా చేసుకుని కూనిరాగాలు తీస్తున్నది. రామేశ్వర్ పడుకుని భార్యవంక చూస్తూవున్నాడు. పరిపూర్ణ తృప్తితో, సంతోషపు ప్రశాంత మాధుర్యం ఇద్దరి ముఖాల్లో తాండవిస్తున్నది. దగ్గరే వున్న రంజన్, మిన్నాలు తమ తల్లిదండ్రులను ప్రేమగా చూస్తున్నారు. వారి వారి ఆనంద పారవశ్యాల్లో మునిగిపోయి మా రాక ఎవరూ గుర్తించలేదు. ఒక క్షణంపాటు నాకే తెలియని వేదన కలిగి ఇంతటి సుందర సంసారంలో కలహజ్వాల వెలిగించి నేను తమాషా చూడటానికి వచ్చానా? అనిపించింది. నేనేకాకుండా అటు లైలా కూడా స్తబ్ధురాలయ్యి తన పెద్ద పెద్ద కళ్ళతో తదేకంగా చూడసాగింది. కమల ప్రజ్ఞాసారథి ఒళ్ళోంచి లేచి పిల్లివలె పాక్కుంటూ వెళ్ళి తన తల్లి వీపుకు అంటుకుపోయి అమ్మా! అన్నది. దాంతో మాలతి పాట ఆగింది. కమలతో పాటు మిన్నా, రంజన్‌లు కూడా ఫక్కుమని నవ్వారు.

"కమలా నువ్వు చాలా దుష్టురాలివే" అన్నాడు తండ్రి.

"నాన్నే దుష్టుడు" అంటూ కమల తన చిన్నారి చేతి వేలును మావైపు సంజ్ఞచేసి చూపించింది. రామేశ్వర్ లేచి కూర్చున్నాడు. మాలతి మమ్మల్ని చూస్తూనే నెత్తిమీద చెంగు మరింత ముందుకు లాక్కుంది. లైలా రామేశ్వర్‌ను చూస్తూనే "సలామ్" అన్నది. ఇరువురి కళ్ళూ కలుసుకున్నవి. ఒక క్షణం పాటు రామేశ్వర్ కళ్ళలో గాభరా కనుపించింది. వెంటనే సర్దుకుని "లైలా నువ్విక్కడకు ఎలా వచ్చావన్నాడు."

"నాణాలు వద్దా బాబూ?" అని అడుగుతూ లైలా నిర్భయంగా మాలతి దగ్గరకెళ్ళి కూర్చున్నది.

లైలాను బిడియంగా చూస్తూ మాలతి లేచి నిలబడింది. లైలా మాలతి ముఖం వంక పరిశీలనగా చూస్తున్నది. మాలతి, లైలాను ఏ మాత్రం పట్టించుకోకుండా నావంక తిరిగి "అన్నయ్యగారూ! మీరింత వరకూ టిఫిన్ చెయ్యలేదు. ఈ రోజు మీ కోసం కందతో లడ్డూలు తయారుచేశాను" అన్నది.

"ఇంతవరకూ ఆ మాట ఎందుకు చెప్పలేదు తల్లీ? ఉదయాన్నుంచి చాలా ఆకలితో వున్నాను" అన్నాను. మాలతి టిఫిన్ తేవటానికి లోపలికెళ్ళింది.

"నాణాలేమైనా తెచ్చావా?" అనడిగాడు రామేశ్వర్.

"తెచ్చానంటూ" తన బ్యాగ్ తెరిచింది. పట్టుగుడ్డలో చుట్టబడిన చోకర్‌ను తెరిచి ఆమె ఉత్తరం బయటకు తీసింది. నేను స్థిరంగావుండి జరిగే విషయం చూడసాగాను. "ముందుగా ఈ ఉత్తరం చదవండి బాబూ అన్నది" లైలా.

రామేశ్వర్ కంపించే చేతులతో దాన్ని తెరిచాడు. అది తాను వ్రాసిన ఉత్తరమే. గాభరగా లైలా వంక చూడసాగాడు. లైలా మాత్రం శాంత స్వరంతో "చదవండి బాబూ, నేను మీనోటితోనే విషయం వినాలనుకుంటున్నానన్నది.

రామేశ్వర్ దృఢత్వాన్ని తెచ్చుకుని చదవనారంభించాడు. రాబోయే పరిణామాలను ఎదుర్కోవటానికి తన సమస్త శక్తుల్నీ కూడదీసుకున్నాడు. మాలతి టిఫిన్ తీసుకొచ్చింది. రామేశ్వర్ ఉత్తరం పూర్తి చేశాడు. కింద తన పేరు మాత్రం చదవలేదు. మాలతి విషయమంతా వింటూ నిలబడ్డది. నేను కంద లడ్డూ తింటున్నాను. మధ్యమధ్యలో మాలతి ముఖం వంక చూస్తున్నాను. ఆమె చాలా గంభీరంగా వున్నది. "అన్నయ్య గారూ? లడ్డూలు ఎలా వున్నాయి? మీరు చెప్పనేలేదు. నెమ్మదిగానే తినండి" అన్నది.

చేదు వస్తువులైతే థూ.థూ. అనుకుంటాం. మంచి వస్తువుల్ని నెమ్మదిగానే మింగుతాం కదమ్మా" అన్నాను.

"నేనీ ఉత్తరాన్ని పూర్తిగావిన్నాను. మీ చేతుల్తో మీరే దాన్ని పూర్తిగా చించేయండి. ఆ తర్వాత మీక్కావలసిన నాణేలను చూపిస్తాను". అన్నది లైలా.

రామేశ్వర్ నిజంగానే ఉత్తరాన్ని చింపసాగాడు. గుడ్డపీలికల్లాగా ఆ కాగితపు ముక్కలు

ఎగరసాగినయ్యి. లైలా దాచుకున్న బాధతో ఒక గట్టి శ్వాస తీసుకున్నది. ఆ నిట్టూర్పును నేను గమనించాను. భయంకర తుఫాను కంటే తక్కువేంకాదిది.

లైలా నిజంగా ఒక బంగారు నాణేన్ని తీసింది. దాంతో పాటు అందమైన పగడాల మాల కూడా తీసింది. రామేశ్వర్‌నాణేన్ని చూచి పరిశీలించాడు. ఏభై రూపాయల నోటివ్వమని మాలతికి చెప్పాడు. మాలతి తన భర్త వృత్తి తెలిసివున్నది కాబట్టి వెంటనే నోటు తెచ్చి ఇచ్చింది. రామేశ్వర్ ఆ నోటును లైలా వైపుకు చాపాడు. అప్పుడే కమల మధ్యగా నిలబడి 'నాన్నా ' అన్నది. 'ఏం కావాలి కమలా?' అన్నాడు రామేశ్వర్.

బొమ్మలాంటి అందమైన ఆ చిన్నారి తన తండ్రి చెక్కిళ్ళను తన చిన్న చేతుల్తో పట్టుకుని లాలా – లాలా అనసాగింది. లైలా ఏభైరూపాయల నోటు తీసుకున్నది. "బాబూ! పగడాల మాల తీసుకోరా?" అనడిగింది.

"వద్దు. వద్దు. మాల అవసరం లేదన్నాడు."

లైలా ఆ మాలను తీసుకుని కమల మెడలో వేసింది. వద్దు వద్దని రామేశ్వర్ వారించినా ఆమె వినిపించుకోలేదు.

కమల తన తల్లి వంక చూస్తూ అమ్మా లాలా లాలా అంటుంటే ఆమె నవ్వి మరికొన్ని నోట్లు తీసి రామేశ్వర్ కిస్తూ "ఈ మాలరేటు కూడా ఇవ్వండి" అన్నది.

లైలా తీవ్ర దృష్టితో మాలతి వంక చూసింది. నేను విషయం అర్థం చేసుకున్నాను.

మాలతి నవ్వుతూ "ఏం డబ్బులఖర్లేదా?" అన్నది.

లైలా కమల ముఖాన్ని ముద్దాడి లేచి నిలబడింది. మాలతి అవాక్కయింది. రామేశ్వర్ స్తబ్ధుడయ్యాడు. నేను మాత్రం తటస్థంగా వుండిపొయ్యాను. లైలా వెళ్ళిపోయింది. దీనికి ఆదీ, అంతం ఎక్కడో నాకర్థం కావటం లేదు. లైలా, ప్రజ్ఞాసారథి, మాలతి, రామేశ్వర్ వీళ్ళంతా నా కళ్ళ ముందు బొమ్మల్లాగా అటూ ఇటూ కదలాడుతున్నారు. సంధ్యా సమయమైంది. నేను రావిచెట్టు కింద అలాగే కూలబడిపొయ్యాను. ప్రజ్ఞాసారథి తన ధ్యానం ముగించివేస్తూ" ఇవాళ మీరు సమాధి స్థితిలోకి వెళ్ళిపోయారు" అన్నాడు.

"అది కూడా ఈ భూమి మీదే. లాలస ఆక్రందన చేసే చోట దుఃఖానుభూతి నవ్వుతున్నది. విధి తన మట్టి బొమ్మలతో పాటు క్రూర మనో వినోదాన్ని కూడా సృష్టిస్తుంది. కాని తమరేమో చాలా ఉన్నతంగా స్వర్గీయ భావనల్లో వున్నారన్నాను."

"ఆగండి శ్రీనాథ్‌గారూ! సుఖ దుఃఖాలు, నింగీనేలా, స్వర్గనరకాల మధ్య వుంటాయి. ఈ సత్యమైనదాన్నే మనుష్యుడు పొందుతాడు." అన్నాడు. ఇంకా సాధారణ మానసిక స్థితి నుండి, మనస్సుని

గ్రహించుకునేదాకా ఎన్నో విషయాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి.

"శ్రీనాథ్ జీ! ఈ రోజు లైలా తన మనస్సు నిగ్రహంగా వుంచి ఒక మహానది తన ఉజ్జ్వల ధారను తాను బంధించివేసినట్లుగా బంధించింది. అది చూసి నేను అవాక్కయ్యాను. ఆ సమయంలో మీది విచిత్ర పరిస్థితి. అయినా కూడా అంతా నిర్విఘ్నంగా పూర్తయింది." అన్నాడు.

"లైలా గుండెల్లో ఎంతభీషణ తుఫాను చెలరేగుతుందో మనకు తెలియదు. నేను ఇప్పటికీ భయపడుతూనే వున్నానన్నాను."

"నేను రేపు బయలుదేరివెళ్తాను. మీరు ఇష్టపడితే రామేశ్వర్‌ను కూడా నా వెంట రమ్మని అంటాను. బొంబాయి వరకు మేము కలిసి ప్రయాణించవచ్చు. మాలతి కూడా ఈ భయంకర పీడ నుండి దూరంగా వెళ్తే మంచిది. అదే అందరికీ క్షేమం అన్నాడు."

ఆ మాటలకు నా మనసులోని వేదన చల్లారింది. చాలా మంచిది అలాగే చెయ్యండన్నాను ప్రజ్ఞాసారథి లేచి లోపలికి వెళ్ళినా నేను అలాగే కూర్చుండిపోయాను. మన్నా, రంజన్‌ల కిలకిలా రావాలు, రామేశ్వర్ గద్దింపులు మాలతి చేసే గరిటె చప్పుళ్ళతో ఈ లోకంలోకి వచ్చాను. కల్లూ కూడా నా ఎదురుగా వచ్చి నిల్చుని "బాబూ లేవండన్నాడు."

ప్రజ్ఞాసారధి, మాలతీ, రామేశ్వర్‌లు వెళ్ళిపోయి ఒక వారంపైగా గడిచింది. ఇప్పటికీ ఆ కుటుంబపు కోలాహలం మధుర సంగీతపు ప్రతిధ్వనివలె నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూవున్నది. ఇంకా ఆ మాదకత నుండి నేను బయటకు రాలేకపోతున్నాను. నేను దుఃఖపుచీకట్లో మునిగిపొయ్యానన్న ఆలోచనలో పడిపోయాను. దానిలోతెంతో నాకు తెలియదు. కాని నా అంధకారంలో ఒక వెలుగును చూశాను. అదేంటంటే నేను లైలాను స్వీకరిస్తాను. ఎవరైనా నవ్వితే నవ్వ నివ్వండి. కాని నేను లైలాను పొందటానికి ఆసక్తిగానే వున్నాను. ఎందుకంటే లైలా రామేశ్వర్‌ను చేరుకోవాలని చాలా ఉబలాటపడింది. అతనామెకు దొరకలేదు. జరిగినదంతా నా కళ్ళముందే జరిగింది. అప్పుడు నేను సానుభూతి చూపించలేకపొయ్యాను. నాలాంటి వాడికి లైలా వంటి చిరసహచరే తగినది. ఈ ఆలోచన కల్గి నాకు చాలా సంతోషం కల్గింది.

కల్లూ నాతో హఠం వేస్తున్నట్లుగా మాట్లాడుతున్నాడు. "మిన్నా, రంజన్, కమలా వాళ్ళు ఉన్నపుడు ఉండేదే ఇల్లు అలాంటి ఇల్లే వుండాలి. మాలతీ అమ్మగారు, రామేశ్వర్‌బాబు గారు వున్నప్పటి ఇల్లే మనకూ కావాలి" అన్నాడు.

హఠాత్తుగా ప్రజ్ఞాసారధి జ్ఞాపకం వచ్చాడు. కోపమూ వచ్చింది. "ఇల్లూ, గిల్లూ ఏం అక్కర్లేదు, నువ్వు నిశ్శబ్దంగా వుండు అన్నాను" కల్లూతో. నేనిలాంటి వాణ్ణని ఆ బౌద్ధుడు బాగా పసికట్టి నాకీ పాఠశాల బాధ్యత ఒప్పజెప్పివెళ్ళాడనుకున్నాను. కల్లూ మరలా మాటలు సాగించాడు. "అందరికీ ఇల్లుంది. మిన్నూ వాళ్ళకు, బాబుగారూ వాళ్ళకు, మీకే ఎందుకు లేదు" అంటూ ప్రశ్నించాడు.

"ఎందుకని లేదు? నామీద నాకే కోపం వచ్చింది. అనవసరవాదన చెయ్యొద్దు కల్లూ. ఈ మధ్య

నీవు సరిగా చదవనే చదవటం లేదు. చదువుకో లేకపోతే నిద్రపో అని కసురుకున్నాను."

వాడు తలవంచుకుని బాధను గుండెల్లో పొదువుకుని అటు తిరిగి పడుకున్నాడు.

ఆ నిశ్శబ్ద రాత్రిలో నేను మేల్కొనే వున్నాను. చిన్న కునుకు, నేను మనసులో నిర్మించుకున్న ఊహే చూస్తున్నాను. చంద్రాప్రశాంత జలాలలో చిన్న పడవ. పడవలో రామేశ్వర్, మాలతి కూర్చునివున్నారు. నేను గడవేస్తూ పడవ నడుపుతున్నాను. ప్రజ్ఞాసారథి తీరంలో నిలబడి పిల్లలను ఆడిస్తున్నాడు. మేమంతా వెన్నెట్లో తడుస్తూ పడవను నడుపుకుంటూ వెళ్తున్నాం. అంతలోనే వాళ్ళకు మధ్యగా లైలా ముఖం కనపడింది. నాకళ్ళ ముందు మెరుపులు మెరవసాగాయి. ఇంతలో నిద్రమేల్కొన్నాను. ఉదయము అయ్యింది. నిద్ర కళ్ళు ఇంకా తెరిపిడిపడకముందే బయట జరిగే కోలాహలం నేను బయటకు వచ్చేటట్లు చేసింది.

ఇరానీయుల గుంపొకటి బయట నిలబడివున్నది. "ఏమైందని" అడిగాను.

గుల్‌ని గుర్తుపట్టాను. "ఇక్కడ మహమ్మదీయ గురువుండాలి గదా" అనడిగాడు.

"మహమ్మదీయ మతగురువా? అతనెవరు అని" అడిగాను.

"అవును. అతనే కావాలి. పచ్చని గుడ్డలు కట్టుకుంటూ వుంటాడని గుర్తులు చెప్పాడు."

"వారంతా ప్రజ్ఞాసారథిని వెదుకుతున్నారని నాకర్థమైంది." ఆయనిక్కడ లేరు. తన దేశం వెళ్లిపోయారు. ఇంతకీ విషయమేమిటని అడిగాను.

"ఒకామెకు గాలిసోకింది. ముస్లిమ్ మతపెద్దకు చూపించి విభూతి పెట్టించాలనుకుంటున్నానని ఒకనడివయసు స్త్రీ చెప్పింది."

"ఇంతకీ ఆ స్త్రీ ఎక్కడుందని అడిగాను.

"మా మకాంలో ఉన్నది. మీరెళ్ళి చూడండి మీకే తెలుస్తుందని చెప్పారు" వాళ్ళు. ఇంతలో గుల్ ముందుకు వచ్చి

"ఆమె మీకు తెలుసు. లైలాకే గాలిసోకిందని" చెప్పాడు

అంతకు మించి నేనేం వినలేదు. నాలో ఆందోళన ఎక్కువయింది. ఒకరి జీవితం నాశనమైతేనే మరొకరి జీవితం బాగుపడుతుంది. ఇదే విధివిధానమా? నిరాశతో వడబడిన లైలా ముఖం కళ్ళముందు కనబడింది.

ఆ ఇరానియన్లతో ఇంకేంమాట్లాకుండా లోపలికొచ్చి దిండులో నా ముఖాన్ని దాచుకున్నాను. వెళ్ళండి. వెళ్ళండి. ఇక్కడ ఏ బాబాజీ ఉండటం లేదు అని కల్లూ అరిచే అరుపులు వినపడ్డాయి.

పాఠశాలలోని పిల్లల్ని చదివిస్తూవున్నాను. నాలో చాలా పెద్ద మార్పే కలిగింది. ఈ కొద్ది నెలల్లో కల్లూ నా ఏకాంత జీవనసహచరుడయ్యాడు. ఎంతనచ్చచెప్పినా ఎవరూలేనిది ఇది మన ఇల్లు కాదు. మనింటికి మనం వెళ్దామని అతను మాటిమాటికీ అనసాగాడు.

వసంతాగమనంలో ప్రకృతి కొత్త చిగురులు తొడిగింది. వనస్పతులు ఆసాంతం పులకించిపోతున్నాయి. రావిచెట్టు కింద ఉదాసీనంగా కూర్చున్నాను. శీతలపవనాలు వీచటంతో నా శరీరం కోర్కెల రెక్కలు టపటప కొట్టుకోసాగినవి. ఆకాశంలోని నక్షత్రాలూ, వెన్నెలా, 'చందా'లో మునకలు వేస్తూవున్నాయి. ఆ నిశ్శబ్దరాత్రి చాలా గంభీరంగావున్నది. దూరాన్నుంచి ఒక సంగీతపు స్వరం వేదనా, కరుణ నాదంలో కలిసి గాలిలో తేలివస్తున్నది. ఆభాషేంటో నాకు తెలియదు. ఇదేదో మాయ కాదుగదా అనిపించింది.

మరలా నేను ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోసాగాను. ఆ ఆలోచనల్లో విధి విధానం, తుఫాను తీవ్రతా ప్రకృతి ప్రకోపం అన్నీ వున్నాయి. నిజంగానే నా కల్పనలో కనుపించిన తుఫాను వాతావరణం ప్రత్యక్షమయింది. దక్షిణాన ఆకాశంలో తారలు మాయమయి చీకట్లు కమ్ముతున్నాయి. పక్షుల కోలాహలం ఎక్కువయింది. అవన్నీ ఎక్కడైనా సురక్షిత ప్రాంతాన్ని వెతుక్కుంటూ తరలిపోతున్నాయి. దగ్గర నుండి వినిపించే సంగీత ధ్వని నన్ను అక్కడ నుండి లేవనీయటం లేదు. కాని కల్లూ అరుపులు విని లేచి లోపలికెళ్ళాను. ఆ భీషణ వాతావరణంలో కూడా ఆ సంగీత ధ్వని గాలిలో ఊయలలూగుతూ రాసాగింది. పాఠశాల నాల్గువైపులా ఆ ధ్వనే ఆవరించింది. వెంటనే ఏదో ధడాలున పడినట్లు ఎవరో బిగ్గరగా మూలిగినట్లు అనిపించింది.

తుఫాను ఆగింది. రావిచెట్టు పెద్దకొమ్మొకటి విరిగిపడింది. దాని క్రింద లైలా అణిగిపోయి తన భావనాసీమను దాటి వెళ్ళిపోయింది.

నేను ఇప్పుడు కూడా 'చందా' ఒడ్డునున్న బౌద్ధ పాఠశాలకు వేతనంలేని అధ్యక్షుణ్ణే. ప్రజ్ఞాసారథిని తిట్టుకుంటూ రోజులు గడుపుతున్నాను. అదే ఇప్పుడు నా జీవన కేంద్రమైపోయింది. నేటికీ నా హృదయంలో తుఫాను చెలరేగుతూనేవున్నది. అందులో లైలా ముఖం మిరుమిట్లు గొలుపుతూనేవున్నది.

## సాహిత్య, చిత్రలేఖన కళాకారుడు శ్రీ నరేంద్రనాగదేవ్

జీవన రేఖలు : శ్రీ నరేంద్ర నాగదేవ్ ఇటు సాహిత్యములోనూ అటు చిత్రలేఖనములోనూ మంచి ప్రవేశముకలిగివున్న వారు. వీరు మధ్యప్రదేశ్ నందలి ఉజ్జయినీలో **1961** నుండి **1966** వరకు ఆర్కిటెక్చర్ నందు విద్యాభ్యాసం చేశారు.

కథా సాహిత్యం : విభిన్న పత్రికలలో వ్యాసాలూ, కథలూ వెలువరించారు. కాదంబినీ కథల పోటీలో విజేతలయ్యారు. 'తమాశ్‌బీన్' అనే కథల సంపుటి వెలువరించారు. ఇందులో విస్మృత్ నావ్–భర్ అంధేరే, సమాపన్, ఉతార్, రిస్తే, ప్రతిశోధ్ మొదలగు కథలున్నవి.

చిత్రలేఖనం : అఖిల భారత కాళిదాస సంస్థ నుండి ఉజ్జయినీలో రెండు సార్లు పురస్కారాలను పొందారు. చిత్రకళ వీరి అభిమాన విషయం. ఆలిండియా ఫైన్ ఆర్ట్స్ & క్రాఫ్ట్ సొసైటీ, న్యూఢిల్లీ వారి నుండీ పురస్కారాన్ని పొందారు. ఎన్నో చిత్రకళా ప్రదర్శనలనేర్పాటు చేశారు.

ప్రస్తుత కథ "ఆక్రమాక్". అనగా ఆక్రమణదారుడని అర్థం. ఈ కథలో ఒక వ్యసన పరుడైన తండ్రి అటు కొడుకు జీవితం పై, ఇటు కూతురి జీవితంపై దురాక్రమణ చేస్తూ, వారినెన్ని ఇక్కట్ల పాలు చేశాడో రచయిత బాగా చక్కగా వివరించారు. ఆ తండ్రి చేసిన పనికి విసిగిపోయిన కొడుకు తీసుకున్న పరిష్కారం కూడా పాఠకులను మెప్పించేటట్లుగా వున్నది.

ప్రస్తుత రెండవ కథ 'ఫాంస్' అంటే ఉరి అని అర్థం. ఈ కథలో గుడిపూజారిగా వున్న రమాశంకర్ పూర్వాశ్రమంలో ఒక గుండా. తన తల్లిని మనస్తాపానికి గురిచేసి ఆమె ఇల్లు వదిలివెళ్ళేటట్లు చేసిన వ్యక్తి. గతం తాలూకు నీడలు వెంటాడుతుంటే రమాశంకర్ గొంతుకు ఉరి బిగుసుకుంటున్నట్లుగా పడే వేదననే శ్రీ నరేంద్రనాగదేవ్ చక్కని భావనా పటిమతో వ్రాశారు.

# ఉరి

నిజం చెప్పాలంటే ఈ గ్రామపు పైనున్న ఆకాశం ధూళితో నిండి పాలిపోయినట్లుగా, వెలిసిపోయిన రంగుతో వుంటుంది. క్షితిజరేఖ వద్ద రాబందువలె భూమిని తన పంజాతో అణిచివేస్తున్నట్లుగా కనపడుతుంది. ఆ వూళ్ళోకి వెళ్ళే రోడ్డు ఒక్కటే. ఆ రోడ్డు చుట్టుపక్కలే ఊరంతా ఏర్పడింది. వాళ్ళంతా వాడే కాలిబాటుంది. ఆదారి పొలాలగుండా రైల్వేస్టేషను వరకూ వెళ్తుంది. స్టేషను నుంచి రెండు టాంగా బళ్ళు ప్రయాణీకుల్ని గ్రామంలోకి తీసుకొస్తూవుంటాయి.

రమాశంకర్ ఆ వూర్లో అడుగుపెట్టినపుడు టాంగా బండి అవసరం మేం పడలేదు. ఎక్కడెక్కడో తిరిగి ఖాళీ చేతుల్తోనే ఇక్కడకు చేరుకున్నాడు. మనసంతా భారాన్ని నింపుకుని వచ్చాడు. ఈ రోజు వరకూ ఆ భారం అట్లాగేవుంది.

సూర్యుడికి అర్ఘ్యమిచ్చే సమయంలో నీటితోపాటు అతనికి తన చేతుల్లో రక్తపు బిందువులు కనుపించేవి. పరిశుభ్రంగా మెరిసే రక్తపు బొట్లు. రమాశంకర్ చాలా సేపు తన చేతుల్ని కడుక్కుంటూ, తుడుచుకుంటూ వుండేవాడు.

ఆ చిన్న గ్రామపు దేవాలయంలో గౌరవనీయులైన పూజారిగా పనిచేస్తూ పండిత రమా శంకర్ అనిపిలవబడుతున్నాడు. భక్తుల్ని ఆశీర్వదిస్తూ ఎవరి తలపై చేయి వుంచబోయినా వెంటనే ఉలిక్కిపడి చేతిని వెనక్కు తీసుకుంటాడు. ఎందుకంటే తన పొడవైన చేతులమీద ఎన్నో ఘాతుకమైన హత్యలు చేసిన ముద్రలున్నాయన్న దృష్టి కలుగుతుంది. ఆ పాపపు జాడలు వాళ్ళను తాకకుండా తన చేతికి తొడుగు వేసుకుంటున్నాడు.

మాటిమాటికి అతనికి లోగడ తను కాపురమున్న చిన్న పట్టణం గుర్తుకొస్తుంది. ఈ గ్రామపు వాతావరణంతో పోలిస్తే అక్కడి వాతావరణం చాలా వేరుగా వుండేది. ఆ పట్టణపు శరత్కాలపు ఆకాశం తెల్లతెల్లని పావురాలు ఎగురుతున్నట్లుగా వుండేది. దానికి సరిగ్గా వ్యతిరేకంగా సముద్రమంతటి గ్రీష్మపు నీలాకాశం కిందకు వంగి కనపడేది. వర్షాకాలంలో మేఘాలు జరజరమని శబ్దం చేస్తూ నీటిని వర్షిస్తూ వుండేవి. ఆ ఆనందాలను, ఆహ్లాదపూరిత వాతావరణాన్ని పరిచయం చేసుకోవటంలో తను విఫలమయ్యాడు. తన ముఖం మీద ఎల్లప్పుడూ వుండే ముసుగు వాస్తవాన్ని కన్పడనీయ కుండా చేస్తున్నది. రమాశంకర్ స్మృతిలో పాత జ్ఞాపకాలు పుంఖానుపుంఖాలుగా వచ్చి మనసు విలవిలలాడుతున్నది. విలవిలలాడే మనసును ఆరోగ్యం సహకరించకపోయినా కుదుటపరుచుకోవాలి.

సాయంకాలం అయ్యేటప్పటికి గుడి ప్రాంగణంలో గ్యాసులైట్లు వెలిగిస్తారు. పాతికమంది దాకా చేరి తలవంచుకుని శ్రద్ధగా కూర్చుంటారు. విహ్వలమైన భావంతోనే ప్రవచనాలు మొదలుపెడతాడు రమాశంకర్. ఎదుట కూర్చున్న భక్తులకు ప్రవచనాలు చెప్తున్నాడో, తనలోని సంఘర్షణను తనకు తాను

చెప్పుకుంటున్నాడో తెలియదు. రమాశంకర్‌కు తెలియకుండానే అతనిలోపల వ్యక్తి మాటిమాటికీ రొదపెడ్తూ వుంటాడు. రొదకాదు. నేను గట్టిగా అరుస్తున్నాను. నువ్విదంతా కట్టిపెట్టు రమాశంకర్! నీవిప్పుడు చేసే పనికి యోగ్యుడవి కానే కావు. ఇలా ప్రవచనాలు చెప్పటం నీకు శోభస్కరం కాదు. ఇక్కణ్ణుంచి తిరిగి వెళ్తేనే నీకు శ్రేయస్కరం." అన్న మాటలు వినిపించి ఈ మాటలు నాకే వినిపించాయా? లేక మిగతావాళ్ళు కూడా విన్నారా? అని చుట్టూ అందర్నీ గమనిస్తూ తనకు తాను సముదాయించుకుంటూ పెదాలపైన నవ్వు తెచ్చుకుంటాడు. నవ్వే పెదాలు కూడా వణుకుతూ వుంటాయి. రోజూ జరిగే తంతే ఇది. తన నుండి తానే రక్షింపబడాలి. చివరికే గమ్యం చేరుకోవాలో? ఇవే ఆలోచనలు రమాశంకర్‌కు.

మళ్ళీ వెనుకటి చిన్ననాటి రోజులు కళ్ళముందుకొచ్చాయి. చిన్నగా లాంతరు వెలుగుతున్నది. అమ్మ చదివిస్తూ వున్నది. నిద్రరానివ్వకుండా ఎదురుగా కూర్చుని అమ్మ చెప్పే పదాలు వల్లెవేస్తున్నాడు. "నువ్వ రాముడివి. సూర్యోదయమైంది. పెందలకడనే లేవాలి. ఇప్పుడు మోహన్ వచ్చాడు. మోహన్ కూడా మంచి వాడు. నువ్వు కూడా మంచివాడుగా తయారవు. కృష్ణుడు చెడ్డవాడు. నువ్వు అలా కావద్దు." ఆ రోజులు, ఆ చదువులు ఎక్కడ మాయమయ్యాయో తెలియదు.

సాయంకాలపు ఆటలు ఆడుకుంటూ తోటలో పొదలచాటున దాక్కొన్నా కూడా ఇంకా భయమే దొరికిపోతామేమోనని. వేసవి మధ్యాహ్నాలలో ఏదో ఒక చెట్టునీడలో నిలుచుని ఐస్ కుల్ఫీ కోసం మారాం చేసిన రోజులు. ఇప్పుడా రోజులు రావు. తోటలూ, పొదలూ, కుల్ఫీలు ఏమీ లేవు.

అమ్మ ఎప్పుడూ ఒక కథ చెప్పేది. "ఒక రాజ్యం వున్నది. ఆ రాజ్యానికొక రాజకుమారుడు వుండేవాడు. అతడు మరి ఒక రాజకుమారిని రక్షించటానికి ఏడు సముద్రాలు దాటాడు. ఆ సముద్రాల అవతల దుష్టుడైన మాంత్రికుని రాజ్యమున్నది. ఆ మాంత్రికుడు చాలా మంది ప్రజలను తన గారడీతో రాళ్ళుగా మార్చేశాడు. రాజకుమారుడు ఆమాంత్రికుణ్ణి చంపి రాళ్ళుగా వున్న వాళ్ళందరినీ మనుష్యులుగా మార్చగలిగాడు. ఆ రాజకుమార్తెను పెళ్ళి చేసుకుని ఒక వేయి సంవత్సరాలు రాజ్యాన్ని పరిపాలించాడు." అతనికి నిద్రవచ్చేంతవరకూ కథలు చెప్పమని వేధించేవాడు. మరల మరలా పాత కథే వద్దని హఠం చేసేవాడు. ఇప్పుడా రాజకుమారులు లేరు. ఆ కథలు చెప్పే అమ్మా లేదు.

గుళ్ళో ప్రవచనాలు చెప్పే సమయంలో ఎవరు దగ్గరగా వచ్చినా రమాశంకర్ గాభరాపడేవాడు. కాళ్ళుతాకి నమస్కరించటానికి భక్తులు ఎంత దగ్గరగా వచ్చినా తన ముఖాన్ని మాత్రం కన్పడనిచ్చేవాడు కాదు. గాస్‌లైట్ల వెలుగులో ఆయన పొడవాటి నీడపడేది. ఆ నీడ చూచి కూడా రమాశంకర్ ఉలికిపడేవాడు. చల్లగా చెమటకారేది. గాస్‌లైట్ దూరం పెట్టండి. అంత దగ్గరగా వుంచాల్సిన అవసరమేం లేదు నాకు అనేవాడు. మాటిమాటికీ తనలో తను అనుకునేవాడు ఈ నీడను అణచివేయలేనా అని? మనసు లోపలి భయాన్ని పట్టుకోగలమా? ఎన్ని రోజులకు ఈ భయాలు మాసిపోతాయి? మనస్సేమో హాహాకారాలు చేస్తుంది.

అమ్మ రాబోయే రోజుల గురించి చెప్తూ వుండేది. పెద్దయిం తర్వాత అన్ని బాధల్నుండి విముక్తి కల్గుతుంది. ఇది కల కాదు. నమ్మకం అంటూ వుండేది. ఇంకా ఏమనేదంటే రమాశంకర్ పెద్దయిన తర్వాత "వీరు రమాశంకర్" అని ప్రజలు అభిమానంగా చెప్పుకుంటారు. ఇతడు నా బిడ్డ అని నేనూ గర్వంగా చెప్పుకుంటాను. ఇదీ నీ కొరకు నిశ్చయింపబడిన భావిజీవితం అనేది.

అయ్యో రమాశంకర్! జరిగిందేమిటి? నువ్వేం చేశావు అంటూ అతనిలోపలి మనిషి అరుపులు ప్రారంభించాడు. నీ ముఖానికి వేసుకున్న అందమైన ముసుగు తీసిచూడు రమాశంకర్. తర్వాత ఏం జరుగుతుందో? అపుడు నీ వంక చూసేవారి చేతులే నీ ముఖం దగ్గరగా వెళ్ళి అసహ్యంతో నీ చెక్కిళ్ళను, ముఖం అంతా నొక్కేస్తాయి.

గుడి ప్రాంగణమంతా చిందరవందరగా దుమ్మూధూళితో నిండివున్నది. గుళ్ళోకి వెళ్ళేటప్పుడు అతని కాలు దుమ్ములో పడింది. కాలి దుమ్ములో పడ్డ అతని అడుగుజాడలు క్రూర జంతువుల కాలి పంజాలాగా అనిపించింది. ఇదొక అనుభవం అనుకున్నాడు. రెండవ రోజు ప్రవచనాల కార్యక్రమంలో రామ్‌శంకర్ భక్తులతో అన్నాడు "గుడి ప్రాంగణమంతా బండలు వేయించాలి" అని.

వినే భక్తులంతా జయజయ ధ్వానాలు చేశారు. కాని అతను మాత్రం లోపల్లోపల చాలా కలవరపడ్డాడు. ఎందుకిలా అయింది? ఎప్పటి నుండి నా పాదాలు క్రూర జంతువుల కాలి పంజాల్లాగా మారిపోయినవి. నేను గమనించుకోనేలేదు. నెమ్మది నెమ్మదిగా ఇలా మారిపోయివుంటాయి. వెనుకటి రోజుల్లో నా కాలి ముద్రలు ఇలా లేవు.

ఎందుకంటే అతను చాలా చిన్న వాడిగా వున్నప్పుడు అమ్మ అతని కాలివేళ్ళను చాలా ప్రేమగా సవరిస్తూ వుండేది. అప్పుడు తన కాలివేళ్ళు చాలా సుకుమారంగా వుండేవి. బాల్యపు భయాలు మాసిపోయే సమయంలోనే ఈ మార్పు జరగటం ప్రారంభమైవుంటుంది. అవును బాగా గుర్తుంది. యౌవనపు ప్రాయం మొదలవుతూనే తను బొత్తిగా చెడిపోయాడు. చెడ్డ సాంగత్యంలో చిక్కుకుపోయాడు. తన కన్నుల్లో భయంకర క్రూరత్వపు జీరలు ఏర్పడుతూ ఏ భావనలన్నీ బయటకు ప్రదర్శించేవాడుకాదు. ముఖంమీద క్రౌర్యంతాలూకు పొరపెరుగుతూ వస్తున్నది. బాల్యంలో విన్న రాజకుమారుల కథల ప్రభావం ఏం లేకుండా పోయింది. ఇప్పుడు నల్లని రూపుకల పెద్ద దుష్టమాంత్రికుడు అతని భుజాలపైకెక్కి కూర్చుని అతన్ని తిప్పుతూ వుంటున్నాడు. ప్రతిచోటికీ అతని వెంటే నడవసాగాడు. ఇంట్లో గది గోడలపైన అవే ఛాయలు తిరుగుతూ, అన్నిటా ఆటంకాలు కల్గిస్తున్నాయి. అవాంఛిత పనులతో అతని అరచేతులు గరుకుగా, గట్టిగా అయిపోతున్నాయి. విచిత్రమైన విషయమేమిటంటే చిన్న చిన్న విషయాలపట్ల కూడా ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకునే అతను సంపూర్ణ జీవనధార తన దిశను మార్చుకునే సమయంలో ఏం చెయ్యలేక నిస్సహాయంగా వుండిపోయాడు.

ఆ రోజుల్లోనే అమ్మ నిశితంగా తన వంక చూస్తూ "రోజంతా ఎక్కడికెళ్ళావని" అడిగేది.

"నీతూ, దుకాణం దగ్గిర పేకాట ఆడుతున్నానని" అనేవాడు.

తన కోరికలకు, ఉద్దేశ్యాలకనుగుణంగా అతని జీవితాన్ని, జీవితంలో పెద్ద భాగాన్ని తెరిచివుంచితే అతని భావి జీవితం సమర్పణ భావంతో వుంటుంది అనుకున్నది. ఇన్ని రోజుల వరకు అతని జీవితాన్ని బాగుచేయటానికి ఎన్నిచేసింది అమ్మ. కాని పదవ తరగతి ఫెయిలయింతర్వాత అతను పుస్తకాలను అల్మారాలో పెట్టేసి నేనింక చదవలేను అని చెప్పేశాడు. ఈ ఒక్కమాటతోనే తను తన తల్లి యొక్క పూర్తి ఆశల్ని అడుగంటింపజేశాడు. ఎవరైనా గూడా రెండవ వారి జీవితం మీద ఇంత తేలిగ్గా నిర్ణయాలు ఎలా తీసుకోగల్గుతారు అని ఆలోచించాడు.

గదిలో లైటు వెలిగింది కాని అంతా అంధకారమే వున్నట్లుగా వున్నది. తను సిగరెట్ లైటరు కూడా వెలిగించాడు. ఆ చీకట్లోనే అమ్మ గోడకంటుకుపోయి కూర్చున్నది. చీకట్లో వెలుతురును చూడటానికి ప్రయత్నిస్తున్నది. తన అధరాలు కంపిస్తుంటే కొడుకును "సిగరెట్లు కాలుస్తున్నావా?" అని అడగాలనుకుని కూడా అడగలేకపొయ్యింది. వీడు పెద్దవాడయ్యాడు. ఈ ఇల్లు ఇకనాది కాదు. వీడిదే అనుకున్నది.

ఆ పట్టణంలో గాలి దుమారాలు బాగా వస్తూవుంటాయి. అలా వచ్చినపుడు మొదట ఆకాశం మట్టిరంగులోకి మారుతుంది. ఆ తర్వాత విపరీత వేగంతో తుఫాను వస్తుంది. అప్పుడప్పుడు అర్ధరాత్రి వరకూ ఈల లాంటి ధ్వనిచేస్తూ గాలి ప్రచండ వేగంతో వీస్తూ వుంటుంది. అలాంటి సమయంలో అమ్మ దర్వాజాలు,కిటికీలు బంధించి తన గదిలో పడుకుని వుంటుంది. కొడుకు తన గదిలో వున్నాడు.

ఇన్ని సంవత్సరాల నుండి తను నిర్మించుకున్న ప్రపంచం తనకళ్ళెదుటే చిన్నాభిన్నమవటం ఆమె జీర్ణించుకోలేకపోతున్నది. ప్రతికొత్త విషయానికీ కొత్త కొత్త ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. అయినా కూడా కొడుకు మీద ఎంతో కొంత అధికారాన్ని చూపించాలని అనుకుంటున్నది. పూర్తిగా కర్తవ్యాన్ని తన అధికారాన్ని కోల్పోవటానికి ఆమె సంసిద్ధంగా లేదు. కాని ఈ దశలో జరిగే ప్రతి చిన్న విషయం ఆమె కళ్ళుబైర్లు కమ్మేటట్లు జరుగుతున్నది. ఒక్కటొక్కటిగా అన్నీ చేజార్చుకున్న బాధ. బలహీనతలను జయించి, మమకారరాహిత్యాన్ని తోసివేసి పనులన్నీ చేస్తూవున్నది. చెప్పటానికైనా, వినటానికైనా ప్రశ్న ఉదయించనేలేదు. బహుశా ఈ యుద్ధం సమాన దళాల మధ్య కాదు. కొడుకు నిరంతరం గెలుస్తూవుంటే అమ్మ ఓడుతూ వస్తున్నది. ఇది నా దౌర్భాగ్యం అనుకున్నది. కొడుకు మొండి వాడుగా తయారయి ఏమీ గ్రహించలేకపోతున్నాడు. తేడా ఎక్కడొచ్చిందో తెలియదు. ఇది దేనికి దారితీస్తుందో తెలియదు. మరొక దౌర్భాగ్యమేమిటంటే తల్లిని ఈ దెబ్బ కొట్టటానికి కూడా అతని మనసు లోపల ఎక్కడో ఆత్మీయత అనే బంధం దాక్కునేవున్నది. వికసించిన తీగలో నిరంతర విద్యుత్ ప్రవాహం వుంటుంది. ఈ సూత్రం వలనే బహుశా ఆ రోజుల్లో అమ్మ అంతగా విలవిలలాడిపోయింది.

ఈ మధ్య ఈ మధ్య వీధిలోని పరిచయస్తుల ద్వారా బయటి విషయాలు ఎక్కువగా తెలుస్తున్నాయి. పదీ ఇరవై రోజులకొకసారి ఒక కొత్త కబురు అమ్మ చెవులపడుతున్నది. ఫలానా చోట కొట్లాట జరిగింది.

దాంట్లో రమాశంకర్‌కూడా వున్నాడు. ఇలాంటివి విన్న తర్వాత అమ్మ ఆలోచించి కొడుకును త్వరగా ఇంటికి రమ్మని మందలించింది. ఇది చెప్పటానికి కూడా ఎంతో వేదనపడింది. అయినా కూడా ఆమె గాభరాపట్టం ఏ మాత్రం తగ్గలేదు. రాత్రిపూట ఆలస్యంగావచ్చిన కొడుకు ఎదుటకు వచ్చి గట్టిగా మందలించలేక తన బలహీనతకు ఆమె మరింతగా కుంగిపోయేది.

ఈ మధ్య ఏ వస్తువునయినా తన చేతిలోకి తీసుకునే ధైర్యం ఆమెకుండటం లేదు. ఎందుకంటే ఆ వస్తువులన్నీ కొడుకు తెచ్చి ఇంట్లో పడవేసినవే. చివరికి కుర్చీ వాడుకొనే విషయంలో కూడా ఆమె అదే ఆలోచించి దాన్నీ వదిలివేసింది.

తన గది తాళం తన దగ్గరే వుంటుంది రెండవ తాళపు చెవిని నువ్వు వాడుకోమని కొడుక్కు చెప్పింది. వీధిలో వాళ్ళు కూడా తగిన సమయంలో కొడుకును అదుపులో పెట్టలేని తల్లి అయిందని ఆమెనే దోషిగా తేల్చారు. ఇది నాకు కష్టపు సమయం. అన్ని విధాలా చెడ్డరోజులుగా వున్నాయి. నేనే ఓర్చుకోవాలి అని అమ్మ ఎంతో ఓర్పుగా వుండేది. వేరే ఎవరూ ఓదార్చేవారు లేక ఆమెలో ఆమే "సత్యాన్ని ఎవరు గ్రహించగలుగుతారు? ఎవరికేమని సమాధానం చెప్పేది" అనుకుని మిన్నకుండిపోయేది.

మరలా ఆ రోజులు తిరిగిరావు. కొత్త జీవితం ప్రారంభిద్దామన్నా ఆ వయస్సు కూడా వెనక్కి రాదుగదా? చాలా ఆలస్యమైపోయింది. ఇపుడు నేను దీన్ని గురించి ఆలోచిస్తే ఆమెపట్ల కృతజ్ఞత చూపించినట్లా? ఒక్కొక్కమెట్టు ఎక్కుతూ అధోగతి వైపుకు చేరుకున్నదంతా నాకే చెందింది. మరల మరలా అదే జరిగింది. ఏది వ్రాసివున్నదో అదే జరిగిందనుకుని ఏమీ చెయ్యలేకపొయ్యాడు. తన పట్ల తనకెప్పుడూ నియంత్రణ లేకుండాపోయింది. తనను తాను పల్లంలోనే ప్రవహింపచేసుకున్నాడు. ఆ ప్రవాహం నుండి ఒడ్డుకు చేరలేకపొయ్యాడు. ఈ లోకంలోకి వచ్చే ముందు అందరమూ ఖాళీ చేతుల్తో వస్తాం. పాపాన్నంతా ఇక్కడే పోగు చేసుకుంటున్నాం. ఆ తర్వాత శిక్ష లభిస్తుంది. రమాశంకర్‌కు ఆ తర్వాత అన్న ఎదురు చూపు ఏం అక్కర్లేకపోయింది.

ఈ దేవాలయంలో భగవంతుడి ఎదురుగా కూర్చున్నాడు. అతనికిక్కడే శిక్ష కూడా లభిస్తున్నది. ముఖానికి ముసుగు వేసుకుని జీవించే శిక్ష. తన్ను తాను అసహ్యించుకుంటూ గ్రామ ప్రజల ప్రేమాభిమానాలను మోసే శిక్ష. తన లోపల వున్న ఆకృతి తనను పీడించి పీడించి తనకు అమితమైన దుఃఖాన్ని ఇస్తుంది. దీన్నుంచి కొంచెం కూడా బయట పడలేకపోతున్నాడు.

పండిత రమాశంకర్ ప్రవచనాలు ఇస్తూనేవున్నాడు. సత్యం మీద, ధర్మం మీద, పాప పుణ్యాల మీద. అవి, వినేవాళ్ళకు అమృత బిందువుల్లాగా అనిపిస్తున్నాయి. కాని అతని లోపల మరిగే సీసం ద్రవీభవిస్తున్నది. ఇంతకన్నా వ్యతిరేకంగా ఏం కావటల్లేదు. అతని లోని ఆకృతి హెచ్చరిస్తున్నది. "ఒక విషయం విను పండిత రమాశంకర్! నిన్ను నీవు మోసం చేసుకోలేవు. ఈశ్వరుణ్ణీ మోసం చేయలేవు. ఇన్ని వందల కళ్ళనూ మోసం చెయ్యలేవు. ఈనాడు నీ ఎదుట ఎంతో శ్రద్ధతో కూర్చున్న కళ్ళలోనే నీ రహస్యం బట్టబయలైనపుడు అసహ్యం కనపడి నిన్ను మింగేస్తుంది"అని.

ఆ రోజు గ్రామంలో తమ పిల్లవాడి పుట్టినరోజు సందర్భంగా ప్రవచనాలు చెప్పమన్నారు. కథలూ, ప్రవచనాలు చెప్తూ, చెప్తూ మరలా తన బాల్యంలోకి తిరిగి వెళ్ళాడు. తన పుట్టినరోజు కోసం అమ్మ ఎంత ఎదురుచూసేదో? కొత్త బట్టలు తెప్పించి వేసి దృష్టి దోషం తగలకుండా ముఖం మీద చిన్న కాటుక గుర్తు వుంచేది. తినటానికి మిఠాయిలు చేసేది. వాతావరణం బాగా వుంటే బయటకు తీసుకెళ్ళేది. తానలసిపోతే భుజాల మీద ఎత్తుకు మోసేది. లేదా ఎక్కడైనా ఎత్తైన చోట నిలబెట్టి పట్టణాన్ని చూపిస్తూ మన ఇల్లు ఎటువైపునుంది? గుర్తుపట్టగలవా అనేది? తన ఇల్లు అమ్మకెంతో ఇష్టమైన ఇల్లు. ఆ ఇంటిని ఆమె నుండి దూరం చేశాడు. తన ఇరవయ్యవ పుట్టినరోజు ఆమె జరిపినపుడు పరిస్థితి అంతా మారిపోయింది.

ఆ రోజున రెండు ఝాముల వరకూ గదిలో ఒత్తిగిల పడుకుని గది బయటకు వచ్చాను. అమ్మ బియ్యం ఏరుతున్నది. ఉదయాన్నుండి మబ్బు పట్టి ఎండ రాలేదు. మనస్సులో రేగే తుఫానునణుచుకోవటానికి అమ్మ ఏదో ఒక పని కల్పించుకొని చేయటానికి కూర్చుంటుంది. బియ్యం ఏరటం మానేసి ఇపుడు కూడా తల గోడకు ఆనించి కూర్చుండిపోయింది. ఆమె మనసులో ఏదో గుబులుగా ఉన్నట్లు అనిపిస్తూ కళ్ళముందు అంతా చీకటే వ్యాపించినట్లున్నది. ఏదైనా జరుగుతుందేమోనన్న భయంతో వున్నది. లేచి వెళ్ళి ముఖం మీద కాసిని నీళ్ళు చిలకరించుకొనివచ్చి మరలా బియ్యం శుభ్రం చేసే పనిలో మునిగిపోయింది.

ఈ విధంగా నాకు కాలక్షేపం ఏమీ లేకుండా ఎంతసేపు ఇంట్లో కూర్చుని వుండగలను?అని ఆలోచిస్తున్నాను.

ఆరోజు వడగళ్ళు పడుతున్నాయి. కొన్ని వడగళ్ళు ఎదురు గోడకు కొట్టుకుని వరండావరకు వస్తున్నాయి. ఒకసారి తాను చిన్నగా వున్నప్పుడు ఇలాగే వడగళ్ళు పడ్డాయి. అప్పుడు వడగళ్ళ చప్పుడులో తన కిలకిలలు కలిసిపోయినవి. ఆ రోజు పెద్ద పెద్ద వడగళ్ళను ఏరి అమ్మకు చూపించాడు. కాని ఈనాడు ఈ వడగళ్ళను గురించి అమ్మతో ఏం ప్రస్తావించలేదు. ఎదురుగా వున్న రోడ్డు వడగళ్ళతో తెల్లగా కనపడుతున్నది. వీధంతా చల్లదనంతో వణుకుతున్నది. ఒకటి రెండు కాకులు రోడ్డు మీద పడి చచ్చి కనపడుతున్నాయి.

వాతావరణం సహజంగా లేదని అమ్మకర్థమయింది. మధ్య మధ్యలో దగ్గుతూ కనీసం నా సానుభూతిని కూడా ఆమె కోరుకోవటం లేదు. మాటి మాటికీ శూన్యపు కళ్ళతో బయటికేసి చూస్తూ వుంటుంది. నెత్తిమీద చేయుంచుకుని జ్వరపడిన దానిలాగా కూర్చునిపోతుంది. దేనికీ సానుభూతి కోరుకోవటం లేదు.

ఎవరినైతే చిన్న కష్టాల నుండి కూడా రక్షిస్తూ, తినిపిస్తూ, తాగిస్తూ, ఎల్లప్పుడూ సంతోషంగా వుంచుతూ, తన సమయాన్నంతా గడిపివేసిందో అతని ఎదుటే నిస్సహాయంగా అయిపోయింది. అతని కళ్ళు తెరుచుకునే నాటికి అతని జీవితంలో మధ్యాహ్న సమయం వాలిపోసాగింది.

ఆ ఇరవైయ్యవ పుట్టినరోజు ఎలా జరిగింది? సీసాలూ, మధ్యమధ్యలో సోడాలు, ఐసూ వస్తున్నాయి. తినటానికి శనగలూ, చిప్సూ వస్తున్నాయి. మొత్తం ఆవారా బ్యాచంతా బాగా కులాసాగా గడిపారు. ఆ పూటంతా ఆ వాతావరణంలో ఊపిరాడక ఏదో పని కల్పించుకుని అమ్మ బయటికెళ్ళింది. బయటికెళ్ళాకే ఆమెకు ఊపిరాడింది. బయటవున్న పొడవైన రోడ్లు చల్లదనాన్ని నింపుకుని వున్నాయి. ఎంతోసేపు అలా బయట తిరుగుతూ శూన్యంగావున్న లాను దగ్గరకెళ్ళింది. అది తప్పితే ఆమెకింకే చోటూ మిగలలేదు. లాన్‌లో చల్లగాలి వీస్తుంది. అటూ ఇటూ వడగళ్ళు కుప్పలాగా ఇంకా వుండి నెమ్మదిగా కరుగుతున్నాయి. ఇంట్లో తన కొడుకు పుట్టినరోజు మందు పార్టీ జరుపుకుంటుంటే ఎంతోసేపు ఆ పెద్ద వయసులోనున్న తల్లి ఆ పార్క్‌లోని విరిగిన బెంచి మీద, చలికి వణుకుతూ వుండాల్సివచ్చింది. ఒక నిష్ప్రయోజనమైన, పనికిమాలిన మందుతో కూడిన విందు నుండి పారిపోయి ఆ చీకట్లో ఒంటరిగా కూర్చునివున్నది. ప్రొద్దుపోతుందని పార్కు నుంచి బయటికొచ్చింది. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. బస్టాపూ, రైల్వేస్టేషనూ, అటూ ఇటూ తిరిగే జట్కాబళ్ళూ, మార్కెట్టూ కాలనీ, అంతటా నిశ్శబ్దం, అంధకారమూ. అ నిశ్శబ్దమే ఒక వరదలాగా పట్టణాన్నంతా మింగేస్తున్నది. వస్తూ వుంటే స్కూల్ దగ్గరుండే కాపలాదారు, ప్రక్కనున్న కిళ్ళీ షాపతనూ ఆదమరచి నిద్రపోతున్నారు. ఈ వర్షానికి ప్రాణి అనేది ఎవరూ బయట కన్పడలేదు. తొమ్మిదిన్నర అయివుంటుంది. వస్తూ చూస్తే హల్వాదుకాణం తెరిచివున్నది. అతనొక్కడే కూర్చుని భజన గీతాన్నొకదానిని పాడుకుంటూ వున్నాడు. అమ్మ అడుగులు ఆ షాపులోకి నడిచాయి.

ఆమె ఒక దొన్నెలో రసమలై తీసుకున్నది. పుట్టినరోజు నాడు పిల్లవాడి నోరు తీపి చెయ్యలేదనుకుంటూ ఆ దొన్నెను పట్టుకుని ఇంటికొచ్చి చూసింది. అప్పటికందరూ వెళ్ళిపోయారు. గదిలో కొడుకూ, అతని మిత్రుడూ మత్తులో పడివున్నారు. అటు ఇటూ చెల్లా చెదరైన గ్లాసుల మధ్యలో ఈరసమలై దొన్నె పెట్టింది. ఒకసారి కొడుకు తలకూడా సరిచేసింది. కాని అతను స్పృహలో లేడు. ఆమె తన గదిలోకొచ్చింది. చాలా రాత్రయింది. కొడుకు స్నేహితుడు తూలుకుంటూ బయటికొచ్చాడు. రమాశంకర్ రసమలై ఏమన్నా తిన్నాడా అని ఆరాటంగా అడిగింది.

ఆ స్నేహితుడు అర్థమయ్యీ కాకుండా తలవూపాడు. ఆమె హతాశురాలైంది. ఈ తాగుబోతుతోనే తన ఆవేదన చెప్పసాగింది. నేను రసమలై వాడి దగ్గరగా వుంచాను. రమాశంకర్ దానిపై చెయ్యి కూడా వెయ్యలేదు అన్నది బాధగా. ఆమె ఎందుకంత దయనీయంగా అవుతుందో తెలియదు. ఇంకా రోడ్డుమీదకెళ్ళే ఆ స్నేహితుణ్ణి ఆపి "విను. విను. రమాశంకర్‌ను లేపి తినమని చెప్పగూడదా అని అడుగుదామనుకున్నది."

హారతి ఇస్తూ, ఇస్తూ అతని చేయి వేగంగా ఒక నిశ్చితగతిలో గుండ్రంగా తిరగసాగింది. ఎవరైనా శంఖం ఊదితే భక్తుల కునికిపాట్లు తేలిపోతాయి. అతనెక్కువసేపు అక్కడా వుండలేదు. రమాశంకర్ దేవుని విగ్రహం ఎదుట కూర్చోవటం, లేవడం, అటూ ఇటూ పడటం చేయసాగాడు. దీపపువత్తి ఎపుడు ఆరిపోయిందో తెలియదు. అతని శరీరంలోని లోపలి ఆకృతి మరలా తన అరుపులు ప్రారంభించింది.

"రమాశంకర్! నీ శరీరం కేవలం పాపం యొక్క ఘనీభూతస్వరూపమే. పంచభూతాల స్వరూపం అనేదేమీ నీలో లేదు. కరుణార్ధ్రతల తారళ్యంకాని, భూదేవి కుండే సహనశీలతకాని, వాయువుకుండే వేగం కాని, అగ్ని యొక్క తేజస్సు కాని, ఆకాశానికుండే మహోన్నత్వం లాంటి వేమీ నీకు తెలియవు. పాపపంకిలమైన తన అస్తిత్వాన్ని ఈశ్వరుని చరణాల వద్ద ఎలా అర్పణ చేయగలవు?" అని.

ఇప్పుడు నాకెక్కడా విముక్తి లేదు గతంలో, వర్తమానంలో బంధింపబడిపోయాను. నాకెంతో అశాంతిగా వున్నది. ఈ లోకంలో నేను చెడిపోయాను. నాకోసం పరలోకం అంటూ వుండదు. నా అలవాట్లు అనే ఉరితాళ్ళతో నన్ను నేనే బంధించి వేసుకున్నాను. కాబట్టి నాకు విముక్తి అనేదే లేదు. ఈ విషయాలన్నీ ఈ గ్రామ వాసులకు చెప్పాలి. నా పట్ల వారు కనపరచే శ్రద్ధకూ, గౌరవభావానికీ నేను తట్టుకోలేకపోతున్నాను. ఈ పాపాత్ముడు ఇక్కడ సంవత్సరాల పాటుండి ఈ గుడినంతా మలినం చేసేశాడు.మీరంతా కలసి దీన్ని శుభ్రం చేసుకోవాలని చెప్తాను. ఎంతో ఉదారత్వంతో వీరంతా నావెంట వస్తున్నారు. కానిలోలోపల నేను ఒంటరినే.

ఆనాడు నా పట్టణంలో పనీపాట లేని వారు ఎంతో మంది నా వెంట తిరిగేవారు. అందరం కలిసి ఎన్నో చర్చలు చేసేవాళ్ళం. అమ్మ భయం అనే ఊబిలో కూరుక్కుపోయింది. "మాయింటికి ఏకొత్వాలో రావచ్చు. సైనికులో, రక్షకభటులో రావచ్చు. వచ్చినవారు రమాశంకర్ జాడచెప్పమని తనను వేధించవచ్చు. వీధిలోని వాళ్లందరి ముందూ పరువుపోవచ్చు. భయం అనే ఆ ఊబిలో నుండి బయటకు రావటం అమ్మకు సాధ్యం కావటంలేదు. గుండాగిరి కొడుకు చేస్తే దాని పూర్వాపరాల బాధను అమ్మ అనుభవించింది. ఎదుటి వారికి ఆమె ఎల్లప్పుడూ గాభరాగా కనుపించేది. ఏ కొత్త వ్యక్తి లోపలికొచ్చినా ఏ సోదా చేయటానికో వచ్చారని భావించేది. ఇక బేడీలు వేసి పట్టుకుపోవటమే తరువాయి అని భావించేది. అవి నిజంగా చాలా చెడ్డ రోజులు. ఇంట్లో సామానంతా ఒక్కటొక్కటిగా చివరకు అలారం గడియారం కూడా అమ్ముకోవలసివచ్చింది. ఆమె నగలతో సహా అమ్ముడయిపోయాయి. సామాను ఇంట్లో నుంచి వెళ్ళిపోయిన తర్వాతే ఆమెకు తెలిసేది. ఇన్నాళ్ళూ వాటినెంత జాగ్రత్తగా దాచాను. వాటిలో ఎన్నో జ్ఞాపకాలు వున్నాయి. అనే బాధే ఆమెకు ఎక్కువగా కలిగి "నా చావును నేను బతికి వుండగానే చూస్తున్నాను" అనుకున్నది. తమ పెరట్లోని జామకాయలు తెంపుకుపోయిన పిల్లల్ని గూడా విపరీతంగా దండించాడు రమాశంకర్. ఇప్పుడతని పేరు చెప్తే వీధంతా ఒణుకుతున్నది. అహంకారాన్ని తన భుజాలపై వేసుకుని తిరుగుతూ ఇతరులకు దుఃఖాన్ని కలిగిస్తున్నాడు.

ఒకరోజు రమాశంకర్ ఇంకో ఎత్తు వేశాడు. అమ్మ పూజా మందిరం నుండి ఒక చిన్న పాత విగ్రహాన్ని దొంగిలించాడు. బయటమార్కెట్‌లో ఆ విగ్రహానికి చాలా విలువవున్నది. విగ్రహం దొంగతనం సంగతి అమ్మకు తెలిసి ఆమె పోట్లాట, తగాదా ఏమీ లేకుండానే మనిషంతా గడ్డకట్టుకుపోయినట్లయింది. ఆ స్థితిలో వున్న అమ్మను, ఆమె తను పెదవులను గట్టిగా అదిమేసుకుని బాధంతా సహించిన అమ్మ ముఖం గుర్తుకొస్తే ఇప్పటికీ రమాశంకర్ విహ్వాలుడైపోతాడు.

మరలా రోజులు మారాయి. చీకటి పడటంతోనే తమ ఇంటి వరండాలో అసాంఘిక శక్తులు చేరేవి. అర్ధరాత్రివరకూ వాళ్ళకుప్పిగంతులు సాగుతూనే వుండేవి. ఎన్నో దందాలు, మధ్యవర్తిత్వాలు నడిపి రమాశంకర్ తన ఆదాయాన్ని బాగా పెంచుకున్నాడు. అప్పుడప్పుడు ఇంట్లో తిరిగే దుష్టశక్తులు అమ్మ పూజగదిలోకి కూడా తొంగిచూస్తూ, తులసికోట మీద ఎక్కికూర్చుని నోటికొచ్చిన ప్రేలాపన చేస్తూ వుండేవాళ్ళు.

ఒకరోజు ఉదయాన్నే ఒకట్రక్కు నిండా ఇసుక, ఇటుకా, సున్నం పేర్చుకుని పనివాళ్ళు గునపాలవి తీసుకుని మరీ వచ్చారు. వారు వచ్చాక అమ్మకు తెలిసింది. తన ఇంటి వసారా వీళ్ళ పనులకు సరిపోక పెద్దదిగా మార్చికడుతున్నారని, ఆ మార్పులో అమ్మ పూజగదీ, తులసి కోటా ధ్వంసమైపోయి, శిధిలాల గుట్ట మిగిలింది. రోజంతా అన్నీ పగలగొడుతూనే వున్నారు. ఆ రోజంతా అమ్మ కంపిస్తూ "ఎంత దుర్దినం, దేవుడి గది కాదు కూలింది. నేనే కూలిపోయాను" అని రోదించింది.

రమాశంకర్ సాయంకాలానికి ఇంటికొచ్చి చూస్తే ఏదో హత్యజరిగిన వాతావరణంలాగా అనిపించింది. మర్నాటి ఉదయమే ఇంట్లో అమ్మలేదు. నాన్నగారి జ్ఞాపకంగా ఆయన వేసుకున్న కోటు, ఆయన వ్రాసుకున్న కలం, వాటితో పాటు మరికొన్ని ముఖ్యమైన వస్తువులు మూటకట్టుకుని రాత్రికి రాత్రే ఎక్కడకో వెళ్ళిపోయింది. ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి ఆమె వెళ్ళిపోయి. ఎక్కడెక్కడో వెతికాడు ఆమె కోసం ఫలితం శూన్యం.

తిరిగి తిరిగి అంతటా వెతుక్కుంటూ ఈ గ్రామపు కాలిబాట వెంటపడి ఇక్కడకు చేరాడు. మనసులో భారాన్ని నింపుకునే యాంత్రికంగా గుడి పనులు చేస్తున్నాడు. మధ్యమధ్యలో అమ్మ గురించిన ఆలోచనలు, అమ్మ ఎక్కడికి వెళ్ళివుంటుంది. ఒకవేళ తన్ను తాను అంతం చేసుకున్నదా? ఏమో? అలాగే జరిగిందేమో? ఆ హత్యాపాపం నాదే అనుకునేవాడు రమాశంకర్.

"పండిట్ జీ! మా యింట శ్రాద్ధం పెట్టటానికి రావాలి. మీ గురించి ఆ బెనారసీ ఆయన చెప్పాడు" అంటూ ఒకరి పిలుపు వినిపించింది రమాశంకర్‌కు.

సుత్తి ఒకటి తీసుకొని తలమీద కొడుతున్నట్లుగా బాధపడుతూ శ్రాద్ధకర్మ చేయించాలా? నా తల్లికే కర్మలు చేయకుండా వదిలేసిన దౌర్భాగ్యుణ్ణి. ఇతరుల కర్మకాండలకు బయలుదేరాలా? అన్న ఆలోచనల భారంతో పడివున్నాడు. ఒక్కసారిగా జ్వరం ముంచుకొచ్చినట్లుగా అయిపోయాడు.

అతని స్థితి చూచి "దుప్పటి కప్పుకోండి పండిట్ జీ. అని" ఒకరు సలహా ఇచ్చారు. "మరొకరు మేం కొంచెం తలపట్టమా? ఇంకేదైనా చేయాలా?" అనడుగుతున్నారు.

రమాశంకర్ ఏమీ మాట్లాడకుండా మంచమ్మీదే ఒత్తిగిలిపడుకున్నాడు.

"మందులు వేసుకోండి పండిట్ జీ! లేకుంటే జ్వరతీవ్రత బాగా ఎక్కువవుతుంది. అంటూ ఎవరికి తోచిన సహాలు వారు ఇవ్వసాగారు.

జ్వరం వస్తే వస్తుందిలే. నాకింతకంటే పెద్ద శిక్షలు కావాలి. జ్వరపీడితునిగావున్నా, తను సత్యాచరణపట్ల, సదాచారాలపట్ల, పాప పుణ్యాల మీద ప్రవచనం ఇవ్వగలడు. విన్న ప్రజలు నా పాద ధూళిని తీసుకుని మరీ వెళతారు" అనుకున్నాడు.

తన గతాన్నంతా మర్చిపోవటానికి ఇక్కడికొచ్చాడు తను. తన గొణుగుడునే ప్రవచనాలుగా భావించి ప్రజలు నన్ను నెత్తిమీద పెట్టుకుంటున్నారు. తననొక పవిత్ర ఆత్మగా భావిస్తున్నారు. తానేమో లోపల అపరాధ భావానికీ, వెలుపలి గౌరవ సత్కారానికీ మధ్య నలిగిపోతున్నాడు.

జ్వర తీవ్రత ఎక్కువైంది. తన రెండు చేతుల్తో శిరస్సును గట్టిగా అదుముకున్నాడు. హారతి సమయమైంది. ఈ రోజు తను లేకుండానే హారతి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. అంతకంతకూ అశాంతి పెరిగిపోతున్నది. తానెక్కడ ఆలోచనలను మొదలుపెట్టి ఎక్కడకు వెళ్తున్నాడు? తనకళ్ళు విప్పార్చుకుని తనను చుట్టుముట్టే అంధకారాన్ని చూడటానికి ప్రయత్నం చేసేదెవరు! ఇంకెవరు? ఎప్పుడూ అరచి గోలచేసే తనలోపలి ఆకృతే. విశ్రాంతిగా కూర్చుని తన జబ్బుని తమాషాగా చూస్తున్నది. చిరకాలంగా అసంతృప్తితోనూ, క్షోభతోనూ రగులుతుంది.

ఏదో రైలు వచ్చి ఆగినట్లు, ఎక్కడికో వెళ్ళాలన్నట్లుగా పారిపోయే, రమాశంకర్ చేతితో తడుముతూ చెప్పుల్ని వెదుక్కుంటున్నట్లుగా అన్పిస్తుంది. ఎక్కడికైనా వెళ్ళాలన్న ఉద్దేశ్యం రాగానే మనస్సు, శరీరం విడిపోతున్నాయి. కాని ఈ ఆలోచన ఒక విధమైన మత్తు లాగా మనస్సుకెక్కుతుంది. చీకట్లో తడుముకుంటూ చేతులు చెప్పుల్ని వెతుక్కుంటూనే వున్నాయి. ఇంకా రకరకాల ఆలోచనలు.

తన చుట్టు పక్కలున్న గోడలన్నీ నెమ్మది నెమ్మదిగా పైకిలేస్తూ సరాసరి ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నాయి. బలమైన రాతితో కట్టబడిన అబేధ్యమైన కోట. లోపలున్న ఖైదీ పారిపోవాలని ప్రయత్నిస్తే సంకెళ్ళు మోగుతున్నాయి.ఇంతలో హడావుడి మొదలయ్యి ద్వారపాలకులు పరుగెత్తివచ్చారు. పారిపోవటం అసంభవం. అంటూ తన లోపలున్న ఆకృతి భుజాల మీద ఎక్కికూర్చున్నది. గట్టిగట్టిగా అరుస్తున్నది "ఎక్కడికి పారిపోతావు? చెప్పు. నేను కూడా వింటాను. నేనూ నీ వెంటే నడుస్తాగా" అని.

హారతి గంటల ధ్వనీ, శంఖ ధ్వానం, చప్పట్ల మోతా అన్నీ జ్వరతీవ్రతలో వినపడుతున్నాయి. చేతనావస్థ నుండి అచేతనావస్థలోకి జారిపోతున్నాడు. కొంచెం సమయమే మిగిలివున్నది. తను త్యాగం చెయ్యబోతున్నాడా? తన పాదాలలో ఏదో మర్మర ధ్వని మొదలైంది. ఇలాంటి భావనలతో తొట్రుపడి లేచి కూర్చున్నాడు. ఊహు. ఇంకా అచేతనావస్థే. మసకమసకగా వున్న దారి వెంట నడుస్తూ గమ్యాన్ని చేరుకోవాలని, రైలెక్కి ప్రయాణం చేయాలని అనుకుంటున్నాడు. ఆ రైలు ఎక్కడెక్కడ ఆగుతూ, చివరికెక్కడికి

చేరుకుంటుందో తెలియదు. తనకు రైలుకూత వినబడి సమయానికి చేరుకోగలడా? అదుగో గార్డు పరుగెత్తుకొస్తున్నాడు. మసక చీకట్లో ఎఱ్ఱని లాంతరు వెలిగించి తెస్తున్నాడు. ఛలో. వెళ్ళు, సమయమైపోయింది. వెళ్ళ. రమాశంకర్ వెళ్ళు అంటున్నాడు. తను సంకోచిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాడు. రైలు లోపలికెళ్ళ నివ్వకుండా ద్వారం దగ్గర జనం గుమిగూడివున్నారు. ఏం చేయాలి? అనుకున్నాడు.

“పండిట్ జీ, మీరు బాగా విశ్రాంతి తీసుకోండి. మేం మీకోసం స్వయంగా ప్రసాదం తయారుచేసి తీసుకొచ్చాం”. అన్నారొకరు. మరొకరు రమాశంకర్ పాదాలు తాకి నమస్కరించారు. లేవకండి. లేకవండి పండిట్‌జీ. హారతి కోసమా మీరు రాబోయేది? ఇంత జ్వరంలో ఎక్కడికి వస్తారు? అంటూ చేయి ఆసరా ఇచ్చి మంచందాకా తీసుకొచ్చి పడుకోబెట్టారు. అతన్ని చుట్టుముట్టి శ్రద్ధగా చూస్తున్నారు ప్రజలు.

“నేనంతా ఈ ప్రజలకు చెప్పివేయాలి. ఎప్పటికప్పుడు చెప్పెయ్యాలనుకుంటున్నాను. కాని నాలో చైతన్యం లోపిస్తుంది. నాలుక, మాట అంతా మూగబోతున్నది. కేవలం పెదవులే కదులుతున్నాయి.” అంటూ గొణుక్కున్నాడు.

“మీరేం బాధపడవద్దు పండిట్‌జీ, గుళ్ళో మీరు లేకపోయినా మేం అంతా చక్కగానే నిర్వహించగలం.” అని మరొకరు చెప్పారు.

రమాశంకర్ గొణుగుడు విని అతని నోటి దగ్గర చెవిఒగ్గి వినాలని ప్రయత్నం చేశారు. కొంచెం కూడా తెలియలేదు. “పండిట్‌జీ హారతి టైమయిందనే చెప్తున్నారు ఇంకేం కాదు. వారికి అనారోగ్య సమయంలో కూడా భగవంతుని యావే” అన్నారు.

పండిత రమాశంకర్ తన పూర్తి శక్తినుపయోగించి ప్రతికూల పద్ధతిలో తల తిప్పుకుంటున్నాడు. అతని లోపలున్న ఆకృతి ఇపుడు అతని భుజాల నుంచి మందిరపు శిఖరంపైకెక్కి కూర్చున్నది. అతని ఈ స్థితిని చూచి పొర్లుగింతలు పెడుతూ పొట్టపట్టుకుని నవ్వుకుంటున్నది.

## శ్రీ జయశంకర ప్రసాద్ కవి పరిచయము

జీవన రేఖలు : 1889 జనవరి 30వ తేదిన ఉత్తరప్రదేశ్ నందలి వారణాసిలో జన్మించారు. ప్రాథమిక అభ్యాసంతోనే స్కూలును వదిలిపెట్టారు. ఆ తర్వాత ఇంట్లో వుండే ఇంగ్లీషు, సంస్కృతం, పాలీ, ప్రాకృత లాంటి భాషల్ని నేర్చుకున్నారు. అంతేకాక భారతీయ దర్శనాలు, చరిత్ర, సాహిత్య సంస్కృతులను బాగా ఔపోసన పట్టారు. ఆ జ్ఞాన సముపార్జనంతా వారి రచనల ద్వారా పాఠకుల కందించారు.

వృత్తి వ్యాపారాలు : నస్యము, పొగాకు వ్యాపారాల్లో వీరి కుటుంబం ప్రసిద్ధి చెందింది. తండ్రితో పాటు బాల్యంలోనే చాలా ప్రదేశాలను తిరిగివచ్చారు. కుటుంబ సభ్యులందరి మరణంతో జయశంకర ప్రసాద్ తన వారసత్వపు వ్యాపారాన్ని చూచుకోవాల్సివచ్చింది. వీరు 1937 నవంబరు 15న స్వర్గస్థులయ్యారు.

సాహిత్య సృష్టి : హిందీ సాహిత్య శ్రేష్ఠ సృష్టికర్తల్లో అగ్రగణ్యులుగా జయశంకరప్రసాద్ పేరుగాంచారు. తక్కువ వయసులోనే మరణించినా ఆ చిన్న జీవితంలోనే సాహిత్యపు విభిన్న పార్శ్వాలను స్పృశించి భారత దేశ చరిత్రను, మానవుని అనేక మనోవృత్తులను అత్యంత సామర్థ్యంగా చిత్రించారు.

కథలు : వీరి కలం నుండి జాలువారిన కథలు వీరికి కథా సాహిత్యంలో ఒక వున్నత స్థానాన్ని కల్పిస్తున్నవి. వీరి నాటకాలు, నవలలు, కావ్యాల వలె వీరి కథలు కూడా ఒక ప్రత్యేక శ్రేణికి చెందినవిగా సాహిత్య సమాలోచకులు భావిస్తున్నారు. అందువలన వీరి కథలు చదివిన పాఠకులు ఎంతో ఉత్తేజితులవుతూ, మానసికోల్లాసాన్ని పొందుతారు. పురస్కార్ గుండా, మధువా మొదలగు కథలు చాలా ప్రాచుర్యం పొందినవి.

ప్రముఖ రచనలు : ఝర్‌నా, ఆంసూ, లహర్, కామాయనీ, స్కంద్ గుప్త్, చంద్రగుప్త్, ధ్రువస్వామినీ, జనమేజయ్‌కా నాగయజ్ఞ్, రాజశ్రీ, విశాఖ్ కామనా, కంకాల్, తితలీ ఔర్ ఇరావతి చాలా ప్రసిద్ధిపొందినవి.

"ఘీసూ" అన్న కథలో (చెదిరిన స్వప్నం అన్నపేరు పెట్టాను) ఆనాటి సామాజిక పరిస్థితులు, ఒక అమాయక ప్రేమికుని బలిదానం, అల్యాంత సహజంగా వర్ణించబడి వున్నది. "చూడీవాలీ' (విలాసిని) కథలో వేశ్యావృత్తి నుండి తప్పుకుని కులవధువుగా జీవితం గడపటానికి ఒక యవతి చేసిన ప్రయత్నమే కన్పిస్తుంది. విలాసిని పాత్ర పాఠకుల ఆదరణను పొందుతుంది. ఆభిజాత్యపుపొరలు కరిగిన విధానమూ ఆకట్టుకుంటుంది. "ఆకాశదీపం" అనే కథ హిందీ కథా సాహిత్యంలో ఆణిముత్యమంటిదని పరిశీలకుల భావన, ఈ కథలో భారతీయ మహిళ తన ఆత్మ గౌరవాన్ని, ఆత్మ ప్రభోధాన్ని కాపాడుకున్న విధానాన్ని పాఠకుల కళ్లముందు సాక్షాత్కరింప జేస్తారు. 'చంప' పరిస్థితికి వగచే పాఠకులను రచయిత తన వర్ణనలతో ఊరడించే సఫలీకృత ప్రయత్నమూ చేస్తారు. 'ఆంధీ" కథ నిజంగా తుఫాను లాగే వివరంగా, తీవ్రంగా విస్తరించిన కథ. ఇందలి భారత ఔన్నత్యం, భారతీయ శిల్ప, చిత్రకళా వర్ణన పాఠకులకు ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. అలాగే మానవుని మానసిక దౌర్బల్యాలు, బౌద్ధుని విశాల, ఉదార స్వభావమూ, చాలా విపులంగా చర్చించబడ్డాయి. లైలా తుఫానులాగే విజృంభించి ప్రకృతిలో కలసిపోయి పాఠకుల మనసులో తుఫాను వాతావరణాన్ని మిగిల్చి వెళ్ళే ఉదంతం పాఠకుల మనస్సులపై చెరగని ముద్ర వేస్తుంది. తుఫాను అన్న పేరు ఈ కథకు ఎంతో సార్థక నామంగా ఉన్నది.

# విలాసిని

"చేతులకు కొత్త గాజులే వున్నాయిగా ఇంకేమిటి" అన్నది ఆ ఇంటి ఇల్లాలు.

"కోడలమ్మా! ఇవి చాలా మంచి గాజులు. బొంబాయి నుంచి సరాసరి ఇక్కడికే పార్శిలు వచ్చింది. ప్రభువులు ఆజ్ఞాపిస్తేనే తెప్పించాను. పార్శిలు వస్తూనే తీసుకుని మీ దగ్గరకు వచ్చాను" అన్నది గాజులమ్మి.

"వెళ్ళు. వెళ్లి మీ ప్రభువులకే ఇవ్వు. వీటినిపుడు నా చేతులకు వేయించుకోలేను."

"కోడలమ్మా! కొంచెం వీటివంక చూచి మాట్లాడండి" అంటూ ఆ ఇంటి ఇల్లాలి మాటలనేం లక్ష్యపెట్టక వద్దన్నది గదా అని ఏ మాత్రం వెరపూ లేకుండా ఆ గాజులమ్మి తన గాజులమలారం తెరువసాగింది. ఆ గాజులమ్మి పాతికేళ్ళ వయసుతో అందంగా వుంటుంది. తెల్లని శరీరచ్ఛాయలో ఆసాంతం మెరిసిపోతూ వుంటుంది. ఆవిడ మణికట్టునిజంగా గాజులు ధరింపజేయటానికే పోతపోసినట్లు వుంటున్నది. తాంబూలంతో ఎఱ్ఱనైన సన్నని పెదవులు. ఆ అధరాలు రెండు మూడు చోట్ల గీతలతో వుండి తమ రహస్యాలను దాచుకున్నట్లుగా వున్నాయి. ఎవరి మనసులకైనా ఆమెను మరీ మరీ చూడాలని అన్పిస్తుంది. చూసిన తర్వాత నవ్వాలనే వాంఛ కలుగుతుంది. ఆమె నవ్వులో బాల్యపుదుందుడుకుతనం, యౌవనపు శీతలత్వం, ప్రౌఢతనపు గంభీరత, విద్యుత్ వలె సరసరా పాకిపోతాయి.

కోడలమ్మకు ఆమె నవ్వంటే చాలా అసహ్యం. ఆమె తన ఐదువేళ్ళ మణికట్టుతో తన చేతిని పట్టుకుని గాజులు ఎక్కిస్తూ తనను ఇబ్బంది పెడుతూ, వంకర నవ్వు నవ్వుతూ "ఒక పాన్ అయినా లభించకపోతే గాజులు మీ చేతులకు ఎక్కనంటున్నాయి" అంటుంది. అపుడు కోడలమ్మకు కోపంతో పాటు నవ్వూ వచ్చేది. కాంతివంతమైన ఆవిడ నవ్వుల మధ్య గాజులమ్మి తన పని పూర్తి చేసేది.

కొద్ది రోజుల్నుండే ఈ గాజులమ్మి ఇంటికి రాసాగింది. అప్పుడప్పుడూ కబురు పంపకుండానే వచ్చి తన పని పూర్తయినా వెళ్ళకుండా వుండేది. బాబుగారు వచ్చేదాకా వుండి కనపడిపోతాననేది. ఇది కోడలమ్మకు చాలా అసహ్యమనిపించేది. ఈ రోజుకూడా కొత్త గాజులు తెప్పించానని, ప్రభువులు ఆజ్ఞాపించారనీ చెప్తూ వచ్చి కూర్చుంది. కోడలమ్మకు చాలా విసుగొచ్చింది. ఆ విసుగును మాటల్లో చూపిస్తూ "ప్రస్తుతం నీ దగ్గర గాజులు కొనేవాళ్ళు ఎవరూలేరా ఏంటి? మాటిమాటికి ఇటే వస్తున్నావు" అన్నది.

"అదేంటమ్మా? అలాగంటారు? మీలాంటి వారికి కొత్త కొత్త రకాలు తెప్పించే ప్రయత్నంలోనే వున్నాను. బయట నేను అమ్మటం చాలా తక్కువ." అంటూ అనేక డజన్ల గాజులు తీసి పరిచింది.

ఇంతలో స్లిప్పర్ల శబ్దం వినిపించింది. ఇంటి కోడలు మాత్రం గబగబా తన దుస్తుల్ని సరిజేసుకున్నది. సిగ్గూ, బిడియం ఏ మాత్రం లేని ఆ గాజులమ్మి మాత్రం చాపల్యమున్న బాలికవలె తల ఓరగాపెట్టి "ఇవి జర్మనీవి, ఇవి ఫ్రాన్స్ నుంచి వచ్చినవి, ఇవి జపాన్ నుండి తెప్పించాను అంటూ చెప్పుకుపోతున్నది. వాళ్ళ వెనుకే ఇంటి యజమాని నిలబడి చిరునవ్వులు చిందిస్తున్నాడు.

"రోజు రోజూ కొత్త గాజులు తెచ్చి తొడగమని ఆజ్ఞాపించారట ఈ గాజులమ్మిని అన్నది ఇంటి ఇల్లాలితనాన్ని, కొంచెం గర్వాన్ని మిళితం చేసి ప్రదర్శిస్తూ."

"తొడిగించుకో, అది కూడా అలంకరణేగా. ఇందులో తప్పేంవుంది?" అన్నాడు యజమాని.

"తప్పేం లేదు. గాజులు ఎక్కిస్తుంటే మణికట్టే బాధపడుతుంది" అని తలవంచుకుని ఓరచూపులు చూస్తూ గాజులమ్మి అన్నది. ఒక అలవంటి ఎఱ్ఱదనం కన్నులవైపు నుండి చెక్కిళ్ళను తడుముతూ పాకివచ్చింది. మనోలాలసతో వ్యంగ్యంగా ఆ యువతి మాట్లాడటం అతనికర్థమయింది. అతని హృదయంలో ఏదో గడబిడ మొదలైంది. పైకి మాత్రం గాభరాగా" మణికట్టుకిబ్బందయితే గాజులు తొడిగించుకోవద్దులే" అన్నాడు.

"భగవంతుడే నా చేత రోజూ గాజులు తొడిగించుకునేటట్లుగా అనుగ్రహిస్తాడు చూడండి అంటూ ఆ గాజులమ్మి ప్రౌఢతనంతో ఆశీర్వచనం పలికింది."

"సరే నువ్వీరోజుకు వెళ్ళు అంటూ" తన భర్త వైపు, ఆ గాజులమ్మి వైపు మార్చి మార్చి చూస్తూ అన్నది.

"నేను తిరిగి మళ్ళీ వస్తాను. మీరే అన్నారుగా ప్రభువులకే గాజులు వెయ్యమని అంటూ ఇంటి యజమానిని రెచ్చగొట్టేటట్లు మాట్లాడింది. తనన్న ఆ మాటలకు భర్తకెక్కడ కోపం వస్తుందోనన్న ఆలోచన కల్గింది. వెంటనే కళ్ళు నిప్పులు చెరిగేటట్టు చూసి "నువ్వుముందిక్కడనుంచి వెళ్ళు" అంటూ గద్దించింది. ఆమె భర్తా నెమ్మదిగా బయటకు నడిచాడు. అపరాధి వలె గాజులమ్మి కూడా తన గాజులు సర్దుకుని లేచి నిలబడింది. గుండె వేగంగా కొట్టుకుంటుంటే తనలోని రహస్యాన్ని నిట్టూర్పు ద్వారా వెలిబుచ్చుతూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

గాజులమ్మి పేరు విలాసిని. ఆవిడ నగర ప్రసిద్ధ నాట్యకత్తె కూతురు. ఆమె రూపానికీ, సంగీతానికీ ఆ చుట్టుపక్కల చాలా పేరుంది. వైభవానికీ తక్కువేం లేదు. ఎంతో విలాసవంతమైన జీవితమున్నా సర్వ సౌఖ్యాలు కల్గించే సంభారాలెన్నో ఆవిడ భవనంలో వున్నా సంతోషం కలగటంలేదు. మనసులో ఏదో లోటు. వాస్తవానికి వృత్తిపట్లవున్న వ్యతిరేక భావమే అది."తాను కుల వధువు కావాలి. దాంపత్య స్వర్గ సుఖాన్ని, తనివితీరా అనుభవించాలి" అన్న ప్రగాఢ వాంఛ ఆవిడలో గూడుకట్టుకుని వున్నది. ఆ వాంఛతోనే,.. ప్రణయ వ్యాపారం పట్ల చాలా విముఖత కనపరుస్తున్నది. కాని సమాజం ఆమెను అనుమాన దృష్టితోనే చూస్తున్నది. హింసాపూరిత పశువుగానే భావిస్తున్నది. తెలిసి, తెలిసీ తనను ఎవరూ ఇంటి ఇల్లాలుగా అనుగ్రహించరని విలాసినికి అర్థమయింది. ఏదైనా మాయోపాయంతో పత్నీ గౌరవ సుఖాల్ని పొందాలని పొంచిచూస్తున్నది. సరళంగా వుంటూనే ప్రేమాశ్రయాన్ని కొల్లగొట్టాలని వెంపర్లాడుతూవున్నది. ఆమె వృత్తిలో ఆమె ప్రేమను ఖరీదు చేయాలనే చాలామందిముందుకు వచ్చారు. కాని విలాసిని తన హృదయాన్ని తెరిచి ఎవరినీ, ఆహ్వానించలేకపోయింది.

ఆ రోజుల్లో జమీందారు విజయకృష్ణ రూపం, యౌవనం, అతని చరిత్ర ఆమెను చాలా ప్రలోభపెట్టాయి. నగరానికి సమీపంలో విజయకృష్ణకు తన జమీందారీ హోదాకు తగ్గట్లుగా చాలా పెద్ద మేడవుంది. దాంట్లోనే భార్యతోపాటుంటాడు. అతని అనుచరులు, ప్రజలు అతన్ని ప్రభూ అనే పిలుస్తారు.

విలాసిని కళ్ళు విజయకృష్ణపై బడ్డాయి. తన చిరకాల వాంఛ పూర్తి చేసుకోవటానికి కొద్ది రోజులుగా ఈ గాజులమ్మి, అవతారమెత్తింది.

విజయకృష్ణ ప్రభువు గాజులమ్మిని, ఆవిడ మనసును ఎరిగుండి గూడా తెలియనట్లుగానే వుండిపోయాడు. ఐశ్వర్యపు ఆభిజాత్యం దాన్నొక వినోదంగా భావించింది. అందుకనే ఆవిడ రాకపోకలకెలాంటి అంతరాయం కల్పించలేదు. విలాసిని యొక్క కళాపూర్ణ సౌందర్యం అతని మనసు మీద కొంత ప్రభావం చూపింది. ఆ ప్రభావ కారణంగా అతడు సురచిపూర్ణమైన కారణాన్ని వెదకనారంభించాడు. కోడలమ్మ యొక్క అధికారం ఆమె వైభవ, సౌందర్య, రాజరిక మర్యాదలు చూసి గాజులమ్మి ఓటమిపాలై తనకు తానే పరాజయాన్ని ఒప్పుకుంటుంది, తన ప్రయత్నాలన్నీ నిష్ఫలమని గ్రహించి వెనుదిరిగిపోతుందని భావించాడు. అప్పటివరకూ వినోదిద్దాం అనుకుని తానూ ఆటను కొనసాగిస్తున్నాడు.

గాజులమ్మి తన ప్రగాఢ వాంఛను తీర్చుకోవటం కోసం ఎంత కౌశల్యాన్ని ప్రదర్శించినా సఫలం కాలేదు. కాని విజయకృష్ణ భార్య ప్రవర్తనను, ఆమె విసుగుతో కూడిన తిరస్కారాన్ని చవి చూసిన విలాసిని ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని భావించింది. తన మాటల ద్వారా జమీందారుకు కూడా భార్య మీద కోపం వచ్చేటట్లుగా, అతని మనసూ గాయపడేటట్లుగా చేయగలిగింది.

ఇప్పుడు ప్రభువైన విజయకృష్ణ బాహాటంగా విలాసిని దగ్గరకు రాకపోకలు సాగిస్తున్నాడు. ప్రకాశవంతమైన ప్రభాత సమయాల్ని కూడా విలాసిని తోటలోనే వీక్షిస్తున్నాడు. కుల మర్యాద, లోకంపోకడ, జమీందారీ అన్నీ ఒక వైపు. గాజులమ్మి ఒక్కతే ఒక వైపు.

లోగిట్లోని కుర్చీల్లో కూర్చుని ప్రభువులూ, విలాసినీ రాత్రి జాగరణ చేసిన అలసటను తీర్చుకుంటున్నారు. వారికి దగ్గర్లోనే దానిమ్మచెట్టొకటి వున్నది. దాన్నిండా ఎఱ్ఱని పూలు. ఒక చిన్న నల్లని పక్షి ఆ పూలను ముక్కుతో పొడిచి మకరందాన్ని తాగనారంభించింది. కొన్ని కేసరాలనూ తిన్నది. కోరిక తీరిన సంతృప్తితో, మోహావేశం కల్గించే కలధ్వానం చేస్తూ ఎగిరివెళ్ళింది.

చాలా సేపు దానివంకే పరీక్షగా చూసిన జమీందారు “ఈ పక్షిని బంధించి పెంచుకుంటే బావుంటుంది కాని మనకెలా చిక్కుతుంది?” అన్నాడు.

“ఊహు. అది పూల సాంగత్యి. పంజరంలో వుండదు. అది పూలున్న ప్రదేశాల్లోనే జీవిస్తుంది బంగారు పంజరాల్లో కాదు. దానికి తినటానికి పూలకేసరాలనే తిండి, పూలమకరందం అనే మదిర ఎవరు ఏర్పాటు చేయగలరు?” అన్నది విలాసిని.

“కాని దాని సుందరమైన కంఠధ్వని సంగీత కళకు పరాకాష్ఠగా వున్నది. అది చేసిన కలకల నాదంలో వీణలో పలికే గమకాలున్నాయి. ఎలాగైనా ఆ పక్షిని పట్టుకోవాలి” అన్నాడు పట్టుదలగా.

“దేని సౌందర్యం స్వచ్ఛందంగా వుంటుందో అది అసాధారణ ప్రాకృతిక కళ. అది బంధింపపడుతుందా? కోరరాని కోరిక ద్వారా అది కళంకితమవుతుంది. గౌరవనీయమూకాదు. బాధలూ, బంధనాలులేని దాన్ని మీరు పంజరంలో బంధించి గౌరవిస్తారా? దండిస్తారా?” అంటూనే విజయ

సూచకమైన, వ్యంగ పూరిత చిరునవ్వునొకదానిని ప్రదర్శించింది.

విజయకృష్ణకు మాత్రం ఆ అడవి పక్షిని పట్టి బంధించాలన్న కోర్కె ఎక్కువైంది.

పోనివ్వండి అది పెద్ద విషయం కాదు అంటూండగానే సంభాషణ వేరేవైపుకు మళ్ళింది. నిత్య సాధారణ వినోదాల్లో పడిపోయ్యారు.

"కోడలమ్మ యొక్క అపార ప్రణయ సంపత్తి నుంచి ఏదో కొంచెం నేను తీసుకుంటున్నాను. ఇందులో హాని ఏమీ లేదనుకున్నది విలాసిని. అటు కోడలమ్మకు తన ప్రణయంలో తనదే ఏకాధిపత్యమని గట్టి నమ్మకం.ఆమె నిష్క్రియా ప్రతీకారం చేయసాగింది. కాని క్షయరోగపు భయంకర దాడిలో ఆమె నిత్యం, కరిగిపోసాగింది. ఇటు విజయకృష్ణ వనవిహంగినియైన విలాసినిని తన పూర్తి అధీనంలోకి తెచ్చుకునే దాంట్లో మునిగిపోయివున్నాడు. దాంట్లో విజయుడయ్యాడు.

రోగికి సేవాశుశ్రూషల్లో లోటేమీలేకపోయినా కోడలమ్మ తిరిగిరానిలోకాలకు వెళ్లిపోయింది.

విలాసినికి "నా అనుభవం అక్కరకొచ్చింది. సంపూర్ణ విజయం లభించినట్లే"ననుకున్నది. కాని విషయం వేరుగావున్నది. విజయకృష్ణకు ఆమెఒక విలాసం మాత్రమే. తాననుకున్నది సాధించాడు. అనుభవించేదంతా అనుభవించాక ఇంకా తనతో పనేమున్నది?" విలాసినీ! శెలవన్నాడు."

"నేను మీ గాజులమ్మిని. మీరెక్కడుంటే నేనూ అక్కడే వుంటాను. నేను మీ దానిని. నా సర్వ సంపదా మీదే" అన్నది.

"వేశ్యకిచ్చిన సంపదను తిరిగి గ్రహించే అధముణ్ణికాదు" అన్నాడు.

ఆ మాటలకు గాజులమ్మి వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. ఏడుస్తూనే ఎంతో ప్రాధేయపడింది. గందరగోళం చేసింది. కాని విజయకృష్ణ తన రాజసాన్ని చూపిస్తూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

విలాసిని పరిపరి విధాల ఆలోచించింది. "నా వృత్తితో చేకూరిన విజయం ఒక గృహస్థును చెడగొడితే వచ్చింది. అలాంటి విజయంతో ఏ సుఖాన్ని పొందానో దానికి విలువేంలేదు. నేను కుల వధువును కావటానికి పనికిరానిదానినయ్యాను. సమాజం దగ్గర దీనికి సమాధానమేమీలేదా? నా ప్రతీకారం, నా ఈ తపస్సు స్వార్థం, త్యాగం అన్నీ వ్యర్థమేనా" అనుకున్నది.

స్త్రీ, పురుష సంబంధాల సమస్త అంతిమ నిర్ణయాన్ని తెలియజెప్పటంలో సమాజం ఎందుకు ఉదారంగా వుండదో విలాసినికి తెలియదు. ఎందుకంటే రెండు పక్షాలకు సర్వదా సంతృప్తి కలగదు. ఆ, ఆశా వుండదు. ఈ రహస్యం సృష్టిలోని చిక్కులను తన వైపుకు తిప్పుకునే తాళం చెవిలాంటిదని ఆమె గ్రహించలేదు.

ఆ తర్వాత గాజులమ్మి తన జీవన శైలిని పూర్తిగా మార్చుకున్నది. జమీందారు నుండి లభించిన సంపదనంతా అమ్మివేసి దగ్గరలో వున్న ఒక గ్రామానికి వెళ్ళింది. వ్యవసాయానికుపయోగపడే భూమినికొన్నది. మంచి గృహస్థులాగా వుండటానికి నిశ్చయించుకున్నది. చెల్లాచెదురైన తన మనస్సును

ఈ గ్రామీణ వాతావరణంలో కుదుటపరచుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఆమె ఇంటికి దగ్గరలో ఒక విశాలవటవృక్షం బాటసారులకు నీడనిస్తూ వున్నది. అక్కడే నిర్మల జలాన్నిచ్చే సరోవరమొకటి దప్పిక తీరుస్తున్నది. ఆ ప్రదేశంలోనే తానూ వుండి బాగసారులకు సేవ చేయాలనే సంకల్పాన్ని పెట్టుకున్నది. కొద్ది రోజుల్లోనే వ్యవసాయం ఫలించి ధాన్యంతో ఆమె ఇల్లు నిండింది. బికారులకు, భిక్షువులకు, బాటసారులకు అన్నంపెట్టి అనిర్వచీయమైన ఆనందాన్ని, తృప్తిని పొందసాగింది.

నెమ్మది నెమ్మదిగా కాలం గడుస్తుంది. యౌవనంలోని మూడవ భాగాలైన కరుణా, శాంతులు గాజులమ్మికిపుడు చెలికత్తెలుగా వున్నాయి. ఆమార్గం గుండా వెళ్ళే బాటసారులకు దూరం నుండే గానం విన్పిస్తూ వుంటుంది. "ఎవరి నాశనాన్నీ కోరవద్దు. ఎవరూ నాశనం కావద్దు" అనే పాట అత్యంత మధురంగా గాలితో పాటు ప్రయాణిస్తూ వీళ్ళ చెవులలో పడుతూ వుంటుంది.

"అనాధబాలుడునందూ, అతడూ గాజులమ్మి ఆశ్రయంలోకొచ్చాడు. శనగపప్పూ, బెల్లం అమ్మే దుకాణానొకదానిని నందూ చేత ఆవటవృక్షం క్రిందే పెట్టించింది. డబ్బులు ఇవ్వలేకపోయిన బాటసారులకు కూడా పప్పూ, బెల్లం ఇప్పించి నందూకు నష్టం లేకుండా ఆ డబ్బులు తాను చెల్లించేది. ఇప్పుడు బాటసారులందరికీ విశ్రాంతి తీసుకునే మజిలీ అదే. కొద్ది రోజుల్లోనే ఈ మజిలీ చాలా ప్రఖ్యాతి పొందింది.

ఆరోజు సంధ్యా సమయమైంది. పక్షులన్నీ గూళ్ళకు తిరిగివస్తూ కోలాహలంగా అరుచుకుంటూ వచ్చి వటవృక్షం ఎక్కి కూర్చున్నాయి. గాజులమ్మి వ్యవసాయం పనులు చూసే వ్యక్తితో మాట్లాడుతూ అక్కడ కట్టేసివున్న ఎడ్లను పరిశీలిస్తున్నది. వసారాలో దీపాలు వెలిగించారు. అంధకారం ఆమె ఇంటిలోను, మనసులోనూ, బలవంతంగా ప్రవేశించాలని చూస్తున్నది. కోలాహలంలేని జీవితంలో కూడా శాంతి లభిస్తుందన్న విశ్వాసం ఆమెకు లేదు. గాజులమ్మికి దగ్గర్లోనే వుండి కాలిపిక్కల దగ్గర్నుంచీ తల వరకూ రుద్దుకుంటూ, తోకవూపుతూ వున్నది పెంపుకు కుక్క. ఇంట్లో నుంచి దాని కోసం ఆహారం వచ్చింది. కాని దాని వంకకూడా చూడకుండా యజమానురాలివంకే చూస్తూ తన ప్రేమను ప్రదర్శిస్తూవున్నది.

గాజులమ్మి నవ్వుతూ "వెళ్ళు కలువా ! వెళ్ళి తిండితిను. ఇప్పటివరకూ ప్రదర్శించిన నీ మురిపాలు చాలింక" అంటూ తన చేతితో దాన్ని నిమిరింది.

స్నేహహస్తాన్ని చాచటంలో మనుష్యుడే చాలా బీదవాడు. ప్రేమాభిమానాలకై బిచ్చమెత్తాల్సివస్తుంది. ఈ విషయంలో అల్పప్రాణులయిన పశుపక్షులే ఎంతోనయంగా వుంటున్నాయి అనుకున్నది విలాసిని.

ఇంతలో నందూ వచ్చాడు. "అమ్మా! ఒక బాటసారి చాలా అలసిపోయివున్నాడు. ఆకలితో అలమటిస్తున్నాడు" అన్నాడు.

"నువ్వతనికి ఏమీ ఇవ్వలేదా?"

"అతడు తీసుకోవటానికి ఇష్టపడటం లేదు. నువ్వే కదు బీదవాడివి. నీ దగ్గర నేను తీసుకోలేను అంటున్నాడు."

ఆ చీకట్లోనే గాజులమ్మి ఆ వట వృక్షం దగ్గరకెళ్ళి చూసింది. చెట్టు మొదలుకానుకుని ఆ బాటసారి

పడుకుని వున్నాడు. గాజులమ్మి చేతులు జోడించి “అయ్యా! తమరేదైనా కొంచెం తీసుకోండి” అన్నది.

“నీవెవరు?” అనడిగాడు.

“మొదట నేనొక వేశ్యనని” బదులిచ్చింది.

“ఛీ.ఛీ. నామానాన నన్ను పడుండనివ్వు. నీతో మాట్లాడాలని నేననుకోవటం లేదు. ఎందుకంటే నీ వృత్తి వలన ఎన్ని కుటుంబాలు స్మశానాలుగా మారాయో?” అన్నాడు.

“మహరాజ్! మాది కళావంతుల వృత్తి. అపరాధమంతా కళలకు వెలకట్టి వారు మమ్మల్ని కోరే కోర్కెలను బట్టి వుంటుంది. ప్రపంచంలో చాలా చోట్ల నిర్లజ్జగా స్వార్థపూరితమైన వృత్తులే రాజ్యమేలుతున్నాయి. మా పట్ల అంత కోపమెందుకు” అనడిగింది.

“ఎందుకంటే మీ వృత్తి అన్నింటికన్నా నీచమైనది. నికృష్టమైనది కాబట్టి.”

“కానీ స్వామీ, నేను వేశ్యవృత్తిలో వుండికూడా ఒకే వ్యక్తిని ప్రేమించాను. నేను మరొక కుటిల ధర్మాన్ని ఎరుగను. ఆ మహానుభావుని వలన నాకు లభించినదానితో నేను సమాజ సేవే చేస్తున్నాను. ఈ ప్రాంతానికొచ్చిన వారెవరూ ఆకలితో వుండగూడదు. నా వృత్తి ఎలాంటిదైనా కానివ్వండి. నా అతిథి ధర్మానికి ఎలాంటి ఆటంకమూ వుండదు.”

ఆ బాటసారి ఒక్కసారిగా లేచికూర్చుని ఆ చీకట్లోనే కళ్ళు తాటించుకుని చూస్తూ “గాజులమ్మీ”! అన్నాడు.

“ఎవరూ? ప్రభూ! మీరా?” అన్నది విస్మయంగా.

“నీవు శోకాన్ని జయించావు. అపరాధమంతా నాదే. పాపంలో పుణ్యానికి కూ్కడా భాగముంటుందని తెలుసుకోలేకపొయ్యాను.”

“ప్రభూ! నేను గృహిణిని, కులవధువును కావాలని కఠోర తపస్సు చేశాను. ఇల్లాలితనంలో వున్న గొప్పదనం సేవ చేయటంలో వున్నది. విలాసాల్లో ఏమీలేదని ఈ నాలుగేళ్ళలో నాకనుభవమైంది.”

“ఇల్లాలితనంలో సేవేకాదు. అనంతయౌవనపు విలాసం కూడావున్నది. ఎందుకంటే స్త్రీ, పురుష శారీరక బంధంలోనే అది ఇమిడిలేదు. బాహ్యసాధనాల వికృత రూపాలకంతుండదు. దాంతప్య జీవితం, దానియొక్క ప్రాచుర్యం ప్రత్యేక సాధనాలుగా వుంటున్నాయి. ఇందువలనే దాంతప్యం అత్యంత ప్రియమైనది అది కోరుకోదగిన వస్తువుగా, కీర్తిగా, శుభంగా కూడా వుంటుంది. నీవిపుడు నీ సాధనలో సఫలీకృతురాలివయ్యావు.” అన్నాడు.

“నా సాఫల్యమంతా మీ దయే. ఇప్పుడు కూడా మీరు నిర్దయులుగా వుండకండి” అంటూ జమీందారు రెండు కాళ్ళూ పట్టుకున్నది విలాసిని.

ఆమె రెండు చేతులూ పట్టి పైకి లేవదీశాడు ప్రభువు.

## నవతరపు రచయిత్రి శ్రీమతి ఉషా మహాజన్

జీవన రేఖలు : వీరు సెప్టెంబరు **30, 1948**వ సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దేవరియా అనే ప్రాంతంలో జన్మించారు. అలహాబాద్ విశ్వవిద్యాలయ పట్ట భద్రురాలు. విద్యాభ్యాస కాలంలోనే అనేక చర్చల్లో పాల్గొన్నారు. అనేక పోటీల్లో విజేతలయ్యి పురస్కారాలూ పొందారు. కొంతకాలం అధ్యాపకురాలిగా పనిచేశారు. హిందీ భాషలో ప్రచురింపబడే అన్ని ప్రముఖ పత్రికల్లో వీరి రచనలు వచ్చాయి.

కథాసాహిత్యం : ఇస్‌బార్, రిక్త్, దౌడ్, వికల్ప్, మోహభంగ్, సాక్షీ, శోషిత్ మొదలగు కథలు రచించారు. కొన్ని కథల్ని ఇంగ్లీషులోకి అనువదించారు. "రాజ్ కమల్ పేపర్ బైక్స్" వారి కొరకు "కుష్వంత్ సింగ్‌జీ" ఇంగ్లీషు కథల్ని హిందీలోకి అనువదించారు. మరికొన్ని బాలసాహిత్య కథలనూ ప్రచురించారు.

ఈ తరపు కథా రచయిత్రుల్లో శ్రీమతి ఉషామహాజన్ పాఠకులకు సుపరిచితురాలు. వీరు మధ్య తరగతి ప్రజల మనోభావాలు, వారి ఆశలు, ఆకాంక్షలు, వారి నిజాయితీ, వీటన్నిటి పట్ల తనలోతైన ఆలోచనలతో సమర్థమైన భాషా శిల్పాన్ని జోడించి రచనలు చేస్తారు. పురుషుడు మానసికంగా జడుడయ్యి ఎలా ప్రవర్తిస్తాడో, స్త్రీ తనను చుట్టుముట్టే సమస్యల్ని, అసహ్య వాతావరణాన్ని కూడా జయించి విజేతగా నిలిచే సంఘటనలే ఈమె రచనల్లో ఎక్కువగా కనుపిస్తాయి.

జహర్ అంటే విషం. ప్రస్తుతం 'జహర్' అనే ఈ కథలో కూడా మన చుట్టు ప్రక్కల జరిగే సంఘటనలే తారసపడతాయి. అనుమానాన్ని పెంచుకుని, జీవితాన్ని కుటుంబాలను నరకం చేసుకునే మానసిక రోగులను గురించి చాలా విస్తృతంగా వర్ణించబడింది.

# విషం

అతను మరలా తన మణికట్టు తిప్పి గడియారం వంక చూసుకుంటూ ఇంతవరకూ ఇంటికి రాలేదు అనుకున్నాడు. మరీ అంత ఆలస్యమేం కాలేదు కాని రోజు రోజుకూ ఇంటికి రావటానికి ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావటం లేదు. తనేమో ఎక్కువసేపు గడియారంలోని టైమ్ చూస్తూ, ఎదుటి దర్వాజా వంక చూస్తూ గడుపుతున్నాడు. ఆఫీసు వదిలిం తర్వాత ఇంటికి చేరుకోవటానికి గంటా గంటన్నర సమయం పడుతుంది. చార్టర్డ్ బస్సు తప్పిపోయినా కూడా ఇంత ఆలస్యం కాదు. ఆ విషయం తనకు బాగా తెలుసు. తను తరుచూ ఆలస్యంగా ఇల్లు చేరుకుంటున్నది. మొదట్లో "ఇంత ఆలస్యమయిందేమిటి?" అని అడిగేవాడిని. కోపం వచ్చినా నా ప్రశ్నకు బదులిచ్చేది.

"దారిలో మిషను వాడి దగ్గరకెళ్ళి బ్లవుజ్ తెచ్చుకున్నాననేది. బ్యూటీపార్లర్‌కెళ్ళి ఐబ్రోస్ ట్రిమ్ చేయించాలనుకున్నాను. కాని వాళ్ళు ఆదివారం రమ్మన్నారు అని చెప్పేది. ఇంటిలోకి కావలసిన సామానంతా కొనుక్కొచ్చేది. వెంటనే ఆటో కాని, బస్సుగాని దొరకలేదు ఇబ్బంది పడ్డానని చెప్పేది." ఇప్పుడైతే నేనడగినదానికి ఇష్టముంటే జవాబు చెప్తుంది. లేకపోతే లేదు. ఆమె ఆడింది ఆటగా, పాడింది పాటగా వుంటుంది" అంటూ విపరీతపు ఆలోచనలు చేయసాగాడు. "దినేశ్‌గారూ!" అనే పిలుపు విన్పించింది.

ఉలిక్కిపడి మళ్ళా గడియారం వంక చూసుకున్నాడు. ఆమె రాలేదు. నా పిచ్చిగాని ఆమె ఎందుకింత తొందరగా ఇంటికొస్తుంది? దినేశ్‌గారూ? అని ఎప్పుడు పిలుస్తుంది? మొదట్లో ప్రేమగా "దీశూ!" లేదా "మిస్టర్ దినేశ్‌కుమార్!" అనీ పిలిచేది. యస్.యస్. అలాగే పిలిచేది. కాని ఇప్పుడు భర్తవైపు చూడటం కూడా తక్కువే. సూటిగా చూడకుండా చూపుల్ని అక్కడక్కడ వుంచుతూ మాట్లాడుతుంది. అది కూడా ఏ ఉపాయంతోనో, ఏదో ఒక నెపాన్ని సృష్టించుకుని మధ్యాహ్నం మందులు వేసుకున్నావా?వెళ్తూ, వెళ్తూ పండ్లవాడికి చెప్పెళ్ళాను. మా ఇంట్లోకి కావలసిన పండ్లు ఇవ్వమని, ఇస్తున్నాడా? లేదా? కరెంట్ బిల్ కట్టటానికి రేపే ఆఖరి రోజు. బిల్ కట్టకపోతే ఫ్యూజ్ తీసేస్తాడు. లేనిపోయిన తలనొప్పి అంటూ కుర్చీలో కూర్చుంటూనో, గది సర్దుతూనో, పేపరు తెరిచిచూస్తూ ఆమధ్యలోనో, చేసే పనుల ధ్వనిలోనో మధ్య మధ్య మాట్లాడుతుంది."

"దినేశ్‌గారూ!" మరలా పిలుపు వినిపించింది.

"ఓహ్!" ఇది మా పొరుగునున్న మిసెస్ చంద్రా గొంతు. సమయాసమయాలు చూడకుండా వచ్చేస్తుంది. ఈమె ఇంట్లో ఎప్పుడూ బీదరికం కాపురముంటుందేమో? ఉల్లిపాయకావాలనో, కోడిగ్రుడ్లు కావాలనో వస్తుంది. లేవని చెప్పినా వినిపించుకోదు. ఇంట్లో నా పెళ్ళాం నీలిమ వున్నప్పుడెప్పుడూ రాదు. నీలిమను ఇక్కడివారు ఎరగరు. ఎందుకంటే కాలింగ్ బెల్ కొట్టగానే తలుపు తీసేదీ, మాట్లాడేదీ ఈ దినేశే కనుక. బహుశా నన్ను భార్య లేనివాడనో, లేకపోతే పెళ్ళికానివాడనో అనుకుని వుంటారు. పెళ్ళి కానివాడని అనుకోకపోవచ్చు. ఎందుకంటే చిన్నూ రెండు గంటల ప్రాంతంలో స్కూల్ బస్ దిగి ఇంటికి

తిరిగి వచ్చేస్తాడు. వాడిని తీసుకునిరావటానికి ఈ దినేశే వెళ్తాడు. ఇరుగుపొరుగువారు వీరిని గమనిస్తూనేవుంటారు.

నిజానికిక్కడ బాగా సందడిగా, ఆనందంగా వున్నది. ఇక్కడి కాలనీ ఇంకా పూర్తిగా రూపు దిద్దుకోలేదు. ఎక్కువ మంది సాయంత్రం పూట పచార్లు చేయటానికి ఇటువైపు వస్తూవుంటారు. మరి కొంతమంది తమ ఇళ్ళు కొద్దీ, గొప్పా పనులు మిగిలివుంటే పూర్తి చేయించుకునేవారు వస్తూ వుంటారు. ఇంకా చేసిన పనుల్లో మార్పులు చేయించుకునే వాళ్ళూ వస్తూ, పోతూ వుంటారు.

“దినేశ్‌గారూ! ఇదిగోండి లడ్డూ ప్రసాదం. మా ఇంటి పన్లు పూర్తి కాలేదు. పూర్తయింతర్వాత హోమమూ అదీ చెయ్యాలి. అందుకని ఇప్పుడు క్లుప్తంగా గృహప్రవేశం చేశాం. కొద్ది ప్రసాదం మాత్రమే తెచ్చాను.” అంటూ పరిచయం చేసుకున్నది. తర్వాత నుంచీ రాకపోకలు సాగిస్తున్నది. మొట్టమొదటి సారిగా మిసెస్ చంద్రంను, ఆమె ముఖాన్ని ఇప్పుడే పరిశీలనగా చూశాను. మిసెస్ చంద్రం పేరు రత్న. భీమానీ హవుసింగ్ సొసైటీ క్రిందనున్న ఈ ఫ్లాట్స్‌లో ఎవరికీ ఏ గోప్యతాలేదు. అల్మారాల నుంచి మాటల వరకు అన్నీ కనుపిస్తూనేవుంటాయి. వినిపిస్తూనే వుంటాయి. ఎదురెదురుగా వున్న ఇండ్ల బెడ్‌రూమ్ కిటికీలు కూడా ఎదురెదురుగా వుంటాయి. రోజూ ఉదయం బాత్‌రూమ్‌లో టవల్ తీసుకుంటూనే చంద్రంగారు “రత్నా! ఓరత్నా! నా ధోవతీ, బనీనూ ఎక్కడ” అని గామా పహిల్వాన్ లాగా రంకెలు వేస్తాడు. ఇదుగో ఆమె మళ్ళీ దేనికోవచ్చి పిలుస్తుంది.

“దినేశ్‌గారూ! మీరు ఇంత మంచి ఆర్టిస్టని నాకు తెలియదు చిన్నూ చెప్పాడు “ఈ ఎదురుగా వున్న పెయింటింగ్ మీరే వేశారని” అన్నదామె.

అతనొకసారి రత్నవంక శ్రద్ధగా, నవ్వు ముఖంతో చూశాడు. వయస్సులో నిస్సందేహంగా నీలిమకన్న కొద్దిగా పెద్దదే అయివుంటుంది. నవ్వు ముఖం, మంచి రంగు మొత్తానికి పూర్తిగా సెక్సీగా వుంటుంది. దీనికన్నా కూడా ప్రత్యేకించి తనను ఒక ఆర్టిస్ట్‌గా గుర్తించింది. ఇది చాలు అనుకుంటూ “అవునండీ నాకు పెయింటింగ్స్ వేయటమంటే చాలా ఇష్టం. ఎంతో ఉత్సాహంగా కూడా వుంటుంది. డైనింగ్‌రూమ్‌లో వేలాడదీసిన పెయింటింగ్ కూడా నేను వేసిందే. మీరు దాన్ని చూడలేదనుకుంటాను.” అన్నాడు.

“ఓ.. ఇది కూడా మీరే వేశారన్నమాట. నిజంగా బాగా అందంగా ఆపెయింటింగ్‌ను వేయటమే కాకుండా మంచిగా తయారుచేసి గోడకుపెట్టారు. అన్నీ బాగానే వున్నాయిగాని దినేశ్‌గారూ! మొన్న మా ఆయన అంటున్నారు ఇంతకీ దినేశ్ గారు ఎక్కడ పనిచేస్తున్నారని” అన్నది ఆరాగా.

“ఖళ్.. ఖళ్.. క్షమించాలి.అంటూ నోటికి రుమాలు అడ్డుపెట్టుకుని కూడా దగ్గు ఉధృతాన్ని ఆపలేకపోయాడు. ఆమె వెళ్ళిపోయింది. దగ్గు వచ్చిన తీవ్రతా? ప్రశ్న తెచ్చిన ధాటీనా? మనసును పొడిచినట్లయి క్షణంలోనే ధమనుల్లో అంతకుముందు కల్గిన ఉత్తేజమంతా ఆవిరయిపోయి దాని స్థానేపిచ్చితిట్లు నోటి వెంట వచ్చాయి. దౌర్భాగ్యపుదానా, దొంగముండా! తలుపు కూడా వేయకుండా

పోయి సచ్చావు. మొగుడడిగాదంటనాగురించి. ఇది సంకరజాతి కుక్కలాగా నా దగ్గర మొరగటానికి వచ్చింది" అంటూ తిట్టుకున్నాడు.

"పనికిరాని వెధవను, పనీ పాటలేని ఏబ్రాసిగాణ్ణి ఏం చేయను? మెడకు ఉచ్చేసుకుని ఉరేసుకోవాలా? నౌకరీ పేరుతో కాలి చెప్పులు మోసే పన్లు నేను చెయ్యను. ఎక్కడైనా బతుకుతాను. ఎమ్మెస్సీ డిగ్రీ వుంది నా దగ్గర. అభిమానాన్ని చంపుకునో, తాకట్టుపెట్టో ఉద్యోగం చెయ్యాలా? గంటలో అరవై నిముషాలూ నీచమైన బాస్ నాకొడుకును సార్! సార్! అంటూ వుండాలి." అంటూ నోటికి వచ్చినట్లుగా మాట్లాడాడు. ఉద్యోగం వదులుకుని వచ్చిన దినేశ్.

నీలిమ వింటూ కూర్చున్నది గాని ఏమీ ఎదురు మాట్లాడలేదు. నర్మదా సిల్క్ మిల్స్ నుండి ఆరోజు ప్రొజెక్టర్ మేనేజర్ పదవినొదులుకుని ఢిల్లీ వచ్చేశాడు. అనేకంటే రావలసివచ్చింది అంటేనే సరిగా వుంటుంది. మరేదైనా ప్రయత్నం చేస్తే కలకత్తాలో ఇంకో ఉద్యోగం దొరికేది. కాని నీలిమ తల్లి ఢిల్లీ వచ్చి వుండమని చెప్పింది. ఆమె తన కొడుకు దగ్గర వుంటున్నది. ఢిల్లీలో బుక్ చేసుకున్న ఇల్లు తయారయింది. అద్దెకట్టే పనిలేదు. కూతురొచ్చి తనింట్లో వుంటే అంతకంటే కావలసినదేమున్నది? నీలిమ ఇక్కడే పెరిగి పెద్దయింది. ఇక్కడే చదువుకున్నది. కాబట్టి కలకత్తాలోని ఉద్యోగం వదిలి పెట్టి వెళ్ళాల్సివచ్చినా అంత దుఃఖం రాలేదు. ఎంతైనా ఢిల్లీలో వుండటం అదృష్టమనుకున్నది. కొంచెం కష్టపడితే నీలిమకు ఢిల్లీలోని ఒక మంచి ఫరమ్‌లో ఉద్యోగమూ దొరికింది. కలకత్తాలోనూ మంచి ఉద్యోగమే చేసేది. ఆడపుట్టుకా, అదృష్టమూ వుండాలి అనుకున్నాడు దినేశ్.

దినేశ్ చాలా ప్రయత్నాలు చేశాడు. తన ఆశల కనుగుణంగా, తన కోర్కెలకు తగ్గట్టుగా ఉద్యోగాన్ని పొందాలని. అది అంత సాధ్యం కాలేదు. సూరత్ సిల్క్‌మిల్ నుండి ఒక అవకాశం వచ్చింది. "ఢిల్లీ వదిలి ఎక్కడికీ వచ్చేదిలేదని నీలిమ తేల్చి చెప్పింది. సూరత్, బరోడా లాంటి పట్టణాల్లో ఇప్పుడు మరలా ఉద్యోగం వెతుక్కుని ఎడ్జస్ట్ కావటం అంత సాధ్యం కాదనీ అన్నది." అయితే నాకూ వెళ్ళటం సాధ్యం కాదని చెప్పి సూరత్ వెళ్ళటం మానేశాడు. కానీ ఇంట్లో ఖాళీగా కూర్చుని, కూర్చుని, ఒక వింత ప్రవృత్తితో, డిప్రెషన్‌లోకి వెళ్ళి తన మనస్సును, మెదడునూ ఖరాబు చేసుకుంటున్నాడు. మూడు నాలుగు నెలలు ఇలాగే గడిచిపోయాయి. ఎక్కడా ఉద్యోగ ప్రకటనా చూడటం లేదు. ఉద్యోగం కోసం ఏ ప్రయత్నమూ చేయటం లేదు. ఇంట్లో గొడవలు, తగువులూ మొదలయ్యాయి. బయట ప్రజలు చిన్న చూపు చూడటమూ మొదలుపెట్టారు. ఆ పరిస్థితి చూసిన తర్వాత అతనికి స్పృహ కలిగింది. అప్పటికి జరగవలసిన ఆలస్యం జరిగేపోయింది. ఇప్పుడు ఎక్కడైనా ఒక ఇంటర్వ్యూకు పిలుపొస్తే వెళ్తున్నాడు. వాళ్ళు అక్కడ అడిగేది ఒకే మాట. " ఇన్ని రోజులూ వృధాగా ఎందుకు గడిపావు? మొదట చేసిన ఉద్యోగాన్ని ఎందుకు వదిలేశావు?" అని.

"హ. హ. వదిలేశానా? ఏమని చెప్పగలను వీళ్ళతో. నేను వదిలిపెట్టలేదు. తన్నులాటతో వదిలించుకున్నారు. వాళ్ళేమన్నారంటే **24** గంటల్లో నీ మూటా ముల్లే సర్దుకో. అలా వెళ్తే నీకే మంచిది. లేదంటే జరిగే పరిణామాలకు మా బాధ్యత ఏమీ వుండదు. తరువాతి నిర్ణయం జి.యమ్. సాహబ్

తీసుకుంటారు. మర్యాదగా రిజైన్ చేస్తే బాగుంటుంది. లేకపోతే మేమే డిస్మిస్ చేసి పారేస్తామని అన్ని రకాలా బెదిరించారు.”

రాజీనామా తంతు అయిపోయిం తర్వాత తడబడే అడుగులతో ఆఫీసు బయటకు వచ్చి జీవన్మృతుడు లాగా ఇంటికొచ్చిపడ్డాడు. ఇంతటి బాధ ఎవరికీ ఆత్మీయులు పోయినపుడు కూడా కలుగరు. ప్రాణాన్ని పణంగా పెట్టి ఏ సిల్కుమిల్లుకు లక్షల రూపాయిల లాభాన్ని తెప్పించే పనిముట్టుగా మారి ఆరుగాలం కష్టించాడో అందుకు ఫలితం బయటికి నెట్టించుకోవటం. ఇదీ ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగుల పరిస్థితి. ఖాళీ తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టించుకుని సిద్ధంగా వుంచుకుంటారు. అవసరం తీరగానే పిర్రమీద కొట్టి మరీ బయటకు పంపుతారు.

దినేశ్ తాజాగా మరొక సిగరెట్ పేకెట్ తీశాడు. ఉదయంనుండి ఇప్పటికి ఎనిమిది సిగరెట్లు కాల్చాడు. డబ్బా ఖాళీ అయింది. ఖాళీ డబ్బాను మేజా బల్లమీద వుంచేస్తే సరి. ఇప్పుడొక కప్పు టీ కూడా కావాలి. ఢిల్లీలో అత్యధిక ఉష్ణోగ్రత 35 డిగ్రీలంటూ వార్తలు కూడా పూర్తయినాయి. చిన్నూ టీ.వీ. చూస్తూ చూస్తూనే నిద్రపోయాడు. ఆమె ఇంకారాలేదు. ఆమెలోని మాతృత్వం కూడా చనిపోయిందా ఏమిటి? ఎప్పుడూ సరైన సమయంలో నీలిమ పిల్లవాడికి తినిపించటం, నిద్రబుచ్చటం లాంటివి చేయటం లేదు. నిద్రపోయేవాడిని లేపి బలవంతంగా తినిపించబోతే వాడతికష్టం మీద ఒకటీ, అరా ముద్దలు మింగుతాడు. అసలు నీలిమలో ఈమార్పు ఎప్పటి నుండి వచ్చిందో గుర్తు చేసుకోసాగాడు. ఏ సంఘటన ఆమెనింతగా కదిలించి బాధ్యతా రాహిత్యం వైపుకు మళ్ళించిందోనన్న సందిగ్ధంలో పడిపోయాడు. నీలిమకు మొదటి నుండీ నేనంటే ఇష్టం లేదా? పెళ్ళయిన కొత్తల్లో ప్రేమ కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్యలో తను నీలిమనడిగాడు. “నువ్వెరినైనా ప్రేమించావా?” అని. నిశ్శబ్దంగా వుండి బహుశా సిగ్గుపడి నెమ్మదిగా “లేదు” అని మాత్రమే అన్నది. గదిలో చీకటిగా వున్నందువలన ఆమె కన్నుల్లో రంగులు కాని, ముఖంలో భావాలు కాని తాను చూడలేకపోయాడు. ఆమె గొంతులో కంపనాన్ని కూడా తాను గుర్తించలేకపొయ్యాడు. బహుశా ఇటువంటి తలాతోక లేని ప్రశ్నల వలన ఆమెకు కోపం గూడా వచ్చి వుండొచ్చు కాని స్త్రీ సహజమైన సిగ్గు కూడా పడివుండవచ్చు. ఆ తర్వాత ఆమే అడిగింది నా ప్రశ్నకు బదులుగా “మరి మీరెవరినైనా ప్రేమించారా” అని. తను నవ్వాడు. “నేను ఆ పని చేసినట్లైతే నిన్నెందుకడుగుతాను” అని కూడా తానన్నాడు. ఎంత తెలివిగా తన ప్రశ్న నుంచి తప్పించుకున్నది? దీనిది తిమింగలపు అంశ అయివుంటుంది. కానిమ్ము, భర్తగా నా ముఖాన ఇంకేం రాసిపెట్టివున్నాయో? నిజం చెప్పాలంటే ఇప్పటివరకూ తనను అనుమానం వేధిస్తూనే వుంది నీలిమ మనసులో తనకు చోటుందా? లేదా? అని. తానుద్యోగం చేసినన్నాళ్ళూ ఈ ఆలోచన రాలేదు. మొదట్నుంచీ నీలిమ కూడా ఉద్యోగం చేస్తూనే వున్నది. కాని ఆమె ఎప్పుడూ తనకంటే ముందే ఇంటికి వచ్చేది. టీ పెట్టి భర్త కోసం ఎదురు చూస్తూ వుండేది. తను రావటం ఆలస్యమయితే ఒక్కోసారి నీలిమ వర్షించే మేఘమే అయ్యేది. ఎల్లప్పుడూ భర్త నుండే స్వాంతన పొందుతూ వుండేది. వేషభాషల్లో, వ్యవహారంలో ఆధునిక యువతి అయినా ధార్మికానుసరణలో ముందుండేది. నియమానుసారంగా వ్రతాలూ, ఉపవాసాలూ చేసేది. నుదుటిన కుంకుమ, పాపిట్లో సింధూరం అన్నీ పెట్టుకునేది.

అతనికిప్పుడు లోపల్లోపల ప్రకంపనం మొదలయ్యింది. తానెప్పుడు సోమరిగా మారాడో, ఉద్యోగం మానేసి తాను ఢిల్లీ వచ్చేసినప్పటి నుండి తనకీ ప్రాణాంతకమైన జబ్బు మొదలైంది. నీలిమకిప్పుడు వ్రతాల, ఉపవాసాల జోలిలేదు. కాని పాపిట్లో సింధూరం, నుదుటిన కుంకుమతో పెద్ద బొట్టు ఇప్పుడూ పెట్టుకుంటుంది.

ఖళ్.. ఖళ్... మని దగ్గుతూ అతడు తన ఛాతీని చేతులతో అదుముకుంటున్నాడు. తన దౌర్భాగ్యస్థితికి తనకే ఎంతో బాధ వేస్తుంది. "నీలిమదంతా నటన. ఆడంబరము ప్రదర్శించటం ఎక్కువైంది. తిరిగి తనకు ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నానంటుంది. ఉదయం తను ఆఫీసుకు వెళ్ళేముందే తనకు టిఫిన్ చేసిపెట్టటం, మందు కాప్సూల్ తీసి ఇవ్వటం అంతా నాటకం. మందులూ, పాలూ, పళ్ళూ అన్నీ క్రమం తప్పకుండా తెప్పించటం ఇదంతా పచ్చి మోసం. నిజంగా ఇది మోసమే. ఆమె కన్నుల్లో అన్యమనస్కతా భావం, ఆవిడ వ్యవహారంలో శీతలత్వం, ఆవిడ జీవితేచ్ఛలో నిర్లిప్తతా, నిర్మోహం ఇవన్నీ నాటకాలు, మోసాలు కాక ఇంకేంటి?" అని గట్టిగా భావించాడు.

ఛాతీని రెండు చేతులతో అదిమి పెట్టుకుని పైకి లేచాడు. చాలా కాలం తర్వాత డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి అద్దంలో ముఖం చూచుకున్నాడు. గడ్డం చేసుకోటానికి ఎపుడూ బాత్‌రూమ్‌లోని అద్దాన్నే వాడతాడు. కాని ఇపుడు గడ్డం మీదగాని, మరే శరీర భాగాల మీదకాని శ్రద్ధ లేదు. తన్ను తన్ను తాను పరీక్షగా చూసుకున్నాడు. ఓహ్. ఎంత ఆక్వర్డ్‌గా వున్నాడు. బలహీనంగా, కంకాళం లాగా రోగిష్టిగా ముసలివాడిగా కనపడుతున్నాడు. తన పక్కన నీలిమను ఊహించుకున్నాడు. నాజూగ్గా, చిన్నగా, మెరిసే చర్మంతో, అందమైన ముఖంతో, ఆరోగ్యంగా వుండి తనకన్నా వయసులో ఎన్నో రెట్లు చిన్నదిగావున్నది. తన స్థితికి తనకే నవ్వు వస్తున్నది. అతని పిడికిళ్ళు బిగుసుకోసాగినవి. నోరు తెరిచి తన ముందటి పళ్ళనూ పరీక్షగా చూసుకోసాగాడు. బస్. కొంచెం కొంచెంగా మార్పు చేసుకోవాలి. ఆ తర్వాత ఎట్లా అవ్వాలంటే అట్లా అవుతుంది అనుకున్నాడు.

అక్కడే వున్న స్టూలు మీద అతడు గభాల్న కూర్చున్నాడు. చేతివేళ్ళను తన జుట్టులోనికి పోనిచ్చి జొనుపుతూ పిచ్చివాడిలాగా వ్యాకులపడసాగాడు. ఎంతసేపటికీ ఆలోచనలు ఒక కొలిక్కిరావటం లేదు. చిన్నప్పుడు అమ్మమ్మలూ, నాయనమ్మలూ చెప్పిన కథల్లోని విషయాలు గుర్తుకొచ్చినాయి. తాను కూడా కథల్లోలాగా అదృశ్యంగా దాక్కుని తన భార్య నీలిమకు తెలియకుండా ఆమెననుసరించి విషయమంతా తెలిసికోవాలని ఉబలాటపడ్డాడు. టి.వీ.లో ప్రసారం వస్తూనే వున్నది. చిన్నూ అలాగే పెడమర్లగా పడుకుని నిద్రపోతున్నాడు. మణికట్టు తిప్పి మరలా చేతి గడియారంలో టైం చూసుకున్నాడు. భార్య ఇంకా ఇంతవరకు ఇంటికి రాలేదు. అతను లేచి తన బిడ్డను ఒకసారి ముద్దాడాడు. తన సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తీసుకుని ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. తాను అదృశ్యమయ్యే మార్గం ఏదైనా భగవంతుడే చూపిస్తాడనుకున్నాడు. అలా అదృశ్యమయ్యేందుకు ఏ గుళికో దొరక్కపోతుందా అని ఆలోచించాడు. రాత్రంతా ఆలోచిస్తూనే తిరిగాడు. వేకువనే వచ్చి తన ఇంటి దర్వాజా ఎదురుగా నిలబడివున్నాడు. గదిలో లైటు వెలుగుతుంది ఇంత పొద్దున్నే లేచి ఎందుకు లైటు వేసిందో? రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చింది గదా? తను ఇంట్లో లేనన్న విషయం గమనించే వుంటుంది. హాయిగా, తృప్తిగా నిట్టూర్చివుంటుంది. ఇంక తిరిగి రాడులే

అనుకుని వుంటుంది. ఆ సంతోషంలో ఉదయాన్నే లేచి తన ప్రేమికుడెవరికో ఫోన్ చేయాలని అనుకుంటూ వుండివుంటుంది. తలుపు లోపలి నుంచి వేసున్నందున లోపల ఏం జరుగుతుందో తెలిసే అవకాశం లేదు. కిటికీలకు పరదాలున్నందున తొంగి చూట్టానికి కూడా ఉపాయమేమీ లేదు, అనుకున్నాడు. అతను ఎక్కువ సేపు నిరీక్షించనక్కరలేకుండానే ఆమె యింటి తలుపు తెరిచింది. బయట వెలుతురూ వచ్చింది. నీలిమ ఒకసారి బయటకొచ్చింది. మనిషి బాగా అలసిపోయి వుంది, బాగా గాభరాగా కూడా వున్నది. మెట్లదగ్గరున్న రెయిలింగ్ పట్టుకుని నిలబడింది. అటూ, ఇటూ తొంగిచూసింది. ఎదురుగా వున్న ఇల్లు మిస్టరు చంద్రంది. వాళ్ళ కాలింగ్ బెల్ కొట్టొచ్చు. కాని ఎవరినీ ఏమీ అడక్కుండా లోపలికెళ్ళిపోయింది. కొంచెంసేపున్న తర్వాత మరలా బయటికొచ్చి అటూ, ఇటూ చూడసాగింది. ఎవరిని పిలిచి ఏమీ అడగలేదు. నీలిమ ధోరణేమిటో దినేశ్‌కు అంతుబట్టటం లేదు.

సరిగ్గా ఏడు గంటలకు చిన్నూ చేయిపట్టుకుని బస్‌స్టాప్ వైపుకు రాసాగింది. ఇంతత్వరగా ఎందుకు బయలుదేరింది? చిన్నూ బస్సు ఏడూ పదికి కాని రాదు. ఆ సంగతి నీలిమకు తెలియకపోవచ్చు. ఎందుకంటే ఆమె పిల్లవాడిని ఎప్పుడూ బస్సు ఎక్కించేది కాదు. నీలిమే తొందరపాటులోవున్నది. మిసెస్ శర్మ తన పిల్లలతో అక్కడికి చేరుకోవటంతోనే చిన్నూను కూడా ఆమెకు ఒప్పగించి బస్సెక్కించమని అడిగింది.ఆ తర్వాత వేగంగా మెయిన్‌రోడ్ వైపుకు రాసాగింది. ఆమె ఆటోలో వెళ్ళినా తనామెను వెంబడించలేడని భయపడ్డాడు. అదృష్టవశాత్తూ **721** నంబరు బస్సు ఆగింది. ఆమె ఒక్క ఉదుటున ముందువైపు నుండి బస్సు ఎక్కేసింది. బస్సు మరీ అంతరద్దీగా లేదు అతను వెనుకవైపు నుంచి బస్సెక్కాడు. ఆమె వెనగ్గానే కూర్చున్నాడు. అతని దృష్టి నీలిమ జడకూ జాకెట్టుకూ మధ్యవున్న ఖాళీలో నుంచి నల్లని గీతలాగా కనుపిస్తే ఉలిక్కిపడ్డాడు. సంవత్సరాల తరబడి తీసివేసిన మంగళసూత్రాల గొలుసు అది. దాన్నివాళ వేసుకున్నది. ఇంతకు ముందు బస్సుల్లో తిరుగుతూ వుంటే బంగారునగలు ధరించటం చాలా ప్రమాదమని అనేది.

ఆమె పగటి కలలు కంటూ సీటుకు జారగిలబడి కళ్ళుమూసుకునివున్నది. జయనగర్ బస్టాపు వచ్చింది. ప్రయాణీకులు దిగేవారు దిగారు. ఎక్కేవారు ఎక్కారు. తర్వాత బస్సు వెంటనే ముందుకు సాగింది. ఆమె కునికిపాట్ల నుండి మేల్కొని బస్సాపండి అని అరిచింది.

“నిద్రపోతున్నారా మేడమ్” అంటూ కండక్టర్ వేళాకోళమాడాడు. ఆమె ముందు వైపునుంచి అతను వెనుక వైపు నుంచీ బస్ దిగారు. బస్ దిగటంతోనే ఎదురుగా జయనగర్ పోలీసుస్టేషన్ కనుపిస్తుంది. చురుగ్గా అడుగులు వేస్తూ ఆమె పోలీసుస్టేషన్‌లోపలకెళ్ళింది.

“చూడండి. ఎవరిక్కడ? ప్లీజ్? నా పని కొంచెం చూడండి. నా భర్త రాత్రి నుంచీ మాయమయ్యారు. ఎక్కడికెళ్ళిందీ నాకు తెలియదు. నేను ఆఫీసు నుండి వచ్చేసరికి ఇంట్లో లేరు. ఇది నా జీవిత సమస్య. మీరు ఎఫ్.ఐ.ఆర్. వ్రాసుకోండి. ఇది నా ఆఫీసు ఫోను నెంబరు. ఇది ఇంటి నంబరు. ఏవిషయమూ తెలియగానే ఫోన్ చెయ్యండి. దయచేసి త్వరగా కనుక్కోండి” అంటూ చెప్పింది.

ఎంత జాణ ఇది? ఇరుగుపొరుగు వారిని ఏమీ అడగలేదు. పోలీసులకు మాత్రం సమాచారమిచ్చి తనకే విధమైన ఇబ్బందులూ రాకుండా చూసుకుంటున్నది. చట్టంతో జాగ్రత్తపడుతున్నది.

"పోలీసులు ఏమైనా చేసి పెడతారు" అని నమ్ముతున్నది. అనుకున్నాడు.

సరిగ్గా తొమ్మిది గంటలకు చార్టర్డ్ బస్సు వచ్చే సమయానికి నీలిమ ఇంటికి తాళమేసింది. తాళం చెవిని బిల్డింగ్ క్రిందనున్న వాచ్‌మెన్‌కిచ్చి "చిన్నూ స్కూల్ నుండి వచ్చే సమయానికి వెళ్ళి ఇంటికి తీసుకునిరా" అని చెప్పింది.

"అమ్మగారూ! అయ్యగారు అంటూ అడగబోయాడు. అదా? సార్‌కి ఆరోగ్యం బాగాలేదు. అందుకని హాస్పిటల్లో వున్నారు." అని చెప్పింది.

ఆ మాటలు వింటున్న అతనికి తల తిరిగిపోయింది. నిజంగా ఎంత తెలివిగల ఆడది. దీని ఆంతర్యమేమిటో ఎవరూ తెలుసుకోలేరు అనుకున్నాడు.

ఆమె రోడ్డు దాటి వెళ్ళేవరకూ చూస్తూ నిలబడ్డాడు. లేత నీలిరంగు మీద బాదం కలరు చుక్కలున్న సిల్కు చీర. నుదుటి మీద పెద్ద కుంకుంబొట్టు. లిప్‌స్టిక్ వేసుకుంటుంటే చేతులయినా వణకలేదా ఈమెకివ్వాళ? లిప్‌స్టిక్ వేసుకునే సందర్భానికీ, మానేసే సందర్భానికీ తేడా తెలియకుండా పోతుందీమెకు అనుకున్నాడు.

ఆఫీసులో ఆమెకు వేరుగా కాబిన్ వుంటుంది. బాస్ కాబిన్ నుండి రెండుగదులు వదిలిపెట్టి ఈవిడ గది వుంటుంది. మధ్యాహ్నం వరకు ఎనిమిది, పదిసార్లు ఆమె పర్సనల్ మేనేజరు గదిలోకి రాకపోకలు సాగించింది. వెళ్ళిన ప్రతిసారీ, ఆమెచేతిలో ఫైలో, ఫోల్డరో, కాగితాలో వుండేవి. ఈ మధ్యలో ఆఫీసులోని మిగతా ఉద్యోగులు స్ప్రింగ్ డోర్ తెరుచుకుని లోపలికీ, బయటికీ వస్తూపోతూ వున్నారు. ఇక్కడ ఈ గదిలో ఏ విధమైన రొమాన్సు జరిగే ఛాన్సులేదు. అయినప్పటికీ అతని మనసులో పెనుభూతం లాంటి అనుమానం పట్టిపీడిస్తున్నది. తనలో తనే మధన పడసాగాడు. ఎంత పనికి రానివాడయ్యాడు తను? తన భార్య పెట్టుకున్న కూలిమనిషేం కాదు తను. ఎందుకోసం పడివున్నాను ఆమె కాళ్ళ దగ్గర ఇన్ని రోజులూ, నీలిమి చాలా సెల్ఫ్ సఫిషియెంట్. కాబట్టి తనంటే ఆమెకేం లెఖ్ఖలేదు. భర్తగా ఉండి ఆమె నుండి ఏం పొందగలిగాడు? సెక్స్ కొరకు కూడా ఆమె తనను ఆశ్రయించలేదు. ఆమె నా ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా ఇంటి వ్యవహారం మొత్తాన్ని తన చెప్పుచేతుల్లో వుంచుకుంది. ఇవన్నీ తనకర్థమయినాయి. ఆమెను నేను దగ్గరకు తీసుకున్నప్పుడు కూడా శవం వలె ఏ స్పందనా లేకుండా నన్ను సహించేది.

ఇంటికి కాపలా కాస్తున్నందున కూలీగా టీ, సిగరెట్లు ఎన్ని కావాలంటే అన్ని లభిస్తున్నాయి. కాసేపు తన ఆలోచనల అదృశ్యపుగుళికను పక్కనపెట్టి అవతల వీధిలో వున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్ళాడు.

మరలా తన అదృశ్యపు గుళికను ఆవాహన చేసుకుంటూ మళ్ళా టైం చూసుకున్నాడు. “అబ్బో చాలా టైమైంది. ఈ పాటికి నీలిమ కాఫీసిప్ చేస్తూ పగటి కలలు కంటూ వుంటుందేమో అనుకున్నాడు. కనురెప్పలు భారంగా వాలిపోతున్నాయి. తన ఇల్లు జ్ఞాపకమొచ్చింది. ఆయింట్లో ఒక పద్ధతంటూ లేకుండాపోయింది. ఇష్టమున్నా లేకున్నా తను కాపురం చేసిన గది. రాత్రింబవళ్ళు తను పడుకున్న పక్క. ఇంకా చిన్నూ తన కొడుకు. కనీసం తన కొడుకు కోసమైనా తను అక్కడుండాలి. తాను తిరిగి ఇంటికి వెళ్తాడు. కాని ఐదున్నరగంటల కల్లా భార్య ఇంట్లో వుండాలి. రోజు రోజూ అనుమానాలతో తిండి కూడా లేకుండా వట్టి మంచి నీళ్ళతోనే కడుపు నింపుకోలేడు. ఈ రోజు ఈ పాడు దగ్గు ఎంతకీ ఆగటం లేదు, అనుకున్నాడు.

పార్కింగ్ ప్లేస్‌లో తిరిగి తిరిగి మరలా లాబీ వైపుకు తిరిగివస్తూ గొంతులోకి వచ్చే కళ్ళెను లోపలకి ఎగబీలుస్తూ చివరకు అక్కడున్న స్థంభం దగ్గరే కాండ్రించి ఉమ్మేశాడు. అతని కాళ్ళలో ఇంకా నిలబడి వుండే శక్తి తగ్గిపోతున్నది. లాబీలోకి వచ్చి ఒక ఖాళీ సోఫాలో కూర్చున్నాడు. మరలా ఆలోచనలు చుట్టుముట్టినవి. నీలిమ కళ్ళు మొదట్లో ఎంత ప్రేమగా వుండేవి? ఇప్పుడు టైమ్ ఆరుముప్పావు అయింది. ఇంతవరకూ నీలిమ బయటకివస్తున్న జాడలేదు.

ఎవరో ఒకతను లేచి గదిలో నుండి బయటికివచ్చాడు. ఈలోగా లిఫ్ట్ క్రిందకు వచ్చి ఆగింది. దాంట్లో నుంచి గుంపుగా కొందరు దిగారు. అందులో ఒకతన్ని గుర్తుపడతాను. అతనే నీలిమావాళ్ళ బాస్. చాలా వేగంగా నా పక్క నుంచీ వెళ్ళాడే అనుకున్నాడు. ఉదయం ఇతన్ని దూరాన్నుంచి చూసి సరిగా అంచనా వేయలేకపోయాను. ఇతను చాలా హాండ్‌సమ్‌గా వున్నాడు. నీలిమకన్న పది పన్నండేళ్ళు తక్కువ వయస్సుంటుంది. మరి నీలిమ నడివయసుకొచ్చింది. అక్కడక్కడా తెల్లబడిన వెంట్రుకలకు గోరింటాకు పెడుతున్నది. ఛూత్! వాళ్ళ బాస్ నీలిమను గురించి ఏమాలోచిస్తూవుంటాడు? అతను కోరుకున్నా నీలిమ కొంచెం కూడ ఛాన్స్ ఇచ్చివుండదు. తనే భార్య మీద వ్యర్థంగా అనుమానాలు పెంచుకుంటూ పోతున్నాడు. ఇంటి ఖర్చంతా ఆమే భరిస్తుంది. నా మందులకయ్యే బిల్లు ఖర్చుకు కంపెనీ నుండి రీఎంబర్స్‌మెంట్ వస్తుంది. మిగతా ఖర్చులు పాలకీ, పళ్ళకీ, ఇంట్లో ఖర్చులకూ తడుముకోకుండా ఖర్చు చేస్తున్నది. పాపం పిచ్చి మొహంది. ఆఫీసు అయింతర్వాత ఎక్కడైనా ట్యూషన్స్ లాంటివి చెప్తున్నదేమో? ఆలోచిస్తూనే మధ్యమధ్యలో ఆగుతూ, రొప్పుతూ సెకండ్ ఫ్లోర్ వరకూ చేరుకున్నాడు. సరాసరి నీలిమ కాబిన్ దగ్గర ఆగాడు. తలుపు తెరిచి లోపలికెళ్ళాడు. తన ముందున్న కాగితాలలోకి వంగి సీరియస్‌గా పనిలో మునిగిపోయివున్నది. ఒక క్షణం తలపైకెత్తి చూసి ఎవరో ఏ పనిమీదో వచ్చుంటారులే అనుకుని మరలా తన పనిలో పడిపోయింది. అతనిక్కూడా గాభరాగా వున్నది. నీలిమ త్వరత్వరగా తన బ్యాగ్ సర్దుకుంటూ కొన్ని ముఖ్యమైన కాగితాల్ని బ్యాగులో కుక్కింది. వెళ్ళటానికి లేచి అకస్మాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్లుగా ఓహ్ మర్చిపోయాను అనుకుంటూ ఫోన్ డయల్‌చేసింది. “విను. అంతా బాగానే వున్నది. ఈ రోజు నేను రాలేను. ప్లీజ్! నాకోసం ఎదురు చూడవద్దు. నేను త్వరగా ఇంటికి వెళ్ళాలి. చాలా పనుంది. పైగా చిన్నూకు ఒంట్లో బాగా లేదు.” అంటూ ఫోన్ పెట్టేసింది.

నీలిమ ఎప్పుడూ ఆకాశం నుంచి ఊడిపడ్డట్లుగా వుంటుంది. ఆమెను గురించి ఎంత ఆలోచించినా ఇంకా మిగిలే వుంటుంది. నేను ఆలోచించటం మంచిదే. మండే ఆమ్లపు జ్వాలను గొంతుకింద దాచి వుంచ గలిగితేనే ఆమెతో వుండగలగుతాను. తన అంగాంగాన్నీ గాయపరిచే తత్వమామెది. కాని ఎదుట నిలబడేసరికి ఎంతో దాంబికాన్ని కనపరుస్తుంది.

నేను ఇంటికి వెళ్లాలి. వెళ్తాను. ఇంకెప్పుడూ జీవితాన్ని వదిలిపెట్టను. నాకే కనుక ప్రేమ లభిస్తే ఆమె గుండెలమీద తల ఆన్చి జీవితాంతం నిశ్చింతగా బతికేయగలను. లేకుంటే అదే ఇంట్లో అదే గదిలో ఫానుకు వేలాడుతూ ఉరిపెట్టుకుని చస్తాను. చచ్చేముందు ఒక చీటీ వ్రాసి మరీ చస్తాను. దాంతో నా దయనీయ స్థితి అందరికీ తెలుస్తుంది అనుకున్నాడు.

వెనుకాముందు ఆలోచించుకుంటూ ఇంటికి చేరుకున్నాడు. చిన్నూ బాగా సంతోషంగా నవ్వుతూ తుళ్ళుతూ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఫ్రెండ్స్‌తో కారమ్స్ ఆడుతున్నాడు. బట్టలు మార్చుకోకుండానే నీలిమ ఏదో ఆలోచనలో పడింది. బాధపడుతున్నట్లు కనుపిస్తుంది. నిన్న రాత్రి అద్దం ముందు నిలబడి తను చూసుకున్నట్లుగా ఈ వేళ నీలిమ కూడా అలాగే నిలబడివున్నది. ఆమె కళ్ళల్లో అశాంతి గూడుకట్టుకునివున్నది. అక్కడ తగిలించి వున్న రుమాలు తీసుకుని తడిపి, లిప్‌స్టిక్‌నూ, కుంకుమనూ రుద్దసాగింది. అలా రుద్దుకుంటూ అద్దంలో తన్ను తాను పరీక్షగా చూసుకోసాగింది. ఆమెను చూస్తుంటే నా మనసులో ఏ మెరుపులూ మెరియటం లేదు. యస్.యస్. అంతే.

పరుగెత్తినట్లు నడిచి ఆమె ఫోన్ దగ్గరకెళ్ళి ఏదో నంబరుకు డయల్ చేసింది. "ఏమైంది? ఇంతవరకూ ఏమీ తెలియలేదా? చూడండి. ప్లీజ్! మీరు కొంచెం శ్రద్ధ పెట్టి నా పని చెయ్యాలి. నాకింకా వేరే ఆలోచనలేంలేవు. ఎందుకో, ఎట్లాగో మిగతా విషయాలు నాకేం తెలియవు. కనపించకుండా పోయింది నా భర్త. త్వరగా మీపని పూర్తి చేయండి" అంటూ ఫోన్ పెట్టేసింది.

ఆ మాటలు విన్ని అతను పళ్ళు పటపటా కొరికాడు. భర్తనా? అంటూ నోటమ్మట బూతు మాటలు వల్లించాడు. జాడ తెలియాలా? నేనింక ఒక్క క్షణం కూడా ఇక్కడ నిలబడను. తన అనారోగ్య స్థితిని కూడా లెక్కచేయకుండా నెమ్మదిగా మెట్లుదిగి మెయిన్‌రోడ్ మీదికొచ్చి నడవసాగాడు. తన అదృశ్యపు గుళిక ఇక ఉపయోగించనఖ్ఖర్లేదనుకున్నాడు.